సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 113

సోమవారం 14-7-2025



'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'



ఏసీ లారీలు

అక్టోబర్ ఒకటి నుంచి రోడ్డెక్కనున్న ఏసీ క్యాబిన్ ట్రక్కులు

- 16లో



రైల్లో సీసీటీవీలు

పైలట్ ప్రాజెక్టు సక్సెస్.. 74 వేల కోచ్‌లలో ఏర్పాటుకు కేంద్రం ఓకే

- 16లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సారే జహాసె అచ్ఛా ఇండియా

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వీడ్కోలు పలికే ముందు వ్యోమగామి శుభాంశు శుక్లా చివరి సందేశం పంపాడు.

వివరాలు 6లో ▸



58 వేల మరణాలు!

ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 58 వేల మంది పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా ఆరోగ్య విభాగం తెలిపింది.

వివరాలు 6లో ▸



ఆర్టీసీ టీపైఎల్ చార్జీల పెంపు

నెల క్రితం బస్‌పాస్ ధరలను సవరించిన తెలంగాణ ఆర్టీసీ తాజాగా ట్రావెల్ యాజ్ యూ లైక్ టికెట్ ధరలను పెంచేసింది.

వివరాలు 16లో ▸



బ్యాటర్లపైనే భారం

ఇంగ్లండ్‌తో మూడో టెస్టులో భారత విజయ లక్ష్యం 193. 4వ రోజు ఆట ముగిసేసరికి గిల్ సేన 4 వికెట్లకు 58 పరుగులు చేసింది.

వివరాలు 14లో ▸

రిజర్వేషన్ల చుట్టూ రాజకీయం

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా రాష్ట్రంలోని రాజకీయ పక్షాల ఎత్తులు

బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని చెప్పుకునే ప్రయత్నంలో అధికార కాంగ్రెస్

- అసెంబ్లీలో బిల్లు మొదలు ఆర్డినెన్స్ వరకు రిజర్వేషన్ల అంశాన్ని ఉపయోగించుకునే వ్యూహం
- రాష్ట్రపతి వద్ద బిల్లు ఆమోదానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలేంటని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలు
- అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు ఎందుకు తీసుకెళ్లలేదని నిలదీస్తున్న వైనం



- బలహీన వర్గాలను మోసం చేసే ఎత్తుగడే అంటున్న బీఆర్‌ఎస్.. చట్టబద్ధత కావాలని డిమాండ్
- రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా, ఆర్డినెన్స్ తేవడం బీసీలను ఏమార్చడానికేనంటున్న బీజేపీ
- ఆర్డినెన్స్ ఆధారంగా జీవో ఇస్తే.. న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు వస్తాయేమోననే ఆందోళనలో బీసీలు
- ఎవరికి వారే పైచేయి సాధించేందుకు కౌంటర్లు, ఎన్‌కౌంటర్లతో మొదలైన స్థానిక ఎన్నికల వేడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాలన్నీ బీసీ రిజర్వేషన్ల అంశం చుట్టూనే తిరుగుతున్నాయి. స్థానిక సంస్థలకు మూడు నెలల్లో ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఊపందుకున్న రిజర్వేషన్ల రగడను రాజకీయంగా ఉపయోగించుకునేందుకు అన్ని ప్రధాన పార్టీలు ఎత్తులు వేస్తున్నాయి. ఇందులో అధికార కాంగ్రెస్ ఓ అడుగు ముందుండగా.. బీఆర్‌ఎస్, బీజేపీ కూడా బీసీల మన్ననలు పొందేందుకు తమదైన శైలిలో ప్రయత్నిస్తున్నాయి. అయితే, పార్టీల వ్యూహ, ప్రతివ్యూహాలు ఎలా ఉన్నా.. ఈసారి స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలుకాకుండా ఎక్కడ ఆగిపోతాయేమోననే ఆందోళన బీసీ సంఘాలు, ఆయా వర్గాల ప్రజల్లో వ్యక్తమవుతోంది. మొత్తం మీద బీసీ రిజర్వేషన్ల అంశంలో రాజకీయ కౌంటర్లు, ఎన్‌కౌంటర్లు, కోర్టు కేసు వ్యవహారంపై భిన్నాభిప్రాయాల నేపథ్యంలో అసలు ఎన్నికల ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియకుండానే రాష్ట్రంలో 'స్థానిక'వేడి మొదలుకావడం గమనార్హం.

అధికార పార్టీ ఏమనుకుంటోందంటే..

ఎవరెంతో.. వారికంత అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అందిపుచ్చుకున్న దేశవ్యాప్త నినాదంతో సామాజిక న్యాయం చేస్తున్నామని చెప్పుకునేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఎస్సీల వర్గీకరణ, మంత్రివర్గ విస్తరణతోపాటు తాజాగా రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన ఆర్డినెన్స్‌తో అన్ని వర్గాలకు తాము న్యాయం చేస్తున్నామని చెబుతోంది. అంతకంటే ముందు అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లు కూడా కామారెడ్డి డిక్లరేషన్‌ను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామనేందుకు నిదర్శనమని ఆ పార్టీ నేతలంటున్నారు. తాము మాత్రమే బీసీలకు న్యాయం చేయగలమని, అందుకే చేశామని ఆ పార్టీ నేతలంటుండగా సీఎం రేవంత్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి రాహుల్‌గాంధీ ప్రధాని అయి ఉంటే 48 గంటల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయించేవాడినన్నారు. కేబినెట్ ఆర్డినెన్స్ నేపథ్యంలో

మిగతా 2వ పేజీలో ▸

దివికేగిన నవరసాల కోట

అనారోగ్యంతో కోట శ్రీనివాస రావు కన్నుమూత



- ప్రధాని సహా సినీ, రాజకీయ ప్రముఖుల సంతాపం
- 750కి పైగా సినిమాల్లో నటించిన ఘనత
- పద్మశ్రీ, 9 నంది అవార్డులు ఆయన సొంతం
- అభిమానుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

బంజారాహిల్స్/రాయదుర్గం: చిత్రపరిశ్రమ ఒక నవరస నటుడిని కోల్పోయింది. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు (83) కన్నుమూశారు. ఆదివారం తెల్లవారుజామున ఫిలింనగర్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. కోట మరణవార్త విని పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. సాయంత్రం ఆయన నివాసం నుంచి జూబ్లీహిల్స్ మహా ప్రస్థానం వరకు పలువురు నటులు, రాజకీయ నాయకులు, అభిమానులు, కుటుంబ సభ్యుల మధ్య అంతిమ యాత్ర జరిగింది. అభిమానుల కన్నీటి

మిగతా 12వ పేజీలో ▸

సకల సినీ పాత్రలకు పెట్టని 'కోట'

తెలుగు తెరపై ఆయనో ఆల్‌రౌండర్. 1985 'ప్రతిఘటన' నుంచి తుది శ్వాస విడిచే వరకు ప్రేక్షకుల హృదయాలను గెలుస్తూనే ఉన్నారు.

- వివరాలు 13లో ▸

న్యూస్‌రీల్

విన్నర్ సినెర్



వింబుల్డన్ పురుషుల సింగిల్స్ టైటిల్ నెగ్గిన ఇటలీ స్టార్. ఫైనల్లో సినెర్ 4-6, 6-4, 6-4, 6-4తో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్‌పై గెలుపొందాడు. సినెర్ కెరీర్‌లో ఇది నాలుగో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కావడం విశేషం.

- వివరాలు 14లో ▸

నెటిజన భారత్



దేశంలో సగటున ఒక్కో నెల మొబైల్ కస్టమర్లు 21.53 జీబీ డేటాను ఆస్వాదిస్తున్నారు. మూడేళ్లలో సగటున నెలకు డేటా వినియోగం 44.59 శాతం పెరిగిందంటే నెట్‌లో ఏ స్థాయిలో నెటిజనులు విహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

- వివరాలు 2లో ▸

మినిమం బాదుడుకు బైబై



ఖాతాల్లో కనీస నిల్వ లేకుంటే భారీగా ప్రైవేటు బ్యాంకుల తరహాలో పెనాల్టీ చార్జీలు విధిస్తూ వచ్చిన ప్రభుత్వరంగ బ్యాంకులు మనసు మార్చుకున్నాయి. ఎస్‌బీఐతోపాటు మరో 5 బ్యాంకులు 'మినిమం' నిబంధనను ఎత్తేసి కస్టమర్లకు ఊరటనిచ్చాయి.

- వివరాలు 3లో ▸

ఏపీలో లారీ బోల్తా.. 9 మంది దుర్మరణం



ఏపీలోని అన్నమయ్య జిల్లాలో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెడ్డిపల్లె చెరువుకట్టపై లారీ బోల్తాపడి 9 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు.

- వివరాలు 3లో ▸

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై 'జాగృతి' దాడి..

మల్లన్నతోపాటు పలువురికి స్వల్ప గాయాలు

- ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారని దాడులు
- క్యూ న్యూస్ ఆఫీస్‌లో కర్రలు, రాడ్లతో విధ్వంసం
- గాల్లోకి కాల్పులు జరిపిన మల్లన్న గన్‌మెన్
- దాడులతో బీసీ ఉద్యమాన్ని ఆపలేరు: తీన్మార్ మల్లన్న



ఆదివారం హైదరాబాద్‌లోని క్యూ న్యూస్ కార్యాలయంలో దాడి చేస్తున్న జాగృతి కార్యకర్తలు

మేడిపల్లి/ఘట్‌కేసర్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కు చెందిన క్యూన్యూస్ కార్యాలయంపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు చెందిన తెలంగాణ జాగృతి కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్యూన్యూస్ ఆఫీస్‌లోకి ఆదివారం ఉదయం 11.30 గంటల సమయంలో సుమారు 20 మంది కర్రలు, రాడ్లతో దూసుకొచ్చి చానల్ సిబ్బందిపై దాడి చేస్తూ విధ్వంసం సృష్టించారు. అక్కడే ఉన్న మల్లన్నపై కూడా దాడికి ప్రయత్నించారు. కార్యాలయంలోని ఫర్నిచర్, ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. వారిని అదుపుచేసేందుకు మల్లన్న గన్‌మెన్‌లు గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ లోపుగా మల్లన్న మేడిపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా

మిగతా 2వ పేజీలో ▸

నిరసన తెలిపితే కాల్పులా?: కవిత

తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీ పదవి నుంచి డిస్మిస్ చేయాలి

- మల్లన్న వ్యాఖ్యలు ఆయనవేనా? ప్రభుత్వం చేయించిందా?.. తనపై మల్లన్న అనుచిత వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ కవిత మండిపాటు
- మల్లన్నపై మండలి చైర్మన్ గుత్తాతోపాటు పోలీసులకు ఫిర్యాదు
- తాను మామూలు ఆడబిడ్డను కాదని.. అగ్గిరవ్వనని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మల్లన్నపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఆదివారం కలిసిన కవిత.. మల్లన్న సభ్యత్వాన్ని రద్దుచేయాలని కోరారు. ఆయన వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి సిఫారసు చేయాలని విన్నవించారు. మల్లన్నపై డీజీపీ కార్యాలయంలో కూడా ఆమె ఫిర్యాదు చేశారు. ఆయా చోట్ల కవిత మీడియాతో మాట్లాడారు. మల్లన్న తనపై చేసిన వ్యాఖ్యలకు కోపం వచ్చి కొందరు నిరసన వ్యక్తం చేశారని, అంతమాత్రానికే

మిగతా 2వ పేజీలో ▸

ఔట్ పేషెంట్ ప్లాన్.. నో టెన్షన్!

అనారోగ్యంతో డాక్టర్ దగ్గరకెళ్తే వ్యాధి నిర్ధారణ పరీక్షల తర్వాతే పరిష్కారం సూచిస్తుంటారు. కన్సల్టేషన్, డయాగ్నోస్టిక్స్ చార్జీలు, మందులకు కలిపి ఎంతలేదన్నా రూ.2,000–5,000 మధ్య ఖర్చు చేయాల్సిందే. జీవనశైలి వ్యాధులు, వైరల్ ఫీవర్లు, ఇన్ఫెక్షన్లు పెరిగిపోయిన తరుణంలో.. ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఓపీడీ) కవరేజీ తదితర అంశాలపై ప్రత్యేక కథనం..

- వివరాలు 15లో ▸



ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో బోనంతో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

5 లో

నేడు రేషన్‌కార్డుల పంపిణీ

సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

- వివరాలు 3లో ▸

పెద్దల సభకు ఉజ్వల్ నికమ్, శ్రింగ్లా



ఉజ్వల్ నికమ్

కసబ్‌కు ఉరిశిక్ష పడేలా వాదించిన నాటి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నికమ్, చరిత్రకారిణి మీనాక్షి జైన్, విదేశాంగ మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ శ్రింగ్లా, కేరళ బీజేపీ నేత సదానందన్ రాజ్యసభకు నామినేట్ అయ్యారు.

- వివరాలు 6లో ▸

'మాక్'తో మేల్కొలుపు



ఇంజనీరింగ్ ఆప్షన్లు సరిచేసుకోవడానికి అవకాశం

- అతి విశ్వాసంతో సీటు పోగొట్టుకున్న టాపర్స్
- 2 వేల ర్యాంకు వచ్చినా సీటు రాని వైనం.. ఆలోచించి ఆప్షన్లు ఇవ్వాలంటున్న నిపుణులు
- ఈ నెల 18న తొలి విడత సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్

ఇంజనీరింగ్ మాక్ సీట్ల కేటాయింపు విద్యార్థులకు అనేక అనుభవాలను నేర్పింది. ఆప్షన్ల ఎంపికలో అతి విశ్వాసం పనికిరాదని స్పష్టం చేసింది. మంచి ర్యాంకు వచ్చినా తక్కువ ఆప్షన్లు పెట్టడం వల్ల సీటు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఎక్కువ ర్యాంకు వచ్చిన వారికి కోరుకున్న బ్రాంచీలో సీటు వచ్చింది. అయితే, ఇక్కడ జాగ్రత్తగా వ్యవహరించకపోతే అసలు సీట్ల కేటాయింపులో నష్టం జరిగే వీలుంది. ఆప్షన్లు ఇవ్వడంలో పొరపాట్లు చేసిన వారు ఇప్పుడు వాటిని సరి చేసుకుంటారు. దీంతో ఈ నెల 18న చేపట్టే అసలు సీట్ల కేటాయింపులో చాలా మార్పులు ఉండే వీలుందని

మిగతా 3వ పేజీలో ▸

జాగ్రత్తగా ఆప్షన్లు ఇవ్వాలి

ఇంటర్ తర్వాత ఇంజనీరింగ్ వైపు వెళ్లే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. 2023–24తో పోలిస్తే 2024–25లో 16 వేల మంది పెరిగి, 1.07 లక్షలకు ఇంజనీరింగ్ ప్రవేశాలు చేరాయి. కాబట్టి ఎప్‌సెట్ అసలు సీట్ల కేటాయింపులో చాలా మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఎందుకంటే తక్కువ ఆప్షన్లు ఇచ్చినవాళ్లు ఈసారి వాటిని పెంచుతారు. మంచి ర్యాంకులు ఉండి సీట్లు వచ్చిన విద్యార్థులు టాప్ కాలేజీల్లో మార్పులు కోరుకుంటారు. కాబట్టి మాక్‌లో వచ్చిన సీటు అసలు కేటాయింపులో ఉండకపోవచ్చు. 20 వేల ర్యాంకుపైన వచ్చిన విద్యార్థుల దీన్ని ప్రధానంగా గుర్తు పెట్టుకోవాలని, ఇందుకు తగ్గట్టుగా ఆప్షన్ల ఎంపికపై కసరత్తు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.



విమానాలే కూలుతున్నాయ్! అఫ్టాల్ గోడ కూలితే ఇంత రాద్ధాంతం ఏంటని అంటున్నాడ్సార్!!

మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నాం: భట్టి

- ప్రతీ నియోజకవర్గంలో మైక్రో ఇండస్ట్రీస్
- అంబేడ్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును చేపడతామన్న డిప్యూటీ సీఎం
- మంచిర్యాల జిల్లాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- పాల్గొన్న శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, జూపల్లి

3 లో





నెటిజన భారత్!


దేశంలో ఇంటర్నెట్ వినియోగదారులు **96.9** కోట్లు


నెలకు తలసరి డేటా వాడకం **21.53** జీబీ

మూడేళ్లలో 44% పెరిగిన డేటా వినియోగం

ఇప్పుడు ఎవరి చేతిలో చూసినా ఓ స్మార్ట్‌ఫోన్. అవసరానికే కాదు వినోదానికీ ఈ ఉపకరణమే. మెసేజింగ్, కాలింగ్ యాప్స్, సామాజిక మాధ్యమాలు జీవితంలో భాగం అయిపోయాయి. ఇంకేముంది.. డేటా, అన్‌లిమిటెడ్ ప్యాక్స్‌తో జనం సింపుల్‌గా మొబైల్‌తో 'రీచార్జ్' అవుతున్నారు. దేశంలో సగటున ఒక్కో నెల మొబైల్ కస్టమర్లు 21.53 జీబీ డేటాను ఆస్వాదిస్తున్నారు. మూడేళ్లలో సగటున నెలకు డేటా వినియోగం 44.59% పెరిగిందంటే నెట్‌లో ఏ స్థాయిలో విహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. - సాక్షి, స్పెషల్ డెస్క్

దేశంలో వైర్‌లెస్ డేటా చందాదారుల సంఖ్య 2025 మార్చి నాటికి 93.9 కోట్లు. అంతకుముందు ఏడాదిలో ఇది 91.3 కోట్లు. మొత్తం బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల్లో వైర్‌లెస్ వాటా ఏకంగా 95 శాతానికిపైగా ఉంది. ఇక వైర్‌లెస్ డేటా వినియోగం 1,94,774 పెటాబైట్స్ నుంచి ఏడాదిలో 17.46 శాతం అధికమై 2,28,779 పెటాబైట్స్‌కు ఎగసింది. అంటే 2,28,77,90,00,000 జీబీ అన్నమాట. టెలికం రెగ్యులేటరీ అథారిటీ (ట్రాయ్) ఇటీవల విడుదల చేసిన 2024–25 గణాంకాల్లో ఈ ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. మొబైల్ ఇంటర్నెట్ వినియోగదారుల్లో ఎల్‌టీఈ (4జీ) వాటా 64.2 కోట్లు కాగా, 5జీ చందాదారుల సంఖ్య 24.4 కోట్లకు చేరింది. 100 మంది జనాభాలో ఇంటర్నెట్ వాడుతున్న వారు 68.63 శాతం ఉన్నారు. ఇంటర్నెట్ మార్కెట్లో ప్రైవేట్ కంపెనీల వాటా ఏకంగా 96 శాతం ఉంది. మిగిలినది ప్రభుత్వ టెలికం సంస్థలది. వైర్‌లెస్ డేటా వినియోగం ద్వారా ఒక్కో కస్టమర్ నుంచి టెలికం కంపెనీలకు ప్రతి నెలా సగటున 2023–24లో రూ.211.36 సమకూరితే.. 2024–25లో అది రూ.231.64కి పెరిగింది. 2021–22లో ఇది రూ.147.94 మాత్రమే.





కంపెనీల ఆదాయం అప్

వైర్‌లెస్ ఇంటర్నెట్ ద్వారా టెలికం కంపెనీల ఆదాయం (రూ.కోట్లలో), వృద్ధి (శాతాల్లో)

సంవత్సరం	ఆదాయం	వృద్ధి
2021-22	1,43,169	21.07
2022-23	1,74,144	21.63
2023-24	1,86,226	6.94
2024-25	2,15,078	15.49

100 మందిలో 69 మంది! 100 మంది జనాభాకు ఇంటర్‌నెట్ టెలి సాంద్రత

2022 మార్చి	60.00
2023 మార్చి	63.53
2024 మార్చి	68.19
2025 మార్చి	68.63

2025 మార్చి నాటికి కొన్ని ప్రధాన సర్కిళ్లలో ఇంటర్నెట్ చందాదారుల సంఖ్య (కోట్లలో), ఇంటర్నెట్ టెలి సాంద్రత

సర్కిల్	గ్రామీణం	పట్టణాల్లో	ఇంటర్నెట్ టెలి సాంద్రత
ఢిల్లీ	0.15	5.6	259.86
కర్ణాటక	2.1	3.9	87.94
మహారాష్ట్ర	3.2	4.7	86.05
తమిళనాడు	1.8	4.6	81.75
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్	3.1	4.1	78.96

క్లుప్తంగా...

సీపీఐ రాష్ట్ర మహాసభల లోగో ఆవిష్కరణ



సీపీఐ 4వ రాష్ట్ర మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న చాడ తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల లోగోను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం హిమాయత్‌నగర్‌లోని రాజ్ బహదూర్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర మహాసభల సందర్భంగా సీపీఐ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పార్టీ లక్ష్యాలను వివరిస్తూ, చందాలను సేకరించాలన్నారు. సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నర్సింహ, కలవేణి శంకర్, శ్రామిక మహిళా ఫోరం జాతీయ నాయకురాలు ప్రేమ్ పావని, రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఈ. ఉమామహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది బీసీల రాజ్యమే: జాజుల



అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే వెంకట్రావు తదితరులు

భద్రాచలం టౌన్: రాష్ట్రంలో రాబోయేది బీసీల రాజ్యమేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. భద్రాచలంలో ఆదివారం నిర్వహించిన బీసీల శంఖారావం సభలో ఆయన మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం 60 మంది బీసీ ఎమ్మెల్యేలు ఉండాలని, కానీ ప్రస్తుతం 18 కూడా లేరన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఒక్క బీసీ ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్ల వెంకట్రావు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో బీసీలకు అన్యాయం జరగకుండా కృషి చేస్తానన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు తటికొండ విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల చుట్టూ 'రాజకీయం'

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు నిర్వహించి తామే బీసీల చాంపియన్‌నని చెబుతోంది. ఈ నేపథ్యంలోనే మరోమారు ఢిల్లీ యాత్రకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. అయితే, ఈ పార్టీ వర్గాల్లో బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ ఆగం చేస్తుందా అనే మీమాంస కూడా కనిపిస్తోంది. ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లు రాష్ట్రపతి, పార్లమెంటు ఆమోదం కోసం పెండింగ్‌లో ఉండగా, ఇప్పుడు ఆర్డినెన్స్ తీసుకురావడం ఏ మేరకు మేలు చేస్తుందనే దానిపై ఆ పార్టీ నేతల్లోనూ సందేహాలు వ్యక్తమవుతుండటం గమనార్హం.

విపక్షాలు ఏమంటున్నాయంటే...

కర్ర విరగకుండా పాము చావకుండా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని, అధికారంలో ఉన్న పార్టీగా చేయాల్సింది చేయకుండా బీసీ వర్గాలను బుట్టలో వేసుకోవడమే లక్ష్యంగా ముందుకెళ్తోందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో రాష్ట్రం నుంచి అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్తానని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందినప్పుడే చెప్పారని, అయితే ఇప్పటి వరకు ఆ ప్రయత్నం ఎందుకు చేయలేదని నిలదీస్తున్నాయి. అన్ని పార్టీలను ప్రధాని వద్దకు తీసుకెళ్తానని చెప్పిన తర్వాత ఎన్నోసార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి వచ్చిన ఆయన కనీసం ఒక్కసారి కూడా ఎందుకు బీసీ బిల్లు ఆమోదం గురించి వినతిపత్రం ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్రపతి వద్దకు వెళ్లిన బిల్లును ఆమోదింపజేసి పార్లమెంటు ఆమోదం కోసం తీసుకురావడంలో కాంగ్రెస్ చేసిన కృషి ఏంటో చెప్పాలని డిమాండ్ చేస్తున్నాయి. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌ను వినిపిస్తున్న బీఆర్‌ఎస్ ఈ విషయంలో కాంగ్రెస్ వైఖరిని తప్పుపడుతోంది. బీసీలను మోసం చేసేందుకే ఆర్డినెన్స్ అంటున్నారని, ఏకసభ్య కమిషన్ పేరుతో ఇచ్చిన నివేదిక లొసుగులతో ఉందని, ఈ నేపథ్యంలో బీసీలకు న్యాయం జరిగే పరిస్థితి లేదని అంటోంది. ఇక, బీజేపీ కూడా ఈ విషయంలో కాంగ్రెస్ వైఖరిని తప్పుపడుతోంది. రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా, ఆర్డినెన్స్ తేవడం బీసీలను ఏమార్చడానికేనని అంటోంది. తాము బహిరంగంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశానికి మద్దతిస్తున్నా.. అటు రాష్ట్రపతితోపాటు ఇటు పార్లమెంటులోనూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లుకు ఆమోదం పొందకపోతే తమకు 'స్థానిక'ంగా పట్టురాదేమోననే ఆందోళన కమలనాథుల్లో వ్యక్తమవుతోంది.

బీసీ సంఘాల ఆందోళన ఇదీ..

ఆర్డినెన్స్ ఆధారంగా ప్రభుత్వం జారీ చేయాలనుకుంటున్న రిజర్వేషన్ల జీవోకు న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయన్న దానిపై బీసీ సంఘాల్లో, ఆయా వర్గాల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ జీవో కోర్టులో నిలబడుతుందా లేదా అన్న దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కోర్టులో సవాల్ చేస్తే నిలబడదని కొందరు, కొన్ని ప్రాతిపదికల మీద నిలబడుతుందని మరికొందరు అంటున్నారు. గతంలో సుప్రీంకోర్టు చెప్పిన విధంగా రిజర్వేషన్ల సీలింగ్ 50 శాతానికి పరిమితం అవుతుందని, ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన కల్పించే రిజర్వేషన్లు పోను 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు వర్తింపజేయడం సుప్రీంతీర్పు అమల్లో ఉన్నంతవరకు సాధ్యం కాదని, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే జీవోను సవాల్ చేస్తే వెంటనే కోర్టు కొట్టి వేస్తుందనేది వారి వాదన. అయితే, గతంలో బీసీల జనాభా లెక్కలు అందుబాటులో లేనందున కోర్టులు కొట్టివేశాయని, ఇప్పుడు ప్రభుత్వం చేసిన కుల సర్వేలో బీసీల జనాభా 56 శాతంగా తేలిందని, బీసీలకు తగినంత రిజర్వేషన్లు కల్పించవచ్చని సుప్రీంకోర్టు తీర్పులోనే పేర్కొన్నందున 42 శాతం కోటా న్యాయ సమీక్షలో నిలబడుతుందని మరికొందరు వాదిస్తున్నారు. అలాగే, డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు అంశం కూడా ఈ వాదనకు బలాన్నిస్తుందని అంటున్నారు. మరోవైపు అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేసే క్రమంలోనే 50 శాతం సీలింగ్ చాలా రాష్ట్రాల్లో దాటిపోయిందని, తెలంగాణలోనూ ఇబ్బంది ఉండదని వారంటున్నారు. మరోవైపు బీసీ వర్గాలకు న్యాయం జరుగుతున్నందున దాన్ని అడ్డుకోవద్దని, కోర్టులో కేసులు వేయొద్దని అటు రాజకీయ పార్టీలకు, ఇటు ప్రజలకు బీసీ సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నా ఏ క్షణంలో కోర్టులో కేసు పడుతుందోననే గుబులు మాత్రం కనిపిస్తోంది. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో ఇచ్చిన మరుసటి రోజే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున కోర్టు కూడా జోక్యం చేసుకోదనే వాదన సముచితం కాదనే భిన్నమైన అంశాన్ని బీసీ సంఘాల నిపుణులు తెరపైకి తెచ్చారు. గతంలో మహారాష్ట్రలో ఇదే జరిగిందని, మరాఠాలను బీసీల్లో చేర్చి, వారికి రిజర్వేషన్లు కల్పించి పంచాయతీ ఎన్నికలకు వెళ్తే సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని మరీ ఎన్నికల ప్రక్రియను నిలిపివేసిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో జీవోలు, ఆర్డినెన్స్‌ల కంటే పార్లమెంటు ఆమోదం ద్వారా 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడమే రక్షణ కవచమని, ఆ కోణంలోనే అన్ని పార్టీలు చిత్తశుద్ధితో పనిచేయాలని బీసీ సంఘాలు కోరుతున్నాయి.

మల్లన్నపై 'జాగృతి' దాడి..

▶ మొదటి పేజీ తరువాయి

స్థలానికి చేరుకుని ఆందోళనకారులను చెదరగొట్టారు. గాయపడిన ఆఫీస్ సిబ్బందిని, మల్లన్నను చికిత్స నిమిత్తం ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మల్లన్న చేతికి స్వల్ప గాయం కావడంతో చికిత్స అందించి ఆస్పత్రి నుంచి పంపించారు. ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ జాగృతి కార్యకర్తలే ఈ దాడి చేసినట్లు పోలీసులు నిర్ధారించారు.



గన్ ఎక్కుపెడుతున్న మల్లన్న భద్రతా సిబ్బంది

దాడులకు భయపడను: మల్లన్న

తెలంగాణ జాగృతి కార్యకర్తల దాడిని తీన్మార్ మల్లన్న తీవ్రంగా ఖండించారు. హత్యాయత్నాలతో బీసీ ఉద్యమాన్ని ఆపలేరని స్పష్టంచేశారు. దాడి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. '20 మంది వరకు కర్రలు, రాడ్లతో దూసుకొచ్చి నాతోపాటు మా కార్యాలయం సిబ్బందిపై పాశవికంగా దాడి చేశారు. నాతో సహా పలువురికి గాయాలయ్యాయి. దాడి తీవ్రతను చూసి వెంటనే గన్‌మెన్ గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు జరిపారు. హత్యాయత్నాలతో బీసీ ఉద్యమాన్ని ఆపలేరు. ఇలాంటి దాడులకు బయపడేది లేదు. కంచం–మంచం అనే పదం తెలంగాణలో ఊతపదం. నా వ్యాఖ్యలకు కట్టుబడి వున్నా. రౌడీల్లా నాపై దాడి చేయడమే కాకుండా మళ్లీ నాపైనే కేసు పెట్టారు. నా ఆఫీస్‌లో నా రక్తాన్ని కళ్లచూశారు. ఈ రక్తం మరకలతోనే ప్రజల్లోకి వెళతాను. ప్రభుత్వం ఈ ఘటనపై స్పందించాలి' అని డిమాండ్ చేశారు. మల్కాజిగిరి డీసీపీ పద్మజారెడ్డి, ఏసీపీ చక్రపాణి, మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్ రెడ్డి తమ సిబ్బందితో ఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడి ఘటనలో గాయపడ్డ ఆందోళనకారులు రాంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. మేడిపల్లి పోలీసుల అదుపులో జాగృతి యాదాద్రి జిల్లా అధ్యక్షుడు సందుపట్ల సుజిత్‌రావు, ఓయూ జాగృతి అధ్యక్షుడు అశోక్ యాదవ్‌తోపాటు మరికొందరు ఉన్నట్లు తెలిసింది.

నిరసన తెలిపితే కాల్పులా?: కవిత

▶ మొదటి పేజీ తరువాయి

కాల్పులు జరిపి చంపేస్తారా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వెంటనే మల్లన్నపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆయనతో అలా మాట్లాడించింది ప్రభుత్వమే అని భావించాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. కాల్పులపై దర్యాప్తు చేయాలని డీజీపీని కోరినట్లు చెప్పారు. తాను మామూలు ఆడబిడ్డను కాదు.. అగ్గిరవ్వను అని వ్యాఖ్యానించారు. మల్లన్న వ్యాఖ్యలపై ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించకపోవడం ఏంటని ప్రశ్నించారు. గత రెండేళ్లుగా బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ల కోసం పోరాడుతున్నట్లు చెప్పారు. తన పోరాటం ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చిందని కవిత అన్నారు. తనను అగౌరవ పరిచిన తీన్మార్ మల్లన్నపై బీఎన్‌ఎస్ 74,79 సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని అదనపు ఐజీ రమణకుమార్‌కు వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు. మల్లన్న బీసీ బిడ్డ కాబట్టి ఏది పడితే అది మాట్లాడతానంటే చెల్లదని స్పష్టంచేశారు.

కవిత ఇంటి వద్ద భారీ బందోబస్తు

తీన్మార్ మల్లన్న క్యూన్యూస్ కార్యాలయంపై తెలంగాణ జాగృతి కార్యకర్తలు దాడి చేసిన నేపథ్యంలో బంజారాహిల్స్ రోడ్డు నంబర్–14లోని కల్వకుంట్ల కవిత ఇంటి వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆమె ఇంటికి వెళ్లే మార్గాల్లో వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. సుమారు 50 మంది పోలీసులతో నాలుగు చోట్ల పికెటింగ్‌లు ఏర్పాటుచేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.

ఎడ్యుటెక్ కంపెనీల కట్టడి ఎలా?

స్కిల్స్ పేరుతో యూనివర్సిటీల్లో క్లాసులు

అది చట్ట విరుద్ధమంటూ మండలి నోటీసులు

ఇది మీ పరిధిలోకి రాదంటూ సంస్థల సమాధానం

ప్రభుత్వం దృష్టికి విషయం... ప్రత్యేక కమిటీ ఏర్పాటు యోచన



సాక్షి, హైదరాబాద్: చట్ట విరుద్ధంగా కోచింగ్ కేంద్రాలను నిర్వహిస్తున్న సంస్థలను నియంత్రించటంపై ప్రభుత్వం దృష్టి సారించింది. వీటిని దారికి తెచ్చేందుకు విద్యాశాఖ, రెవెన్యూ, పోలీసు విభాగాల అధికారులతో ప్రత్యేక కమిటీ వేయాలని భావిస్తోంది. ఇంజనీరింగ్‌లో నైపుణ్యం పేరుతో కొన్ని సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఉన్నత విద్యా మండలి గుర్తించింది. డీమ్డ్, ప్రైవేటు యూనివర్సిటీల్లోకి స్కిల్ పేరుతో చొరబడుతున్న ఈ కంపెనీల వల్ల జరిగే నష్టాలను మండలి అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. స్కిల్ కోసం షార్ట్‌కట్స్‌లో ఇవి బోధిస్తున్నాయి. సబ్జెక్టు ఫ్యాకల్టీలో నాణ్యత పాటించడం లేదు. ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఈ కోచింగ్ కేంద్రాలకు వెళ్లడం వల్ల నష్టం జరుగుతుందని ప్రభుత్వానికి మండలి తెలిపింది.

ఏం చేస్తారో చేసుకోండి

ఎలాంటి అనుమతులు లేకుండా కోచింగ్ కేంద్రాలు నడుపుతున్న సంస్థలకు గత నెలలో ఉన్నత విద్యా మండలి నోటీసులు ఇచ్చింది. అయితే, నోటీసులు పొందిన సంస్థలు మండలికి ఘాటుగా సమాధానం ఇచ్చాయి. తామెక్కడా చట్ట విరుద్ధంగా బోధన చేయడం లేదని, విద్యార్థులు స్కిల్ కోసం తమ దగ్గరకు వస్తున్నారని పేర్కొన్నాయి. అసలు తమను నియంత్రించడం, నోటీసులు ఇచ్చే అధికారం ఉన్నత విద్యామండలికి లేదని న్యాయవాదులతో సమాధానం ఇవ్వడంతో మండలి వర్గాలు నివ్వెరపోయాయి. ఇదే విషయాన్ని అధికారులు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. మరోవైపు ఆ సంస్థల్లో చేరిన విద్యార్థులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడించడం, మండలి అధికారులను తప్పుబడుతూ విద్యార్థులు మెయిల్స్ ఇవ్వడంతో సమస్య తీవ్రంగా మారింది. ఈ నేపథ్యంలో ఏం చేయాలో చెప్పాలని మండలి అధికారులు ప్రభుత్వాన్ని కోరారు. దీంతో సీఎం కార్యాలయం విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఇటీవల దీనిపై చర్చించింది.

కట్టడి చేయకుంటే కష్టమే

ఇంజనీరింగ్ పూర్తవ్వగానే ఉద్యోగం పొందడం ఒక్కటే లక్ష్యంగా భావిస్తున్న విద్యార్థుల బలహీనతను కోచింగ్ కేంద్రాలు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. ఇందులో డీమ్డ్, ప్రైవేటు యూనివర్సిటీలు ప్రధానంగా భాగస్వామ్యం అయ్యాయి. సబ్జెక్టులకు ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వకుండా, కేవలం ఉద్యోగం పొందేందుకు కొత్తగా వస్తున్న చాట్ జీపీటీ, ఏఐ సంబంధిత టెక్నాలజీపైనే షార్ట్ కట్స్ బోధిస్తున్నాయి. ఈ క్రమంలో కీలకమైన ఫ్యాకల్టీని కూడా తగ్గిస్తున్నాయి. హైదరాబాద్‌లోని రెండు డీమ్డ్ వర్సిటీలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న డీమ్డ్ వర్సిటీల ఆఫ్ క్యాంపస్‌లపై గత ఏడాది కూడా పెద్ద ఎత్తున ఫిర్యాదులొచ్చాయి. ఎమర్జింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు కాలేజీల్లో కాకుండా, స్కిల్ కేంద్రాల్లో బోధిస్తున్నారు. పరీక్షలు నిర్వహించి, డిగ్రీలు ఇవ్వడం మాత్రం కాలేజీల్లోనే జరుగుతోంది. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని మండలి పేర్కొంది. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో బేసిక్స్ నేర్పుతారు. రెండు, మూడు సంవత్సరాల్లో కీలకమైన కోడింగ్‌పై సబ్జెక్టులు ఉంటాయి. ఇదే క్రమంలో ఎమర్జింగ్ కోర్సులకు పారిశ్రామిక భాగస్వామ్యంతో శిక్షణ ఇవ్వాలి. అప్పుడే విద్యార్థి కోడింగ్‌పై పట్టు సాధిస్తాడు. ఏఐ చేసే కోడింగ్, డీ–కోడింగ్ కచ్చితమైనదేనా? కాదా? అనేది సబ్జెక్టులపై అవగాహన ఉన్నప్పుడే తెలుస్తుంది. ప్రైవేటు కాలేజీలు దీన్ని విస్మరించి ఉద్యోగం పొందడానికి అవసరమైన స్కిల్స్‌ను మాత్రమే నేర్పుతుండటంతో ఉద్యోగం వచ్చినా, పనిలో పురోగతి సాధించలేకపోతున్నారు. గడచిన ఐదేళ్లలో ఐటీ కంపెనీల్లో అనేక మంది కోడింగ్‌పై పట్టు లేకపోవడం వల్లే ఉద్యోగాలు పోగొట్టుకున్నారు.

విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

చట్ట విరుద్ధంగా నడుపుతున్న కోచింగ్ కేంద్రాలకు నోటీసులు ఇచ్చాం. సమాధానం వచ్చింది. అయితే, ఇప్పుడు ఏం చేయాలో ఆలోచిస్తున్నాం. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో దీనిపై విధాన నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

- ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్

సాగర్ రెండో జోన్‌కు నీటి విడుదల నేడు

హాజరుకానున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

పాలేరు వద్ద పనులు పరిశీలించిన మంత్రి పొంగులేటి



యూటీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్ అనుదీప్

కూసుమంచి: పాలేరు రిజర్వాయర్ నుంచి జిల్లాలోని సాగర్ ఆయకట్టు(రెండో జోన్‌కు) సోమవారం సాగునీటిని విడుదల చేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పాలేరు వద్ద ఎడమ కాల్వకు చేపట్టిన యూటీ నిర్మాణ పనులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి మంత్రి ఆదివారం రాత్రి పరిశీలించారు. సోమవారం ఉదయమే 1,300 క్యూసెక్కుల నీటి విడుదలకు ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్ డీఈఈ మాధవిని ఆదేశించారు. కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు హాజరవుతానని, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గత సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వర్షాలకు పాలేరు వద్ద ఎడమ కాల్వ యూటీ కొట్టుకుపోయిందని, ఈ ప్రాంతాన్ని అప్పట్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించారని గుర్తు చేశారు. సీఎం సూచనలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో.. రూ.14.20 కోట్లతో శాశ్వత ప్రాతిపదికన యూటీ, కాలువ మరమ్మతులు చేపట్టామని వివరించారు. ఈ ఏడాది కృష్ణా బేసిన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవడంతో.. అనుకున్న సమయానికంటే ముందే రైతులకు సాగునీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఆయన వెంట రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కేసీఆర్ దూరదృష్టి ఫలితంగానే తెలంగాణలో అద్భుతాలు

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ అందుకు సజీవ సాక్ష్యం: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి ఫలితంగానే ఇప్పుడు తెలంగాణలో అద్భుతాలు జరుగుతున్నాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. పరిపాలన అంటే కేవలం శంకుస్థాపనలు చేయడమే కాదని.. అభివృద్ధి, ప్రగతి అంటే కేవలం రాజకీయ హంగులు ఆర్భాటాలు మాత్రమే కాదని చెప్పారు. నిజమైన నాయకుడు ఒక తరం లేదా ఒక ఎన్నిక గురించి మాత్రమే ఆలోచించడని, తరతరాలపాటు రాష్ట్రానికి ప్రయోజనాలు కలిగించే ప్రణాళికలే నిజమైన నాయకుడి లక్ష్యమని అన్నారు. కేసీఆర్ దూరదృష్టి ఫలితంగా ఈరోజు తెలంగాణ రెండు అద్భుత ఫలితాలను సాధించిందన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కేసీఆర్ విజన్‌కు మరో సజీవ సాక్ష్యమని, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మోటార్లు ఆన్ అవడంతో ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందుతుందన్నారు. మరో అద్భుతం యాదాద్రి థర్మల్ ప్లాంట్ అని, దామరచర్ల అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్‌లోని ఒకటో యూనిట్ 72 గంటల కోడ్‌ను విజయవంతంగా పూర్తి చేసిందన్నారు.

కవితపై మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయం

మల్లన్న కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకం: మహేశ్‌గౌడ్




మల్లన్నను పరామర్శిస్తున్న బీసీ కుల సంఘాల జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: శాసనమండలి సభ్యురాలు కవితనుద్దేశించి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయమని, కవితపై మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించాల్సిందేనని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మల్లన్న కార్యాలయంపై దాడి కూడా చట్ట వ్యతిరేకమని, చట్టం పరిధిలోనే అందరూ పనిచేయాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంలో వచ్చిన ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ జరుగుతుందని వెల్లడించారు. బీసీ బిల్లు, రిజర్వేషన్లు.. కాంగ్రెస్ చేసిన కృషి ఫలితమేనని తెలిపారు. ఈ అంశంలో ఇతరులు లబ్ధి పొందాలని చూడటం సమంజసం కాదని ఆ ప్రకటనలో మహేశ్‌గౌడ్ వ్యాఖ్యానించారు.

బీసీ కుల సంఘాల జేఏసీ ఖండన: ఎమ్మెల్సీ, సీనియర్ జర్నలిస్టు తీన్మార్ మల్లన్నపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజ్‌గౌడ్, సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, సుగూరి దుర్గయ్య గౌడ్‌లు అన్నారు. ఆదివారం ఎమ్మెల్సీ కవిత.. జాగృతి అనుచరులతో చేసిన దాడిలో గాయపడ్డ మల్లన్నను వారు పరామర్శించారు.

కాంగ్రెస్ నేతలు సంస్కారం మరిచిపోయారు

బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ నేతలు సంస్కారం మర్చిపోయారని బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం తెలంగాణ భవన్‌లో మన్నె గోవర్ధన్ రెడ్డి, బొమ్మెర రామమూర్తి, కురువ విజయ్ కుమార్, అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను ఎలా సంబోధించాలో అర్థం కావడం లేదని, సంస్కారం మరచిపోయి, విలువలు లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాలను భ్రష్టు పట్టించిన కాంగ్రెస్ నేతలు.. మూతులు తెరిస్తే బూతులే వస్తున్నాయన్నారు. గాంధీ భవన్‌ను గలీజు భవన్‌గా మార్చారన్నారు. వారిదగ్గర విషయం లేనందునే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై చవక బారు మాటలు మాట్లాడుతున్నారన్నారు.

మినిమం బాదుడుకు బైబై!!



మినిమం బ్యాలెన్స్ నిబంధన.. బ్యాంకు ఖాతా నుంచి ఆఖరు రూపాయి కూడా ఊడ్చేసినా ఖర్చులు తీరని సామాన్యులకు, వేతన జీవులకు కంగారెత్తిస్తుంది. చెప్పిన దాని కన్నా ఖాతాలో ఏ కాస్త తక్కువైనా సరే బ్యాంకులు పెనాల్టీ చార్జీల కింద బాదేస్తుంటాయి. అప్పటికి కట్టలేకపోతే, ఆ తర్వాత ఖాతాలోకి డబ్బు క్రెడిట్ కావడమే తరువాయి.. లాగేస్తాయి. ప్రైవేట్ బ్యాంకులు సరే.. ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా దీన్ని అడ్డం పెట్టుకుని వందల వేల కోట్ల రూపాయలు రాబట్టాయి. దీనిమీద చాలాకాలంగా విమర్శలు వస్తున్నా, పెద్దగా పట్టించుకోలేదు. కానీ ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇప్పుడు మనసు, రూటు మార్చుకుంటున్నాయి. ఎస్‌బీఐ కోవలో మరో 5 బ్యాంకులు ఈ 'మినిమం' నిబంధనను ఎత్తివేసి, మ్యాగ్జిమం ఊరటనిచ్చాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ), ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ ఈ జాబితాలో ఉన్నాయి.

- సాక్షి, బిజినెస్ డెస్క్

ఒక్కో ఖాతాదారువారీగా చూస్తే పెనాల్టీలు నామమాత్రంగా వందల రూపాయల స్థాయిలోనే కనిపిస్తాయి. కానీ, కోట్ల మంది పరంగా చూస్తే వేల కోట్ల రూపాయలు బ్యాంకులు వసూలు చేశాయి. ఆర్థిక శాఖ గతేడాది ఇచ్చిన గణాంకాల ప్రకారం మూడేళ్ల వ్యవధిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇలా వసూలు చేసింది ఏకంగా రూ.5,614 కోట్లు. 2024 ఆర్థిక సంవత్సరంలో 11 పీఎస్‌యూ బ్యాంకులు (పీఎస్‌బీలు) రూ.2,331 కోట్లు మినిమం బ్యాలెన్స్ పెనాల్టీల కింద వసూలు చేశాయి. 2023లో వసూలు చేసిన రూ.1,855 కోట్లతో పోలిస్తే ఇది 25.6 శాతం అధికం! చాలా మటుకు గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లోని అల్పాదాయ కస్టమర్లు ఏటా రూ.360–720 వరకు, పట్టణ ప్రాంతాల్లోని వారు ఏటా కనీసం రూ. వెయ్యి అయినా చెల్లించుకోవాల్సి వస్తోందని అంచనా.

ఇంతకీ ఎందుకీ చార్జీలు?



2000కు ముందు ఈ నిబంధనను పెద్దగా పట్టించుకోకపోయినా, ఆ తర్వాత పెద్ద ప్రైవేట్ బ్యాంకులు వచ్చినప్పట్నుంచి ఇవి సర్వసాధారణమైపోయాయి. అప్పట్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ చార్జీలను రద్దు చేసినప్పటికీ 2017లో మళ్లీ ప్రవేశపెట్టింది. దీంతో కోట్లాది ఖాతాదారుల మీద ప్రభావం పడి చర్చకు దారి తీసింది. దీంతో కాస్త తగ్గించి, ఆ తర్వాత 2020లో కోవిడ్ సమయంలో పూర్తిగా తొలగించింది. వాస్తవానికి కస్టమర్ల ఖాతాల (సేవింగ్స్ అయినా, కరెంట్ అయినా) నిర్వహణ కోసం బ్యాంకులకు కాస్తంత ఖర్చవుతుంది. అంటే ఏటీఎం విత్‌డ్రాయల్స్, కార్డుల నిర్వహణ, పాస్‌బుక్ ప్రింటింగ్, బ్రాంచ్ సర్వీసులు, ఆన్‌లైన్/మొబైల్ బ్యాంకింగ్ మౌలిక సదుపాయాలు మొదలైనవి కల్పించడానికి ఖర్చులవుతాయి. కస్టమర్లు కనీసం కొంతైనా బ్యాలెన్స్ ఉంచితే ఆ ఖర్చులను కవర్ చేసుకోవచ్చనేది బ్యాంకుల ఆలోచన. అదొక్కటే కాదు..

ఖాతాల్లో కనీస బ్యాలెన్స్ ఉంటే బ్యాంకులు ఎక్కువ వడ్డీ ఇవ్వాల్సిన అవసరం లేకుండా తక్కువ ఖర్చుకే డిపాజిట్లను సమీకరించుకున్నట్లు అవుతుంది. అలా చౌకగా వచ్చిన మొత్తాన్ని అధిక వడ్డీ రేటుపై రుణాలివ్వొచ్చు లేదా పెట్టుబడులకు వాడుకోవచ్చు.

పెనాల్టీలనేవి బ్యాంకులకు ఇతరత్రా ఆదాయ వనరులాగా కూడా ఉపయోగపడతాయి.

బ్యాలెన్స్ లేని ఖాతాల వల్ల తమకు ఉపయోగం లేకపోయినా తప్పనిసరిగా కేవైసీ, ఆడిట్‌లాంటివన్నీ చేయాలి. కాబట్టి ఆ భారాన్ని తగ్గించుకునేందుకు పెనాల్టీలు విధిస్తే కస్టమర్లు ఖాతాను యాక్టివ్‌గా ఉంచుకోవడమో లేదా మూసివేయడమో చేస్తారు కాబట్టి భారం కాస్త తగ్గుతుంది.

హై–వేల్యూ కస్టమర్లు, లో–వేల్యూ కస్టమర్లను గుర్తించేందుకు, ఖాతాదారులను బట్టి ప్రీమియం సర్వీసుల్లాంటివి ఆఫర్ చేసేందుకు ఇవి ఉపయోగపడతాయి.

2024లో 11 పీఎస్‌బీలకు భారీ ఆదాయం

రూ. 2,331 కోట్ల మినిమం బ్యాలెన్స్ పెనాల్టీ

- ఖాతాదారులకు ఇన్నాళ్లకు లభించిన ఊరట
- అకౌంట్లో కనీస బ్యాలెన్స్ పెనాల్టీ తొలగింపు
- లిస్టులో పీఎన్‌బీ, బీవోబీ సహా 5 బ్యాంకులు

ఎందుకు తొలగిస్తున్నాయంటే?

కరువు.. ఆపై అధిక మాసంలాగా అసలే చేతిలో డబ్బు లేకపోగా.. పెనాల్టీల భారం కూడా తోడు కావడమనేది సామాన్య ఖాతాదారులకు తలనొప్పి వ్యవహారంగా మారింది. దీన్ని భరించే బదులు ఖాతానే వాడటం మానేస్తే పోతుందని వదిలేస్తున్నారు కూడా. దీన్ని పరిష్కరించుకోవడంతో పాటు, అందరికీ బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తేవడంపై ప్రభుత్వం మరింతగా దృష్టి పెడుతుండటంతో దానికి తగ్గట్లుగా ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా చర్యలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగానే తీసుకున్న ఈ నిర్ణయంతో.. సాధారణంగా కనీస బ్యాలెన్స్‌లను పాటించడం కష్టంగా ఉండే విద్యార్థులు, రైతులు, మహిళలు, గ్రామీణ – పట్టణ ప్రాంతాల్లోని పేదలు మొదలైన వర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది.

వ్యాపార వ్యూహాలు..: ఇప్పుడు ఈ నిర్ణయం తీసుకోవడంలో బ్యాంకుల వ్యాపార వ్యూహాలు కూడా ఉన్నాయి. పెనాల్టీల రూపంలో కోట్లు వసూలు చేస్తున్నప్పటికీ బ్యాంకుల కోణంలో చూస్తే వాటికి వచ్చే వడ్డీ ఆదాయంతో పోలిస్తే ఇలా వచ్చే ఆదాయం చాలా తక్కువే. దీనికి తోడు చెడ్డ పేరు ఒకటి. దీంతో ఆ కాస్త మొత్తాన్ని వదులుకున్నా, కస్టమర్ల నమ్మకాన్ని పొందవచ్చనేది ఒక ఆలోచన. మినిమం బ్యాలెన్స్ పెనాల్టీ భారం లేదు కాబట్టి ఖాతాదారులు ఎంతో కొంతైనా వేస్తూ, తీస్తూ ఉండటం వల్ల ఖాతాలు యాక్టివ్‌గా ఉంటాయి. అలాగే పాతబడిన ఖాతాలపై పెనాల్టీలు వేయొద్దన్న నియంత్రణ సంస్థ ఆదేశాలను కూడా పాటించినట్లవుతుంది. జీరో–బ్యాలెన్స్, డిజిటల్ ఖాతాల్లాంటివి అందిస్తూ కస్టమర్లను ఆకట్టుకుంటున్న కొత్త తరం సంస్థలతో పోటీపడేందుకు వీలవుతుంది.

ఆర్థిక శాఖ గణాంకాల ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.633.4 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.386.51 కోట్లు, ఇండియన్ బ్యాంక్ రూ.369.16 కోట్లు ఇలా పెనాల్టీల కింద వసూలు చేశాయి.

మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నాం

- ప్రతీ నియోజకవర్గంలో మైక్రో ఇండస్ట్రీస్
- అంబేడ్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును చేపడతాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- మంచిర్యాల జిల్లాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- పాల్గొన్న శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, జూపల్లి

దండేపల్లి/జన్నారం/మంచిర్యాల రూరల్ (హాజీపూర్)/ లక్సెట్టిపేట: మహిళా సాధికారతకు ప్రజా ప్రభుత్వం కట్టుబ డి ఉందని, రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో మహిళల కోసం మైక్రో ఇండస్ట్రీస్ ఏర్పాటు చేసి, వారు వ్యాపారాలు చేసుకునేలా కార్యక్రమాలు చేపడతామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఆదివారం మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్ మండలాల్లో మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారా వులతో కలసి భట్టి విక్రమార్క పర్యటించారు. లక్సెట్టిపేట లో నూతనంగా నిర్మించిన 50 పడకల సామాజిక ఆస్పత్రి, కళాశాల భవనాన్ని ప్రారంభించారు. దండేపల్లి మండలం రెబ్బెనపల్లిలో ఇందిరా మహిళా శక్తి సౌర విద్యుత్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. హాజీపూర్ మండలం వేంపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు, ఐటీ పార్కుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో భట్టి విక్రమార్క మాట్లాడుతూ జనాభాలో సగభాగమైన మహిళలకు గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వడ్డీ లేని రుణాలు అందించగా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డీ లేని రుణాల పథకాన్ని పునరుద్ధరించినట్లు తెలిపారు. 'కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని ప్రకటించినప్పుడు కొందరు అవహేళన చేశారు. కానీ మొదటి సంవత్సరంలోనే రూ.21,600 కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చాం. మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు కేటాయించి, ఆర్థిక స్వావలంబనకు మార్గం సుగమం చేస్తున్నాం. మహిళా సంఘాలకు రుణ సౌకర్యం కల్పించి, బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దెకు ఇప్పిస్తున్నాం. క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, ఇతర వ్యాపారాల కోసం మహిళా సంఘాలకు స్థలాలు కేటాయించాం' అని భట్టి చెప్పారు.



వేంపల్లిలో ఇండస్ట్రియల్, ఐటీ, ఆటోనగర్ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు జూపల్లి, శ్రీధర్‌బాబు, దామోదర

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని రూ.22,500 కోట్లతో మొదలుపెట్టామని భట్టి విక్రమార్క తెలిపారు. సంక్షేమ పథకాల కోసం రూ.55 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో అటవీ అధికారులతో ఇబ్బందులు ఎదుర్కొన్న గిరిజనుల కోసం ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం ప్రవేశపెట్టినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ పథకం కింద ఉచిత సోలార్ పంప్‌సెట్లు, స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్, అవకాడో, వెదురు మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును తిరిగి చేపడతామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామ న్నారు. ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రివర్గం దృష్టి సారించిందని తెలిపారు.

సంక్షేమ పథకాల కోసం రూ.55 వేల కోట్లు ఖర్చు

మంచిర్యాలలో ఐటీ, ఇండస్ట్రియల్ పార్కు

మంచిర్యాలలో 212 ఎకరాల్లో దత్తసాయి ఇండస్ట్రియల్, ఐటీ, ఆటోనగర్ పార్కు ఏర్పాటుకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేశారు. మొత్తం 300 ఎకరాల్లో ఈ పార్కును నిర్మించనున్నట్లు తెలిపారు. మొదటి విడతగా రూ.30 కోట్లు కేటాయించామని, ఈ ప్రాజె క్టు ద్వారా 2 వేల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు.

నేడు రేషన్‌కార్డుల పంపిణీ

తిరుమలగిరిలో ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి



తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణీకి ఏర్పాటు చేసిన వేదిక

సాక్షి ప్రతినిధి, నల్లగొండ/తిరుమలగిరి (తుంగతుర్తి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం సూర్యాపేట జిల్లాకు రానున్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండల కేంద్రంలో సాయంత్రం 4 గంటలకు బహిరంగసభ నిర్వహించనున్నారు. సభలో ఆయన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. అధికారులు రాష్ట్రవ్యాప్తంగా 5,61,343 మందికి కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. వాటిద్వారా 45,34,430 మందికి లబ్ధి చేకూరనుంది. రాష్ట్రంలో గతంలో 89,95,282 కార్డుల ద్వారా 2,81,47,565 మందికి లబ్ధి చేకూరగా, ఇకపై 95,56,625 రేషన్ కార్డుల ద్వారా 3,09,30,911 మందికి లబ్ధి చేకూరనుంది. సీఎం వెంట జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు సభలో పాల్గొననున్నారు.


అర్హులందరికీ రేషన్‌కార్డులు: చౌహాన్



తెలంగాణలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం రేషన్‌కార్డులు అందజేస్తుందని రాష్ట్ర పౌర సరఫరా ల శాఖ కమిషనర్ డీ.ఎస్.చౌహాన్ తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని తిరుమలగిరిలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కొత్త కార్డుల రూపేణా ప్రభుత్వంపై ఏటా సుమారుగా రూ.1150 కోట్ల భారం పడుతుందని తెలిపారు. ప్రజా పాలన, ప్రజావాణి, మీసేవల ద్వారా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారందరికీ విచారణ జరిపి కార్డులు అందిస్తున్నామన్నారు. రేషన్‌కార్డుల ప్రక్రియ నిరంతరం సాగుతుందన్నారు. రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని తెలిపారు.

చట్టబద్ధమైన రిజర్వేషన్లతోనే బీసీలకు న్యాయం

- జస్టిస్ ఈశ్వరయ్య వెల్లడి



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లను చట్ట బద్ధంగా పెంచితేనే చెల్లుబాటవుతాయని జస్టి స్ ఈశ్వరయ్య స్పష్టం చేశారు. ఇందుకోసం 9వ షెడ్యూల్‌లో మార్పు చేస్తేనే 42 శాతం రిజర్వేషన్ల అమలు సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. బీసీ ప్రజాప్రతిని ధుల ఫోరం సభ్యులు ఆదివారం జస్టిస్ ఈశ్వరయ్య తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వే షన్లకు సంబంధించి గతంలో రాష్ట్ర ప్రభుత్వం జీవోలు జారీ చేసిందని, కానీ హైకోర్టు, సుప్రీంకోర్టు సైతం వాటిని కొట్టేయడంతో రిజర్వేషన్ల ప్రక్రి య ముందుకు సాగలేదని గుర్తు చేశారు. మహారాష్ట్రలో కూడా ఇదే పరిస్థి తి ఎదురైందన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో కూడా రిజ ర్వేషన్ల పెంపు ఉత్తర్వులతో ప్రయో జనం కలగలేదన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈనెల 15న ఇందిరాపార్క్ వద్ద బీసీ ప్రజా ప్రతినిధుల ఫోరం నిర్వహించే మహాధ ర్నాలో పాల్గొంటానని తెలిపారు.

జీఆర్టీ సర్‌ప్రైజ్ బహుమతులు

సాక్షి, హైదరాబాద్: ఆషాఢ మాసం సందర్భంగా జీఆర్టీ జ్యువెల్లర్స్ తమ వినియోగదారులకు.. ప్రతి కొనుగోలుపై వివిధ రకాల ప్రత్యేక బహుమతులను అందిస్తోంది. చిన్న కొనుగోళ్ల నుండి అతిపెద్ద కొనుగోళ్ల వరకు, ప్రతి లావాదేవీపై కచ్చితంగా ఒక ఆశ్చర్యకరమైన బహుమతి ఉంటుందని సంస్థ తెలిపింది. ఈ ప్రత్యేక ఆఫర్ బంగారు నాణే లు, బార్లపై వర్తించదని, ఇతర ప్రమోషన్లతో కలిపి వినియోగించలేరని స్పష్టం చేసింది. అయినా కూడా, ఆషాఢమాసమంతా ఈ ఆనందకరమైన సర్‌ప్రైజ్ బహుమతుల అను భవాన్ని వినియోగదారులు ఆస్వాదించవచ్చని జీఆర్టీ జ్యువెల్లర్స్ ఎండీ జీఆర్ 'ఆనంద్' అనంత పద్మనాభన్ తెలిపారు. ఎంచుకునే ప్రతి ఆభరణం.. మీ కోసమైనా.. మీరు ప్రేమించే వారి కోసమైనా ఒక ప్రత్యేకమైన బహుమతితో వస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తమ అత్యంత విస్తృతమైన కలెక్షన్లలో ఒకదాన్ని కొనుగోలుదారుల ముందుకు తీసుకురావడం చాలా ఆనందంగా ఉందని జీఆర్టీ జ్యువెల్లర్స్ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ రాధాకృష్ణన్ పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్ పేరిట టోకరా

- వ్యాపారి నుంచి రూ.3.24 కోట్లు కొల్లగొట్టిన సైబర్ కేటుగాళ్లు
- కేసు నమోదు చేసిన టీజీ సీఎస్బీ

సాక్షి, హైదరాబాద్: స్టాక్ మార్కెట్లో పెట్టుబడులతో పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయని ఆశ చూపి నగరానికి చెందిన ఒక వ్యాపారి నుంచి రూ.3.24 కోట్లు కొల్లగొట్టారు సైబర్ కేటుగాళ్లు. నకిలీ స్టాక్ బ్రోకింగ్ యాప్‌లలో ఐపీవోల పేరిట తనను మోసగించారని గాంధీనగర్‌కు చెందిన వ్యాపారి శీతల్ జే గన్వాల్.. టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేశారు. వివరాలివి. ఈ ఏడాది మే 28న బజాజ్ ఫైనాన్షియల్ సెక్యూరిటీస్ లిమిటెడ్ పేరుతో ఒక వాట్సాప్ ఇన్వైట్ లింక్ ద్వారా వ్యాపారవేత్తకు సందేశం వచ్చింది. ఆసక్తితో ఆ లింక్‌ను తెరిచి, 'బజాజ్ ఫైనాన్షియల్ సెక్యూరిటీస్ లిమిటెడ్' వాట్సాప్ గ్రూప్‌లో చేరారు. ఈ గ్రూప్‌లో ప్రిషా సింగ్ (అడ్మిన్), పురవ్ రువేర్ (అసిస్టెంట్) నిర్వాహకులుగా ఉన్నారు. గ్రూప్‌లో మార్కెట్ ట్రెండ్స్, బ్లాక్ ట్రేడ్‌లు, ఐపీవోల గురించి రోజువారీ సమాచారం పంచుకునేవారు. కొన్ని రోజుల తర్వాత, వారు జూన్, జూలై 2025లో లిస్ట్ కాబోతున్న కొన్ని సంస్థల బ్లాక్ ట్రేడింగ్, ఐపీవోల కోసం దరఖాస్తు చేయమని సూచించారు. 'ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్' ద్వారా ఐపీవోల కేటాయింపు సులభతరం చేస్తామని, మంచి లాభాలు వస్తాయని నమ్మించారు. దీంతో వ్యాపారవేత్త మే 30న మొదటి లావాదేవీ చేశారు. జూలై 9 వరకు 'బజాజ్ ఫైనాన్షియల్ సెక్యూరిటీస్ లిమిటెడ్' అనే ఖాతాకు పలు దఫాలుగా మొత్తం రూ.3,24,85,000 బదిలీ చేశారు. అనంతరం తనకు వచ్చిన లాభాలను బ్యాంకు ఖాతాలకు మళ్లించేందుకు ప్రయత్నించగా.. జమ కాలేదు. దీంతో మోసపో యినట్టు గుర్తించి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు ఈనెల 11న ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

హైకోర్టులో 2.36 లక్షల కేసులు పెండింగ్

- సత్వర న్యాయం కోసం కొత్త కోర్టులు
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్
- ఓదెలలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించిన న్యాయమూర్తి



ఓదెలలో జేసీజే కోర్టును ప్రారంభిస్తున్న జస్టిస్ కె.లక్ష్మణ్. చిత్రంలో జస్టిస్ శ్రీనివాస్‌రావు, జస్టిస్ ఇ.వేణుగోపాల్

ఓదెల(పెద్దపల్లి): తెలంగాణ హైకోర్టులో ప్రస్తుతం 2.36 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ వెల్లడించారు. అందరికీ సత్వర న్యాయం అందించేందుకు కొత్త కోర్టులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలో ఆదివారం ఆయన జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, కోర్టుల్లో సాధారణంగా 500కుపైగా కేసులు పెండింగ్‌లో ఉంటే సమీపంలో కొత్తకోర్టు ఏర్పాటుకు ప్రతిపాదనలను పంపిస్తామన్నారు. కాగా, హైకోర్టులో 2.36 లక్షల కేసులు పెండింగ్ ఉంటే.. సుప్రీంకోర్టులో 82 వేల కేసులు అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నాయంటే జడ్జిల తీర్పులో జాప్యం కారణం కాదని వెల్లడించారు. తెలంగాణలో ఉమ్మడి కరీంనగర్ రాజకీయ, సామాజిక, న్యాయవ్యవస్థ, కళలకు పుట్టిల్లు లాంటిదన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత సి.నారాయణ రెడ్డి పుట్టినగడ్డ కరీంనగర్‌కు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జిలు జస్టిస్ శ్రీనివాస్‌రావు, జస్టిస్ ఇ.వేణుగోపాల్, జస్టిస్ ఎస్.వి. శ్రావణ్‌కుమార్, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి కుంచాల సునీత, సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి గణేశ్, రాష్ట్ర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసుగంటి లక్ష్మణ్‌కుమార్, సుల్తానా బాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఓదెల మల్లన్న సన్నిధిలో పూజలు

అంతకుముందు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ శ్రీనివాస్‌రావు, జస్టిస్ ఇ.వేణుగోపాల్, జస్టిస్ ఎస్.వి. శ్రావణ్‌కుమార్ ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో సదయ్య, అర్చకులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు.

డోర్నకల్–గద్వాల రైల్వేలైన్ చేపట్టాలా.. వద్దా?

- రూ.5,500 కోట్లకు పైగా వ్యయం.. అంతర్మథనంలో రైల్వే బోర్డు
- రాజకీయ ఒత్తిడి వస్తేనే ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపే పరిస్థితి
- దక్షిణ తెలంగాణలోని కీలక పట్టణాలను అనుసంధానించే ప్రాజెక్టు



సాక్షి, హైదరాబాద్: దక్షిణ తెలంగాణలోని సూర్యాపేట, నాగర్‌కర్నూలు, కల్వకుర్తి, అచ్చంపేటలాంటి కీలక ప్రాంతాలకు ఇప్పటి వరకు రైలుమార్గం లేదు. ఈ మార్గాలను అనుసంధానిస్తూ ప్రతిపాదించిన రైల్వేలైన్‌కు భారీ వ్యయం అవుతున్నందున రైల్వేబోర్డు ఎటూ తేల్చుకోలేకపోతోంది. దాదాపు రూ.5,500 కోట్ల వరకు వ్యయం చేయాల్సి ఉన్నందున.. ఈ మార్గాన్ని నిర్మిస్తే రైల్వేకు వచ్చే ఆదాయం ఎంతో లెక్కలేసుకుంటోంది. ఆదాయం అంతగా ఉండదని భావిస్తే ఈ కీలక మార్గం మంజూరయ్యే అవకాశం లేదు. దీంతో ఇప్పుడు ఈ ప్రాజెక్టును సాధించాలంటే రాజకీయ ఒత్తిడి కీలకంగా మారబోతోంది. నేతలు గట్టిగా ఒత్తిడి చేస్తే తప్ప ఇది సాకారం అయ్యే సూచనలు కనిపించటం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఏంటా ప్రాజెక్టు.. ఎందుకు టెన్షన్

తెలంగాణలో ఆది నుంచి రైల్వే అనుసంధానం తక్కువ. అందులోనూ దక్షిణ తెలంగాణలోని కీలక ప్రాంతాలకు రైల్వే భాగ్యం లేకుండా పోయింది. ఉన్న ప్రధాన లైన్లు తప్ప, వాటిని అనుసంధానించే కొత్త లైన్లు లేవు. ఈ తరుణంలో రైల్వే శాఖ సికింద్రాబాద్–విజయవాడ గ్రాండ్ ట్రంక్ రూట్‌లో ఉన్న డోర్నకల్ నుంచి కాచిగూడ–బెంగళూరు ప్రధాన లైన్‌లో ఉన్న గద్వాలను అనుసంధానిస్తూ కొత్త రైలు మార్గం నిర్మించాలని ప్రతిపాదించింది. దీనికి సంబంధించి ఇటీవల ఫైనల్ లొకేషన్ సర్వేను పూర్తి చేసింది. ఇప్పుడు అందులో కీలకమైన డీపీఆర్ తయారీ దాదాపు పూర్తయ్యింది. ఇప్పుడు దీనిపై రైల్వేబోర్డు నిర్ణయం వెల్లడించాల్సి ఉంది. డోర్నకల్‌లో ప్రారంభమయ్యే కొత్త లైన్ ఖమ్మంలోని కూసుమంచి, పాలేరు మీదుగా దక్షిణ తెలంగాణలో కీలక పట్టణాలైన సూర్యాపేట, నల్లగొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూలు, వనపర్తి, భూత్పూర్‌ల మీదుగా సాగి గద్వాల వద్ద ముగుస్తుంది. దీని నిడివి దాదాపు 300 కి.మీ. ఈ ప్రాంతాల్లో చాలా వాటికి ఇప్పటి వరకు రైలు వసతి లేదు. రైల్వేలైన్ ఏర్పడితే ఆ ప్రాంతాల్లో పురోగతి వేగం అందుకుంటుంది. పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చెందేందుకు దోహదం చేస్తుంది. దీంతో ఈ రైలు మార్గం దక్షిణ తెలంగాణ ఆర్థిక పరిస్థితిని మార్చే కీలక ప్రాజెక్టు. నిడివి ఎక్కువగా ఉండటంతో ఈ రైలు మార్గం నిర్మాణానికి దాదాపు రూ.5,500 కోట్లకుపైగా ఖర్చవుతుందని డీపీఆర్ ప్రాథమిక కసరత్తు చెబుతోంది. అధికారిక అంచనా వెల్లడి కావాల్సి ఉంది. ప్రస్తుతానికి జరుగుతున్న కసరత్తు మేరకు, ఇది భారీ ఖర్చుతో కూడుకున్నందున దీనిపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆదాయం అంతగా రాదని..

ప్రయాణికుల రైళ్లతో పెద్దగా ఆదాయం ఉండదు. సరుకు రవాణా రైళ్లతోనే ఆ శాఖకు భారీగా ఆదాయం సమకూరుతుంది. సిమెంటు పరిశ్రమలు, బొగ్గు గనులు, భారీ వ్యవసాయ మార్కెట్లు ఉన్న ప్రాంతాల మీదుగా సరుకు రవాణా రైళ్ల అవసరం ఉంటుంది. ఇప్పుడు ప్రతిపాదించిన కొత్త మార్గంలో సిమెంటు పరిశ్రమలు పెద్దగా లేవు. ఉమ్మడి ఖమ్మం ప్రాంతం మీదుగా సాగనున్నందుకు బొగ్గు తరలింపునకు అవకాశం ఉంది. రూ.ఐదున్నర వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నందున రేట్ ఆఫ్ రిటర్న్స్ బ్రేక్ ఈవెన్‌ను మించేలా ఉంటే ఈ ప్రాజెక్టును చేపట్టే వీలుంది. బ్రేక్‌ఈవెన్‌కు చేరుకోకుంటే నష్టం తెచ్చే ప్రాజెక్టుగా ముద్ర వేసి దాన్ని పక్కనపెట్టేస్తారు. దీనిపై రైల్వే బోర్డు నిర్ణయం తీసుకునే తరుణం అయినందున, ఇప్పుడే రాజకీయ ఒత్తిడి ఉండాలన్న సూచనలు వస్తున్నాయి.

'మాక్'తో మేల్కొలుపు

▶ మొదటి పేజీ తరువాయి

నిపుణులు చెబుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే జాగ్రత్తగా ఆప్షన్లు మార్చుకోవచ్చని సూచిస్తున్నారు.

2 వేల ర్యాంకుకూ సీటు రాలే..

మాక్ సీట్ల కేటాయింపులో 83,054 సీట్లకు 77,154 సీట్లు భర్తీ అయ్యాయి. దాదాపు 95 వేల మంది విద్యార్థులు ఆప్షన్లపై కసరత్తు చేశారు. అయితే, 16,905 మంది ఆప్షన్లు ఇచ్చినా సీట్లు పొందలేకపోయారు. వీళ్లంతా తక్కువ కాలేజీలు, కొన్ని బ్రాంచీలను మాత్రమే ఎంచుకున్నారు. మొదటి దశ కౌన్సెలింగ్ కాబట్టి జేఈఈ ద్వారా జాతీయ కాలేజీలకు వెళ్లే విద్యార్థులు కూడా రాష్ట్ర ఎప్‌సెట్‌కు దరఖాస్తు చేశారు. ఎక్కువ ఆప్షన్లు ఇవ్వకపోవడం వల్ల మంచి ర్యాంకు వచ్చినా వారికి సీటు రాలేదు. ఒక విద్యార్థినికి ఎప్‌సెట్‌లో 2 వేల ర్యాంకు వచ్చింది. అయినా మాక్ సీట్ల కేటాయింపులో సీటు రాలే దు. ఒక విద్యార్థికి 50 వేల ర్యాంకు వచ్చినా టాప్ 15 జాబితాలో ఉన్న కాలేజీలో సీఎస్ ఈ బ్రాంచీలో సీటు వచ్చింది. ఇతను ఎక్కువ ఆప్షన్లు ఇవ్వడం వల్ల ఇలా జరిగింది.



"మనకు ఆసక్తి ఎంత ఎక్కువగా ఉంటే, దుఃఖం అంత ఎక్కువగా ఉంటుంది.
– సయాజీ ఊ బా ఖీన్

సాక్షి
సోమవారం, 14 జూలై 2025

భాషా ఘోష

ప్రపంచంలో ఇప్పుడు ఏడు వేలకు పైగా భాషలు మనుగడలో ఉన్నాయి. గడచిన శతాబ్ద కాలంలో దాదాపు రెండు వేల భాషలు పూర్తిగా కనుమరుగైపోయాయి. ఇప్పటికి మనుగడలో ఉన్న ఏడు వేలకు పైగా భాషల్లోనూ సుమారు మూడు వేల భాషలు ప్రమాదం అంచుల్లో ఉన్నాయి. అంటే, ఆ యా భాషల కోసం పరిరక్షణ చర్యలు చేపట్టకుంటే, కొన ఊపిరితో ఉన్న ఆ భాషలు కూడా కనుమరుగైపోవడానికి ఎంతోకాలం పట్టదు. భాషలు కనుమరుగైపోవడానికి సవాలక్ష కారణాలు. ఆ కారణాలలో ముఖ్యమైనది ప్రభుత్వాల అణచివేత ధోరణి. అల్పసంఖ్యాకులు మాట్లాడుకునే భాషలలో బోధనావకాశాలు కల్పించకుండా చేయడం వంటి బుద్ధితక్కువ చర్యలు భాషల ఉసురు తీస్తున్నాయి. ఒక భాష అంతరించిపోతే వాటిల్లే నష్టం ఏమిటో రాజకీయాల్లో మునిగితేలే పాలకులకు తెలియదు. ఒక భాష అంతరించిపోతే, కేవలం ఒక సమాచార మార్పిడి సాధనం మాత్రమే అంతరించిపోయినట్లు కాదు. ఒక భాష అంతరించిపోతే, దానితో పాటే ఆ భాష మాట్లాడే ప్రజల పరంపరాగతమైన పరిజ్ఞానం; వారి సాంస్కృతిక సంపద; వారి సంప్రదాయాలు; వారు చెప్పుకొనే కథలు; వారు పాడుకొనే పాటలు– ఇలా అన్నీ కాలగర్భంలో కలిసిపోతాయి.

ప్రపంచంలోనే అత్యధిక భాషలు మనుగడలో ఉన్న దేశం పాపువా న్యూగినీ. ఈ దేశంలో ముప్పయి మూడు భాషా కుటుంబాలకు చెందిన ఎనిమిది వందలకు పైగా భాషలు మనుగడలో ఉన్నాయి. పాపువా న్యూగినీ అధికార భాషలు ఇంగ్లిష్ సహా నాలుగే అయినా, స్థానిక సమూహాలు మాట్లాడుకునే భాషలను అక్కడి రాజ్యాంగం గుర్తించిందే తప్ప వాటి మనుగడను దెబ్బతీసే చర్యలేవీ చేపట్టలేదు. చాలా దేశాల కంటే విస్తీర్ణంలోను, జనాభాలోను, ఆర్థిక సంపదలోను పాపువా న్యూగినీ చిన్న దేశమే అయినా, భాషా బాహుళ్యానికి భరోసా కల్పించడంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోంది. పాపువా న్యూగినీ తర్వాత భాషా బాహుళ్యంలో మన దేశం రెండో స్థానంలో ఉంది. 'ఎథ్నోలాగ్– లాంగ్వేజెస్ ఆఫ్ ద వరల్డ్' జాబితా ప్రకారం మన దేశంలో నాలుగు వందల యాభై ఆరు భాషలు మనుగడలో ఉన్నాయి. వీటిలో పదివేల మందికి పైగా జనాభా మాట్లాడే భాషలు నూట ఇరవై రెండు ఉన్నాయి. పది లక్షల మందికి పైగా జనాభా మాట్లాడే భాషలు ముప్పయి ఉన్నాయి. మన రాజ్యాంగం ఇరవై రెండు భాషలను గుర్తించింది. మన దేశంలో అనేక భాషా కుటుంబాలకు చెందిన భాషలున్నాయి. ప్రధానంగా ఉత్తరాదిలో ఇండో–ఆర్యన్ కుటుంబానికి చెందిన భాషలు మాట్లాడేవారి జనాభా ఎక్కువ. దక్షిణాదిలో ద్రవిడ భాషా కుటుంబానికి చెందిన భాషలు మాట్లాడేవారి జనాభా ఎక్కువ. ఇండో–ఆర్యన్, ద్రవిడ భాషా కుటుంబాలే కాకుండా; ఆస్ట్రో ఆసియాటిక్, సైనో–టిబెటన్, తాయ్ కడాయ్, అండమాన్ తదితర భాషా కుటుంబాలకు చెందిన భాషలు కూడా ఉన్నాయి.

మన దేశంలో గడచిన యాభయ్యేళ్లలో రెండు వందల ఇరవై భాషలు అంతరించిపోయాయి. మరో నూట తొంభై ఏడు భాషలు ప్రమాదం అంచుల్లో ఉన్నాయని యూనెస్కో ప్రకటించింది. ప్రపంచీకరణ ఫలితంగా విపణికి అవసరమైన భాషల ప్రాబల్యం ప్రపంచ వ్యాప్తంగా చాలా భాషల మనుగడను ప్రశ్నార్థకంగా మార్చింది. నియంతలు ఏలిన దేశాల్లో ఆధిపత్య భాషల బలవంతపు రుద్దుడు ఫలితంగా ఎన్నో భాషలు కనుమరుగయ్యాయి. నాజీ నియంత హిట్లర్ ఏలుబడిలో జర్మన్‌ను బలవంతంగా జనాల మీద రుద్దే ప్రయత్నం జరిగింది. ఇప్పటికీ భారత్ సహా ప్రపంచంలోని చాలా దేశాల్లో ప్రజాస్వామ్యం ఉన్నా, పాలకుల రాజకీయ, ఆర్థిక ఆధిపత్య ధోరణుల కారణంగా అల్పసంఖ్యాకులు మాట్లాడుకునే భాషలకు ముప్పు వాటిల్లుతోంది.

ప్రపంచవ్యాప్తంగా దాదాపు నూటనలభైకి పైగా భాషా కుటుంబాలు ఉన్నాయి. వీటి నుంచి విడివడి వేలాది భాషలు ఏర్పడ్డాయి. కాలగమనంలో వాటిలో అంతరించినవి అంతరించగా, కొన్ని ఇంకా మిగిలి ఉన్నాయి. వాటిలో కొన్ని భాషలు మిగిలిన భాషల మీద పెత్తనం చలాయిస్తుంటే, మిగిలిన భాషలు మనుగడ కోసం పోరాటం సాగిస్తున్నాయి. 'ఒక మనిషితో మనం అతడికి అర్థమయ్యే భాషలో మాట్లాడితే, అది అతడి మస్తిష్కానికి చేరుతుంది. అతడి భాషలోనే మాట్లాడితే, అది అతడి హృదయానికి చేరుతుంది' అని నెల్సన్ మండేలా అన్నారు. ఇదొక సామరస్య ప్రకటన. 'ఒక సంస్కృతిని నాశనం చేయాలంటే, ముందుగా దాని భాషను, చరిత్రను చంపాలి' అనేది జాత్యహంకార నియంతల విధానం. ఆధిపత్య ధోరణులు భాషారంగం సహా ఏ రంగంలో ఉన్నా, ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదు. ఏడు రంగులు హరివిల్లు ప్రత్యేకత అయినట్లే, భాషా బాహుళ్యమే మన దేశ సాంస్కృతిక ప్రత్యేకత. హరివిల్లుకు ఒకే రంగుపూసి, దాని వర్ణవైవిధ్యాన్ని రూపుమాపాలని అనుకోవడం ఎంతటి వెర్రి ఆలోచనో, దేశంలోని భాషా బాహుళ్యానికి విఘాతం కలిగించే ప్రయత్నాలు చేయడం కూడా అంతటి వెర్రితనమే! భాషా బాహుళ్యంలోని వైవిధ్యాన్ని కాపాడుకోవడం, అల్పసంఖ్యాకుల భాషా సంస్కృతుల మనుగడకు భరోసాను ఇవ్వడం ప్రజాస్వామిక ప్రభుత్వాల బాధ్యత. దురదృష్టవశాత్తు మన దేశంలో భాషలకు కూడా రాజకీయాల చీడ సోకింది. భాషల నడుమ ఉన్న సంబంధ బాంధవ్యాల గురించి కనీస అవగాహన లేకుండా ఏ భాష మరే భాషకు పెద్దమ్మ అవుతుందో, మరే భాష ఇంకే భాషకు అమ్మమ్మ అవుతుందో ప్రవచనాలు చెబుతుండటం మన దౌర్భాగ్యం. ఇలాంటి ప్రవచనాల్లో వాడే భాష దద్దమ్మ భాష తప్ప మరేమీ కాదు.

హాస్యాస్పద ఓటరు ధ్రువీకరణ

కామెంట్



కరణ్ థాపర్

ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ కోసం జూన్ 24న ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కలవరపరచే పలు ప్రశ్నలను రేకెత్తిస్తున్నాయి. ఈ సవరణ ఫలితంగా కోట్ల మంది తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉండదా? వీరిలో అత్యధికులు పేదలు, అణగారిన వర్గాలే ఉంటారా? అసలు ఇప్పటికిప్పుడు ఈ సవరణ కార్యక్రమం చేపట్టడం అవసరమా?

ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం, ఏ సమయంలోనైనా, ఏ తరహాలోనైనా ఓటర్ల జాబితాల్లో ప్రత్యేక సవరణ చేసే అధికారం ఎలక్షన్ కమిషన్‌కు ఉంటుంది. నాకు ఆ విషయం తెలుసు. అయితే, కేవలం నాలుగు నెలల్లో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవలసి ఉన్న తరుణంలో ఈ ఆదేశం ఎంతవరకు సబబు? 2003లో, అసెంబ్లీ ఎన్నికలకు రెండేళ్ల ముందుగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్– సర్) జరిగింది. అది నాలుగు నెలల ముందు కాదన్నది మనం గమనించవలసిన విషయం.

ఆధారాలు ఎలా తెస్తారు?

రెండోది, ఈ 'సర్'ను జూన్ 25న ప్రారంభించి, జూలై 25 నాటికి పూర్తి చేయాలి. అంటే కేవలం ఒక నెల రోజుల వ్యవధి మాత్రమే ఉంటుంది. 8 కోట్ల మంది ఓటర్లను ప్రభావితం చేసే ఈ కార్యక్రమాన్ని కేవలం 30 రోజుల్లో పూర్తి చేయడం అసలు సాధ్యపడే పనేనా?

ఇవి సందర్భానికి సమయానికి సంబంధించిన ప్రశ్నలు. అయితే, ఇక్కడ ప్రశ్నార్థకం సమయం ఒక్కటే కాదు; ప్రక్రియ మీదా నీలినీడలు ముసిరాయి. ఎలాగో తెలుసుకోడానికి ఉత్తర్వుల వివరాల్లోకి వెళ్దాం. కమిషన్ ఆదేశాల ప్రకారం, 1987 జూలైకి ముందు జన్మించిన వ్యక్తులు తమ పుట్టుకకు, పుట్టిన ప్రదేశానికి సంబంధించిన ఆధారాలు సమర్పించి తీరాలి. అయితే, చాలా మందికి జనన ధ్రువీకరణ పత్రాలు ఉండవు. వీరిలో ఎంతో మంది ఆసుపత్రుల్లో కాకుండా ఇళ్లలోనే జన్మించారు.

2000 సంవత్సరం వరకూ కూడా బిహార్‌లో కేవలం 3.7 శాతం జననాలే అధికారికంగా నమోదు అయ్యాయి. 2007 నాటికి ఇది 25 శాతానికి పెరిగింది. ఈ సంవత్సరంలో పుట్టిన వారికి 2025లో 18 ఏళ్లు నిండుతాయి. అంటే ఏమిటి? వీరిలో గణనీయ సంఖ్యాకుల వద్ద జనన ధ్రువీకరణ పత్రాలు లేవు. స్వయంగా రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా వెల్లడించిన గణాంకాలే ఈ వాస్తవాన్ని వెల్లడిస్తున్నాయి.

జనన ధ్రువీకరణ పత్రాలు లేని వారు 11 ఇతర ఆధారాల్లో ఏదో ఒకటి చూపించగలిగితే చాలని కమిషన్ చెబుతోంది. ప్రభుత్వ రంగ



సంస్థలు జారీ చేసే గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు, మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్, అటవీ హక్కు సర్టిఫికెట్ వంటివి వీటిలో ఉన్నాయి. కానీ, సాధారణంగా అందరి దగ్గరా ఉండే ఆధార్, రేషన్ కార్డులను సుప్రీం కోర్టు సూచించినప్పటికీ వీటినుంచి మినహాయించారు. కమిషన్ పేర్కొన్న 11 పత్రాల్లో ఏదో ఒకటి ఎంత మంది బిహారీల వద్ద ఉండి ఉంటుంది? ఆ ఏదో ఒక పత్రంలో జన్మస్థలం నమోదై ఉంటుందా అనేది మరో ముఖ్యమైన ప్రశ్న. చాలా వాటిలో ఉండదు.

దళితులు, ముస్లింలు, అత్యంత వెనుకబడిన కులాలు, ఆదివాసీలు వంటి అట్టడుగు వర్గాల బీద ప్రజలకు ఈ ధ్రువీకరణ పత్రాలు ఉండవు. కాబట్టి వారి ఓటు హక్కు రద్దవుతుంది. ఇది అన్యాయం కాదా?

కమిషన్ మౌనం

మరో అడుగు ముందుకు వెళ్లి పరిశీలిద్దాం. 1987 జూలై తర్వాతి నుంచి 2004 డిసెంబరు వరకు గడచిన కాలంలో పుట్టినవారు జనన, జనన ప్రదేశ ఆధారాలు మాత్రమే ఇస్తే సరిపోదు. తమ తల్లిదండ్రుల్లో ఒకరి జనన ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. ఇక 2004 డిసెంబరు తర్వాత పుట్టిన వారైతే తల్లిదండ్రుల ఇద్దరి వివరాలు ఆధారాలతో సహా సమర్పించాలి. ఎంతమంది ఇలా చేయగలరు? ఉదాహరణకు, నా తల్లిదండ్రుల జనన ధ్రువపత్రాలు నా వద్ద లేవు. నేను వాటిని సమర్పించలేను. చాలామంది బిహారీల వద్ద వారి తల్లిదండ్రుల జనన ధ్రువీకరణ పత్రాలు ఉండవని నేను కచ్చితంగా చెప్పగలను.

కమిషన్ ఆ తర్వాత చెప్పిన దాని ప్రకారం, బిహార్‌లో 2003 'సర్' జరిగిన తర్వాత 7.9 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 4.96 కోట్ల మంది ఓటర్లు ఎలాంటి డాక్యుమెంట్లూ సమర్పించాల్సిన

- ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం, ఏ సమయంలోనైనా, ఏ తరహాలోనైనా ఓటర్ల జాబితాల్లో ప్రత్యేక సవరణ చేసే అధికారం ఎలక్షన్ కమిషన్‌కు ఉంటుంది. అయితే, కేవలం నాలుగు నెలల్లో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవలసి ఉన్న తరుణంలో ఈ ఆదేశం ఎంతవరకు సబబు?
- 2000 సంవత్సరం వరకూ కూడా బిహార్‌లో కేవలం 3.7 శాతం జననాలే అధికారికంగా నమోదు అయ్యాయి. 2007 నాటికి ఇది 25 శాతానికి పెరిగింది. ఈ సంవత్సరంలో పుట్టిన వారికి 2025లో 18 ఏళ్లు నిండుతాయి. అంటే ఏమిటి? వీరిలో గణనీయ సంఖ్యాకుల వద్ద జనన ధ్రువీకరణ పత్రాలు లేవు.

అవసరం లేదు. మరి మిగిలిన 3 కోట్ల మంది మాటేమిటి? హక్కు ఉన్నప్పటికీ 2003 ఎస్ఐఆర్‌లో నమోదు కాని వారి సంగతేమిటి? ఈ ప్రశ్నలకు కమిషన్ నుంచి ఎలాంటి సమాధానం రావడం లేదు.

అక్రమం... హాస్యాస్పదం

ఇవి ఇప్పటికే వేధిస్తున్న ప్రశ్నలు కాగా, సవరణ ప్రక్రియ ముందుకు సాగుతున్న కొద్దీ మరిన్ని సమస్యలు ఎదురవుతాయి. కమిషన్ కోరుతున్న అన్ని వివరాలూ నెల రోజుల్లోనే సమకూర్చాలి. అలా చేయలేని వారి పేర్లను ఓటర్ల జాబితాల నుంచి తొలగిస్తారు. అసలే నడి వర్షాకాలం, పైగా ఖరీఫ్ సీజన్ ముమ్మరంగా సాగుతూ ఉంటుంది. ఇలాంటి సమయంలో పనులు మానుకుని ఎంతమంది ఈ అదనపు బరువు నెత్తికి ఎత్తుకుంటారు?

ఇక్కడితో అయిపోలేదు. బిహార్ జనాభాలో 20 శాతం మంది వలసలు పోయే కార్మికులు. ఈ ప్రత్యేక సవరణ జరిగేటప్పుడు వారు స్థానికంగా అందుబాటులో ఉండరు. అలాంటి వారి విషయంలో ఏం జరుగుతుంది? ఓటర్ల జాబితాల నుంచి వారి పేర్లు గల్లంతయ్యే ప్రమాదం లేదా?

చివరిగా, మరో అంశం ప్రస్తావించాలి. ఓటర్ల జాబితాల్లో ఇలా పేర్లు గల్లంతైన వారు పౌరులుగా కూడా గుర్తింపు కోల్పోయే ప్రమాదం లేదా? 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్' (ఏడీఆర్) వ్యవస్థాపక ట్రస్టీ అయిన జగదీప్ ఛోకర్ అందుకే ఈ ఎస్ఐఆర్ "అక్రమం, హాస్యాస్పదం, అనవసరం" అంటున్నారు. నిర్మొహమాటంగా చెబుతున్నాను, నేను ఆయన అభిప్రాయంతో ఏకీభవిస్తాను. మరి మీ సంగతేమిటి?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

భవిష్యత్ డాక్టర్



వైద్యులారా! విప్లవం ఆల్రెడీ వచ్చేసింది. వైద్యం, న్యాయం, భౌతికశాస్త్రం, ఆర్థికం – అన్ని రంగాల్లోనూ గ్రోక్ 4 మన కంటే తెలివైనది. ఇదింకా మొదటి ఏడాదే. మరో రెండేళ్లలో రోగులు తమ రిపోర్టులు, స్కానింగులు, లక్షణాలు అప్‌లోడ్ చేస్తే, ఒక యంత్రం స్పెషలిస్టుల కన్నా వేగంగా, నిర్దిష్టంగా, మరింత వ్యక్తిగతంగా జవాబు ఇస్తుంది. ఇదేమీ సైన్స్ ఫిక్షన్ కాదు. నిజం! వైద్యులకు ఏఐ ప్రత్యామ్నాయం అవుతుందా అన్నది ఇప్పుడు ప్రశ్నే కాదు. ఆ రోజంటూ వచ్చాక మనం ఏం చేస్తామన్నదే అసలైన ప్రశ్న.

– అఫ్షైన్ ఇమ్రానీ, కార్డియాలజిస్ట్

అన్నీ తెలియాలి!



మనకు నిజంగా ఇలాంటి ఒక వెబ్‌సైట్ కావాలి: ఫలానా రోడ్డును వేసిన కాంట్రాక్టర్ ఎవరు? దాన్ని అనుమతించిన అధికారి ఎవరు? దానికైన ఖర్చెంత? అందులో భాగమైన మంత్రి ఎవరు? దాన్ని నిర్వహించాల్సిన సంస్థ ఏది? ఇవన్నీ బహిరంగంగా తెలియాలి. రోడ్డుకు రేటింగ్ ఇచ్చే వీలు కూడా ఉండాలి. అన్నింటా జవాబుదారీతనాన్ని డిమాండ్ చేయాల్సిన సమయం ఇదే!

– అనురాధా తివారీ, యాక్టివిస్ట్

నూనెకు చెక్!



2001లో భారతీయులు ఏటా 8 కిలోల నూనెను వాడే వాళ్లు. ఇది ఇప్పుడు మూడింతలై ఏడాదికి 24 కిలోలయ్యింది. మనకు తెలియకుండానే చిరుతిళ్ల రూపంలో ఎంత నూనె తింటున్నామో చూసుకోవాలి.

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

వాస్తవం



యూఎస్ లాగా పన్నులు. సోమాలియా లాగా మౌలిక వసతులు. కలలు మాత్రం ప్రాచీన భారత్‌వర్ష్‌వి!

– అతుల్ కుమార్ మిశ్రా, ఆంట్రప్రెన్యూర్

ప్రశ్నలే ప్రశ్నలు



పేరెంట్–టీచర్స్ మీటింగ్ వాస్తవాలు: పిల్లలు వాళ్లమ్మతో వస్తే మీటింగ్‌కు అరగంట పడుతుంది. అదే వాళ్ల నాన్నతో వస్తే రెండు నిమిషాల్లో ముగుస్తుంది.

– జాఫర్, వ్యంగ్య వ్యాఖ్యాత

ఉండాల్సిన తీరు




మీకు మీరే శత్రువులా కావొద్దు. గతంలో జీవించొద్దు. మీరు చేసిన గత తప్పుల గురించి అదేపనిగా మథనపడొద్దు. ఇతరులతో మిమ్మల్ని పోల్చుకోవడం మానేయాలి. మిమ్మల్ని సృష్టించిన ఆ దేవుడి నుంచి బలాన్ని కోరుకోండి.

– ముఫ్తీ మెంక్, ఆధ్యాత్మిక బోధకుడు

గామానైఫ్‌తో రేడియో సర్జరీ

సైన్స్ టుడే



డా॥ సి.వి. సర్వేశ్వర శర్మ

యురేనియం కన్నా ఎన్నో రెట్లు ఎక్కువ రేడియో ధార్మిక శక్తి గల పదార్థం రేడియం. ఈ రెండు పదార్థాలు అప్రయత్నంగా ఆల్ఫా, బీటా, గామా కిరణాలను వెదజల్లుతూ ఉంటాయి. వీటిలో గామా కిరణాలు ఎక్కువ శక్తి కల్గి ఉంటాయి. ఈ మూలకాల ధర చాలా ఎక్కువ. 1935లో ఎర్నెస్ట్ లారెన్స్ కృత్రిమ రేడియో ధార్మిక పదార్థం రేడియో సోడియాన్ని తయారు చేశాడు. ఇప్పుడు ఇటువంటి రేడియో ధార్మిక పదార్థాలు వెయ్యికి పైగా అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ గామా కిరణ జనకాలే.

ఈ విశాల విశ్వంలో నక్షత్రాల విస్ఫోటనం వల్ల గామా కిరణాలు ఉత్పన్నమవుతున్నాయి. ఇవి భూమిని చేరకుండా ఆకాశంలో ఓజోన్ పొర అడ్డుకుంటోంది. ఈ గామా కిరణాలు భూమిని జేరి మనిషి మీద పడితే అవి పడే డోసును బట్టి మనిషి రకరకాల ఆపదలకు గురవుతాడు.

ఎక్స్ కిరణాలకన్నా గామా కిరణాలకు చొచ్చుకుపోయే సామర్థ్యం ఎక్కువ. సులువుగా ఈ కిరణాలు ఎదిగే మొక్కల అంతర్భాగంలోకీ, జంతువుల ధాతువుల్లోకీ దూసుకుపోగలవు. గామా కిరణాలు మొక్కల మీద పడితే అవి వేగంగా ఎదుగుతాయి, దిగుబడి పెరుగుతుంది. పొలాల్లో పంటలను నాశనం చేసే ఎలుకలు ఈ కిరణాల ధాటికి మరణిస్తాయి. మొక్కలకు వచ్చే చీడ, పీడ, పురుగులు, తెగుళ్ల ఈ గామా కిరణాల తాకిడికి దరిజేరవు. మనిషి తట్టుకోలేని ఈ కిరణాలను ధాన్యం తట్టుకోగలదు. పంట పొలాలపై ఈ కిరణాలు పడటం వల్ల పంట కాల వ్యవధి తగ్గుతుంది. దిగుబడి పెరుగుతుంది. పంట నాణ్యత గణనీయంగా పెరుగుతుంది. ఇంకా ప్రయోగ దశలోఉన్న ఈ విధానం రైతులకు అందుబాటులోకి రావాల్సి ఉంది.



మెదడు లోని కణితులు, గాయాలు, ధమనుల వైఫల్యాలు, ట్రిజిమినల్, న్యూరల్జియా, ఇతర పరిస్థితులకు చికిత్స చేయడంలో 'గామా నైఫ్' అనే పరికరం సహాయ పడుతుంది. ఇది కోబాల్ట్ –60 రేడియేషన్ మూలాల నుండి వచ్చే గామా కిరణాలను ప్రత్యేకమైన పద్ధతిలో కేంద్రీకరించి నిర్దిష్ట ప్రాంతాలకు పంపడంలో సహకరిస్తుంది. దీని సహాయంతో కచ్చితమైన మోతాదులు వైద్యుడు పంపగల్గుతాడు.

రోగికి సమస్య ఉన్న స్థానం, గాయం రకం, ప్రక్రియ సమయంలో రోగి సాధారణ ఆరోగ్యం, ఇతర కారకాలపై గామా నైఫ్ విజయం ఆధారపడి ఉంటుంది. నిజానికి ఇది మెదడులోని సమస్యలను సరి చేయగల ఒక సాంకేతికత. చికిత్సలో భాగంగా రోగి తల కదలకుండా ఒక ఫ్రేమ్ కట్టి గామా కిరణాలు ఎక్కడ పడాలో పర్యవేక్షిస్తారు. రోగికి నొప్పి లేకుండా, మెలకువగా ఉండగానే కొన్ని గంటల్లో ఈ చికిత్స పూర్తి అవుతుంది. శరీరంపై ఎటువంటి కోతలు ఉండవు.

గామా కిరణాలు ప్రభావిత ప్రాంతాలకు అధిక మోతాదులోనే వెడతాయి. చుట్టుపక్కల కణజాలానికి తక్కువ హాని మాత్రమే జరుగుతుంది. ఈ చికిత్స వైద్యుడు మాత్రమే నిర్వహించాలి. రోగులు ఈ చికిత్స పూర్తి అయిన తరువాత ఇంటికి వెళ్లిపోవచ్చు. ఈ చికిత్స అనంతరం కొంతమందికి కొన్ని దుష్ప్రభావాలు కనిపించవచ్చు. తల నొప్పి, వికారం, వాంతులు, తిమ్మిర్లు, చుట్టుపక్కల జుట్టు రాలిపోవడం, బలహీనత, దృష్టి సమస్యలు రావచ్చు. ప్రతి సమస్యకు వైద్యుని సలహా మేర మందులు వాడితే పరిష్కారం లభిస్తుంది.

వ్యాసకర్త కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు

హద్దులు లేని స్నేహబంధం

హిమాలయాల తలమానికం. గౌతమ బుద్ధుని జన్మభూమి. హిందూ – బౌద్ధ సంస్కృతుల కలయిక. రాజకీయంగా పునర్నిర్మాణం. ఇలాంటి నేపాల్‌ను సందర్శించాలన్న ఆలోచన ఎంతో కాలంగా మనసులో ఉంది. 'నేపాల్ శాంతి సంఘీభావ సమితి' ద్వారా ఈ అవకాశం కలిగింది. 'భారత సాంస్కృతిక స్నేహ సహకార సంఘం' (ఇస్కఫ్) బృందం 2025 జూన్ 15 నుండి 20 వరకు ఖాట్మండు పర్యటన జరిపింది. ఈ బృందంలో ఒడిశా, తమిళనాడు, కశ్మీర్, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన 27 మంది ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొన్న వారిలో ఈ వ్యాస రచయిత ఉన్నాడు. మా బృందానికి ఇస్కఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్ కుమార్ పదిహారి నాయకత్వం వహించారు. నేపాల్ పర్యటన రాజకీయ, ఆధ్యాత్మిక, విద్యా కోణాల్లో ఎన్నో కొత్త అనుభవాలను అందించింది.

భారత్–నేపాల్ దేశాలు భౌగోళికంగా, సాంస్కృతికంగా, మతపరంగా అత్యంత సమీప సంబంధాలున్న దేశాలు. రామాయణంలో పేర్కొన్న సీతాదేవి జన్మస్థలం జనకపురి నేపాల్ లోనిదే. అంతేగాక, బుద్ధుడు జన్మించిన లుంబిని ఈ దేశంలోనే ఉంది. ఈ విధంగా హిందూ – బౌద్ధ సంప్రదాయాల మధ్య సాంస్కృతిక అనుబంధం గాఢంగా ఏర్పడింది. 1947లో భారత్ స్వాతంత్ర్యం పొందిన తరువాత, 1950లో భారత్–నేపాల్ మధ్య స్నేహ, శాంతి ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం, రెండు దేశాల ప్రజలు ఇరు దేశాలకూ స్వేచ్ఛగా ప్రయాణించగలుగుతారు. వాణిజ్యం, ఉద్యోగం, స్థిరాస్తుల విషయంలో సమాన హక్కులు కలిగి ఉంటారు.

మా తొలి రోజు కార్యక్రమం, ఖాట్మండు పరిసరాల్లోని చారిత్రక ప్రదేశాలను సందర్శించడం. తొలి ఆధ్యాత్మిక ఆరాధన పశుపతి నాథ్ ఆలయంతో మొదలైంది. హిందూ ధర్మంలో ఒక శైవపీఠంగా గుర్తించబడే ఇది మన సాంస్కృతిక బంధానికి మూల స్తంభంగా నిలుస్తోంది.

ఒక విశేష సమావేశంగా మేము నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యూనిఫైడ్ మార్క్సిస్టు–లెనినిస్టు) సెంట్రల్ కమిటీ సభ్యుడు రాజన్ భట్టారాయ్‌ని కలిశాం. నేపాల్ రాజ్యాంగ నిర్మాణానికి, రాచరికం అంతానికి, ప్రజాస్వామ్య స్థాపనకు కమ్యూనిస్టు ఉద్యమం ఎలా ఉద్యమించిందో ఆయన వివరించారు. ప్రజలు స్వయం శక్తితో ఎలా ఉద్యమించారో, మావోయిస్టుల హింసాత్మక మార్గం ఎలా విఫలమై, పార్లమెంటరీ పద్ధతులు ఎలా విజయవంతమయ్యాయో ఆయన తెలియజేశారు. భారత కమ్యూనిస్టు ఉద్యమానికి





నేపాల్ కమ్యూనిస్టు నాయకుడు రాజన్ భట్టారాయ్‌ని కలిసిన వ్యాసకర్త సభ్యుడిగా ఉన్న ఇస్కఫ్ ప్రతినిధి బృందం

- నేపాల్‌లో మావోయిస్టుల హింసాత్మక మార్గం ఎలా విఫలమై, పార్లమెంటరీ పద్ధతులు ఎలా విజయవంతమయ్యాయో నేపాల్ కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు తెలియజేశారు. భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఈ పరిణామాలు పనికొస్తాయి.

ఈ రాజకీయ పరిణామాలు మౌలికంగా పనికి వస్తాయి. నేపాల్ కమ్యూనిస్టు ఉద్యమం అనేది హిమాలయ ప్రజల నిబద్ధత, బలమైన రాజకీయ ఆవేశం, సామాజిక న్యాయం సాధించాలన్న కోరికల ఫలితం. ఇది కేవలం ఒక రాజకీయ ఉద్యమం కాదు – ఒక దేశ ప్రజలను రాజ్యాంగం కలిగిన ప్రజాస్వామ్య దేశంగా మార్చిన విప్లవ గాథ. నేపాల్‌లో వందల ఏళ్లుగా సాగుతున్న రాచరిక పాలనను తుడిచిపెట్టిన ప్రజా ఉద్యమానికి కమ్యూనిస్టులు కేంద్ర బిందువులయ్యారు.


నేపాల్‌కు భారత్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. 2023–24లో నేపాల్ దిగుమతులలో దాదాపు 60% వరకు భారతదేశం నుంచి జరిగినవే. భారత ప్రభుత్వం నేపాల్‌లో అనేక మౌలిక వసతుల ప్రాజెక్టులకు సహాయంగా పనిచేస్తోంది. రహదారులు, విద్యుత్, రైల్వే, డ్యామ్‌లు వంటివి ఇందులో ఉన్నాయి. భారత్, నేపాల్ మధ్య రక్షణ సంబంధాలు బలంగా ఉన్నాయి. నేపాల్ గూర్ఖా సైనికులు భారత ఆర్మీలో ప్రత్యేక స్థానం పొందారు. ప్రస్తుతం భారత సైన్యంలో దాదాపు 32,000 నేపాలీయులు పనిచేస్తున్నారు. ప్రతి సంవత్సరం భారత రక్షణ దళాలు నేపాల్ ఆర్మీకి శిక్షణ, పరికరాలు, సాంకేతిక సహాయం అందిస్తాయి. భారతదేశంలోని విశ్వవిద్యాలయాల్లో వేలాది నేపాలీ విద్యార్థులు ఉన్నారు. ఖాట్మండు విశ్వవిద్యాలయంలో భారత దౌత్య శాఖ సహాయంతో నడుస్తున్న ఇండియా–నేపాల్ ఫ్రెండ్‌షిప్ లైబ్రరీ, విద్యారంగానికి ఒక సంకేతంగా ఉంది. ఇండియన్ ఎంబసీ తరఫున నేపాల్‌కు విద్యా, పర్యావరణ, ఆరోగ్య రంగాల్లో భారీగా స్కాలర్‌షిప్‌లు, మద్దతు అందిస్తున్నాయి.

ఈ యాత్ర మాకు ఒక పాఠశాల. రాజకీయ చైతన్యం, మతసామరస్య దృక్పథం, ఆధ్యాత్మికత, సేవా, విద్యలో సమానత్వం– అన్నింటినీ ఒకే వేదికపై ముందు ఉంచిన అనుభవం.

– కె. రాజశేఖర్
ఇస్కఫ్ ఏపీ శాఖ అధ్యక్షుడు | 99483 17270

అర్హతే ముఖ్యం

గౌతమ బుద్ధుని జీవితమంతా ఎన్నెన్నో అద్భుతమైన సంఘటనలతో నిండి ఉంది. వాటినన్నిటినీ పైకి తీసి ప్రపంచానికి పంచాడు ఓషో. అందులో ఈ సంఘటన ఒకటి: ఒకనాడు గౌతమ బుద్ధుడు ఒక గ్రామానికి చేరాడు. గ్రామ ప్రముఖులు ఎంతో సంతోషించి ఆ నాటి సాయంత్రం ఒక బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఆ కరుణామయుని దివ్య పలుకులను వినటానికి అన్ని వర్గాల ప్రజలూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. బుద్ధుని వాక్కులను వినటానికి ఉవ్విళ్ళూరుతున్నారు. కానీ బుద్ధుడు వేదికపై మౌనంగా కూర్చొన్నాడు గానీ ఉపన్యాసాన్ని ప్రారంభించలేదు. ఎవరి రాక కోసమో ఎదురు చూస్తున్నట్టుగా ఒక వైపు చూస్తూ ఉండిపోయాడు. అప్పుడొక ప్రముఖుడు ఆయనతో 'రావలసిన పుర ప్రముఖులు, ప్రజలు అందరూ వచ్చారు. మీరు ప్రారంభించవచ్చు' అన్నాడు. అప్పుడు ఆయనతో బుద్ధుడు, 'లేదు, అత్యంత ముఖ్యమైన వ్యక్తి ఇంకా రాలేదు. అసలు ఈ రోజు నేను ఈ గ్రామానికి వచ్చిందే ఆ వ్యక్తికి బోధించటానికి. ఆ వ్యక్తి మాత్రమే ఈనాటి నా బోధను శ్రద్ధగా వినేది, గ్రహించేది, ఆచరణలోకి తెచ్చుకొనేది. ఆ వ్యక్తి జ్ఞాన దాహమే నన్ను ఈ రోజు ఇక్కడికి ఆకర్షించి రప్పించిం'దని అన్నాడు.



జ్యోతిర్మయం

ఇంతలో ఆ దిక్కులో ఒక సాధారణమైన పల్లెటూరి పిల్ల సభా ప్రాంగణంలోకి ప్రవేశించింది– ఎంతో ఉత్సాహంతో, ఉత్సుకతతో. ఆ పిల్ల ఆనాడు పొలం పనుల్లో నిమగ్నమై ఉండగా తెలిసింది గౌతమ బుద్ధుడు పక్క ఊళ్లో ఉన్నాడని – ఆ రోజు తప్పక తన ఊరికి వస్తాడని చెప్పింది ఆమె హృదయం. ఆయన బోధనలను వినాలని తపించింది ఆమె మనస్సు. ఆ తపనే గౌతమ బుద్ధుని ఆ ఊరికి లాక్కొచ్చింది. ఆమె పొలం పనులను గబగబా ముగించి పరుగులు తీస్తూ సభా ప్రాంగణానికి చేరింది.

ఆమెను చూపుతూ 'అదిగో, నేను వేచి ఉన్న వ్యక్తి వచ్చింది. ఇక నేను నా ఉపన్యాసాన్ని ప్రారంభిస్తాను' అన్నాడు బుద్ధుడు. ఆ పల్లెటూరి పేద బాలిక హృదయం బుద్ధుని అమృత వాక్కులను విని ఆనందంతో నిండిపోయింది (పేజీ. 51, సెవెన్ స్టెప్స్ టు సమాధి – ఓషో). సద్గురువులు వారి జ్ఞాన ధనాన్ని పంచవలసిన సందర్భంలో ఏ వ్యక్తికి జ్ఞాన పిపాస ఉందా అనే చూస్తారు గానీ, వ్యక్తి హోదా, వయసు, కులం లాంటి అల్పమైన వాటిని పరిగణించరు. వారికి కావలసింది అర్హుడైన వ్యక్తే గాని, వేల సంఖ్యలో అనర్హులు కారు.

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, తిథి: బ.చవితి రా.11.56 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: ధనిష్ఠ ఉ.7.39 వరకు, తదుపరి శతభిషం, వర్జ్యం: ప.2.42 నుండి 4.16 వరకు, దుర్ముహూర్తం: ప.12.31 నుండి 1.23 వరకు, తదుపరి ప.3.07 నుండి 3.59 వరకు, అమృతఘడియలు: రా.12.05 నుండి 1.40 వరకు, సంకటహర చతుర్థి ; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 5.36, సూర్యాస్తమయం: 6.35.

క్లుప్తంగా...

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు మెరుగుపర్చండి

- గుడిహత్నూర్ ఘటన నేపథ్యంలో ప్రభుత్వానికి ఎన్‌సీపీసీఆర్ సూచన



సాక్షి, హైదరాబాద్: ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు రోజుల పసిబిడ్డపై సీలింగ్ ఫ్యాన్ తెగిపడి గాయపడిన ఘటనపై జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎన్‌సీపీసీఆర్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్‌సీపీసీఆర్ నోటీసులు జారీచేసింది. ఘటనపై పదిరోజుల్లో పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు మెరుగుపర్చాలని సూచించింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని వైద్య,ఆరోగ్య శాఖను ఎన్‌సీపీసీఆర్ ఆదేశించింది.

విద్యుదాఘాతంతో దివ్యాంగ బాలిక సజీవ దహనం


భానుప్రియ

మక్తల్: మాటలు రాని, అంధురాలైన ఒక దివ్యాంగ బాలిక ప్రమాదవశాత్తు ఇంట్లో జరిగిన విద్యుదాఘాతంతో సజీవ దహనమైంది. ప్రమాదంలో ఇల్లు సైతం పాక్షికంగా కాలిపోయింది. నారాయణపేట జిల్లా మక్తల్‌లో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. మక్తల్ పట్టణం నందినగర్‌కు చెందిన ఈసరి కృష్ణ, సుజాత దంపతులకు ముగ్గురు సంతానం. భార్యాభర్తలు ఆదివారం కూలి పనులకు వెళ్లారు. చిన్న కూతురు, కుమారుడు ఆరుబయట ఆడుకుంటుండగా.. పెద్ద కూతురైన దివ్యాంగురాలు భానుప్రియ (12) ఇంట్లో ఉంది. కాగా.. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నుంచి పొగలు రావడంతో.. బయట ఆడుకుంటున్న చెల్లెలు ఇంట్లోకి వెళ్లి చూసింది. అప్పటికే విద్యుదాఘాతంతో భానుప్రియ మృతి చెందగా.. ఇల్లు పాక్షికంగా కాలిపోయింది. వెంటనే చెల్లెలు బయటికి వచ్చి కేకలు వేయడంతో.. చుట్టుపక్కల వారు వచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం అందించి మంటలు ఆర్పివేశారు. బాలిక తండ్రి ఈసరి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి

తండ్రీ కొడుకుల మధ్య భూ వివాదం

- పురుగు మందు తాగి కుమారుడి ఆత్మహత్య

జూలపల్లి(పెద్దపల్లి): తండ్రీకొడుకుల మధ్య భూవివాదం కుమారుడి ఆత్మహత్యకు దారి తీసింది. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రంలో జరిగిన ఈ సంఘటనపై ఎస్‌ఐ సనత్‌కుమార్ కథనం ప్రకారం.. జూలపల్లికి చెందిన గుమ్మడి మల్లయ్యకు కుమారుడు సతీశ్ (35), ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వీరందరికీ పెళ్లిళ్లు చేశాడు. కాగా, కొంతకాలంగా భూమి విషయంలో తండ్రీకొడుకుల మధ్య వివాదం జరుగుతోంది. తండ్రికి ఉన్న ఎకరం పొలంలో కొంతభాగం.. తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని కుమారుడు కోరుతూ వస్తున్నాడు. ఇందుకు ఆయన అంగీకరించడం లేదు. ఇదే విషయంపై శనివారం రాత్రి తండ్రి మల్లయ్య.. కొడుకు సతీశ్ మధ్య గొడవ జరిగింది. తన పేరిట భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదనే తీవ్ర మనస్తాపంతో సతీశ్ ఇంట్లోని పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య స్వాతి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సనత్‌కుమార్ వివరించారు.

సీఎస్‌సీతో మీసేవ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలి

- మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైర శంకర్

సాక్షి, హైదరాబాద్: మీసేవ కేంద్రాల ద్వారా అందుతున్న బిల్లు చెల్లింపుల సర్వీసులను ప్రైవేటు సంస్థ సీఎస్‌సీకి అప్పగించడంపై తెలంగాణ మీసేవ ఫెడరేషన్ అధ్యక్షుడు బైర శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా విజయవంతంగా సేవలందిస్తున్న మీసేవ కేంద్రాలకు బదులుగా.. ప్రైవేటు సంస్థను ప్రోత్సహించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టారు. తక్షణమే ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఐటీ శాఖ ఉన్నతాధికారులకు వినతులు సమర్పించామని, సోమవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి పరిస్థితిని వివరిస్తామన్నారు. ఒప్పందాన్ని రద్దు చేసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వైభవంగా లష్కర్ బోనాలు

- ఉజ్జయినీ మహంకాళిని దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి
- అమ్మవారిని దర్శించుకున్న లక్షలాది మంది భక్తులు


ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దర్శనం చేసుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో అనిల్‌కుమార్, పొంగులేటి, కొండా సురేఖ, పొన్నం తదితరులు


కుటుంబ సభ్యులతో కలసి మహంకాళి అమ్మవారి దర్శనానికి వస్తున్న కిషన్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: రెండు శతాబ్దాల చరిత్ర కలిగిన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయం నలుదిక్కుల ఏర్పాటు చేసిన క్యూలైన్లలో తెల్లవారుజాము నుంచే భక్తులు వేచిఉన్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉదయం 11.40 గంటలకు ఆలయానికి రాగా, ఆలయ అధికారులు, వేద పండితులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. రేవంత్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు, అర్చకులు సీఎంకు తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వచనం పలికారు. రేవంత్‌రెడ్డి వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ అనిల్‌కుమార్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేష్, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ ఉన్నారు. కాగా, తెల్లవారుజామున 4 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు అమ్మవారికి బంగారు బోనం సమర్పించి తొలి పూజ చేశారు. అనంతరం సాధారణ భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బోనం సమర్పించిన కిషన్‌రెడ్డి దంపతులు

మహంకాళి అమ్మవారికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి దంపతులు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ నర్సింగ్‌రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపీ ఈటల రాజేందర్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ముఠా గోపాల్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మంత్రి పొన్నం బోనాల విందు

సాక్షి, హైదరాబాద్: శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా.. బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని తన అధికారిక నివాసంలో విందు ఇచ్చారు. ఈ విందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నేతలు వీహెచ్, కె.కేశవరావు, బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డిలతో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరికీ మంత్రి పొన్నం బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తన కుటుంబ సభ్యులను అతిథులకు పరిచయం చేశారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

రాష్ట్రం సుభిక్షంగా ఉండి పాడి పంటలు, వర్షాలతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని మొక్కుకున్నా. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలకు ఏర్పాట్లు చేశాం.

– పొన్నం ప్రభాకర్, మంత్రి

అమ్మవారి వైభవం చాటేలా ఉత్సవాలు

చారిత్రాత్మక ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి వైభవాన్ని చాటేలా బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. తెలంగాణ సుభిక్షంగా ఉండాలని, ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి ఆలోచనలు సఫలీకృతం కావాలని మొక్కుకున్నా.

– సీతక్క, మంత్రి

దేశ ప్రజల తరఫున బోనం

ప్రధాని మోదీతోపాటు దేశ ప్రజలందరి తరఫున అమ్మవారికి బోనం సమర్పించాను. దేశం, రాష్ట్రం సుఖ శాంతులతో ఉండటంతోపాటు దేశాన్ని రక్షించే సాయుధ బలగాలకు శక్తిని ప్రసాదించాలని మొక్కుకున్నా.

– కిషన్‌రెడ్డి, కేంద్రమంత్రి

సుఖశాంతులతో ఉండాలని..

రాష్ట్రాన్ని ఆశీర్వదించి పాడిపంటలు, సుఖశాంతులతో ప్రజలు ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నా. ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు లేకుండా అమ్మవారు ప్రజలను కాపాడాలి. ప్రకృతిని పూజించే గొప్ప సంప్రదాయం ఉన్న రాష్ట్రం తెలంగాణ.

– రాంచందర్‌రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

సీఐ వార్నింగ్.. వ్యక్తి ఆత్మహత్య

- ఈ నెల 7న పురుగు మందు తాగిన బాధితుడు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి
- కరీంనగర్ మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ బెదిరించినట్లు సెల్ఫీ వీడియో
- వరకట్న కేసులో వేధిస్తున్నారని ఆరోపణ
- మృతుడి భార్య, అత్త, మధ్యవర్తులు, సీఐపై కేసు


శ్రవణ్‌కుమార్

చొప్పదండి/కరీంనగర్ క్రైం: గృహహింస, వరకట్న వేధింపుల కేసులో తనను అత్తింటివారితోపాటు మధ్యవర్తులు, కరీంనగర్ మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ వేధిస్తున్నారని ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 7వ తేదీన సెల్ఫీ వీడియో తీసుకుని పురుగుల మందు తాగిన కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన కడారి శ్రవణ్‌కుమార్.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. ఈ వ్యవహారంలో చొప్పదండి పోలీసులు కరీంనగర్ మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీలత, మృతుడి భార్య, అత్త, మధ్యవర్తులపై కేసు నమోదు చేశారు. కరీంనగర్ రూరల్ రెవెన్యూ కార్యాలయంలో శ్రవణ్ కుమార్ రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతనికి కరీంనగర్ బస్ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న కరీంనగర్ నివాసి నీలిమతో 2021 జూన్‌లో వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. రెండేళ్ల నుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. అప్పటి నుంచి నీలిమ తల్లిగారింట్లో ఉంటోంది. గత నెలలో కరీంనగర్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో నీలిమ వరకట్నం వేధింపుల కేసు పెట్టడంతో శ్రవణ్‌తోపాటు, అతని తండ్రి నర్సింగం, తల్లి విజయ, అక్క కడారి వనజ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ సీఐ శ్రీలత 'నువ్వు ప్రభుత్వ ఉద్యోగివి. నేను చెప్పినట్లు వింటే మంచిది. కంప్రమైజ్ చేసుకో. లేకుంటే ఇబ్బంది పడతావు'అని బెదిరిస్తూ అతడిపై కేసు నమోదు చేసింది. ఈ క్రమంలో సీఐ శ్రీలత, తన భార్య, అత్త, మధ్యవర్తుల వేధింపులు భరించలేకపోతున్నానని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని శ్రవణ్ సెల్ఫీ వీడియోలో ఆరోపించాడు. శ్రవణ్ తండ్రి నర్సింగం ఫిర్యాదుతో సీఐ శ్రీలత, నీలిమ, ప్రవీణ్‌కుమార్, నవీన్‌కుమార్, ఎడ్ల ప్రసన్న, బత్తుల వినోద, బత్తుల మధుకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌రెడ్డి తెలిపారు. శ్రవణ్ మృతితో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద అతడి బంధువులు ఆందోళన నిర్వహించారు. శ్రవణ్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ధూళి పేలుడుతోనే సిగాచి ప్రమాదం

- తెలంగాణ పౌర సమాజం నిజనిర్ధారణ కమిటీ

పటాన్‌చెరు టౌన్: ఇటీవల సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదం రసాయనాలకు సంబంధించింది కాదని, వాటిని కరిగించేందుకు వినియోగించే కర్ర పొడి, బొగ్గు ధూళి వల్లే పేలుడు సంభవించిందని తెలంగాణ పౌర సమాజం నిజ నిర్ధారణ కమిటీ సభ్యుడు, సీనియర్ శాస్త్రవేత్త కలపాల బాబురావు స్పష్టం చేశారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, మానవ హక్కుల వేదిక, ఏపీసీఆర్ సంస్థ, సైంటిస్ట్ వార్ పీపుల్ సంస్థలతో కలిసి పౌర సమాజం నిజ నిర్ధారణ కమిటీగా ఏర్పడి ఆదివారం సిగాచి పరిశ్రమను సందర్శించింది. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించిన అనంతరం కమిటీ సభ్యులతో కలసి బాబురావు మీడియాతో మాట్లాడారు. ప్రమాదం జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపై పరిశ్రమ యాజమాన్యానికి అవగాహన లేదని, కార్మికులకు, ఉద్యోగులకు ప్లాంట్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షణ చర్యలపై యాజమాన్యం కనీస అవగాహన కల్పించలేదని మండిపడ్డారు. కంపెనీ యాజమాన్య ప్రతినిధు వెంటనే ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు.

కమ్యూనిస్టు నేత విజయ్ కన్నుమూత

సాక్షి, హైదరాబాద్: కమ్యూనిస్టు నాయకుడు, యూసీసీఆర్ఐ (ఎం-ఎల్) సభ్యుడు విజయ్ (74) శనివారం రాత్రి 8.30 గంటలకు కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు ఇటీవల తీవ్రమైన సమస్యలు తలెత్తాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణ వార్తను పార్టీ అధికారికంగా విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. విజయ్ అసలు పేరు శిష్ట విజయ్ శర్మ. 1951 మార్చి 19న అప్పటి మద్రాస్ రాష్ట్రం, ప్రస్తుత ఏపీలోని కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం లంకపల్లి గ్రామంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే ఆయనకు విప్లవ సిద్ధాంతాల పట్ల ఆసక్తి ఏర్పడింది. ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చేసిన ఆయన న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్‌లో ఉద్యోగంలో చేరారు. 1981లో ఉద్యోగానికి రాజీనామా చేసి, పూర్తిగా కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమయ్యారు. ఏపీ, తెలంగాణలో పలు రైతు, కార్మిక ఉద్యమాల్లో పాల్గొన్నారు. విజయ్ మృతి పట్ల పార్టీ నేతలు సంతాపం ప్రకటించారు.

మిస్టరీగా ఆర్మీ జవాన్ అదృశ్యం

- ఈ నెల 11న అదృశ్యం.. శ్రీశైలం డ్యాం వద్ద కారు లభ్యం
- బంధువుకు వీడియో కాల్ చేసి తాను చనిపోతున్నానని చెప్పిన జవాన్


నవీన్

మరిపెడ రూరల్: ఓ ఆర్మీ జవాన్ కనిపించకుండా పోవడం మిస్టరీగా మారింది. అతడు ప్రయాణించిన కారు శ్రీశైలం డ్యాం వద్ద లభించింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పూసలతండాకు చెందిన మూడు నవీన్ ఢిల్లీలో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 2023లో దంతాలపల్లి మండలానికి చెందిన సరితను వివాహం చేసుకోగా, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నవీన్ ఇటీవల ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో ఈనెల 11న నవీన్ కనిపించకుండా పోయాడు. బంధువులు ఆరాతీయగా, ఆయన కారు శ్రీశైలం డ్యాం వద్ద లభించింది. కారులో నవీన్ గుర్తింపు కార్డు, పురుగు మందు ఖాళీ డబ్బా, సెల్ ఫోన్ లభ్యమైనట్లు సమాచారం. దీంతో సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, ఈ నెల 11న భార్య సరితకు చెప్పకుండా వెళ్లిపోయిన నవీన్ అదేరోజు తన సమీప బంధువుకు వీడియో కాల్ చేసి తాను పురుగు మందు తాగి చనిపోతున్నానని చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చేదెక్కిన చెరకు

- రాష్ట్రంలో ఏటా తగ్గుతున్న సాగు విస్తీర్ణం
- 61వేల హెక్టార్లకు గాను 21వేల హెక్టార్లలోనే సాగు
- సన్న వడ్ల తరహాలో బోనస్ కోసం రైతుల డిమాండ్
- మెట్రిక్ టన్నుకు రూ.1,000 ఇవ్వాలని వినతి


మూడోవంతు విస్తీర్ణంలోనే సాగు !

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చెరకు సాగు విస్తీర్ణం క్రమేపీ తగ్గుతోంది. ఫ్యాక్టరీల క్రషింగ్ సామర్థ్యానికి సరిపోను దిగుబడి కూడా ఉండటం లేదంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. చెరకు సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వపరంగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో రైతులు ఇతర పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా వరిసాగుకు సై అనడంతో చెరకు సాగు విస్తీర్ణం పెరగడం లేదని ఫ్యాక్టరీల యాజమాన్యాలు, చెరకు విభాగం అధికారులు చెబుతున్నారు. చెరకు పరిశ్రమ ద్వారా ఒక్కో మెట్రిక్ టన్నుపై ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో రూ.250 వరకు సమకూరుతోంది. చెరకు ఏడాది పంట కావడంతో టన్నుకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహకం ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తోంది. చెరకు ఫ్యాక్టరీలకు అవసరమైన ముడి సరుకుతోపాటు గ్రామీణ ప్రాంతంలో ఉపాధి కల్పనలో కీలకంగా ఉన్న చెరకు పరిశ్రమను ప్రోత్సహించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో చెరకు రైతులకు బోనస్ ప్రకటించేందుకు విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సిందిగా చెరకు విభాగం అధికారులు కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం.

రాష్ట్రంలో 12 చక్కెర కర్మాగారాలు ఉండగా, ఐదు కర్మాగారాలు మూత పడ్డాయి. ప్రస్తుతం ప్రైవేట్ రంగంలోని ఏడు చక్కెర కర్మాగారాలు మాత్రమే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటి క్రషింగ్ సామర్థ్యం రోజుకు 24,700 మెట్రిక్ టన్నులు. 130 రోజుల క్రషింగ్ సీజన్‌ను పరిగణనలోకి తీసుకొని లెక్క వేస్తే మొత్తంగా ఫ్యాక్టరీల క్రషింగ్ సామర్థ్యానికి అనుగుణంగా 32.11 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు అవసరం. రాష్ట్రంలో 40వేలకు పైగా హెక్టార్లలో చెరకు సాగు చేస్తేనే ఈ ఏడు ఫ్యాక్టరీల క్రషింగ్ సామర్థ్యానికి అనుగుణంగా దిగుబడి వస్తుందని యాజమాన్యాలు చెబుతున్నాయి. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో 21వేల హెక్టార్లలో మాత్రమే రైతులు చెరకును సాగు చేస్తున్నారు. దీంతో ఫ్యాక్టరీలకు నష్టాలు తప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించి మూతపడిన బోధన్, మెదక్, మెట్‌పల్లిలోని నిజాం డెక్కన్ షుగర్స్ యూనిట్లు తెరుచుకుంటే చెరకు పంట సాగు విస్తీర్ణం 61వేల హెక్టార్లకు చేరాలి. అంటే ప్రస్తుతం రాష్ట్రంలోని ఫ్యాక్టరీల క్రషింగ్ సామర్థ్యానికి అవసరమైన విస్తీర్ణంలో కేవలం మూడో వంతు విస్తీర్ణంలో మాత్రమే చెరకు సాగవుతోంది.

తమిళనాడు తరహాలో బోనస్ ఇవ్వాలి

తమిళనాడులో చెరకు రైతులకు టన్నుకు రూ.1,000 చొప్పున బోనస్ ఇస్తున్నారు. ఇదే తరహాలో తెలంగాణ ప్రభుత్వం కూడా చెరకు రైతులకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహకం ఇవ్వాలి. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో రైతులు వరి సాగువైపే మొగ్గు చూపుతున్నారు.

– రచ్చ నరసింహారావు, చెన్నారం, ఖమ్మం జిల్లా

చెరకు రైతులను ఆదుకోవాలి

చెరకు సాగులో ఖర్చులు పెరిగి గిట్టుబాటు కావడం లేదు. స్థానికంగా ఉన్న చక్కెర కర్మాగారం మూతపడటంతో తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది. మరోవైపు కనీస మద్దతు ధర కూడా ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. సన్న వడ్లకు ఇచ్చినట్టుగా చెరకు రైతులకు కూడా బోనస్ ఇవ్వాలి. చెరకు సాగులో యాంత్రీకరణ అనుకున్నంత వేగంగా జరగడం లేదు.

– ఈదులపల్లి ఈరన్న, హద్నూర్, సంగారెడ్డి జిల్లా

గడచిన రెండు సీజన్లలో చెరకు సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)

	2023-24	2024-25
ప్లాంట్ (తోట)	9,741	11,667
రటూన్ (పిలక)	11,036	9,637
విత్తనం	-	475
మొత్తం	20,777	21,779

క్రిప్టో దందా వెనుక బీజేపీ నేత?

- రూ.100 కోట్లతో లోకేశ్‌ను దేశం దాటించింది ఎవరు?
- సదరు లీడర్ పాత్రపై కేంద్ర నిఘా వర్గాల ఆరా

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మెటా క్రిప్టో కరెన్సీ యాప్‌పై కేంద్ర నిఘా వర్గాలు కూడా ఫోకస్ పెట్టాయి. ఈ యాప్‌ను కరీంనగర్ జిల్లాలో పరిచయం చేయించిన మాజీ కార్పొరేటర్ వెనక ఎవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాయి. ఆయన వెనక బీజేపీలోని ఒక పెద్ద నేత ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మెటా పేరిట వసూలు చేసిన రూ.100 కోట్లకుపైగా డబ్బు ఎలా థాయ్‌లాండ్ వెళ్లింది? ఎవరు దీనికి సాయం చేశారు? ఈ విషయంలో సదరు బీజేపీ పెద్ద నేతకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అన్న దిశగా విచారణ చేస్తున్నారు. మెటా క్రిప్టో వ్యవహారంలో మాజీ కార్పొరేటర్ కరీంనగర్ ప్రజలకు లోకేశ్ అనే వ్యక్తిని పరిచయం చేశాడు. క్రిప్టో కరెన్సీ పేరిట మూడు నెలల్లో డబ్బులు రెట్టింపు అవుతాయని నమ్మించి రూ.100 కోట్ల వరకు వసూలు చేసి ముఖం చాటేశారు. ఈ లోకేశ్ ఎవరు? అతడిని థాయ్‌లాండ్ ఎవరు పంపారు అనే విషయంపై ఇప్పుడు దర్యాప్తు జరుగుతున్నట్లు తెలిసింది. అతడికి బీజేపీ పెద్ద లీడర్ ఏమైనా సాయం చేశారా? అన్న కోణంలో వివరాలు సేకరిస్తున్నారు. ఈ కుంభకోణంలో జగిత్యాల వాసులు రవివర్మ, భాస్కర్ కీలక పాత్ర పోషించారు. వీరు విమానాల్లో ఇన్వెస్టర్లను విదేశీ యాత్రలకు తీసుకెళ్తున్నారు. ఈ యాప్‌లో రూ.కోట్లలో పెట్టుబడి పెట్టిస్తే.. వీరికి ఒకటి నుంచి 7 వరకు స్టార్స్ ఇస్తారు. సెవెన్‌స్టార్స్ జాబితాలో జగిత్యాలకు చెందిన శేఖర్, రాకేశ్, మల్లికార్జున్, రమేశ్, కిషన్ మరో మహిళ ఉన్నారు. వీరు ఇప్పటివరకు 7 నుంచి పదిసార్లు విదేశాలకు వెళ్లివచ్చారు. ఇటీవలే నలుగురు టీచర్లు, ఒక పోలీసు అధికారి, కొంత మంది రెవెన్యూ ఉద్యోగులు, రాజకీయ నాయకులు పెట్టుబడులు పెట్టి బ్యాంకాక్‌కు వెళ్లివచ్చారు.

రాజకీయ వ్యవస్థలో మార్పు రావాలి

- ప్రొఫెసర్ హరగోపాల్


సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

హనుమకొండ: మాజీ సీఎం కేసీఆర్ గత ప్రభుత్వంలో మేధావుల సూచనలను పట్టించుకోలేదని, నేటి పాలకులు కూడా మేధావుల సూచనలను విన్నప్పటికీ వాటి అమలుపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రొఫెసర్ హరగోపాల్ విమర్శించారు. ఆదివారం హనుమకొండలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ అప్పుల ఊబిలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ కూరుకుపోయిందన్నారు. రాజకీయాలు మొత్తం డబ్బు మయమయ్యాయని, రూ.కోట్లు ఖర్చు చేయనిదే ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేదని విచారం వ్యక్తం చేశారు. దీనివల్లనే మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి అటకెక్కిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక రంగం బాగుపడాలంటే రాజకీయ వ్యవస్థలో మార్పు రావాలని సూచించారు. తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళికలు రచించాలని సూచించారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పాలకులు అభివృద్ధిని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. విద్య, వైద్య రంగంలో తెలంగాణ 31వ స్థానానికి దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇట్యాల పురుషోత్తం మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వరంగ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని సూచించారు. హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆర్‌వీ రమణమూర్తి, ప్రొఫెసర్ సదానందం, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నమనేని జగన్ మోహన్‌రావు సదస్సులో ప్రసంగించారు.

కల్లు కాంపౌండ్లపై కాంట్రాక్టర్ల గుత్తాధిపత్యం

- గీత కార్మిక నేతల ఆరోపణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భూపతి వెంకటేశ్వర్లు, వేణుగోపాల్‌గౌడ్

బంజారాహిల్స్ (హైదరాబాద్): కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, బాధితులకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కల్లు గీత కార్మిక సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పి.వేణుగోపాల్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కల్లు దుకాణాలపై కాంట్రాక్టర్లు గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారని, అందుకే కల్తీ కల్లు ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. నగరంలో 104 కల్లు దుకాణాలు ఉన్నాయని, ఇందులో ఒకరికి 14 షాపులు, మరొకరికి 6 షాపులు, ఇంకొకరికి 3 దుకాణాల చొప్పున గత కొన్ని దశాబ్దాలుగా వీరి అధీనంలోనే కొనసాగుతున్నాయని అన్నారు. అల్ప్రాజోలం కలిపి కల్లు తయారుచేసే యంత్రాంగం, సొంత స్థలాలు ఉండడం ఈ కాంట్రాక్టర్లకు బాగా కలిసివస్తోందని, అందుకే దుకాణాలపై గుత్తాధిపత్యం కొనసాగుతోందని విమర్శించారు. కల్లు అమ్మే వారికి గుర్తింపు కార్డు, రహదారి పర్మిషన్, లైసెన్స్ రెన్యువల్ తప్పనిసరిగా ఉండాలని, అయితే నగరంలో నడుస్తున్న దుకాణాలకు ఇవేమీ లేవని అన్నారు. ఇదొక మాఫియాలా తయారైందన్నారు. కల్లు కాంపౌండ్‌లపై కాంట్రాక్టర్ల గుత్తాధిపత్యం, కల్తీని అరికట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

భూముల కోసం రైతుల ఆత్మహత్యాయత్నం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన


ఒంటిపై పెట్రోల్ చల్లుకుంటున్న యువకుడు

బెల్లంపల్లి: అటవీ అధికారుల వేధింపులు ఆపాలని, ఏళ్లుగా సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములను కాపాడాలని బెల్లంపల్లి, నెన్నెల మండలాలకు చెందిన పలువురు రైతులు బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆదివారం ఆందోళన చేశారు. భూమి పత్రాలు, పెట్రోల్ డబ్బాలతో ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకున్న రైతులు న్యాయం కోసం నినాదాలు చేశారు. అటవీ అధికారులు తమ పత్తి పంటను ధ్వంసం చేసి, మోటార్లు, పైపులను స్వాధీనం చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ భూముల్లో సాగు చేస్తున్నామని ఆరోపిస్తూ అడ్డంకులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొందరు రైతులు, వారి కుటుంబ సభ్యులు పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన వన్‌టౌన్ ఎస్సై రాకేశ్, తాళ్లగురిజాల ఎస్సై రమేశ్ వారి ప్రయత్నాలను అడ్డుకున్నారు. ఈ ఘటనతో క్యాంపు కార్యాలయం వద్ద కలకలం రేగింది. పోలీసులు, రైతుల మధ్య స్వల్ప తోపులాట కూడా జరిగింది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ కార్యాలయం నుంచి బయటకు వచ్చి రైతులతో మాట్లాడారు. వెంటనే కలెక్టర్ కుమార్‌దీపక్‌కు ఫోన్ చేసి సమస్య వివరించారు. న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు.

సారే జహాసె అచ్ఛా ఇండియా

అంతరిక్ష కేంద్రం నుంచి శుభాంశు చివరి సందేశం

- నేడు ఐఎస్ఎస్ నుంచి బయలుదేరనున్న నలుగురు వ్యోమగాములు
- రేపు కాలిఫోర్నియా తీరంలో దిగనున్న స్పేస్ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్

న్యూఢిల్లీ: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) సోమవారం వీడ్కోలు పలుకబోతున్నారు. ఐఎస్ఎస్‌కు చేరుకున్న మొట్టమొదటి ఇండియన్ అస్ట్రోనాట్‌గా చరిత్ర సృష్టించిన శుక్లా 18 రోజుల తన అంతరిక్ష యాత్ర ముగించుకొని సహచర వ్యోమగాములతో కలిసి భూమిపైకి తిరిగిరాబోతున్నారు. యాక్సియోమ్ మిషన్-4(ఏఎక్స్-4) ముగింపు దశకు చేరుకోవడంతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఆదివారం ప్రత్యేక వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శుభాంశు శుక్లా చివరి సందేశం ఇచ్చారు. ''భారతదేశం ఈరోజు అంతరిక్షం నుంచి నిర్భయంగా, పూర్తి విశ్వాసంతో సగర్వంగా కనిపిస్తోంది. సారే జహాసె అచ్ఛా ఇండియా. ఇదొక అద్భుతమైన, నమ్మశక్యంకాని ప్రయాణం. ఐఎస్ఎస్‌లో అంతరిక్ష ప్రయోగాల్లో ఈరోజు నా వ్యక్తిగత అధ్యాయం ముగిసింది. కానీ, భారతీయ అంతరిక్ష సంస్థ ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది. మనమంతా కలిసి పని చేస్తే అనుకున్నది సాధించగలం. భవిష్యత్తులో మరెన్నో ఘన విజయాల కోసం మనం ఐక్యంగా కృషి చేయాలి. పరస్పరం సహకరించుకోవాలి. ఈ ప్రయోగం సఫలం కావడానికి, నేను ఇక్కడికి చేరుకోవడానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఐఎస్ఎస్‌లో నిష్ణాతులైన సహచర వ్యోమగాములతో కలిసి పనిచేయడం మర్చిపోలేని అనుభవం. వారు నా అంతరిక్ష యాత్రను అందమైన అనుభూతిగా మార్చారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి మన భూమిని వీక్షించడం ఎన్నో గొప్ప జ్ఞాపకాలను మిగిల్చింది. భూమిని చూసిన ప్రతిసారీ మాయాజాలాన్ని చూస్తున్నట్లే ఉంది. నాకు అన్ని విధాలా మద్దతుగా నిలిచిన ఇస్రో, నాసా సైంటిస్టులకు కృతజ్ఞతలు. ఇలాంటి అంతరిక్ష యాత్రలు కేవలం శాస్త్రీయ పరిశోధనలకే కాకుండా మన దేశాలకు, మానవాళి ప్రగతికి తోడ్పడతాయి'' అని శుభాంశు శుక్లా ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. సహచర వ్యోమగాములు ఆయనను ఆలింగనం చేసుకున్నారు. శుభాంశు శుక్లాతోపాటు అమెరికాకు చెందిన పెగ్గీ విట్సన్, పోలాండ్‌కు చెందిన సావోజ్ ఉజ్‌నాన్‌స్కీ-విస్నీవ్‌స్కీ, హంగేరీకి చెందిన టిబోర్ కపు సైతం మాట్లాడారు. తమ అనుభవాలు పంచుకున్నారు.

- ఏఎక్స్-4 మిషన్‌లో భాగంగా గత నెల 26న అమెరికాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి నలుగురు వ్యోమగాములు శుభాంశు శుక్లా, పెగ్గీ విట్సన్, సావోజ్ ఉజ్‌నాన్‌స్కీ-విస్నీవ్‌స్కీ, టిబోర్ కపు బయలుదేరిన సంగతి తెలిసిందే.
- ఐఎస్ఎస్ నుంచి వీరు ఇప్పటిదాకా భూగోళాన్ని 250 సార్లు చుట్టేశారు. భూమి చుట్టూ 96,56,064 కిలోమీటర్లు ప్రయాణించారు.
- అంతరిక్ష కేంద్రంలో 60 రకాల శాస్త్రీయ ప్రయోగాల్లో పాలుపంచుకున్నారు. అంతరిక్ష ప్రయోగాలకు సంబంధించి కీలకమైన సమాచారం అందించారు.
- స్పేస్ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో ఐఎస్ఎస్ నుంచి శుభాంశు శుక్లా, పెగ్గీ విట్సన్, సావోజ్ ఉజ్‌నాన్‌స్కీ-విస్నీవ్‌స్కీ, టిబోర్ కపు భూమిపైకి తిరిగిరాబోతున్నారు. వారి రిటర్న్ షెడ్యూల్‌ను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అధికారికంగా ధ్రువీకరించింది.
- భారత అంతరిక్ష ప్రయోగాల్లో శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారతీయుడిగా, ఐఎస్ఎస్‌కు చేరుకున్న మొదటి భారతీయుడిగా ఆయన రికార్డుకెక్కారు. ఆయన ప్రయాణం కొత్త తరం భారతీయ శాస్త్రవేత్తలకు, అంతరిక్ష ఔత్సాహికులకు స్ఫూర్తిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.


ఐఎస్ఎస్‌లో వీడ్కోలు కార్యక్రమంలో మాట్లాడుతున్న శుభాంశు శుక్లా

ఘనస్వాగతానికి ఏర్పాట్లు

- అంతరిక్ష యాత్ర పూర్తికావడంతో నలుగురు వ్యోమగాములు భారత కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 2.25 గంటలకు ఐఎస్ఎస్ నుంచి స్పేస్ఎక్స్ డ్రాగన్ వ్యోమనౌకలోకి చేరుకుంటారు. ప్రి-ఫ్లైట్ తనిఖీలు నిర్వహిస్తారు.
- వ్యోమనౌక సాయంత్రం 4.34 గంటలకు ఐఎస్ఎస్‌తో అన్‌డాకింగ్ అవుతుంది. తర్వాత భూమి దిశగా ప్రయాణం సాగిస్తుంది.
- అమెరికాలోని కాలిఫోర్నియా సమీపంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు పసిఫిక్ సముద్ర తీరంలో నలుగురు వ్యోమగాములు భూమిపై దిగే అవకాశం ఉంది.
- అమెరికాలో ఏడు రోజుల క్వారంటైన్ తర్వాత స్వదేశానికి చేరుకొనే శుభాంశు శుక్లాకు ఘన స్వాగతం పలకడానికి ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో స్వాగత ఏర్పాట్లు జరుగుతున్నాయి.

వేలానికి అరుదైన అంగారక శకలం

భూమిపై ఉన్న అతిపెద్ద, అరుదైన అంగారక గ్రహ శకలం మార్టిన్ ఉల్క (ఎన్‌డబ్ల్యూఏ 16788) వేలానికి వెళ్లనుంది. ఈ శకలం సుమారు 25 కిలోల బరువున్నది. ఇది 2023లో సహారా ఎడారిలో దొరికింది. అంగాకరక గ్రహం నుంచి భూమిపై ఇప్పటివరకూ పడ్డ ఇతర శకలాల కంటే దాదాపు 70% పెద్దది. దీనిని న్యూయార్క్‌లోని సోతేబైస్‌లో జూలై 16న వేలం నిర్వహించనున్నారు. ఇది సుమారు రూ. 33.4 కోట్లకు అమ్ముడుపోవచ్చని అంచనా వేస్తున్నారు. మార్టిన్ ఉల్కలు చాలా అరుదుగా ఉంటాయి. ఇప్పటివరకూ భూమిపై అధికారికంగా కనుగొన్న 77,000 గుర్తించిన ఉల్కలలో ఇవి కేవలం 0.6 శాతం మాత్రమే. ఏదైనా ఆస్టరాయిడ్ మార్స్‌ను ఢీకొట్టడం వల్ల ఇది అంతరిక్షంలోకి వచ్చి ఉంటుంది. 225 మిలియన్ మైళ్ల దూరం ప్రయాణించి చివరికి భూమికి చేరుకుంది. 'ఇది కేవలం ఒక అద్భుత ఆవిష్కరణ మాత్రమే కాదు, మన పొరుగున ఉన్న అంగారక గ్రహం రహస్యాలను తెలుసుకోవడానికి సహాయపడే భారీ డేటాసెట్' అని సోథెబైస్ సైన్స్ అండ్ నేచురల్ హిస్టరీ వైస్ చైర్మన్ కాసాండ్రా హాటన్ అన్నారు. ఎన్‌డబ్ల్యూ 16788పై భూసంబంధమైన వాతావరణం కనిపిస్తోందని, అన్ని మైళ్ల ప్రయాణం తరువాత కూడా దాని భౌతిక, రసాయన నిర్మాణం చెక్కుచెదరకుండా ఉందని తెలిపారు. అయితే.. వేలం ద్వారా విలువైన పరిశోధనా సామగ్రి ప్రైవేట్ చేతులకు వెళ్లే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతుంది.



- సాక్షి, నేషనల్ డెస్క్

డీజిల్‌తో వెళ్లే గూడ్స్‌లో మంటలు

చెన్నై: చెన్నైలో గూడ్స్ రైలు ప్రమాదానికి గురైంది. ఓడరేవు నుంచి డీజిల్‌తో వెళ్తున్న రైలు ఆదివారం తెల్లవారుజామున తమిళనాడులోని తిరువళ్లూరులో మంటల్లో చిక్కుకుంది. రైలు పట్టాలు తప్పిన తర్వాత మంటలు చెలరేగాయి. మంటల నుంచి దట్టమైన పొగలు ఎగసిపడుతున్న దృశ్యాలు స్థానికులను భయాందోళనకు గురి చేశాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళాలు... ప్రమాదానికి గురైన నాలు కంపార్ట్‌మెంట్లను.. మిగిలిన బోగీల నుంచి వేరు చేశారు. ప్రమాద తీవ్రత అధికంగా ఉండటంతో సమీప ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయించారు. సమీపంలోని ఇళ్లలో ఉపయోగించిన ఎల్పీజీ సిలిండర్లను తొలగించారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడం అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం కారణంగా, భద్రతా చర్యగా ఓవర్ హెడ్ విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీని వల్ల రైలు కార్యకలాపాల్లో మార్పులు వచ్చాయి.



పెద్దల సభకు ఉజ్వల్ నికమ్

- హర్షవర్ధన్ శ్రింగ్లా, మీనాక్షి జైన్, సి.సదానందన్ మాస్టర్‌లకు సైతం అవకాశం
- రాజ్యసభకు నలుగురిని నామినేట్ చేసిన రాష్ట్రపతి ముర్ము

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నలుగురు ప్రతిభావంతులను రాజ్యసభకు నామినేట్ చేశారు. 26/11 ముంబయి ఉగ్రవాద దాడి కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసి, పాకిస్తాన్ ఉగ్రవాది అజ్మల్ కసబ్‌కు ఉరిశిక్ష పడేలా కీలక పాత్ర పోషించిన సీనియర్ లాయర్ ఉజ్వల్ నికమ్, చరిత్రకారిణి డాక్టర్ మీనాక్షి జైన్, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ శ్రింగ్లా, కేరళ బీజేపీ నేత సి.సదానందన్ మాస్టర్‌లు పెద్దల సభకు నామినేట్ అయ్యారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80(1)(ఎ) క్లాజ్ (3) కింద తనకు లభించిన అధికారం మేరకు ద్రౌపదీ ముర్ము రాజ్యసభకు ఈ నలుగురిని నామినేట్ చేశారు. ఈ మేరకు శనివారం అర్ధరాత్రి కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఎగువ సభకు 12 మందిని పంపించే అధికారం రాష్ట్రపతికి ఉంది. ప్రధానంగా కళలు, సాహిత్యం, విజ్ఞానం, సామాజిక సేవ వంటి రంగాల్లో విశిష్టమైన సేవలందించిన వ్యక్తులకు రాష్ట్రపతి రాజ్యసభకు పంపిస్తుంటారు.


ఉజ్వల్ నికమ్


హర్షవర్ధన్ శ్రింగ్లా


సదానందన్


మీనాక్షి జైన్

న్యాయ పటిమకు మారుపేరు ఉజ్వల్

ఉజ్వల్ దేవ్‌రావు నికమ్‌కి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. 1993 ముంబై బాంబు పేలుళ్ల కేసులో కోర్టులో ప్రభుత్వం పక్షాన వాదించారు. దాదాపు 100 మందికి శిక్షలు పడేలా కృషిచేశారు. ఆ తర్వాత 26/11 దాడి కేసులో ఉగ్రవాది కసబ్‌కు ఉరిశిక్ష పడేలా కీలక పాత్ర పోషించారు. ఎన్ని బెదిరింపులు వచ్చినా, ఎన్ని ఒత్తిళ్లున్నా పక్కాగా సాక్ష్యాధారాలు సేకరించి, కోర్టులో వాదించడం ఉజ్వల్ నికమ్ ప్రత్యేకత. ఇప్పటివరకు వివిధ కేసుల్లో 628 మందికి యావజ్జీవ కారాగార శిక్ష, 37 మందికి ఉరిశిక్ష పడేలా కోర్టులో వాదించారు. 2016లో కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారం ప్రకటించింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ముంబై నార్త్ సెంట్రల్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా ఉజ్వల్ పోటీ చేశారు.

దౌత్య నిపుణుడు హర్షవర్ధన్ శ్రింగ్లా

హర్షవర్ధన్ శ్రింగ్లా సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి. 1984 బ్యాచ్‌కు చెందిన ఆయన 38 ఏళ్లకు పైగా దౌత్య సేవలు అందించారు. అమెరికా, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్‌లో భారత రాయబారిగా, హైకమిషనర్‌గా పని చేశారు. అమెరికా, చైనా వంటి దేశాలతో ఇండియా సంబంధాల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 2020 నుంచి 2022 వరకు భారత విదేశీ వ్యవహారాల కార్యదర్శిగా సేవలందించారు. 2023లో జీ20 కూటమికి భారత్ నాయకత్వం వహించిన సమయంలో జీ20 సమావేశాల ముఖ్య సమన్వయకర్తగా ఉన్నారు.

చరిత్రలో కొత్త వెలుగులు మీనాక్షి జైన్

డాక్టర్ మీనాక్షి జైన్ విద్యావేత్తగా పేరుగాంచారు. చరిత్ర, సామాజిక శాస్త్రాల్లో లోతైన పరిశోధనలు చేశారు. ఢిల్లీ యూనివర్సిటీలోని గార్గీ కాలేజీలో హిస్టరీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. భారతీయ నాగరికత, సంస్కృతిపై పలు పుస్తకాలను రచించారు. విద్య, సాహిత్యం, చరిత్ర, రాజనీతిశాస్త్రంలో మీనాక్షి జైన్ సేవలు ప్రశంలందుకున్నాయి. పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

సాహసి సదానందన్ మాస్టర్

కేరళలోని పాలక్కడ్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత సి.సదానందన్ మాస్టర్ రాజకీయ హింసకు భయపడని వ్యక్తిగా ప్రఖ్యాతి చెందారు. పార్టీ మారేందుకు నిరాకరించినందుకు 1994 జనవరి 25న వామపక్ష కార్యకర్తలు ఆయనపై దాడి చేసి, రెండు కాళ్లను నరికేశారు. అయినా సదానంద్ మాస్టర్ ధైర్యం కోల్పోకుండా సమాజ సేవలో నిమగ్నమయ్యారు. విద్యా, సామాజిక రంగాల్లో తనవంతు సేవలందించారు. సుదీర్ఘకాలం ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 2016, 2021లో కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున కన్నూర్ నుంచి పోటీ చేశారు.

మోదీ మరాఠీలో మాట్లాడారు

ప్రధాని నరేంద్ర మోదీ తనతో మరాఠీ భాషలో మాట్లాడారని ఉజ్వల్ నికమ్ ఆదివారం తెలిపారు. తనను రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేయబోతున్నట్లు ఆయన ముందే చెప్పారని అన్నారు. ''శనివారం ప్రధాని మోదీ నాతో ఫోన్‌లో మాట్లాడారు. హిందీలో మాట్లాడాలా? లేక మరాఠీలో మాట్లాడాలా? అని అడిగారు. దాంతో ఇద్దరం కాసేపు హాయిగా నవ్వుకున్నాం. చివరకు మోదీ మరాఠీలోనే నాతో సరదాగా సంభాషించారు. రాజ్యసభకు పంపించబోతున్నట్లు చెప్పగా, అందుకు వెంటనే అంగీకారం తెలియజేశా'' అని ఉజ్వల్‌నికమ్ వెల్లడించారు.

అసాధారణ కృషి చేశారు: మోదీ

రాజ్యసభకు నామినేట్ అయిన నలుగురు ప్రముఖులకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. వారి నైపుణ్యం పార్లమెంట్ కార్య కలాపా లను సుసంపన్నం చేయాలని ఆకాంక్షించారు. ఈ మేరకు మోదీ సోషల్ మీడియాలో పోస్టుచేశారు. ''నలుగురు ప్రముఖులు చేసిన కృషి అసాధారణం. న్యాయరంగం, రాజ్యాంగం పట్ల ఉజ్వల్ నికమ్ నిబద్ధత ప్రశంసనీయమైనది. ఆయనను రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేయడం ఒక గౌరవ సూచిక. హర్షవర్ధన్ శ్రింగ్లా ప్రతిభావంతుడైన దౌత్యవేత్త. వ్యూహాత్మక ఆలోచనలతో భారత్‌ను అంతర్జాతీయంగా నూతన శిఖరాలకు తీసుకెళ్లారు. సదానందన్ మాస్టర్ జీవితం ధైర్యసాహసాలకు ఒక ప్రతీక. విద్య, సమాజ సేవా రంగాల్లో ఆయన విశేషమైన కృషి సాగించారు. డాక్టర్ మీనాక్షి జైన్ ఒక గొప్ప చరిత్రకారిణి, విద్యావేత్త, పరిశోధనల్లో మేటి. ప్రతిభావంతురాలైన మీనాక్షి జైన్ రాజ్యసభకు వస్తుండడం చాలా సంతోషకరం'' అని పేర్కొన్నారు.

21 నెలలు.. 58 వేల మరణాలు!

- ఇజ్రాయెల్ దాడుల్లో చనిపోయిన పాలస్తీనియన్లు
- వెల్లడించిన గాజాస్ట్రిప్ ఆరోగ్య విభాగం
- తాజాగా మరో 30 మంది మృతి

డెయిర్ అల్-బలాహ్: గాజా స్ట్రిప్‌లో హమాస్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ సాగిస్తున్న దాడుల్లో మరణాలు సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. 21 నెలలుగా సాగుతున్న ఈ యుద్ధంలో ఇప్పటి వరకు 58 వేల మంది పాలస్తీనియన్లు అసువులు బాసినట్లు ఆదివారం గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. మృతుల్లో సగానికి పైగా మహిళలు, చిన్నారులే ఉన్నారంది. క్షత గాత్రుల సంఖ్య లక్షల్లోనే ఉంటుందని అంచనా. యుద్ధ మరణాలపై గాజా ఆరోగ్య విభాగం విడుదల చేసే గణాంకాలను ఐక్యరాజ్యసమితితోపాటు ఇతర అంతర్జాతీయ సంస్థలు విశ్వసనీయమైనవిగా భావిస్తున్నాయి.

నీళ్ల కోసం వచ్చి ఆరుగురు బాలలు మృతి

గాజాపై ఆదివారం ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన దాడుల్లో 30 మంది చనిపోయారు. వీరిలో నీళ్ల ట్యాంకు వద్దకు వచ్చిన ఆరుగురు చిన్నారులున్నారు. సెంట్రల్ గాజా నగరంలో ఓ వీధిలో నడిచి వెళ్తున్న వారిపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 11 మంది చనిపోగా 30 మంది క్షతగాత్రులుగా మారారు. మృతుల్లో అల్-అహ్లి ఆస్పత్రి జనరల్ సర్జన్ డాక్టర్ అహ్మద్ ఖండిల్ కూడా ఉన్నారు. ఆస్పత్రికి వస్తుండగా దాడికి గురయ్యారని అధికారులు తెలిపారు. జవైదాలోని ఓ ఇంటిపై జరిగిన దాడిలో ఇద్దరు మహిళలు, ముగ్గురు చిన్నారులు సహా 9 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంటిపై దాడి విషయం తమకు తెలీదని, 24 గంటల వ్యవధిలో గాజాలోని 150 లక్ష్యాలపై దాడులు చేశామని ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. కాగా, వెస్ట్‌బ్యాంక్‌లో శనివారం ఇజ్రాయెల్ సెటిలర్ల కాల్పుల్లో చనిపోయిన పాలస్తీనా అమెరికన్ సైఫొల్లా ముసల్లెట్(20), అతని స్నేహితుడు మహ్మద్ అల్ షలాబీలకు ఆదివారం జరిగిన అంత్యక్రియల్లో పెద్ద ఎత్తున జనం పాల్గొన్నారు. 2023 అక్టోబర్ 7న హమాస్ సారథ్యంలో సాయుధులు ఇజ్రాయెల్ భూభాగంపై మెరుపుదాడులు చేసి సుమారు 1,200 మందిని చంపడంతోపాటు 251 మందిని బందీలుగా పట్టుకెళ్లారు. ఆ రోజు నుంచి ఇజ్రాయెల్ ఆర్మీ హమాస్ లక్ష్యంగా గాజాపై యథేచ్ఛగా దాడులు సాగిస్తోంది.

భావప్రకటనా స్వేచ్ఛ ఉందని ఉగ్రవాదాన్ని కీర్తించరాదు

శ్రీనగర్: దేశ రాజ్యాంగం ప్రజలందరికీ భావ ప్రకటనా స్వేచ్ఛను ఇచ్చిందని, అది ఉగ్రవాదాన్ని కీర్తించడం కోసం కాదని జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తేల్చిచెప్పారు. ఆదివారం జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా పట్టణంలో 40 ఉగ్రవాద బాధిత కుటుంబాలకు ఉద్యోగ నియామక పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సభలో మాట్లాడుతూ.. ఉగ్రవాద బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు, న్యాయం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రతి బాధిత కుటుంబానికి పునరావాసం కల్పించే వరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఉద్ఘాటించారు. రాజకీయ అవకాశాల కోసం ఎవరైనా ఉగ్రవాదాన్ని కీర్తిస్తే.. అందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. జమ్మూకశ్మీర్ ఇప్పటికే చాలా ఎంతో రక్తపాతాన్ని చూసిందని, ఇప్పుడా బాధలకు, కన్నీళ్లకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని మనోజ్ సిన్హా పేర్కొన్నారు.

యూఎస్ ఎయిడ్ కోత.. దక్షిణాఫ్రికాలో నిలిచిన హెచ్ఐవీ టీకా ట్రయల్స్

జోహన్నెస్‌బర్గ్: డొనాల్డ్ ట్రంప్ సారథ్యంలోని అమెరికా ప్రభుత్వం యూఎస్ ఎయిడ్ (యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెలవప్‌మెంట్) నిధులను పూర్తిగా నిలిపివేసింది. ఇందుకు సంబంధించిన యంత్రాంగాన్ని పూర్తిగా తొలగించింది. ఈ చర్య ప్రపంచ వ్యాప్తంగా 'యూఎస్ ఎయిడ్' సాయం అందుకునే పలు దేశాలతోపాటు వివిధ కీలకమైన సంస్థలపైనా పడింది. ముఖ్యంగా మానవ చరిత్రలోనే అత్యంత ప్రమాదకరమైన హెచ్ఐవీకి విరుగుడును తీసుకువచ్చే ప్రయత్నాలకు ట్రంప్ చర్య ఆఖరి క్షణంలో అడ్డుకట్ట వేసింది. దక్షిణాఫ్రికాలో బ్రిలియంట్ కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ టీకా 'లెనకపవిర్'ను రూపొందించారు. దీనికి అమెరికా యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కూడా ఆమోదముద్ర వేసింది. మరో వారం రోజుల్లో దక్షిణాఫ్రికాలోని యువతపై టీకా క్లినికల్ ట్రయల్స్ చేపట్టేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సమయంలో పిడుగులాంటి వార్త వారికి అందింది. అదే యూఎస్ ఎయిడ్ నిలిపివేత. దీంతో, ఈ కార్యక్రమం కింద పనిచేస్తున్న దాదాపు 100 మంది పరిశోధకులు హతాశులయ్యారు. నిధుల్లేకుండా వారు ముందుకు సాగేందుకు ఏమాత్రం అవకాశాల్లేవు. దక్షిణాఫ్రికా ప్రభుత్వాన్ని సాయం కోరినా ఫలితం కనిపించలేదు. ఇప్పుడిక అన్ని కార్యక్రమాలను నిలిపివేయడం మినహా గత్యంతరం లేదని వారంటున్నారు. బ్రిలియంట్ కార్యక్రమం చీఫ్ గ్లెండా గ్రె..'హెచ్ఐవీకి విరుగుడు కనుగొనడంలో ఆఫ్రికా ఖండం చాలా కీలకమైంది. హెచ్ఐవీని అరికట్టేందుకు లెనకపవిర్ టీకాను ఏడాదిలో రెండు సార్లు ఇస్తే సరిపోతుంది. ప్రపంచంలోనే ఇలాంటి మొట్టమొదటి వ్యాక్సిన్ ఇది. అవకాశమిస్తే ట్రయల్స్‌ను ప్రపంచంలోనే అందరికంటే చౌకగా, సమర్థంగా, వేగవంతంగా పూర్తి చేయగలం' అని ఆమె అన్నారు. గతంలో కోవిడ్ మహమ్మారి సమయంలో నోవావ్యాక్స్ టీకా తయారీలో దక్షిణాఫ్రికా శాస్త్రవేత్తలు కీలకంగా ఉన్నారని ఆమె గుర్తు చేశారు. అమెరికా నిర్ణయం ఫలితంగా సుమారు 8 వేల మంది ఆరోగ్య కార్యకర్తలు ఉద్యోగాలు కోల్పోయారు. శ్వేత వర్ణం వారిని వేధిస్తున్నామంటూ అమెరికా ప్రభుత్వం తమపై అనవసర ఆరోపణలు మోపి ఎంతో కీలకమైన ఆరోగ్యరంగానికి నిధులను ఆపేయడం అన్యాయమని దక్షిణాఫ్రికా ప్రభుత్వం వాపోతోంది.

అమెరికాపై టారిఫ్‌లు నిలిపేసిన ఈయూ

బ్రస్సెల్స్: అమెరికా వస్తువులపై నేటి నుంచి అమల్లోకి రానున్న ప్రతీకార సుంకాలను యూరోపియన్ యూనియన్(ఈయూ) నిలిపివేసింది. ఆగస్టు ఒకటి నుంచి ఈయూ, మెక్సికోపై 30% కొత్త సుంకాలను ట్రంప్ ప్రకటించడంతో ఈయూ వెనుకడుగు వేసింది. ఈ నెలాఖరు నాటికి ట్రంప్‌తో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవాలనే ఆశతో ఉంది. ఇది చర్చలకు సమయమని యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లేయన్ అన్నారు. చర్చలు జరపడానికి ఆగస్టు మొదటి తేదీ వరకు తమకు సమయం ఉందన్నారు. ఒప్పందానికి రాలేకపోతే, ప్రతీకారానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నామని ఉద్ఘాటించారు.

నేటి నుంచి ఒడిశాలో రాష్ట్రపతి పర్యటన

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నేటి నుంచి ఒడిశాలో పర్యటించనున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆమె సోమవారం భువనేశ్వర్‌కు చేరుకుంటారని రాష్ట్రపతి కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. సోమవారం భువనేశ్వర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఐదవ స్నాతకోత్సవానికి హాజరవుతారు. రెండో రోజైన జూలై 15న రావెన్‌షా విశ్వవిద్యాలయం 13వ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. అలాగే రావెన్‌షా బాలికల ఉన్నత పాఠశాల మూడు భవనాల పునరాభివృద్ధికి శంకుస్థాపన చేస్తారు. ఆదికావి సరళ దాస్ జయంతి వేడుకలకు హాజరవుతారు.

బెంగాల్‌లో మరో తృణమూల్ నేత హత్య

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని బీర్‌భూమ్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పీయూష్ ఘోష్ హత్యకు గురయ్యారు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. అర్ధరాత్రి సమయంలో ఘోష్‌కు ఒక ఫోన్ కాల్ వచ్చింది. అనంతరం ఆయన బయటకు వచ్చాడు. కొమర్‌పూర్ కూడలి వద్దకు రాగానే, దుండగులు అతని తలపై కాల్చారు. ఘటనలో ఇద్దరు మహిళలు సహా ముగ్గురిని అరెస్టు చేశామని జిల్లా ఎస్పీ అమన్‌దీప్ సింగ్ తెలిపారు. భంగర్‌లో టీఎంసీ నాయకుడు హత్యకు గురైన మూడు రోజులకే ఘోష్ హత్య జరగడం గమనార్హం. మూడు రోజుల్లో రెండు రాజకీయ హత్యలు జరగడంతో ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగాయి.

ఢిల్లీలో భారీ వర్షాలు.. రెడ్ అలర్ట్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఢిల్లీతోపాటు శివారు ప్రాంతాలను వర్షం ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇండియా గేట్, కర్తవ్యపథ్ ప్రాంతాల్లో భీకర వర్షం పడడంతో పర్యాటకులు ఇబ్బందులకు గురయ్యారు. ఢిల్లీలో మరికొన్ని రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) ప్రకటించడంతో అరెంజ్ అలర్ట్‌ను అధికారులు రెడ్ అలర్ట్‌గా మార్చారు. ఢిల్లీతోపాటు తూర్పు హరియాణ, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోనూ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది.

'ఐఐఎం-కలకత్తా' ఘటనపై సిట్

కోల్‌కతా: కోలకత్తాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)కు చెందిన విద్యార్థి.. మహిళపై అత్యాచారం చేశాడన్న ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటైంది. తొమ్మిది మంది సభ్యుల సిట్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఫోరెన్సిక్ బృందాలు ఇప్పటికే సంఘటనా స్థలాన్ని సందర్శించి, పరీక్షల కోసం మిగిలిపోయిన ఆహారాన్ని, ఇతర వస్తువుల నమూనాలను సేకరించాయి. క్యాంపస్‌లోని సీసీటీవీ కెమెరా ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు. శుక్రవారం ఐఐఎం-కలకత్తా బోయ్స్ హాస్టల్‌లో ఘటన జరిగిందని మహిళ ఫిర్యాదు చేయగా.. అత్యాచారం జరగలేదని మహిళ తండ్రి శనివారం ప్రకటించారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఈ సంఘటనను సుమోటోగా స్వీకరించింది.

కల్తీ ఎరువులపై కఠిన చర్యలు: కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: నకిలీ, నాసిరకం ఎరువుల విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రులను కోరారు. ఆదివారం ఆయన అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముకని, రైతుల ఆదాయంలో స్థిరత్వాన్ని నిర్ధారించడానికి, వారికి సరైన సమయంలో సరసమైన ధరలకు ప్రామాణికతతో నాణ్యమైన ఎరువులను అందించడం చాలా అవసరమని నొక్కి చెప్పారు. ముఖ్యమైన ప్రాంతాల్లో ఎరువుల లభ్యతను నిర్ధారించాలని తెలిపారు. బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు విక్రయించడం, సబ్సిడీ ఎరువుల మళ్లింపు వంటి వాటిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. సంప్రదాయ ఎరువులతో పాటు నానో-ఎరువులు, బయో-స్టిమ్యులెంట్ ఉత్పత్తులను బలవంతంగా అంటగట్టడాన్ని వెంటనే అరికట్టాలన్నారు. దోషులుగా తేలితే లైసెన్స్‌ల రద్దు వంటి కఠినమైన చర్యలు తీసుకోవడంతో పాటు, తగు శిక్షలు పడేలా చూడాలని సూచించారు. ఎరువుల్లో కల్తీపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు.

అమర్‌నాథ్ యాత్రలో అపశ్రుతి

శ్రీనగర్: అమర్‌నాథ్ యాత్ర ముగించుకుని బేస్ క్యాంప్ వైపు వస్తున్న తీర్థయాత్రికుల బస్సులు ఒకదానినొకటి ఢీకొని 10 మంది గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. ఘటనలో మూడు బస్సులు దెబ్బతిన్నాయన్నారు. ప్రమాదం అనంతరం అదనపు బస్సుల్లో యాత్రికులను కుల్గాంలోని బేస్ క్యాంప్‌నకు చేర్చారు. ఇలా ఉండగా, 7,049 మంది యాత్రికులతో కూడిన బృందం ఆదివారం జమ్మూలోని భగవతీ నగర్ బేస్ క్యాంపు నుంచి అమర్‌నాథ్ దిశగా బయలుదేరిందని అధికారులు తెలిపారు. ఈ నెల 3వ తేదీన మొదలైన యాత్రలో ఇప్పటి వరకు సుమారు 1.83 లక్షల మంది పవిత్ర సహజ శివలింగాన్ని దర్శించుకున్నారన్నారు.

మరాఠీకి వ్యతిరేకంగా మాట్లాడాడని..

ఆటో డ్రైవర్‌పై శివసేన (యూబీటీ) కార్యకర్తల దాడి

పాల్ఘర్: భాషా వివాదం.. కర్ణాటక నుంచి మహారాష్ట్రకు మారింది. మరాఠీకి వ్యతిరేకంగా మాట్లాడారంటూ మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో ఓ ఆటో డ్రైవ్‌పై శివసేన (ఉద్ధవ్)కార్యకర్తలు దాడి చేశారు. ఆటో డ్రైవర్‌ను పలువురు దాడి చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు ఆదివారం తెలిపారు. పాల్ఘర్‌లోని విరార్ ప్రాంతంలో నివసిస్తున్న వలస కార్మికుడు, ఆటో డ్రైవర్‌కు, ఇద్దరు ప్రయాణికులకు మధ్య గతంలో మరాఠీ విషయంలో ఘర్షణ జరిగింది. ఆ సమయంలో ఆటో డ్రైవర్ 'మై హిందీ బోలుంగా' (నేను హిందీలోనే మాట్లాడతాను) అని ప్రకటించడం వైరల్ అయ్యింది. అయితే మరాఠీ భాషను, మరాఠీ చిహ్నాలను అవమానిస్తూ మాట్లాడారని ఆటోడ్రైవర్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. శనివారం. విరార్ రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డుపై శివసేన (యూబీటీ) కార్యకర్తలు అదే ఆటో డ్రైవర్‌ను చెంపదెబ్బ కొట్టినట్లు కొత్త వీడియో వైరలయ్యింది. దాడి అనంతరం.. అనుచితంగా ప్రవర్తించినందుకు ఓ వ్యక్తికి, అతని సోదరికి, అలాగే మరాఠీని అవమానించినందుకు రాష్ట్రానికి ఆటో డ్రైవర్ బహిరంగంగా క్షమాపణ చెప్పారు.

లండన్ సమీపంలో కూలిపోయిన విమానం



లండన్: యుకే రాజధాని లండన్‌కు 58 కిలోమీటర్ల దూరంలో సౌతెండ్ ఎయిర్‌పోర్ట్‌లో ఆదివారం సాయంత్రం ఒక విమానం కూలిపోయింది. ఆ సమయంలో విమానంలో తొమ్మిది మంది ప్రయాణికులు, ఇద్దరు పైలట్లు ఉన్నట్లు తెలిసింది. అయితే, ప్రాణ నష్టం వాటిల్లిందా? అనే వివరాలు తెలియరాలేదు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. తొలుత భారీ అగ్నిగోళం, తర్వాత దట్టమైన నల్లటి పొగలు వెలువడుతున్న దృశ్యాలు కనిపించాయి. ఇది చాలా తీవ్రమైన ప్రమాదం అని పోలీసులు చెప్పారు. కూలిపోయింది చిన్నపాటి విమానమేనని తెలిసింది. సౌతెండ్ నుంచి నెదర్లాండ్స్‌లోని లెలీస్టడ్ సిటీకి బయలుదేరుతుండగా ఈ విమానం ప్రమాదవశాత్తూ కూలిపోయినట్లు సమాచారం.

సాక్షి హైదరాబాద్

సోమవారం । 14 । జూలై । 2025



భాయ్.. బచ్చా ఆగయా...

భాయ్.. బచ్చా ఆగయా.. అంటూ కోడ్ లాంగ్వేజ్‌లో కస్టమర్లను సంప్రదిస్తున్న డ్రగ్స్ ముఠా గుట్టు రట్టు చేశారు సైబరాబాద్ పోలీసులు. 14 మందిని అరెస్టు చేశారు. -8లో



సోషల్ రీల్స్.. మీమర్స్ ట్రోల్స్..

'గివ్ హిమ్ నోబెల్'.. కొంత కాలంగా ఈ వాక్యం గ్లోబల్ సోషల్ మీడియా వేదికగా వైరల్‌గా మారింది. ట్రోలింగ్ కల్చర్ ప్రస్తుతం నగరంలో విపరీతంగా పెరిగిపోయింది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/25.0

నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 33, కనిష్టంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

ఉజ్జయినీ.. జగజ్జననీ

లష్కర్‌లో వైభవంగా బోనాల జాతర





అమ్మవారి ఆలయం వద్ద ఎమ్మెల్యే తలసాని





బోనాలతో వస్తున్న వెన్నెల గద్దర్, అలేఖ్య పుంజాల





ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి సీతక్క



డప్పుల దరువులు.. శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాలు.. బోనాలు.. తొట్టెలు.. సాక.. సమర్పించేందుకు బారులు తీరిన భక్తులు.. వెరసీ.. ఆదివారం లష్కర్ ఆద్యంతం ఆధ్యాత్మికతతో పరవశించింది. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరలో ఎటుచూసినా కోలాహలమే కనిపించింది. అమ్మవారికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ పట్టువస్త్రాలు సమర్పించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దంపతులు, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు, ఇతర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉజ్జయినీ మహంకాళికి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

– రాంగోపాల్‌పేట్



భక్తులకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



అమ్మవారి ఆలయం వద్ద భక్తుల కోలాహలం











ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేసిన జీఎం

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ తనిఖీ చేసి పునర్ నిర్మాణ పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా జీఎం, రెండు వైపులా ప్లాట్ ఫారమ్ నెం.1, ప్లాట్‌ఫారమ్ నెం.10 వైపు జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రత్యేకించి ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం , బుకింగ్ కౌంటర్లు, పార్కింగ్, సర్క్యులేటింగ్ ఏరియాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పునర్ నిర్మాణ ప్రణాళికలు, పురోగతిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారు జీఎంకు వివరాలు తెలియజేశారు. ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. పునర్ నిర్మాణ పనుల నేపథ్యంలో భారీ మౌలిక వసతుల మార్పులు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ నిర్వహణ, భద్రతను మరింత బలోపేతం చేయాలని, సహాయక చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. జీఎం వెంట సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్, పలువురు సీనియర్ అధికారులు ఉన్నారు



రైల్వే స్టేషన్ నమూనా చిత్రం

లోటు పాట్లు!

వానాకాలంలోనూ తక్కువ వర్షపాతమే

- పెరగని భూగర్భ జలాలు
- రోడ్లపైకి ట్యాంకర్ల పరుగులు
- తాగునీటికి తండ్లాట
- నిత్యావసరాలకు కష్టాలు
- జలమండలికి ట్యాంకర్ల తాకిడి
- ప్రైవేటులో మరింత డిమాండ్



గాలిదొడ్డిలో వాటర్ ట్యాంకర్లు

సాక్షి, సిటీబ్యూరో: ముందస్తు వానలు మురిపించాయి. ఆ తర్వాత జాడే లేకుండాపోయాయి. మహా నగరంలో సాధారణ వర్షపాతం సగటున సగం కూడా నమోదు కాకపోవడంతో భూగర్భ జలాలు పెరగకపోవడంతో వాటర్ ట్యాంకర్లకు తాకిడి పెరిగింది. నైరుతి రుతు పవనాల ప్రభావంతో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ అంచనా వేసినప్పటికీ.. నగరంలో ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా తయారయ్యాయి. జూన్ మొదటి వారంలో మోస్తరు వర్షాలు కురిసినప్పటికీ.. ఆశించిన స్థాయిలో లేకుండాపోయాయి. గత నెలలో సాధారణ వర్షపాతం 41 శాతం మించలేదు. ఈ నెలలో ఇప్పటి వరకు అదే పరిస్థితి పునరావృతమవుతోంది.

గ్రేటర్ పరిధిలో జులై 13 వరకు నమోదైన వర్షపాతం

మండలం	సాధారణ వర్షపాతం	కురిసింది	లోటు వర్షపాతం (శాతం)మి.మీ
తిరుమలగిరి	175.2	34.4	-80.0
బాలానగర్	184.2	50.8	-72.0
గండిపేట	167.1	54.2	-68.0
మారేడుపల్లి	172.8	56.4	-67.0
దుండిగల్	189.3	68.5	-64.0
మల్కాజిగిరి	158.6	60.3	-62.0
కుత్బుల్లాపూర్	179.1	70.2	-61.0
మేడిపల్లి	173.9	69.5	-60.0
కాప్రా	152.7	55.9	-63.0
కూకట్‌పల్లి	178.4	74.4	-58.0
సికింద్రాబాద్	172.9	73.3	-58.0
అల్వాల్	159.1	66.3	-58.0
అమీర్‌పేట	173.2	79.6	-54.0
నాంపల్లి	174.9	80.1	-54.0
గోల్కొండ	171.0	79.0	-54.0
ఆసిఫ్‌నగర్	173.3	80.7	-53.0
కీసర	166.8	78.4	-53.0
మేడ్చల్	166.6	81.6	-51.0
ఖైరతాబాద్	174.1	86.9	-50
ఉప్పల్	167.8	85.1	-49.0

మూడు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి..

భూగర్భజలాల పరిస్థితి గతేడాది కంటే సగటున ఒకటి నుంచి రెండు మీటర్ల లోతులో పడిపోయాయి. కోర్‌సిటీ పరిధిలోని హైదరాబాద్ జిల్లాలోని 16 మండలాల్లో ఈ నెల 13 నాటికి సగటు వర్షపాతం 17 సెంటీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా 8.3 సెంటీమీటర్లకు మించలేదు. రంగారెడ్డి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదైనా.. నగర శివారులోని ఎనిమిది అర్బన్ మండలాల్లో 30 నుంచి 40 శాతం కూడా నమోదు కాకపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా మొత్తం మీద సాధారణ వర్షపాతం సగటున 56 శాతం తక్కువగా నమోదు కావడంతో భూగర్భ జలాల మట్టంపై పెద్దగా ప్రభావం చూపించక లేకపోయాయి.

ట్యాంకర్లే ఆధారం..

నగరంలో వేసవి తరహాలోనే వర్షాకాలంలో సైతం వాటర్ ట్యాంకర్లు పరుగులు తీస్తున్నాయి. శివారు ప్రాంతాల్లో సైతం అడుగంటిన భూగర్భజలాలు పైకి రాకపోవడంతో బోర్లు నీరు పోయడం లేదు. తాగునీటికే కాదు నిత్యావసరాల కోసం కూడా తిప్పలు తప్పడం లేదు. ఫలితంగా జలమండలితో పాటు ప్రైవేటు ట్యాంకర్లకు బాగా డిమాండ్ పెరిగింది. శివారు ప్రాంతాల్లోని బహుళ అంతస్తు నివాస సముదాయాలకు, సర్వీస్ అపార్ట్‌మెంట్స్, వసతి గృహాలు పూర్తిగా ట్యాంకర్ల పైనే ఆధార పడాల్సి వస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రైవేటు ట్యాంకర్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ప్రస్తుతం గతేడాది కంటే 20 శాతం తాకిడి పెరిగింది. దీంతో జలమండలి రోజువారీగా సుమారు ఏడు వేలకు పైగా ట్యాంకర్లను సరఫరా చేస్తున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జలమండలి నల్లా కనెక్షన్లు లేని వినియోగదారులు ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా ప్రైవేటు ట్యాంకర్లకు కూడా డిమాండ్ మరింత పెరిగింది. గతేడాది జూన్‌లో 1.8 లక్షలు, జులైలో 1.47 లక్షల నీటిని ట్యాంకర్లతో సరఫరా జరగగా, ఈసారి దానికి అదనంగా 20 శాతం డిమాండ్ పెరిగినట్లు కనిపిస్తోంది.

సాధారణ వర్షపాతమూ కరువే..

నగరంలో సాధారణం కన్నా అధికంగా వర్షపాతం నమోదైతేనే భూమిలోకి నీరు ఇంకే పరిస్థితి లేకుండా పోగా, సగం కూడా సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడంతో ప్రమాద ఘంటికల నుంచి భూగర్భ జలాలు బయటికి పడే పరిస్థితి కనిపించడం లేదు. వర్షపు నీటి సంరక్షణలో నిర్లక్ష్యం, విచ్చలవిడిగా బోర్ల తవ్వకం, చెరువులు, కుంటలు ఆక్రమణ తదితర కారణాలతో భూగర్భ జలాలు మరింత పడిపోయాయి. వాస్తవంగా ప్రతి వేసవిలో ఉష్ణతాపానికి భూగర్భ జలాలు పాతాళంలోకి పడిపోతాయి. ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు చాలా ప్రాంతాల్లో సుమారు 10 నుంచి 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు భూగర్భ జలాలు చేరాయి. సాధారణంగానే నగరంలో సగటున భూగర్భ నీటిమట్టం 8 నుంచి 11 మీటర్ల లోతులోనే ఉంటాయి.

మరో కీలక నిర్ణయం

హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పునర్‌వ్యవస్థీకరణ

- వెస్ట్, సౌత్ వెస్ట్ జోన్లకు మరో అదనపు డీసీపీ
- సీనియర్ అధికారి ఇక్బాల్ సిద్ధిఖీకి అవకాశం
- నగరంపై పట్టున్న ఆఫీసర్‌గా ఈయనకు పేరు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. నగర పోలీసు విభాగానికి గుండెకాయ వంటి టాస్క్‌ఫోర్స్‌ను పునర్ వ్యవస్థీకరించారు. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై టాస్క్‌ఫోర్స్‌కు డీసీపీతో పాటు ఇద్దరు అదనపు డీసీపీలు ఉండనున్నారు. కొత్త అదనపు డీసీపీగా సీనియర్ పోలీసు అధికారి మహ్మద్ ఇక్బాల్ సిద్ధిఖీని నియమించిన కొత్వాల్ ఆయనకు వెస్ట్, సౌత్ వెస్ట్ జోన్ల బాధ్యతలు అప్పగించారు.

ఒకప్పుడు నాలుగు.. ఇప్పుడు ఐదు.

నగర కమిషనరేట్‌లో ఒకప్పుడు కేవలం నాలుగు జోన్లే ఉండేవి. ఆపై వీటి సంఖ్య ఐదుకు పెరిగింది. ప్రతి జోన్‌కు బాధ్యత వహిస్తూ ఓ టాస్క్‌ఫోర్స్ బృందం ఉంటుంది. వీటన్నింటికీ నాన్ క్యాడర్ లేదా అదనపు ఎస్పీ స్థాయిలో ఉన్న అధికారి డీసీపీగా నేతృత్వం వహిస్తుంటారు. ఈయనకు సహకరించడానికి ఓ అదనపు డీసీపీ పని చేస్తుండే వారు. అప్పట్లో జోన్ల సంఖ్య ఐదుకు పెరిగినప్పుడూ ఇదే విధానం కొనసాగించారు. డీసీపీపై ఉన్న పని ఒత్తిడిని పరిగణనలోకి తీసుకున్న ఉన్నతాధికారులు జోన్లను విభజించారు.

- వెస్ట్, నార్త్, సెంట్రల్ జోన్లకు డీసీపీ నేతృత్వం వహించేలా, ఈస్ట్, సౌత్ జోన్లకు అదనపు డీసీపీ నేతృత్వం వహించేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో డీసీపీ కార్యాలయం సికింద్రాబాద్‌లోనే కొనసాగిస్తూ అదనపు డీసీపీకి పాతబస్తీలోని పురానీ హవేలీలో ఏర్పాటు చేశారు. నగరంలో మాదకద్రవ్యాల వ్యతిరేక విభాగం హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) ఏర్పడటంతో పాటు జోన్ల సంఖ్య ఏడుకు చేరింది.
- అయినప్పటికీ కొన్నాళ్లు సౌత్ ఈస్ట్, హెచ్–న్యూలు టాస్క్‌ఫోర్స్ డీసీపీ అధీనంలోనే పని చేశాయి. ఆపై డీసీపీకి హెచ్–న్యూతో పాటు వెస్ట్, సౌత్ వెస్ట్, నార్త్, సెంట్రల్ జోన్లను అప్పగించారు. సాంకేతిక కారణాలతో సౌత్ వెస్ట్ జోన్‌ను అదనపు డీసీపీగా అప్పటిస్తూ గత ఏడాది నిర్ణయం తీసుకున్నారు.

తాజాగా టాస్క్‌ఫోర్స్‌కు మరో అదనపు డీసీపీగా నియమించిన సీపీ ఆనంద్.. ఆయనకు వెస్ట్, సౌత్‌వెస్ట్ టీమ్స్‌ను అప్పగించారు. కొత్త అదనపు డీసీపీగా సీసీఎస్ అదనపు డీసీపీగా ఉన్న ఇక్బాల్ సిద్ధిఖీని నియమించారు.

కీలక బాధ్యతల్లో పని చేసిన సిద్ధిఖీ...

నగర టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీగా నియమితులైన మహ్మద్ ఇక్బాల్ సిద్ధిఖీ ఇప్పటి వరకు అనేక కీలక బాధ్యతల్లో పని చేశారు. సిద్ధిఖీ ఎన్నికల ముందు వరకు పశ్చిమ మండల అదనపు డీసీపీగా, ఎన్నికల తర్వాత సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీగా పని చేశారు. దీనికి ముందు ఆయన బంజారాహిల్స్ సహా కీలక ఠాణాలకు ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. 'షోయబ్ మాలిక్–సానియా మీర్జా' ఉదంతం చోటు చేసుకున్నప్పుడు సిద్ధఖీనే బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఉండి ఆ వ్యవహారాన్ని సమర్థంగా పర్యవేక్షించారు. ఈయనకు ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్ సబ్–ఇన్‌స్పెక్టర్‌గా, సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన అనుభవం ఉంది.

- పాకిస్థాన్‌లో ముద్రితమైన రూ.500, రూ.1000 నకిలీ నోట్లు ఒకేసారి రూ.2.5 కోట్ల విలువైనవి చిక్కడం నగర పోలీసు చరిత్రలో రికార్డు. 2007 ఆగస్టు 25న పాతబస్తీలో ఈ నకిలీ నోట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అప్పట్లో జరిగిన ఈ భారీ ఆపరేషన్‌కు సిద్ధిఖీనే నేతృత్వం వహించారు. అదే ఏడాది నగరంలో చోటు చేసుకున్న మక్కా మసీదులో బాంబు పేలుడు, గోకుల్‌చాట్- లుంబినీ పార్క్‌ల్లో జంట పేలుళ్ల కేసుల దర్యాప్తులోనూ ఇక్బాల్ సిద్ధిఖీ కీలకపాత్ర పోషించారు. సైబరాబాద్‌లో క్రైమ్స్–2 అదనపు డీసీపీగానూ సిద్ధిఖీ పని చేశారు.



పాతబస్తీలో వైభవంగా అమ్మవారి ఘట స్థాపన ఊరేగింపు

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారి సామూహిక ఘటస్థాపన ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులు ఘటస్థాపన ఊరేగింపును తిలకించడానికి భారీ సంఖ్యలో హాజరయ్యారు. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఊరేగింపు మేళ తాళాలు.. డప్పు దరువులు.. శివ సత్తులు, పోతురాజులు, కళాకారుల నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శాలిబండలోని కాశీ విశ్వనాథ ఆలయం నుంచి ప్రారంభమైన ఘటస్థాపన ఊరేగింపు లాల్ దర్వాజా మోడ్ మీదుగా కొనసాగి ఆయా దేవాలయాల్లో ఘటస్థాపన జరిగింది. ఈ నెల 20న అమ్మవారికి బోనాల సమర్పణ, 21న చార్మినార్ ప్రధాన వీధుల్లో నిర్వహించే సామూహిక ఊరేగింపుతో ఉత్సవాలు ముగియనున్నాయి.



వ్యక్తి దారుణ హత్య

కొట్టి చంపిన భార్యాభర్తలు



నర్సింహులు మృతదేహం



పోలీసుల అదుపులో నిందితులు

మేడ్చల్‌రూరల్: భార్యాభర్తలు ఓ వ్యక్తిని కొట్టి చంపిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ చెందిన ఎదునూరి నరసింహ అలియాస్ చిన్న, తన భార్య అనితతో కలిసి మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని చెక్‌పోస్ట్‌లో ఉంటూ రోడ్డు పక్కన కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులను సేకరించి, అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. మెదక్ జిల్లా, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నర్సింలు (37) శనివారం మధ్యాహ్నం మేడ్చల్ చెక్‌పోస్ట్‌లోని వెంటకరమణ లిక్కర్ ల్యాండ్ వద్ద మద్యం తాగుతుండగా చిన్న, అతడి భార్య అనితతో స్క్రాప్ విషయమై గొడవ జరిగింది. దీంతో వారిద్దరూ కలిసి నర్సింహులును కర్రలతో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి దీనిని గుర్తించిన వైన్ షాప్ నిర్వాహకుడు మహేష్ మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో కార్పెంటర్ మృతి

మేడిపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్, జైభవాని కాలనీకి చెందిన బ్రహ్మచారి(55)కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం అతను బైక్‌పై పర్వతాపూర్ రోడ్డులో వెళుతుండగా ఆగ్రా స్వీట్ షాప్ ఎదురుగా డీసీఎం ట్యాంకర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తలరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్స్‌లో కోలుకుంటున్న కల్తీ కల్లు బాధితులు

- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ పరామర్శ
- ఆస్పత్రిలో 26 మందికి చికిత్స.. 13 మంది డిశ్చార్జి

లక్డీకాపూల్: కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో అనారోగ్యం పాలైన బాధితులు కోలుకుంటున్నారని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన నిమ్స్ ట్రామా బ్లాక్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 26 మంది చికిత్స పొందుతున్నట్లు నిమ్స్ వైద్యులు తెలిపారురు. వారిలో ఆరుగురికి డయాలసిస్ సేవలు అందిస్తున్నామన్నారు. శుక్ర, శనివారాల్లో ఆరోగ్యం మెరుగై నిమ్స్ నుంచి మరో 13 మంది డిశ్చార్జ్ అయినట్లు వారు వివరించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 58 మందిపై కేసులు..

కుత్బుల్లాపూర్: బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ పరిధిలో శనివారం నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 58 మంది వాహనదారులు పట్టుబడ్డారు. బాలానగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 15 మంది, జీడిమెట్ల పరిధిలో 20 మంది, ఆల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 23 మంది బ్రీతింగ్ ఎనలైజ్ టెస్ట్‌లో అధిక మోతాదులో మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసిన పోలీసులు వాహనాలను సీజ్ చేశారు.

మురుగు కాల్వల్లో వ్యర్థజలాలు



వాయు కాలుష్యం పైనా పట్టింపు లేని పరిశ్రమలు

- పారిశ్రామిక వాడల్లో ప్రజల అవస్థలు
- తనిఖీల్లో బయటపడుతున్న లోపాలు
- మూసివేతకు పీసీబీ ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: పారిశ్రామిక వాడల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థ జలాల నిర్వహణ, వాయు కాలుష్య నియంత్రణ చర్యలు అంతంతగానే ఉంటున్నాయి. నిత్యం సాయంత్రం వేళల్లో, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజుల్లో కాలుష్య ఉద్గారాల విడుదల అధికంగా ఉంటుంది. సాధారణ రోజుల్లో సైతం హానికర వాయువులను విడుదల చేస్తుండటంతో కళ్లలో మంటలు, శ్వాసకోస సమస్యలు వస్తున్నాయంటూ స్థానికంగా నివాసం ఉండే ప్రజలు పీసీబీకి ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో పరిశ్రమలను సందర్శించి ప్రమాణాల మేరకు నిబంధనలు పాటిస్తున్నారా..? లేక డీవియేషన్స్ ఉన్నాయా అనేది పరిశీలిస్తున్నారు. నిబంధనలు పాక్షికంగా అతిక్రమించిన పరిశ్రమలను హెచ్చరించడం, మరికొన్ని సందర్భాల్లో పూర్తిగా మూసివేయాలని పీసీబీ అధికారులు ఆదేశిస్తున్నారు.

సాయంత్రమైతే ఊపిరాడదు..

బాచుపల్లి, బాలానగర్, బొల్లారం, పాశమైలారం, బొంతపల్లి, పటాన్‌చెరు, ఇస్నాపూర్, తదితర ప్రాంతాల్లో వాయుకాలుష్యం తీవ్రంగా ఉంటోంది. అదే సందర్భంలో పలు పరిశ్రమలు వ్యర్థ జలాల నిర్వహణలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నాయన్న ఫిర్యాదులు అందుతున్నాయి. ట్యాంకర్లలో అర్ధరాత్రులు తరలించి ఊరి బయట ఖాళీ ప్రదేశాల్లో పారబోస్తున్నారు. దీంతో ఘాటు వాసనలతో ఆ దారిన పోయే వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గ్రేటర్ పరిధిలోని కొన్ని పరిశ్రమలు నేరుగా మురుగు, వరద కాల్వల్లోకి వ్యర్థ జలాల పైపులు వేస్తున్నారు. బూడిద వచ్చి ఇళ్లపై పడుతోందని, ఆరుబయట దుస్తులు ఆరబెట్టుకోలేని పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల బాలానగర్‌లో ఓ పరిశ్రమ యాజమాన్యంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమకు ఆనుకుని ఉన్న నాలాలో నేరుగా వ్యర్థ జలాలను విడిచిపెడుతున్నారని గుర్తించారు. ఘన వ్యర్థాలను దుండిగల్‌లోని టీజీడీఎఫ్‌కు తరలించడం లేదని, వ్యర్థాల శుద్ధి కేంద్రంలోనూ సభ్యత్వం లేదని తేలింది. దీంతో ఆ పరిశ్రమను మూసివేయాలని ఆదేశించారు. బాచుపల్లిలోని మరో పరిశ్రమ విపరీతంగా కాలుష్యాన్ని విడుదల చేస్తోందని గుర్తించిన పీసీబీ అధికారులు 2023లోనే పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. అయినా యాజమాన్యంలో మార్పు కనిపించలేదు. ఘాఢ వాయువులను శుద్ధి చేయకపోగా, వ్యర్థజలాలను ఆరుబయట పారబోస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పలు సందర్భాల్లో ఈ పరిశ్రమపై ఫిర్యాదులు వస్తున్నాయి. పునఃపరిశీలన చేసిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నారని, కాలుష్య నియంత్రణ పద్ధతులు పాటించడం లేదని గుర్తించారు. దీంతో పరిశ్రమను మూసివేయాలని ఆదేశించారు. ఇది ఇక్కడితో ఆగిపోదని, భవిష్యత్తులోనూ నిబంధనలు ఉల్లంఘించిన పరిశ్రమలపై కఠిన చర్యలు తప్పవని పీసీబీ అధికారులు హెచ్చరిస్తున్నారు.

భాయ్.. బచ్చా ఆగయా..

కోడ్ భాషలో డ్రగ్స్ కస్టమర్లతో సంప్రదింపులు

- రెక్కీ చేసి రెండు గంటల్లో 14 మందిని పట్టుకున్న పోలీసులు
- భార్య, నాలుగేళ్ల కుమారుడితో కలిసి గంజాయి కొనేందుకు వచ్చిన కస్టమర్
- ఐటీ ఉద్యోగులే లక్ష్యంగా డ్రగ్స్ దందా



సాక్షి, సిటీబ్యూరో: భాయ్ బచ్చా ఆగయా.. ఇలా కోడ్ లాగ్వేజ్ లో డ్రగ్స్ కస్టమర్లను సంప్రదిస్తూ దందా సాగిస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు సైబరాబాద్ పోలీసులు. మఫ్టీలో రెండు గంటల పాటు రెక్కీ చేసిన సైబరాబాద్ నార్కోటిక్ పోలీసులు (ఈగల్) ఏకంగా 14 మంది నిందితులను అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన సందీప్ అనే డ్రగ్ పెడ్లర్ తరచూ గచ్చిబౌలిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో కస్టమర్లకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు ఈనెల 12న పోలీసులకు సమాచారం అందింది. దీంతో రెక్కీ నిర్వహించిన పోలీసులు గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన నవీన్, ఆయుష్, నిఖిల్, సింధూర, హసన్, క్రాంతి, అఖిల్, శివ, సందేశ్, సాయి రాజ్, అఖిల్, స్వామి, తుషార్, అర్పిత్ లను అరెస్టు చేశారు.

భార్య, కొడుకుతో సహా...

పోలీసులకు చిక్కకుండా పలువురు డ్రగ్స్ కస్టమర్లు చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. ఓ డ్రగ్ కస్టమర్ భార్య, నాలుగేళ్ల కుమారుడితో సహా డ్రగ్స్ కొనుగోలు చేసేందుకు వచ్చాడు. కానీ అప్పటికే పోలీసులు అతనిపై నిఘా వేసి పట్టుకున్నారు. అయితే అతని భార్య, కుమారుడికి డ్రగ్స్ యూరిన్ డ్రగ్ పరీక్షలు నిర్వహించగా నెగిటివ్ రావడంతో వదిలేశారు. మరో డ్రగ్ కస్టమర్ భార్యతో సహా మాదక ద్రవ్యాలు కొనేందుకు వచ్చి పోలీసులకు చిక్కారు. పరీక్షల్లో ఇద్దరికీ పాజిటివ్ రాగా పోలీసులు ఇద్దరినీ అరెస్టు చేశారు.

50 గ్రాములు మూడు వేలు..

ప్రధాన నిందితుడు మహారాష్ట్ర నుంచి 5 కిలోల గంజాయి ప్యాకెట్లుగా అక్రమ మార్గంలో హైదరాబాద్ తీసుకొస్తున్నాడు. ఒక్కో ప్యాకెట్ (50 గ్రాములు) రూ.3 వేలకు విక్రయిస్తున్నాడు. వాట్సాప్ ద్వారా ''భాయ్ బచ్చా ఆగయా లాంటి కోడ్ మెసేజ్‌లు పంపుతూ కస్టమర్లతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. అతడి వద్ద 100 మందికి పైగా కస్టమర్ల డేటాబేస్ ఉన్నట్లు గుర్తించారు. ప్రధాన నిందితుడైన సందీప్ పరారీలో ఉన్నా, అతని మొబైల్ డేటా, వాట్సాప్ చాట్‌లు, కస్టమర్ నెంబర్లను ఆన్‌లైన్ ట్రేస్ చేస్తూ పెద్ద నెట్‌వర్క్‌ను ఛేదించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మిగతా 86 మంది వినియోగదారుల వివరాలు వెలుగులోకి రావడంతో వారిని డీ అడిక్షన్‌కు కేంద్రాలకు పంపించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ మహిళ మెడలోని చైన్ లాక్కెళ్లిన సంఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా, బీఎన్ రెడ్డి నగర్‌కు చెందిన ముక్క పద్మ తిరుపతి వెళ్లి కాచిగూడకు రైల్లో తిరిగి వస్తుంది. రైలు మహబూబ్‌నగర్ జిల్లా మణికొండ స్టేషన్‌లో ఆగగా గుర్తు తెలియని వ్యక్తి కిటికీలోంచి ఆమె మెడలోని 2 తులాల బంగారు గొలుసు లాక్కెళ్లాడు. బాధితురాలు ఆదివారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

ముగిసిన లాటరీ ప్రక్రియ

- ఫార్మా ప్లాట్లు పొందిన 4,174 మంది రైతులు
- 2,602 మంది రైతులకు రిజిస్ట్రేషన్లు పూర్తి
- కబ్జాలు చూపించిన అధికారులు
- ఫిర్యాదులతో పలువురి రిజిస్ట్రేషన్ల నిలిపివేత
- ప్లాట్లు పొందినవారిలో ఆనందం



లాటరీలో వచ్చిన నంబరు ప్లాటులో ఓ రైతు..

యాచారం: రైతులు ఎన్నాళ్లుగానో ఎదురుచూసిన ఫార్మా ప్లాట్ల లాటరీ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. ఈ నెల 7 నుంచి 11 వ తేదీ వరకు ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేసి, మెగా వెంచర్‌లో కబ్జాలు చూపించారు. యాచారం, కందుకూరు మండలాల్లో ఫార్మా ప్లాట్లను 4,174 మంది రైతులకు అందజేశారు. కోల్పోయిన భూమిని బట్టి 60, 121, 181, 242, 302, 363, 423, 484, 544 గజాల చొప్పున ప్లాట్లను పంపిణీ చేశారు. మీరాఖాన్‌పేట టీజీఐఐసీ మెగా వెంచర్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన లాటరీ ప్రక్రియలో 2,602 మంది రైతులు పాల్గొన్నారు. వారికి ప్లాట్ల నంబర్లు తీసి, వెంటనే రిజిస్ట్రేషన్లు చేసి కబ్జాలను చూపించారు. దీంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

లాటరీలో పాల్గొనని 1,572 మంది

లాటరీ ప్రక్రియలో పాల్గొనాలని అధికారులు ఆయా గ్రామాల్లో ఒక రోజు ముందే పంచాయతీల వద్ద లిస్టులను ప్రకటించారు. అయినా 1,572 మంది రైతులు లాటరీ ప్రక్రియలో పాల్గొనలేదు. వీరిలో 700 మంది వరకు అథారిటీలో పరిహారం డబ్బులు జమ చేసిన రైతులు ఉన్నారు. అథారిటీలో పరిహారం డబ్బులు జమ చేసిన రైతులకు కూడా ప్లాట్లు కేటాయించినప్పటికీ లాటరీ ప్రక్రియలో పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. వారంతా నకిలీలా.. లేక ఫార్మా ప్లాట్లను ముందే అమ్ముకున్నవారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలు గ్రామాల్లో అభ్యంతరాలు, ఫిర్యాదుల నేపథ్యంలో దాదాపు 25 మంది నుంచి 50 మంది రైతులను లాటరీ ప్రక్రియలో పాల్గొనకుండా అధికారులు నిలువరించారు. మరోవైపు గతంలో భూసేకరణలో కీలకంగా పని చేసి, అక్రమాలకు పాల్పడిన ఓ మాజీ రెవెన్యూ అధికారి చివరి నిమిషంలో తనకున్న పలుకుబడితో తన అనుయాయులను లాటరీలో పాల్గొనేలా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పక్కాగా పూర్తి చేశాం



పక్కాగా లాటరీ ప్రక్రియ పూర్తి చేశాం. కొందరు రైతులను లాటరీ ప్రక్రియకు అనుమతించొద్దని ఫిర్యాదులు వచ్చాయి. అలాంటి వారిలో 25 మందికి పైగా ఉంటారు. వారిని కార్యక్రమంలో పాల్గొనకుండా చేశాం. కొందరి నకిలీల ప్లాట్లను కూడా నిలిపేశాం. లాటరీ ప్రక్రియలో పాల్గొననివారిలో అర్హులెవరైనా ఉంటే ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో లాటరీ తీసి, రిజిస్ట్రేషన్లు చేస్తాం.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

ఎయిర్‌పోర్టులో వోల్వోకారు దగ్ధం



శంషాబాద్: నిలిపి ఉన్న వోల్వో కారులో మంటలు చెలరేగి దగ్ధమైన సంఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చోటు చేసుకుంది. ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు సీఐ బాలరాజు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం వోల్వోకారులో వచ్చిన శ్రీకాంత్‌చౌదరి అనే వ్యక్తి సీఐఎస్ఎఫ్ చెక్‌పోస్టు వద్ద కారును నిలిపాడు. అతర్వాత కొద్ది సేపటికే ఒక్కసారిగా ఇంజిన్ నుంచి మంటలు రావడంతో ఆయన వెంటనే కిందికి దిగిపోయాడు. క్షణాల్లో కారు ముందు భాగం పూర్తిగా తగలపడిపోయింది. పోలీసులు ఫైరింజన్‌ను రప్పించడంతో మంటలను ఆర్పివేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మంత్రి సురేఖ పర్యటన

పరిగి: పట్టణంలోని ఎస్సీ కాలనీలో నిర్మించిన సీతారామాలయం, బహర్‌పేట్ బీసీకాలనీలో పోచమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవానికి సోమవారం ఉదయం 11 గంటలకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విచ్చేయనున్నట్లు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

‘సలాం’ చేయకపోవడంతోనే సందేహం!

గుర్తింపు దాచేసి ఇక్కడే తిష్టవేసిన నైజీరియా మహిళ

- యాస్మిన్‌గా మారి విజిట్ వీసాపై వచ్చిన చైనాజా
- సియెర్రా నుంచి పాస్‌పోర్టు పొంది ఇండియాకు రాక
- అబ్దుల్లా పేరుతో ఆమె వద్దకు వెళ్లిన నగర పోలీసులు
- ఓ చిన్న అనుమానంతో ఆరా. విషయం వెలుగులోకి



అల్మాసీ చైనాజా హమీద్ మాక్స్‌వెల్

సాక్షి, సిటీబ్యూరో: నైజీరియాకు చెందిన చైనాజ నన్న వివియన్ తన గుర్తింపును దాచేస్తూ సియెర్రా లియోన్ దేశం నుంచి ఇబ్రహీం నియాషా యాస్మిన్ పేరుతో పాస్‌పోర్టు తీసుకుంది. దీని ఆధారంగా టూరిస్ట్ వీసాపై వచ్చి ఇక్కడ తిష్టవేసింది. ఓ నైజీరియన్ డ్రగ్స్ దందా చేస్తోందని సమాచారం అందుకున్న హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) అధికారులు ఆమె ఉన్న ఫ్లాట్‌పై దాడి చేశారు. ఆ సమయంలో చైనాజ ‘సలాం’ చేయకపోవడంతోనే అనుమానించిన ఓ అధికారి లోతుగా ఆరా తీయగా... ఆమె సియెర్రా లియోన్ జాతీయరాలు కాదని తేలింది. హెచ్–న్యూ మొత్తం నలుగురిని పట్టుకోగా..వీరిలో ముగ్గురిని డిపోర్టేషన్ (బలవంతంగా తిప్పి పంపడం) ద్వారా గత మంగళవారం తెల్లవారుజామున వారివారి దేశాలకు పంపేశారు. మరొకరిని శుక్రవారం విమానం ఎక్కించారు.

ఆ భయంతోనే ‘రూటు’ మార్చి..

విజిట్, స్టడీ, మెడికల్..ఇలా ఏదో ఒక వీసాపై వచ్చి, గడువు ముగిసినా తిష్టవేయడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలు పాల్పడుతూ చిక్కిన నైజీరియన్లను పోలీసులు డిపోర్టేషన్ విధానంలో బలవంతంగా తిప్పి పంపుతారు. ఇలా దేశం దాటిన వాళ్లు మరోసారి ఇక్కడ అడుగుపెట్టడానికి ఆస్కారం ఉండదు. ఈ విషయం తెలిసిన చైనాజా తన ఉనికి బయటపడకూడదనే నైజీరియా నుంచి సియెర్రా లియోన్ చేరారు. అక్కడ ఇబ్రహీం నియాషా యాస్మిన్ పేరుతో పాస్‌పోర్టు తీసుకున్నారు. దీని ఆధారంగా టూరిస్ట్ వీసా తీసుకుని 2020 ఫిబ్రవరి 12న ముంబై వచ్చారు. ఈ వీసా 2021 జనవరి 20, ఆమె పాస్‌పోర్టు 2023లో ఎక్స్‌పైర్ అయిపోయాయి. ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్న ఈమె అక్కడి పెడ్లర్స్ నుంచి ఎండీఎంఏ డ్రగ్ ఖరీదు చేస్తున్నారు. దీన్ని బంజారాహిల్స్‌లో ఉంటున్న టాంజానియన్ మ్వాజుమా అల్మాసీ మసిసిలాకు సరఫరా చేస్తోంది.

ఆమె బంజారాహిల్స్ ఫ్లాట్‌లో ఉండగా..

ఇటీవల బంజారాహిల్స్ వచ్చిన చైనాజా...అల్మాసీతో కలిసి ఉంది. నైజీరియన్ల డ్రగ్స్ దందాపై సమాచారం అందుకున్న హెచ్–న్యూ పోలీసులు ఆ ఫ్లాట్‌పై దాడికి సిద్ధమయ్యారు. అందులో భాగంగా డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు. హెచ్–న్యూకు చెందిన ఓ అధికారి అబ్దుల్లా పేరుతో... ఆ ఫ్లాట్‌లోకి వెళ్లి డ్రగ్స్ కోసం అడగాలన్నది వీరి ప్రణాళిక. అనుకున్న ప్రకారం సదరు ఫ్లాట్‌లోకి వెళ్లిన ‘అబ్దుల్లా’కు యాస్మిన్‌గా చెప్పుకుంటున్న చైనాజా కనిపించగానే సలాం చేశాడు. ఆమె నిజంగానే యాస్మిన్ అయి ఉంటే తిరిగి సలాం చేసి ఉండేది. అలా కాకుండా హాయ్ అంటూ సమాధానం ఇచ్చింది. దీంతో అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆమెతో పాటు అల్మాసీని అదుపులోకి తీసుకున్నారు.

డిపోర్టేషన్ ఇలా..

హెచ్–న్యూ అధికారులు పక్కా సమాచారం మేరకు చైనాజా అనుచరుడైన అహ్మద్ హమీద్ అబుబకర్, మాక్స్‌వెల్ ఆంథోనీ ఇజుచుక్వులను పట్టుకున్నారు. వీళ్లు అక్రమంగానే నగరంలో ఉంటున్నట్లు గుర్తించారు. వీరివద్ద ఎలాంటి డ్రగ్స్ లభించకపోవడంతో డిపోర్టేషన్ చేయాలని నిర్ణయించారు. ఎఫ్ఆర్ఆర్ఓ సాయంతో అవసరమైన ప్రక్రియ పూర్తి చేసి ఈ నలుగురిపై ఎమర్జెన్సీ ట్రావెల్ సర్టిఫికెట్లు (ఈటీసీ) పొందారు. వీటి సాయంతో మొదట గత మంగళవారం తెల్లవారుజామున ఇద్దరిని నైజీరియా, ఒకరిని టాంజానియా పంపేశారు. టిక్కెట్ సర్దుబాటు నేపథ్యంలో సూడాన్‌కు చెందిన హమీద్‌ను మాత్రం శుక్రవారం తెల్లవారుజామున కాస్త ఆలస్యంగా స్వదేశానికి పంపించారు.

క్లుప్తంగా...

మంత్రిని సత్కరించిన కాంగ్రెస్ నేతలు

బంజారాహిల్స్: సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కాంగ్రెస్ జూబ్లీహిల్స్ డివిజన్ నేతలు కలిసి శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేష్‌తో పాటు మచ్చల విష్ణు, ఎస్.రమేష్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ప్రారంభం నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజల కోసం పనిచేస్తూ కిందిస్థాయి నుంచి కష్టపడి వచ్చిన లక్ష్మణ్ మంత్రి పదవి చేపట్టడం తమ సామాజిక వర్గానికి గర్వకారణమని రమేష్ అన్నారు.

కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం

శ్రీనగర్‌కాలనీ: కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమని ఏసీపీ డీవీ ప్రదీప్ కుమార్‌రెడ్డి అన్నారు. వెంగళరావునగర్ పార్క్ ఎ టైప్ పార్క్ వద్ద నూతనంగా ఏర్పాటైన వెంగళరావునగర్‌కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోషియేషన్ కార్యవర్గ సమావేశానికి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై అసోసియేషన్ పత్రాన్ని ఆవిష్కరించారు. అసోసియేషన్ చైర్మన్, చీఫ్ అడ్వైజర్ డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి, అసోషియేషన్ అధ్యక్షుడిగా రిటైర్డ్ ఎస్పీ ఆఫ్ జైల్స్ ఎం.రంగారావు, వైస్ ప్రెసిడెంట్‌గా ప్రొఫెసర్ వరహాల రెడ్డి, జనరల్ సెక్రటరీగా రిటైర్డ్ సెక్షన్ ఆఫీసర్ సారంగరావు, ట్రెజరర్‌గా హైకోర్ట్ న్యాయవాది లక్ష్మీకాంతరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ప్రదీప్‌కుమార్, రామయ్య, కుటుంబరావు, నాగరాజు ఎన్నికయ్యారు. సమావేశంలో ఆర్టీసీ రిటైర్డ్ రీజినల్ డైరెక్టర్ బాలకృష్ణ, సాయి, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ కొని ముగ్గురికి గాయాలు

వెంగళరావునగర్: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కూకట్‌పల్లికి చెందిన ప్రవీణ్‌కుమార్, తన భార్య రత్నమాల, 9 నెలల కుమారుడుతో కలిసి శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై పంజగుట్ట నుంచి కూకట్‌పల్లికి వెళ్తున్నారు. అమీర్‌పేట వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు వారి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో ముగ్గురు కింద పడ్డారు. రత్నమాల తలకు బలమైన గాయాలయ్యాయి. ప్రవీణ్‌కుమార్, అతడి 9 నెలల బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిర్లక్ష్యంగా బస్సు నడిపిన ప్రవీణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని అతడి సోదరుడు శశికాంత్ ఆదివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాళాలు పగలగొట్టి బంగారు ఆభరణాలు చోరీ

ఫిలింనగర్: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి అల్మరా తాళాలు పగలగొట్టి బంగారు ఆభరణాలు తస్కరించిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీలో నివసించే పరమేశ్వరి, ఆమె భర్త కురుమయ్య ఎప్పటిలాగానే ఇంటికి తాళాలు వేసి విధులకు వెళ్లిపోయారు. రాత్రి తిరిగి వచ్చిన తర్వాత ఇంట్లోకి వెళ్లి చూడగా అల్మరా తలుపులు తెరిచి ఉన్నాయి. లాకర్ పగులగొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు పరమేశ్వరి గుర్తించింది. గుర్తుతెలియని వ్యక్తులు కిటికీ అద్దాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి లాకర్‌ను పగులగొట్టి బంగారు ఆభరణాలు తస్కరించారని, చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్: మెట్రో వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఎం.జయకృష్ణ సినిమాల్లో జూనియర్ ఆర్టిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తుంటాడు. షూటింగ్‌కు వెళ్లడానికి తన ద్విచక్ర వాహనంపై అమీర్‌పేట సమీపంలోని మెట్రో స్టేషన్ వద్దకు వచ్చి శుక్రవారం అక్కడ పార్కింగ్ చేశాడు. షూటింగ్ అయిపోయిన తర్వాత మరుసటి రోజు వచ్చి చూడగా అతడి వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల, స్నేహితుల వద్ద విచారించినా కనిపించలేదు. దాంతో ఆదివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాటా రూ.29, నల్లవంకాయ 28, పొడుగువంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 45, క్యాప్సికం 78, పచ్చికాకరకాయ 42, పందిరి బీర 40, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండకాయ 28, గుండు బీన్నీస్ 85, గింజచిక్కుడు 65, గోకరకాయ 50, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22.

1281 మందికి స్మార్ట్ రేషన్‌కార్డులు



- సర్కిల్–7కు మంజూరైన కార్డులు
- మొదటి దశ పంపిణీకి సిద్ధమవుతున్న అధికారులు

బంజారాహిల్స్: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రేషన్ కార్డుల పంపిణీకి పౌరసరఫరాల శాఖ అధికారులు సిద్ధమయ్యారు. ఇటీవలే ప్రజాపాలన, మీసేవ కేంద్రాలు, వార్డు కార్యాలయాల్లో అర్హులైన వారి నుంచి రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు తీసుకోవడంతో పాటు కొత్తగా వ్యక్తుల పేర్లు నమోదు కూడా చేయడం జరిగింది. పౌర సరఫరాల శాఖ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 81 రేషన్ దుకాణాల పరిధిలో రేషన్ కార్డుల కోసం మొత్తం 19,740 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 360 డిగ్రీల కోణంలో రేషనింగ్ అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయగా అన్ని అర్హతలు ఉన్నవారు 3,723గా తేలాయి.

- అలాగే పాత కార్డుల్లో పేర్లు తొలగింపు 5,300 దరఖాస్తులు వచ్చాయి.
- పాత కార్డుల్లో కొత్తగా పేర్లు నమోదు కోసం 19,433 దరఖాస్తులు వచ్చాయి.
- కొత్తగా పేర్లు చేర్చిన కార్డులు 1207 ఉన్నాయి.
- ఈ నెల 14వ తేదీ నుంచి కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.
- ఈ నేపథ్యంలోనే ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధిలో మొదటి విడతలో 1281 కార్డులు ప్రింట్ కాగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి ఎమ్మెల్యేల చేతులమీదుగా వీటిని పంపిణీ చేయనున్నారు.
- కార్డులు మంజూరైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తారు.
- సర్కిల్–7 పరిధిలో రేషన్‌కార్డుల పంపిణీకి అధికారులు సిద్ధమవుతున్నారు. ఆదివారం రాత్రి సంగారెడ్డిలోని ప్రింటింగ్ కార్యాలయం నుంచి కార్డులను సర్కిల్ కార్యాలయానికి తీసుకువచ్చారు.
- కొత్తగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులను ఇప్పటికీ తీసుకుంటున్నారు.
- ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏ గ్రూపులోకి చేర్చాలి

- తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్



నియామక పత్రం అందజేస్తున్న చొప్పరి శంకర్ ముదిరాజ్

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్ కులస్తులను బీసీ(డీ) నుంచి బీసీ(ఏ) గ్రూపులోకి చేర్చేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదర్‌గూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో మహాసభ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా సిద్దే సంపత్ ముదిరాజ్ నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేసి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ కులానికి జనాభా దామాషా ప్రకారంగా సీట్లను కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. డా.మద్దెల సంతోష్ ముదిరాజ్, ఈటల భద్రయ్య, బోయిని నారాయణ, పగిడాల సుధాకర్, నిరాటి సతీష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

మాలలకు రోస్టర్ పాయింట్లు తగ్గించాలి



మాట్లాడుతున్న మాందాల భాస్కర్

పంజగుట్ట: అంబేద్కర్ జయంతి రోజున ముఖ్యమంత్రి ఎస్సీ వర్గీకరణ బిల్లు జీవో 99 తీసుకువచ్చి అందులో రోస్టర్ విధానంలో మాల సామాజిక వర్గానికి తడిబట్టతో గొంతు కోసిన పనిచేశారని మాల సంఘాల జేఏసీ చైర్మన్ మాందాల భాస్కర్ అన్నారు. ప్రస్తుతం తీసుకువచ్చిన రోస్టర్ విధానం చూస్తుంటే మాల, మాల ఉపకులాల వారు తమను ఎస్సీ నుంచి తొలగించి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లో అయినా కలపమని కోరుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో జేఏసీ గౌరవ చైర్మన్ చెరుకు రాంచందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వర్గీకరణపై యావత్ మాల సమాజం ఆగ్రహంతో ఉందన్నారు. వెంటనే రోస్టర్ పాయింట్లు మార్చకపోతే మరో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. 30 ఏళ్లుగా మాలలు దోచుకుంటున్నారని ప్రచారం చేస్తున్నారని, ఇటీవల నిర్వహించిన షమీమ్ అక్తర్ నివేదికలోనే రాష్ట్రంలో మొత్తం 5 లక్షల 20 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులుంటే అందులో ఎస్సీలు 93 వేల మంది ఉన్నారని, మాదిగలు 43 వేల మంది ఉంటే మాలలు 36 వేలు, మిగిలినవి మాల, మాదిగ ఉపకులాల వారు ఉన్నట్లు నివేదిక ఇచ్చిందని, దీంతో ఎవరు దోచుకుంటున్నారో అర్థం అవుతుందన్నారు. బేర బాలకిషన్, తాళ్లపల్లి రవి, నల్లల కనకరాజు, శేపూరి నరసింహ, డి.భాస్కర్, సైదులు, గాజుల పున్నమ్మ, జాకబ్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాలపై అవగాహన

బంజారాహిల్స్: ప్రభుత్వం స్వయం ఉపాధి పొందే మహిళా గ్రూపులకు వడ్డీ లేని రుణాలను అందిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు పాటుపడుతోందని జీహెచ్ఎంసీ సర్కిల్–18 యూసీడీ డీపీఓ ఆశా విరోనిక అన్నారు. వడ్డీ లేని రుణాలపై స్వయం సహాయక బృందాల సభ్యులకు మరింత అవగాహన కలిగించేందుకు బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని ఎన్‌బీనగర్ కమ్యూనిటీ హాల్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సాంస్కృతిక కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆటపాటలతో వడ్డీ లేని రుణాలపై మహిళలకు అవగాహన కలిగించారు. కార్యక్రమం మహిళలను విశేషంగా ఆకట్టుకుంది. రుణాలు ఎవరు తీసుకోవాలి.. ఎలా తీసుకోవాలి.. ఎలా వ్యాపారాలు పెట్టుకోవాలి.. స్వయం ఉపాధి ఎలా పొందాలి.. తిరిగి రుణాలు ఎలా చెల్లించాలి.. అన్న విషయంలో కళాకారులు తేలిగ్గా అర్థమయ్యే రీతిలో బృందగానాలతో స్పష్టపరిచారు.



ఆటపాటలతో అవగాహన కలిగిస్తున్న కళాకారులు

చాక్లెట్లలో పురుగులు

జూబ్లీహిల్స్ పీఎస్‌లో కేసు నమోదు

బంజారాహిల్స్: తాను కొనుగోలు చేసిన డ్రైఫ్రూట్స్‌లో పురుగులు వచ్చాయని, ఇదే విషయాన్ని సదరు షాపు నిర్వాహకులకు తెలిపితే నిర్లక్ష్యంగా వ్యవహరించారని, సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాలని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మాదాపూర్‌లో నివసించే డాక్టర్ పెరూర్ పురేందర్‌రెడ్డి ఈ నెల 12వ తేదీన జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–36లోని పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న అజ్వాన్ ఇంటర్నేషనల్ రిటైల్ డేట్స్ అండ్ నట్స్‌లో డ్రైడేటెడ్ బ్లాక్, యూఎస్ఏ పిస్తా, యూఎస్ఏ వాల్‌నట్, ఆల్మండ్ డేటెడ్ చాక్లెట్స్‌తో పాటు మరికొన్ని డ్రైఫ్రూట్స్ కొనుగోలు చేశారు. ఇంటికి వెళ్లి చూడగా డేటెడ్ చాక్లెట్స్‌లో తెల్లరకం పురుగులు కనిపించాయి. దీంతో వెంటనే ఆయన సదరు షాపునకు వచ్చి సిబ్బందికి పురుగులు ఉన్న చాక్లెట్ చూపించాడు. షాపు సిబ్బంది ఏమాత్రం స్పందించకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజ్వాన్ ఇంటర్నేషనల్ రిటైల్స్ ఎల్ఎల్‌పీ మేనేజ్‌మెంట్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 125, 274, 275, 59 ఫుడ్‌సేఫ్టీ స్టాండర్డ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హిందీ ప్రచార సభను సందర్శించిన అధికారులు



కేంద్ర అధికార భాష శాఖ అధికారులను సన్మానించిన ఎస్.గైబువల్లి

హిమాయత్‌నగర్: హిందీ ప్రచార సభ హైదరాబాద్ స్థాపించి 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హిందీ ప్రచార సభ హైదరాబాద్ ముఖ్య కార్యాలయాన్ని కేంద్ర అధికార భాష శాఖ(న్యూఢిల్లీ) జాయింట్ డైరెక్టర్ రాజేష్ కుమార్ శ్రీవాస్తవ్, అసిస్టెంట్ డైరెక్టర్ భావనా సక్సేనా, డిప్యూటీ డైరెక్టర్ రఘువీర్ శర్మ తదితరులు సందర్శించారు. వారిని హిందీ ప్రచార సభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి సన్మానించి సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



ఖైరతాబాద్ ఎస్సై రమణకు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పంజగుట్ట: సమైక్య భారతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాక్స్ విజన్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం తుమ్మలబస్తీ సమైక్య భవన్‌లో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగిన ఉచిత వైద్యశిబిరాన్ని 112 మంది సద్వినియోగం చేసుకున్నారు. ఈ శిబిరాన్ని ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ ఎస్సై బి.రమణ, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ బి.రాజేంద్ర కుమార్ ప్రారంభించారు. సమైక్య భారతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, వివిధ పార్టీల నాయకులు మనోహర్ బాబు, జహంగీర్, బాలాజీ గోస్వామి, దేవరకొండ రమేష్, గజ్జల ఆనంద్, శ్రీనివాస్, టి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తీరును ప్రజలు గమనిస్తున్నారు

- శిలాఫలకాల్లో దివంగత ఎమ్మెల్యే పేరు లేకపోవడం హేయం

శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ ప్రభుత్వం తన కుటిల బుద్ధిని చూపెడుతోందని, ప్రభుత్వ శిలాఫలకాల్లో ఎప్పుడో మంజూరైన నిధుల పనులు, సంక్షేమాభివృద్ధి పనుల్లో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేరును ప్రస్తావించకపోవడం ఏమిటని మాగంటి గోపీనాథ్ సోదరుడు మాగంటి వజ్రనాథ్ ప్రశ్నించారు. రెండురోజుల క్రితం మంత్రులు స్వయంగా వచ్చి చేసిన అభివృద్ధి పనుల శంకుస్థాపన శిలాఫలకాల్లో ఆయన పేరును కావాలనే కాంగ్రెస్ నేతలు ప్రచురించలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న ఈ పనులను ప్రజలు గమనిస్తున్నారని, ఓటుతో వారు సమాధానం చెబుతారని ఎద్దేవా చేశారు. మాగంటి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి ఎనలేని సేవ చేశారని, అలాంటి వ్యక్తిని విస్మరించడం కాంగ్రెస్ చేసిన తప్పిదని, రానున్న ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభంజనం చూస్తారని పేర్కొన్నారు.

రేపు నిమ్స్‌మేలో మెగా రుణమేళా

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం (నిమ్స్ మే) కేంద్ర ప్రభుత్వ శిక్షణ కేంద్రం ప్రాంగణంలో ఈ నెల 15న మెగా రుణమేళా నిర్వహిస్తున్నట్లు నిమ్స్ మే సీనియర్ ఫ్యాకల్టీ వి.స్వప్న తెలియజేశారు. నిమ్స్ మే ప్రాంగణంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ నివేదిక తయారీ, రుణం పొందే ప్రక్రియ, దీనికి సంబంధించిన పత్రాలపై ప్రతినిధులు వివరింగా తెలియజేస్తారని పేర్కొన్నారు. రుణమేళాలో ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నారని నిర్వాహకులు తెలియజేశారు. పూర్తి వివరాలకు 040–2363 3244/ 218/ 261 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని పార్థివ్ లంగ్‌కేర్ సెంటర్ ఆధ్వర్యంలో కల్యాణ్‌నగర్ వెంచర్–3 రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ నాగరాజు నేతృత్వంలో మోతీనగర్ జైస్వాల్ హాస్పిటల్ ఎదురుగా కల్యాణ్‌నగర్ వెంచర్–3 వివేకానంద పార్క్‌లో జరిగిన శిబిరంలో జనరల్ ఫిజిషియన్ డాక్టర్ మౌనిక బారెడ్డి మందులు అందజేశారు.

రోడ్డును తవ్వేశారు.. మరమ్మతులు మరిచారు..



చింతలబస్తీ ప్రధాన రోడ్డు కూడలిలో రోడ్డును తవ్వి కుప్పలుగా పోసిన మట్టి గుట్టలు

ఖైరతాబాద్: చింతలబస్తీ ప్రధాన రోడ్డు కూడలి ప్రాంతంలో రోడ్డు మరమ్మతుల్లో భాగంగా రోడ్డు తవ్వకాలు చేపట్టి నాలుగు రోజులు కావొస్తుండటంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చింతలబస్తీ నుంచి ఖైరతాబాద్ షాదాన్ కళాశాల వైపు, మరోవైపు ఆనంద్‌నగర్ కాలనీ వైపు వెళ్లే ప్రధాన కూడలి ప్రాంతంలో రోడ్డు తవ్వకాలు చేపట్టి రాకపోకలను నిలిపివేయడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే ఆదివారం బోనాల ఉత్సవాలు ఉండటంతో ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున బోనాల ఉత్సవాలు నిర్వహిస్తారు. రోడ్డును పూర్తిగా తవ్వి గుట్టలు, గుట్టలుగా మట్టికుప్పలు వేసి తాపీగా పనులు చేస్తుండంతో బోనాల ఉత్సవాలను ఎలా నిర్వహించుకోవాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పూర్తిగా రాకపోకలను వారాల తరబడి నిలిపివేసి పనులు చేపట్టడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులను బోనాల ఉత్సవాలకు రెండు రోజుల ముందే పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

బోనాల వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

ఫిలింనగర్: రాబోయే బోనాల పండగను పురస్కరించుకుని ఆలయాల ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశం ఆదివారం ఫిలింనగర్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ నెల 20వ తేదీన స్వామివివేకానందనగర్, జైల్‌సింగ్‌నగర్, భగత్‌సింగ్‌కాలనీ, పద్మాలయా అంబేద్కర్‌నగర్, బీజేఆర్‌నగర్, ఎంఆర్‌సీకాలనీ బస్తీల్లో బోనాల పండగ జరుగుతుందని ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు తెలిపారు. అలాగే ఈ నెల 22 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు కూడా పలు బస్తీల్లో బోనాల పండుగ నిర్వహించేందుకు సభ్యులు తీర్మానించినట్లు చెప్పారు. ఆలయాల వద్ద వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, శానిటేషన్, పోలీసు బందోబస్తుతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించడానికి ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఆయా శాఖల అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. ఈ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు సమన్వయంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ బస్తీల నేతలు ఆకుల రాజు, కాటూరి రమేష్, ఎల్లయ్య, పద్మ, ధనమ్మ, శ్యాం, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పాత రోడ్డు తవ్వకుండా సీసీ రోడ్డు ఎలా?

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడలో సొంత పార్టీ కాంగ్రెస్ నేతలే చేస్తున్న అభివృద్ధి పనుల నాణ్యతపై ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎల్లారెడ్డిగూడ నుంచి అమీర్‌పేట చౌరస్తా కృష్ణా అపార్ట్‌మెంట్ మీదుగా వేస్తున్న సీసీ రోడ్డు పనులు సక్రమంగా జరగడం లేదని స్థానిక కాంగ్రెస్ నేతలు గళమెత్తారు. పాత రోడ్డును తవ్వకుండా ఉన్న రోడ్డుపై సీసీ రోడ్డు నిర్మాణాలు ఎలా చేపడతారని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ అధికారులకు ఫోన్ చేయగా సరిగా స్పందించలేదని ఆరోపించారు. అక్కడి నివసించే స్థానికులు కూడా రోడ్డును తవ్వలేదని, పాత రోడ్డుపైనే నూతన రోడ్డు నిర్మాణం చేపట్టారని స్పష్టం చేశారు. స్థానిక కార్పొరేటర్ స్థానికంగా ఉండే సమస్యలను పరిష్కరించకుండా కేవలం సీసీ రోడ్డు పనులపైనే దృష్టి కేంద్రీకరించారని దుయ్యబట్టారు. స్థానిక కార్పొరేటర్ ఆమె భర్త ప్రోద్బలంతోనే ఈ తతంగం జరుగుతోందని ఆరోపించారు. దీనికి జీహెచ్ఎంసీ అధికారులు వత్తాసు పలకడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఏమైనా ఇలా సొంత పార్టీ నేతలే స్థానిక నేతపై ఆరోపణలు చేయడం శోచనీయం.



పాత రోడ్డుపై వేసిన నూతన సీసీ రోడ్డు

ప్రజాస్వామ్య పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడమే నివాళి

- ప్రముఖ విప్లవకవి నిఖిలేశ్వర్



సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న ప్రముఖ విప్లవకవి నిఖిలేశ్వర్

హిమాయత్‌నగర్: భూమి, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం కోసం జరుగుతున్న పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడమే భారత కమ్యూనిస్టు విప్లవ పంథా నిర్మాతలు, విప్లవ రథ సారథులైన కామ్రేడ్స్ దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డిలకు మనమిచ్చే ఘనమైన నివాళులని ప్రముఖ విప్లవ కవి కామ్రేడ్ నిఖిలేశ్వర్ అన్నారు. భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యత కేంద్రం(మార్క్సిస్ట్–లెనినిస్ట్) ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో కామ్రేడ్స్ దేవులపల్లి వెంకటేశ్వరరావు(డివి), తరిమెల నాగిరెడ్డి(టిఎన్)ల సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిఖిలేశ్వర్ మాట్లాడుతూ భారత విప్లవ రథ సారథులైన దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి ఇద్దరు నేతలు తమ రాజకీయ జీవితాన్ని విద్యార్థి దశ నుండే ప్రారంభించారని గుర్తు చేశారు. యుసీసీఆర్ఐ(ఎం–ఎల్) అధ్యక్షులు వి.ఎస్.వినోద్ కుమార్, సి.భాస్కర్, నవోదయ సాహితీ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు డా.జతిన్ కుమార్, ఓపీడీఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.విజయేందర్ రావు, తెలంగాణ గ్రామీణ పేదల సంఘం కార్యదర్శి జి.వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ క్వారీలోని బండ మైసమ్మ, కొండ పోషమ్మ ఆలయంలో తెలంగాణ వడ్డెర ఐక్యవేదిక నగర అధ్యక్షుడు ముద్దంగుల శేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు. వడ్డెర సంఘం నాయకులు, వివిధ బస్తీలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



ఉపాధిపై ఓపెన్ వర్సిటీలో శిక్షణ



సనత్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులకు విద్యతోపాటు ఉపాధి సంబంధిత శిక్షణా కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్లు రిజిస్ట్రార్ ఎల్వీకే రెడ్డి తెలిపారు. బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ మహిళా స్టడీ సెంటర్‌లో పీజీ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకాలం కేవలం విద్యా సంబంధిత జ్ఞానాన్ని అందించిన వర్సిటీ ఇక నుంచి వివిధ సంస్థల సహకారంతో ఉపాధి శిక్షణ కార్యక్రమాలను కూడా ప్రారంభిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌బీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, కో–ఆర్డినేటర్ రామాచారి వివిధ సబ్జెక్టుల కౌన్సిలర్లు, నాన్‌టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబుకు సన్మానం



డాక్టర్ శ్రీకాంత్ బాబును సన్మానిస్తున్న వైద్యులు

సనత్‌నగర్: రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ పెరుగు శ్రీకాంత్ బాబును నగరానికి చెందిన ఆయుష్ వైద్యుల బృందం ఆదివారం ఘనంగా సన్మానించింది. బేగంపేట్ కుందన్‌బాగ్‌లోని వారి నివాసంలో జరిగిన కార్యక్రమంలో శ్రీకాంత్‌బాబును పూలమాల, శాలువాలతో సత్కరించి వెంకటేశ్వరస్వామి ప్రతిమ అందజేశారు. డాక్టర్‌గా, ప్రొఫెసర్‌గా, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీకాంత్ బాబు చేస్తున్న సేవలను కొనియాడారు. ఆయుష్ విభాగాల అభివృద్ధికి ఆయన మరింతగా తోడ్పడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైద్యులు ఎంఆర్ఎస్ రాజు, యశోద, మనోజ్, సుధ, రాజ్యలక్ష్మీ, కృష్ణానాయక్, వాసురాయ్, శాలినీయాదవ్, ప్రసన్న, శైలజ వాణి, హారిక, విష్ణు, భరద్వాజ, భాస్కర్ పాల్గొన్నారు.

పీవీ నరసింహారావు రాజనీతిజ్ఞుడు



మాట్లాడుతున్న శాంతికృష్ణ ఆచార్య, చిత్రంలో రాజ్‌కుమార్, దైవజ్ఞశర్మ, విష్ణువర్ధన్

చిక్కడపల్లి: తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుల జయంతి కార్యక్రమాలను ఆదివారం త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులకు బతుకమ్మ తల్లి గ్రంథకర్త శాంతికృష్ణ ఆచార్య తెలుగు వెలుగు జాతీయ పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు రాజనీతిజ్ఞుడు, స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. ఎన్టీ రామారావు నటనా సార్వభౌముడిగానే కాక ముఖ్యమంత్రిగా పేదల సంక్షేమానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నిర్వహణ సంస్థ వ్యవస్థాపకుడు పి.రాజ్‌కుమార్, ప్రముఖులు దైవజ్ఞశర్మ, విష్ణువర్ధన్, శాంతాబాయి, రేవతి, భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో జరుగుతుంది
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో డిజిటల్ ఆర్ట్, పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

ఫ్లైఓవర్లపై జర పైలం!

గ్రేటర్‌లో డెత్ జోన్లుగా మారుతున్న పైవంతెనలు

- 28 నెలల్లో 656 రోడ్డు ప్రమాదాలు
- 126 మంది దుర్మరణం, 504 మందికి గాయాలు
- అత్యధికంగా హైదరాబాద్‌లో 291 యాక్సిడెంట్లు
- సైబరాబాద్‌లో 228; రాచకొండలో 137 ప్రమాదాలు



సాక్షి, సిటీబ్యూరో: ఏటేటా గ్రేటర్ హైదరాబాద్‌లో పెరుగుతున్న వాహనాల సంఖ్య, ట్రాఫిక్ రద్దీని తట్టుకునేందుకు నిర్మించిన ఫ్లైఓవర్లు డెత్ జోన్లుగా మారుతున్నాయి. వాహనదారుల ప్రయాణ సమయాన్ని తగ్గించే పైవంతెనలు ప్రాణాలను తీసే ప్రమాదకారకాలుగా మారుతున్నాయి. 2023 జనవరి నుంచి 2025 మే మధ్య 28 నెలల కాలంలో గ్రేటర్‌లోని ఫ్లైఓవర్లపై 656 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వీటిల్లో 126 మంది మృత్యువాత పడ్డారు. 504 మందికి గాయాలయ్యాయి.

ఇంజినీరింగ్ లోపాలతో..

గ్రేటర్ పరిధిలో 70కు పైగా ఫ్లైఓవర్లు ఉన్నాయి. రద్దీ లేని సమయాల్లో పైవంతెనలపై వాహనాల వేగం పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ.. ఫ్లైఓవర్లపై సరైన వీధిలైట్లు లేకపోవడం, రంబుల్డ్ స్ట్రిప్స్, బాటిల్ నెక్, వంపులు ఎక్కువగా ఉండటం వంటి ఇంజినీరింగ్ లోపాలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని రోడ్డు భద్రతా నిపుణులు చెబుతున్నారు. అతివేగం, లైన్ క్రమశిక్షణ లేకపోవడం, పరధ్యానంలో వాహనాలు నడపటం వంటివి కూడా కారణాలేనని పేర్కొంటున్నారు.

సీసీటీవీ కెమెరాలెక్కడ?

ఫ్లైఓవర్లపై సీసీటీవీ కెమెరాలు లేకపోవడంతో ప్రమాదాల కారణాలను విశ్లేషించలేకపోతున్నామని, కేసుల దర్యాప్తులో జాప్యం జరుగుతోందని ఓ ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. సీసీటీవీ కెమెరాలు లేకపోవడంతో ప్రమాదం ఎలా జరిగిందో నిర్ధారించడం, ఎవరి తప్పు అనేది తేల్చడం పోలీసులకు సవాల్‌గా మారింది. వాహనం డ్యామేజ్, రోడ్డు స్కిడ్ అయిన తీరు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలం, క్షతగాత్రులకు గాయాలైన తీరు వంటి సంప్రదాయ పద్ధతులపై ఆధారపడాల్సి వస్తోంది. 2019లో బయోడైవర్సిటీ ఫ్లైఓవర్‌పై జరిగిన ఘోరమైన కారు ప్రమాద సమయంలో జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసులు హడావుడి చేశారు. ఆ తర్వాత ఎలాంటి పురోగతి కనిపించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాహనదారుల భద్రత దృష్ట్యా ఫ్లైఓవర్లపై సీసీటీవీ కెమెరాలను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

అత్యధికంగా సిటీ కమిషనరేట్‌లో..

గ్రేటర్‌లోని మూడు పోలీసు కమిషనరేట్లలో అత్యధికంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఫ్లై ఓవర్లపై రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సిటీ పరిధిలో 291 ప్రమాదాలు జరిగాయి. ఇందులో 46 మంది మరణించగా, 234 మంది గాయాలపాలయ్యారు. సైబరాబాద్‌లో జరిగిన 228 ప్రమాదాల్లో 54 మంది మృత్యువాత పడగా, 162 మంది గాయపడ్డారు. రాచకొండలో జరిగిన 137 ప్రమాదాల్లో 26 మంది మరణించగా, 107 మందికి గాయాలయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి నుంచి మే మధ్యకాలంలో సైబరాబాద్‌లో 56, హైదరాబాద్‌లో 49, రాచకొండలో 22 రోడ్డు ప్రమాదాలు జరిగాయి.

గ్రేటర్‌లోని ఫై వంతెనలపై ప్రమాదాల గణాంకాలు 2023 జనవరి–2025 మే మధ్య కాలంలో...

కమిషనరేట్	ప్రమాదాలు	ఘోరమైనవి	గాయాలైనవి
హైదరాబాద్	291	43	235
సైబరాబాద్	228	54	162
రాచకొండ	137	26	107

నిమ్స్‌లో గిరిజన విద్యార్థినికి మంత్రి అడ్లూరి పరామర్శ



లక్డీకాపూల్: గిరిజన విద్యార్థిని ఆత్రం త్రివేణి ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న త్రివేణిని ఆదివారం మంత్రి పరామర్శించారు. వివరాలు.. ఆదిలాబాద్ జిల్లా కుంటాల మండలం నేరడిగొండ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న త్రివేణి వేసవి సెలవుల్లో ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఓ రోజు ఆమె తలపై కర్ర పడటంతో గాయమైంది. స్థానిక ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. సెలవుల అనంతరం ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 11న ఆమె మళ్లీ వాంతులు, తీవ్రమైన తలనొప్పితో బాధపడుతుండగా నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. సిటీ స్కాన్ చేయగా ఆమె మెదడులో రక్తం గడ్డ కట్టినట్టు వైద్యులు గుర్తించి నిమ్స్‌కు రిఫర్ చేశారు.

ఉపాధ్యాయులపై ఎన్ఆర్ పాట స్ఫూర్తిదాయకం

ఆవిష్కరణ సభలో పలువురు వక్తలు

హిమాయత్‌నగర్: ఉపాధ్యాయులపై ఎన్ఆర్ రాసిన పాట స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తికి సమాజంలో ఉన్న గౌరవాన్ని ఈ పాట ద్వారా మరోసారి చాటి చెప్పిందన్నారు. ఆదివారం రాత్రి బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మార్పు కళామండలి వ్యవస్థాపకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు ఎన్ఆర్ రాసిన 'జ్ఞానజ్యోతి వెలిగించే ఓ ఉపాధ్యాయుడా నీకు ఎవరు సాటి' ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, అరుణోదయ విమలక్క, ప్రముఖ రచయిత్రి జూపాక సుభద్ర, రచయిత నాళేశ్వరం శంకరం, ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పి.హనుమాండ్లు, బంధు సొసైటీ అధ్యకుడు పి.వీరస్వామి, యాదగిరి తదితరులు మాట్లాడారు. ఎన్ఆర్ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పాటలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతమైన కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. కార్యక్రమంలో మార్పు కళామండలి ప్రతినిధి రత్నం, న్యాయవాది శైలజ తదితరులు పాల్గొన్నారు.

తనికెళ్ల రచనలు సామాజిక స్థితికి ప్రతిబింబాలు



కళాకారులను అభినందిస్తున్న ప్రకాశ్‌రాజ్

సినీనటుడు ప్రకాశ్‌రాజ్

గన్‌ఫౌండ్రీ: నలభై ఏళ్ల క్రితం రాసిన నాటకాలైనా ప్రస్తుత సామాజిక, రాజకీయ స్థితిని ప్రతిబింబించేలా తనికెళ్ల భరణి రచనలు ఉన్నాయని ప్రముఖ సినీనటుడు ప్రకాశ్‌రాజ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సంగమం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న తనికెళ్ల భరణి రంగస్థల జీవిత స్వర్ణోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనికెళ్ల భరణి రచనలు నేటి యువ రచయితలకు ఎంతో ప్రేరణగా నిలుస్తాయన్నారు. అంతకు ముందు తనికెళ్ల భరణి నాటికలు–ప్రయోగశీలత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. తనికెళ్ల రచించిన జంబుద్వీపం, గోగ్రహణం వంటి నాటికలను ప్రదర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, శాంతా బయోటిక్స్ ఎండీ వరప్రసాద్‌రెడ్డి, సినీ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, నటులు జయలలిత, అశోక్‌కుమార్, సంగమం ఫౌండేషన్ అధ్యక్షుడు సంజయ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా మహాగణపతి తయారీ పనులు



ఖైరతాబాద్ మహాగణపతి కోసం 70 అడుగుల భారీ షెడ్డు

ఖైరతాబాద్: ఈ సంవత్సరం శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా ఖైరతాబాద్ మహాగణపతి భక్తులకు దర్శనమివ్వనున్నాడు. నిర్జల ఏకాదశి సందర్భంగా కర్రపూజ నిర్వహించి మహాగణపతి తయారీ పనులకు శ్రీకారం చుట్టి వేగంగా పనులు పూర్తిచేస్తున్నారు. 71వ సంవత్సరం సందర్భంగా 69 అడుగుల ఎత్తులో శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి తయారీ పనులు శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ నేతృత్వంలో వేగంగా జరుగుతున్నాయి. 69 అడుగుల ఎత్తులో ఉన్న మహాగణతి విగ్రహానికి సరిపడా 70 అడుగుల ఎత్తులో షెడ్డు నిర్మించారు. నర్సాపూర్ నుంచి 38 టన్నుల కర్రలతో ఆదిలాబాద్‌కు చెందిన సర్సయ్య బృందం భారీ షెడ్డును నిర్మించారు. విగ్రహ నమూనాకు మూలమైన వెల్డింగ్ పనులను కాకినాడకు చెందిన నాగబాబు ఆధ్వర్యంలో 20 మంది వెల్డర్లు చేపట్టారు. 20 టన్నుల స్టీల్ ఉపయోగించి ఇప్పటికే అవుట్ లైన్ వర్క్ మొత్తం పూర్తయిందని, మరో వారం రోజుల్లో వెల్డింగ్ పనులు పూర్తవుతాయని రాజేంద్రన్ తెలిపారు. వెల్డింగ్ పనుల అనంతరం రాజస్థాన్ నుంచి బంకమట్టి, వరిగడ్డి యాదాద్రి జిల్లా చీకటిమామిడి నుంచి భిక్షపతి గౌడ్, తూప్రాన్‌కు చెందిన రాచర్ల కృష్ణమూర్తి బాలాజీ రైస్ మిల్ నుంచి 40 బ్యాగుల వరి పొట్టు అందజేశారని ఉత్సవ కమిటీ ప్రతినిధి సందీప్ రాజ్ తెలిపారు. బిహార్, బెంగాల్, ఒడిశా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి ఆర్టిస్టులు, ఫినిషింగ్ వర్కర్లు వచ్చి మహాగణపతి తయారీ పనులను పూర్తి చేస్తారు.

గైడ్‌లైన్స్‌కు విరుద్ధంగా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆంక్షలు

తెలంగాణ ఆటో రిక్షాడ్రైవర్స్ యూనియన్ జేఏసీ కన్వీనర్ వెంకటేశం

హిమాయత్‌నగర్: ప్రభుత్వ గైడ్‌లైన్స్‌కు విరుద్ధంగా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేంద్రమోహన్ ఆంక్షలు విధించడం వల్ల కొత్త ఆటోపర్మిట్ల కోసం ఆటోడ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ ఆటో రిక్షాడ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం తెలిపారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో జేఏసీ నేతలు ఎంఏ సలీం, వి.ప్రవీణ్, ఎస్.రామకిషన్, పి.యాదగిరితో కలిసి బి.వెంకటేశం మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన లైసెన్స్‌లు చెల్లవని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత జారీ చేసిన లైసెన్సులే చెల్లుతాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రోజుకు 100 ఆటోలు లాగిన్ అని మెలిక పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. లాగిన్, అప్రూవల్ అయిన తరువాత కూడా ఆటోలు డెలివరీ చేయడం లేదని ఆరోపించారు. సమావేశంలో ఆటో జేఏసీ నాయకులు ఎస్.అశోక్, బి.తిరుమలేశ్ గౌడ్, ఎం.జనార్దన్‌రెడ్డి, ఎం.డి.రఫీ, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు సాహితీ వనం సమూహం ఆధ్వర్యంలో తెలుగు సాహితీవనం 8వ వార్షికోత్సవాలను ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి శాంతికృష్ణ రచించిన 8 పుస్తకాలను ఆవిష్కరించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ వివిధ అంశాలపై ఏకకాలంలో 8 పుస్తకాలను తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు రచయితలు, కవులకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ డైరెక్టర్ ఏనుగు నరింహారెడ్డి, ప్రముఖ కవి అంపశయ్య నవీన్, శీలా సుభద్రాదేవి, పెద్దింటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఇక రాజకీయ వృత్తిని చేపట్టాలి

దక్షిణ మధ్య రైల్వే ఓబీసీ ఉద్యోగుల సదస్సులో మాజీ డీజీపీ పూర్ణచంద్రారావు



పూర్ణచంద్రారావును సన్మానిస్తున్న దక్షిణ మధ్య రైల్వే ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు

అడ్డగుట్ట: ఇంతకాలం అనేక కుల వృత్తులు చేసిన బీసీలు ఇక రాజకీయం అనే పూర్తిస్థాయి వృత్తిని చేపట్టి రాజ్యాధికారం సాధించాలని మాజీ డీజీపీ, ఏబీఎస్పీ జాతీయ సమన్వయకర్త డాక్టర్ జె.పూర్ణచంద్రారావు పిలుపునిచ్చారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీ చైర్మన్ పదవులు చేపట్టేలా చూడాలని రైల్వే ఉద్యోగులకు సూచించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఆడిటోరియంలో ఆదివారం దక్షిణ మధ్య రైల్వే ఓబీసీ ఉద్యోగుల ప్రత్యేక సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పూర్ణచంద్రారావు మాట్లాడుతూ బీసీలు సామాజికంగా, రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందని, అందుకోసం సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు బీసీ నేతలకు వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. తెలంగాణలో 17 పార్లమెంటు నియోజకవర్గాల్లో ముగ్గురు చొప్పున బీసీ ఎమ్మెల్యేలు ఉండాలని, కానీ ఉన్నది మాత్రం 19 మందే అని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో భూములన్నీ అగ్రవర్ణాల వారి వద్దే ఉన్నాయని, బీసీలను వ్యవసాయ కూలీలుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. రాజకీయాల్లో కూడా అలాగే ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జరుగుతున్న అన్యాయం తెలుసుకొని తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి బీవీఎస్ సత్యనారాయణ, మీనాక్షి, సంధ్యారాణి, ఉద్యోగ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

కల్తీకల్లు ఘటనపై చర్య తీసుకోవాలి: ఐద్వా

డ్రగ్స్ తరహాలో ఉక్కుపాదం మోపాలి



నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న ఐద్వా నేతలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కల్తీకల్లు ఘటనపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అరుణజ్యోతి, మల్లు లక్ష్మీ డిమాండ్ చేశారు. డ్రగ్స్ తరహాలో కల్తీకల్లుపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని కోరారు. ఆదివారం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్తీకల్లు ప్రమాద ఘటనలో ఏడుగురు చనిపోగా, మిగతా వారు చికిత్స పొందుతున్నారని అన్నారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉందని విచారం వ్యక్తం చేశారు. కిడ్నీ ఇన్‌ఫెక్షన్ కారణంగా డయాలసిస్ చేస్తున్నారని, ఇది తీవ్రంగా కలచివేస్తోందన్నారు. కల్లు కాంపౌండ్ యాజమాన్యాలు రసాయనాలతో కృత్రిమంగా కల్లును తయారు చేసి విక్రయిస్తూ సామాన్యులను ఆర్థికంగా దోచుకుంటున్నారని, ప్రాణాలకు హానీ కలిగిస్తున్నారని ఆరోపించారు. ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా కోశాధికారి మాచర్ల భారతి, ఎం.వినోద తదితరులు ఉన్నారు.

కవితపై తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు

యునైటెడ్ ఫూలే ఫ్రంట్ ఖండన

హిమాయత్‌నగర్: మహిళ అని కూడా చూడకుండా రాజకీయ మైలేజ్ కోసమే ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని యునైటెడ్ ఫూలే ఫ్రంట్ కన్వీనర్ బొల్లా శివశంకర్ అన్నారు. అలాంటి వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. కవితకు వెంటనే మల్లన్న క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత దూషణల కారణంగానే క్యూ న్యూస్ ఆఫీస్‌పై దాడులు జరిగాయని పేర్కొన్నారు. వ్యక్తిగత దూషణలతో బీసీ ఉద్యమాన్ని నీరుగార్చే కుట్ర జరుగుతోందన్నారు. జాగృతి అధికార ప్రతినిధి ఎల్చాల దత్తాత్రేయ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తీన్మార్ మల్లన్న ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. బీసీ ఉద్యమనేత ఆర్.కృష్ణయ్యను విమర్శించిన చరిత్ర మల్లన్నదని అన్నారు. యునైటెడ్ పూలే ఫ్రంట్ కో–ఆర్డినేటర్ అలకుంట్ల హరి మాట్లాడుతూ బేషరతుగా కవితకు క్షమాపణలు చెప్పాలని, లేకపోతే మరిన్ని దాడులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో జాగృతి స్టేట్ యూత్ ప్రెసిడెంట్ ఎదురుగట్ల సంపత్ గౌడ్, రాష్ట్ర కో–కన్వీనర్లు ఎలుకొండ రాంకోటి, పెద్దాపురం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

వృథా ఖర్చుల వల్లే ఆర్థిక అనారోగ్యం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించకుండా అనేక రంగాల్లో వృథాగా డబ్బులు ఖర్చు చేయడం వల్లే ఆర్థిక అనారోగ్య పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. ఆర్థిక ఆరోగ్యం గురించి ఆలోచించి ప్రభుత్వాలు నడిపితే భవిష్యత్‌లో విపత్కర పరిస్థితులు ఉండవని పేర్కొన్నారు. ఈ మేరకు డాక్టర్ దీప్తిరావు గురుకొంటి రచించిన 'ఏ డాక్టర్ గైడ్ టు ఫైనాన్షియల్ హెల్త్' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం తార్నాకలోని ఎన్ఐఎన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో రాంచందర్‌రావు, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాంచందర్‌రావు మాట్లాడుతూ మనిషికి ఆర్థిక ఆరోగ్యం ఎంత ముఖ్యమో రాష్ట్రానికి సైతం అంతే ముఖ్యమని పేర్కొన్నారు. డబ్బును పొదుపు చేయడం, తెలివిగా ఖర్చు చేయడం ఆర్థిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. ఆర్థిక ఆరోగ్యం ప్రాముఖ్యత అందరికీ అర్థం అయ్యేలా సరళమైన భాషలో పుస్తకాన్ని రాసిన డా.దీప్తిని వక్తలు అభినందించారు. కార్యక్రమంలో ప్రొ.రేవతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మనోవికాస గ్రంథం భగవద్గీత



మాట్లాడుతున్న వేణుగోపాలచారి

చిక్కడపల్లి: భగవద్గీత మానవాళికి జీవన విధానాన్ని చెప్పే మనో వికాస గ్రంథమని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. కృష్ణం వందే జగద్గురు ఫౌండేషన్, గీతా ఫౌండేషన్, నక్క వెంకటమ్మ, యాదగిరి స్వామియాదవ్ ఎడ్యుకేషనల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గానసభలో భగవద్గీతపై జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఉన్నత జీవన విధానానికి గీత ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గీతా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బడేసాబ్ సమన్వయం చేసిన కార్యక్రమంలో ప్రముఖులు తాడూరు విశ్వేశ్వర్, శ్రీనివాస్, జి.శ్రీనివాసయాదవ్, జి.మనోహర్‌రెడ్డి, రాధాకుసుమ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనబాటలో 'మన ఊరు–మన బడి' గుత్తేదార్లు

నేడు డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఎదుట నిరసన

సాక్షి,సిటీబ్యూరో: కార్పొరేట్ తరహాలో సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం మన ఊరు–మన బడి పథకం కింద పనులు చేపట్టిన గుత్తేదారులు బిల్లుల సాధన కోసం ఆందోళన బాట పడుతున్నారు. గత బీఆర్ఎస్ హయంలో పనులు చేపట్టినా ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదు. దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక తలకు మించిన భారంగా మారాయని వారు వాపోతున్నారు. తక్షణమే ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం డెరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (డీఎస్ఈ) ఎదుట నిరసన వ్యక్తం చేయాలని నిర్ణయించారు. బిల్లులు చెల్లింపు జరిగే వరకు దశల వారీగా ఆందోళన నిర్వహిస్తామని వారు ప్రకటించారు.

ఇదీ పరిస్థితి..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 'మన ఊరు–మన బడి' కార్య క్రమంలో భాగంగా హైదరాబాద్ జిల్లాలో మొదటి విడత కింద 239 స్కూళ్లను ఎంపిక చేసి సుమారు 12 రకాల పనులు చేపట్టాలని నిర్ణయించారు. రూ.30 లక్షలలోపు పనులను హెచ్ఎం స్థాయిలో నామినేటెడ్ కింద చేసే అవకాశం కల్పించగా, రూ.30 లక్షలకుపైగా పనులను టెండర్ ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించారు. తరగతి గదులు, ఆడిటోరియం, ప్రహరీల నిర్మాణానికి రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ కనెక్షన్లు, నీటి సరఫరా, ఫర్నిచర్ ఏర్పాటుకు రూ.15 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు నిధులు కేటాయించారు.

హెచ్ఎంల కొరవతో..

'మన ఊరు–మన బడి' పథకం కింద నామినేటెడ్ పనులు అత్యధిక శాతం ప్రధానోపాధ్యాయుల చొరవతోనే పూర్తయ్యాయి. వాస్తవంగా మొత్తం ఎంపిక చేసిన 239 స్కూళ్లలో కేవలం 48 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. నామినేటెడ్ కింద పనులకు బిల్లులపై అనుమానంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. అయితే కొందరు స్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపించి ఆసక్తి కలిగిన కాంట్రాక్టర్లను ఒప్పించి పనులు చేయించారు. మొదటి విడతగా 25 శాతం పనులు చేసినా బిల్లుల విడుదలలో ఇబ్బందులు ఎదురుకావడంతో కొందరు వెనక్కి తగ్గగా, మరికొందరు మాత్రం అప్పులు తీసుకొచ్చి పనులు పూర్తి చేశారు. అయితే బిల్లుల చెల్లింపుల్లో కాలయాపన, ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పెండింగ్‌లో పడిపోయింది.కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది.



సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన 'గివ్ హిమ్ నోబెల్'

ఐపీఎల్ మొదలు, రాజకీయాల వరకూ ట్రోలింగ్

సరికొత్తగా పుట్టుకొస్తున్న మీమ్స్, షార్ట్స్, రీల్స్

పాజిటివ్ వర్సెస్ నెగెటివ్‌గా ట్రోలింగ్ కల్చర్

నగరంలో పెరుగుతున్న సోషల్ మీడియా ట్రోలింగ్

'గివ్ హిమ్ నోబెల్'.. గత కొంత కాలంగా ఈ ఒక్క వాక్యం గ్లోబల్ సోషల్ మీడియా వేదికగా వైరల్‌గా మారింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎప్పటిలానే కొన్ని వింత వ్యాఖ్యలు చేయగానే, భారతీయ నెటిజన్లు దాన్ని వినోదాత్మకంగా తీసుకుని ట్రోలింగ్ మంత్రంగా మార్చేశారు. ఇలాంటి ట్రోలింగ్ కల్చర్ ప్రస్తుతం అంతర్జాతీయంగానే కాకుండా నగరంలో కూడా విపరీతంగా పెరిగిపోయింది. సోషల్ మీడియా యాప్స్ అతిగా వినియోగిస్తున్న క్రమంలో ఈ ట్రోలింగ్ పుట్టుకొచ్చి నానా హంగామా చేస్తోంది. సెలబ్రిటీలు, సినిమాలు, క్రీడలు, సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్లు, రాజకీయాలు ఇలా ఒకటేంటి.. ట్రెండింగ్‌లో ఉన్న ప్రతి అంశంపైనా ట్రోలింగ్ జరుగుతోంది. ఇందులో హ్యూమర్, సెటైర్, సోషల్ కామెంటరీ, ఫన్, సూచనలు తదితర అంశాలు సమ్మిళితంగా ఉంటుంది. సాధారణంగా నగరంలో లక్షల మంది సోషల్ మీడియా యాప్స్ వాడుతున్న వారు ఉండటం, అంతర్జాతీయ అంశాలకు సైతం నగరం వేదికగా ఉండటంతో ఇక్కడ కూడా ట్రోలింగ్ స్థాయి కాస్త ఎక్కువగానే ఉందని నిపుణులు చెబుతున్న మాట.

- సాక్షి, సిటీబ్యూరో

సోషల్ రీల్స్.. మీమర్స్ ట్రోల్స్..





ట్రోలింగ్ ఒక వినోద మాధ్యమంగా ప్రారంభమై, నేడు ఓ సామాజిక ప్రయోగంగా మారింది. అయినా సరే, ఇది బాధ్యతతో వినియోగించాల్సిన సాధనం. హాస్యం చాటుతూనే, వ్యక్తిగత గౌరవాన్ని కాపాడాల్సిన అవసరం ఉంటుంది. హైదరాబాద్ వంటి డిజిటల్ నగరాలు ఈ మార్పులకు మార్గదర్శకంగా మారాలని నిపుణుల అభిప్రాయం. స్మార్ట్‌ఫోన్ విప్లవం, డేటా వినియోగం పెరిగినప్పటి నుంచి సోషల్ మీడియా వేదికల్లో (ఎక్స్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్, యూట్యూబ్ మొదలైనవి) ట్రోలింగ్ ఒక మొడ్రన్ కల్చర్‌లా మారింది. హైదరాబాద్‌లోని మిలీనియల్స్, జెన్–జీ తరాలు ప్రత్యేకించి ట్రోల్స్‌ను వినోదంగా తీసుకుంటూ, వాటిని షేర్ చేయడం ద్వారా మీమ్స్, సెటైర్ వంటి కళలను కొత్త రీతిలో వెలుగులోకి తెస్తున్నారు.



సామాన్యుల నుంచి సెలబ్రిటీలు..

– ఈ మధ్యనే ముగిసిన ఐపీఎల్ మ్యాచ్ సమయంలో ప్రముఖ క్రికెటర్ విరాట్ కోహ్లీ విపరీతంగా ట్రోల్‌కు గురయ్యారు. తన జెర్సీ నెంబర్ 18, ఈ సారి జరిగిన మ్యాచ్ కూడా 18వ మ్యాచ్ కావడంతో ఇక ట్రోఫీ గెలవరని దారుణంగా ట్రోల్ చేశారు. అయితే దీనికి విభిన్నంగా 18 ఏళ్ల తరువాత మ్యాచ్ గెలవడంతో ఈ ట్రోలింగ్‌కు తెలపడింది. కానీ మరుసటి రోజు బెంగళూరు వేదికగా విజయోత్సవ వేడుకల్లో భాగంగా అపశృతి జరిగి క్రికెట్ అభిమానులు తొక్కిసలాటలో మరణించడంతో మళ్లీ ట్రోలింగ్ పుంజుకుని ఒక వారం పాటు సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. ఇదే ఐపీఎల్‌లో హైదరాబాద్ టీమ్ ఓడినప్పుడు కూడా.. 'బిర్యానీ తిని ఆట పై దృష్టి సారించలేరనే' కామెంట్లతో ట్రోల్ చేశారు.



సోషల్‌మీడియా రాజకీయం

రాజకీయాల పరంగా సోషల్ మీడియా ట్రోలింగ్ అనేది ఇప్పుడు ట్రెండింగ్‌గా మారింది. ఇది రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు పార్టీల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నిపుణులను సైతం పెట్టుకుని సోషల్ మీడియా ట్రోలింగ్ మీమ్స్ తయారు చేస్తున్నారు. వీటికి ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్ వేదికల్లో ప్రత్యేక ఖాతాలు, గ్రూపులు సైతం ఆవిష్కరించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్–కాంగ్రెస్ మధ్య, ఏపీలో వైఎస్‌ఆర్‌సీపీ–టీడీపీ మధ్య ట్రోలింగ్ ఎక్కువగా ఉండగా.. దేశవ్యాప్తంగా ఎక్కడైనా కూడా బీజేపీ పైన విపరీతమైన ట్రోలింగ్ జరుగుతోంది.

గ్లోబల్ వేదికగా..

భారత్ పాక్ యుద్ధం నేపథ్యంలో.. నువ్వు ఓకే అను ఏసేద్దాం అంటూ పోకిరి సినిమా డైలాగ్స్‌ను భారత్–ఇజ్రాయెల్ మీమ్స్‌గా తయారు చేసి పాక్‌ను విపరీతంగా ట్రోల్ చేశారు. ఇలాంటి ట్రోల్స్ తెలుగు మీమర్స్ చాలా ఉత్సాహంగా, క్రియేటివ్‌గా ఉన్నారు. ఇదే యుద్ధం సందర్భంగా భారత్–పాక్ దేశాల మధ్య యుద్ధాన్ని నేనే ఆపాను అనే ట్రంప్ స్టేట్‌మెంట్ ఆధారంగా.. 'గివ్ హిమ్ నోబెల్' అనే ట్రోల్ ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. అలాగే ఎలన్ మస్క్ 'ట్విట్టర్'లో మార్పులపై 'ఇంతలోనే ట్విట్టర్ మేము మిస్ అవుతున్నాం మస్క్ గారు' అంటూ ట్రోల్స్ చేశారు.

ట్రోలింగ్‌లోనూ రెండు రకాలు..

పాజిటివ్ వర్సెస్ నెగెటివ్ ట్రోలింగ్. పాజిటివ్‌లో హ్యూమరస్, సెటైరిక్ ఎక్కువగా ఉంటూ.. సామాజిక అంశాలపై అవగాహన కలిగించేలా ట్రోల్స్ చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ విఫలతలపై క్రియేటివ్‌గా విమర్శలు, పౌరుల చైతన్యం వంటి వాటిపై దృష్టి సారిస్తున్నారు. నెగెటివ్ ట్రోలింగ్‌లో బులీయింగ్, మోసం వంటి అంశాలను ఎత్తి చూపుతున్నారు. ఇందులో వ్యక్తిగత జీవితాలపై దూషణలు తారా స్థాయికి చేరాయి. ట్రోల్ పేరుతో హేట్‌స్పీచ్ ఎక్కువ వ్యాప్తిచేస్తున్నారు. కుల, మత, భౌగోళిక అంశాలపైన ఈ ట్రోలింగ్ ఎక్కువగా ఉంటుంది.

మూడు నుంచి ఐదు గంటలు..

తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ విడుదల చేసిన 2024 డిజిటల్ యుసేజ్ రిపోర్ట్ ప్రకారం.. హైదరాబాద్ నగరంలో 78 శాతం మంది యువత రోజుకు కనీసం 3–5 గంటల వరకు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నారు. ఈ క్రమంలో ట్రోలింగ్ ఓ ప్రధాన వినోదపు సాధనంగా మారింది. స్థానిక స్థాయిలో జీహెచ్‌ఎంసీ పనితీరు, ట్రాఫిక్ సమస్యలు, మినిస్టర్ స్టేట్మెంట్లు మొదలుకొని అంతర్జాతీయంగా ట్రంప్, పుతిన్, ఎలాన్ మస్క్‌ల వ్యాఖ్యలు కూడా ట్రోలింగ్‌కు గురవుతున్నాయి.



అత్యధికంగా సినిమాలపైనే..

టాలీవుడ్ స్టార్ ప్రభాస్ పాన్ ఇండియన్ మూవీ 'ఆదిపురుష్' చిత్రం విడుదలైనప్పుడు 'హనుమాన్‌కి వైఫై ఉంద'ని, థియేటర్లో హనుమాన్‌కు సైతం ఒక సీట్ వదిలేయాలనే ట్రోల్స్ జోరుగా సాగాయి. నాగ్‌చైతన్య, సమంత విడాకుల సమయంలో కూడా 'వెడ్డింగ్ టార్గెట్ 2.0' అనే పేరుతో కొందరి ఎడిటెడ్ పోస్టర్లు చక్కర్లు కొట్టాయి. నేషనల్ క్రష్‌గా మారిన రష్మిక మందన సినిమాలో నటిస్తే అది వెయ్యి కోట్లు కలెక్ట్ చేస్తుందని, పూజా హెగ్డే నటిస్తే సినిమా ఫ్లాప్ అవుతుందని ఇలాంటి వింత వింత ట్రోలింగ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



గ్రీనరీతో.. రాష్ట్ర పటం సీనరీ..



జూ పార్కులో ఆకట్టుకుంటున్న తెలంగాణ నమూనా

తెలంగాణ రాష్ట్ర పటాన్ని వివిధ రకాల జాతుల మొక్కలతో జూ పార్కులో అద్భుతంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. జూ పార్కు సందర్శనకు వచ్చిన ప్రకృతి ప్రేమికులు గ్రీనరీతో ఏర్పాటు చేసిన సీనరీకి ఫిదా అవుతున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల సరిహద్దులతో సహా ఈ మొక్కలతో ఏర్పాటు చేశారు. వాటి మధ్యలో జిల్లా పేర్లను స్పష్టంగా కనిపించేలా సైన్‌బోర్డులతో ఏర్పాటు చేశారు. కొత్త తరహాలో ఏర్పాటు చేసిన ఈ గ్రీనరీని చూసిన సందర్శకులు మంత్రముగ్ధులవుతున్నారు.

- చార్మినార్

బ్రెయిన్ ట్యూమర్ పరిశోధనలకు డాక్టరేట్..



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్ క్యాంపస్‌లోని ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి (ఈసీఈ) చెందిన పరిశోధనా స్కాలర్ ఏ.వినీషకు కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసింది. మెడికల్ ఇమేజ్ ప్రాసెసింగ్ రంగంలో చేసిన అత్యుత్తమ పరిశోధనలకు గానూ ఈ డిగ్రీ ప్రదానం చేశారు. అధునాతన పద్ధతిలో లోతైన లెర్నింగ్ టెక్నిక్‌లను ఉపయోగించి బ్రెయిన్ ట్యూమర్‌ను కనుగొనడం, క్లాసిఫికేషన్ అల్గోరిథం అభివృద్ధి అంశాలపై ఆమె దృష్టి కేంద్రీకరించడంలో కీలకంగా ఈ పరిశోధనలు సాగించారు.

17న బెంట్లీ ఇన్నోవేషన్ డే



సాక్షి, సిటీబ్యూరో : సాంకేతిక మార్పులతో దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల రంగం వేగంగా మారుతోంది. ఈ నేపథ్యంలో జూలై 17న నగరంలోని లీలా హోటల్‌లో ప్రముఖ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీరింగ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ బెంట్లీ సిస్టమ్స్ 'ఇన్నోవేషన్ డే' నిర్వహించనుంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా మౌలిక వసతుల రంగాన్ని ముందుకు తీసుకెళ్లే ఆధునిక డిజిటల్ సొల్యూషన్లు ప్రదర్శించనున్నామని, డిజిటల్ ట్విన్స్ జియోటెక్నికల్ ఇంటెలిజెన్స్ వంటి టెక్నాలజీల ప్రాముఖ్యతపై విస్తృత చర్చలు జరగనున్నాయని వివరించారు. దేశంలోని పలువురు పరిశ్రమ ప్రముఖుల ప్రసంగాలు, లైవ్ డెమోలు, డిజిటల్ డెలివరీ, భూమి స్థిరత్వానికి సంబంధించిన పరిష్కారాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

సేవ్ రాక్స్ ఆధ్వర్యంలో.. ఇంటర్నేషనల్ రాక్ డే



పర్యావరణ పరిరక్షణపై నృత్య ప్రదర్శన | రాతి సంపదపై ఆకట్టుకున్న ఇకెబనా ఎగ్జిబిషన్





గచ్చిబౌలి: హైదరాబాద్ శివార్లలో రెండున్నర బిలియన్ ఏళ్ల క్రితం వెలసిన అరుదైన వారసత్వ రాతి సంపదను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు కొనియాడారు. అదే లక్ష్యంగా నృత్యం, ఇకెబనా ఎగ్జిబిషన్ ఆదివారం రాత్రి గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. సొసైటీ టు సేవ్ రాక్స్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్‌రాక్ డే సందర్భంగా పర్యావరణంలో ముఖ్య భూమికను పోషించే రాతి సంపదను ఆయా దేశాలు ఎలా కాపాడుకుంటారో వివరించారు. నయనతార నందకుమార్ అవర్ సీక్రెడ్ ప్లేస్‌కు చెందిన వారు అంతరించిపోతున్న రాతి సంపద గురించి డ్యాన్స్ రూపంలో వివరించారు. పుప్పాలగూడలోని పక్ళుద్దీన్ గుట్ట 400 సంవత్సరాల క్రితం ఎలా ఉంది, గుట్టను ఎలా ధ్వంసం చేస్తున్నారో, కంచె గచ్చిబౌలిలో పురాతన రాళ్లు, పర్యావరణ విధ్వంసాన్ని వివరించారు. నగర శివార్లలో రెండున్నర బిలియన్ సంవత్సరాల క్రితం వెలసిన రాతి సంపదకు ముప్పు వాటిల్లుతోందని, పర్యావరణంపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోందని నయనతార వివరించారు. ప్రకృతి వనరులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాళ్లు, నీళ్లు, చెట్లు ఎలా మమేకమవుతాయో వివరిస్తూ ఓరా స్కూల్ ఆఫ్ ఇకెబనా హైదరాబాద్ చాప్టర్ సభ్యులు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. చెట్లకు రాళ్లు మినరల్స్‌ను అందిస్తాయని, రాళ్లలో పక్షులతో పాటు అనేక ప్రాణులు జీవిస్తాయని తెలియజేశారు. పర్యావరణ విచ్ఛిన్నం వల్లే గ్లోబల్‌వార్మింగ్, అతి వర్షాలు, వరదలు, భూకంపాలు, సునామీ వంటి ప్రకృతి అవాంతరాలు వస్తున్నాయని ఓరా స్కూల్ ప్రెసిడెంట్ నిర్మల పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ టు సేవ్ రాక్స్ ప్రెసిడెంట్ ఫాతిమా అలీఖాన్, వైస్ ప్రెసిడెంట్ సంగీత వర్మ, జనరల్ సెక్రెటరీ ఫ్రాక్ ఖాదర్ పాల్గొన్నారు.





భామాకలాపం..

మాదాపూర్: కళాకారిణి హర్షిణి చుండి కూచిపూడి నృత్యంతో సందర్శకులను అలరించింది. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో ఆదివారం నటరాజ నాట్యాంజలి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ (అట్లాంటా) యూఎస్‌ఏ నాట్యగురువు నీలిమ గడ్డమనుగు, తల్లిదండ్రులు కళ్యాణి, వెంకట్ చుండి పర్యవేక్షణలో తొలి ప్రదర్శన ఇచ్చారు. గణేశకౌత్వం, భామాకలాపం, శివశివ భవభవ, కృష్ణశబ్దం, సరస్వతీ స్తుతి, అన్నమాచార్య కీర్తన, తిల్లాన, మంగళం తదితర అంశాలను ప్రదర్శించారు. ఓకల్ మృదు రవళి, మంతా శ్రీనివాస్, మృదంగం చంద్రకాంత్, వయొలిన్ లక్ష్మీనరసింహామూర్తి, ఫ్లూట్ ఉమావేంకటేశ్వర్లు, వీణ సుధాకర్ సంగీత సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట కలెక్టర్ హనుమంతరావు, బ్రహ్మశ్రీ నాగఫణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎగువ గోదారి వెలవెల!

జైక్వాడ్ నుంచి అన్నారం బరాజ్ వరకు కానరాని వరద

మేడిగడ్డ నుంచి ధవళేశ్వరం వరకు కొనసాగుతున్న ఉధృతి

ప్రాణహిత, ఇంద్రావతి వరదలు తోడుకావడమే కారణం

ఇప్పటికే సముద్రంలో కలిసిన 175 టీఎంసీల గోదావరి జలాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించి నెలన్నర గడిచిపోయినా వరద ప్రవాహం లేక ఎగువ గోదావరి వెలవెలబోతోంది. మరోవైపు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని దిగువ పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఉప నదులైన ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, వాగులు, వంకల్లో వరద ఉధృతి పెరిగి దిగువ గోదావరి పోటెత్తింది. గోదావరిలో ప్రాణహిత కలిసే కాళేశ్వరం వద్ద నిర్మించిన మేడిగడ్డ బరాజ్ నుంచి ధవళేశ్వరం బరాజ్‌కి దిగువన సముద్రంలో కలిసే వరకూ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాణహితలో వరద పెరగడంతో కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌లోకి 2.21 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, వచ్చిన వరదను వచ్చినట్టు కిందికి విడుదల చేస్తున్నారు. దానికి ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న ఇంద్రావతి వరద తోడవుతుండటంతో తుపాకులగూడెం (సమ్మక్క సాగర్) బరాజ్‌లోకి 2.69 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా అంతే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. సీతమ్మసాగర్ (దుమ్ముగూడెం బరాజ్)లోకి చేరుతున్న 5.92 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఏపీలోని ధవళేశ్వరం బరాజ్ గేట్లను ఎత్తివేయడంతో ఇప్పటికే ఈ ఏడాది 175 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలోకి కలిసిపోయాయి.

ఎగువన అన్ని రిజర్వాయర్లూ వెలవెలనే..

గోదావరిపై మహారాష్ట్రంలో ఉన్న జైక్వాడ్ ప్రాజెక్టు గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 102.73 టీఎంసీలు కాగా, ప్రస్తుతం జలాశయానికి 15 వేల క్యూసెక్కుల వరద వస్తుండడంతో 83.48 టీఎంసీలకు నిల్వలు చేరాయి. జైక్వాడ్ ప్రాజెక్టు నిండితేనే గోదావరి ప్రధాన పాయ ద్వారా తెలంగాణలోకి వరద ప్రవాహం ప్రారంభమవుతుంది. మంజీరాపై నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ఎలాంటి ఇన్‌ఫ్లో లేకపోవడంతో నిల్వలు 4.71 టీఎంసీలకు పడిపోయాయి. గోదావరి ప్రధాన పాయపై ఉన్న శ్రీరామ్‌సాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, కేవలం 2,100 క్యూసెక్కుల వరద వస్తుండగా, జలాశయంలో 20.77 టీఎంసీల నీరే ఉంది. కడెం నదిపై నిర్మించిన కడెం ప్రాజెక్టు సామర్థ్యం 4.7 టీఎంసీలు కాగా, 602 క్యూసెక్కుల వరద వస్తుండడంతో నిల్వలు 3.47 టీఎంసీలకు చేరాయి. గోదావరి ప్రధాన పాయపై ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా, 431 క్యూసెక్కుల వరద మాత్రమే వస్తుండడంతో నిల్వలు 8.9 టీఎంసీలకు పరిమితమయ్యాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గోదావరి ప్రధాన పాయపై నిర్మించిన సుందిళ్ల, అన్నారం బరాజ్‌లకు సైతం నామమాత్రంగా 293 క్యూసెక్కులు, 450 క్యూసెక్కుల వరద మాత్రమే వస్తోంది. మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో నీళ్లు నింపరాదని ఎన్డీఎస్ఏ సూచించింది. దీంతో మేడిగడ్డ బరాజ్‌కి భారీ వరద వస్తున్నా నీటిని ఎత్తిపోసే అవకాశం లేకుండా పోయింది.



నాగార్జున సాగర్‌లో 551 అడుగులకు నీటి మట్టం

నాగార్జునసాగర్: శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టడంతో ఒక గేటు ద్వారా దిగువన నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల ద్వారా 69,382 క్యూసెక్కులు, ఒక గేటు ద్వారా 27,295 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. సాగర్ జలాశయ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 551.10 అడుగుల మేర నీటి మట్టం ఉంది. సాగర్ జలాశయానికి గడిచిన 24 గంటల్లో 70,320 క్యూసెక్కుల నీరు రాగా, 9,552 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

దివికేగిన నవరసాల కోట

▶ మొదటి పేజీ తరువాయి

వీడ్కోలు మధ్య అంత్యక్రియలు జరిగాయి. ఆయన పెద్ద మనవడు శ్రీనివాస్ తాత అంతిమ సంస్కారాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, ఏపీ సీఎం చంద్రబాబు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, సినీ ప్రముఖులు చిరంజీవి, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, బ్రహ్మానందం, ప్రకాశ్‌రాజ్, బాబూమోహన్, రావు రమేష్, ఆర్.నారాయణమూర్తి, త్రివిక్రమ్ శ్రీనివాస్, ముప్పలనేని శివ, అల్లు అరవింద్, ఆదిశేషగిరిరావు, విజయేంద్రప్రసాద్, పరుచూరి వెంకటేశ్వరరావు, పరుచూరి గోపాలకృష్ణ తదితరులు ఆయన పార్థివదేహానికి నివాళులు అర్పించారు.



కోట శ్రీనివాసరావు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.

19 ఏళ్లు బ్యాంకులో కొలువు..

కోట శ్రీనివాసరావు 1942 జూలై 10న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా కంకిపాడులో జన్మించారు. కోట శ్రీనివాసరావు తల్లిదండ్రులకు 12 మంది సంతానం. వారిలో ముగ్గురు అబ్బాయిలు, తొమ్మిది మంది అమ్మాయిలు. కోట పదో తరగతి తర్వాత విజయవాడలోని ఎస్ఆర్ఆర్ కాలేజీలో ఇంటర్మీడియెట్‌లో చేరారు. కోటకి చిన్నప్పటి నుంచి నాటకాలంటే ఆసక్తి. స్కూల్, కాలేజీలో నాటకాలు వేసేవారు. బీఎస్సీ పూర్తయిన తర్వాత స్టేట్ బ్యాంకులో గుమాస్తా ఉద్యోగంలో చేరారు. ఆయన తొలి జీతం 135 రూపాయలు. 19 ఏళ్లు బ్యాంకులో ఉద్యోగం చేశారు. కోట ఆ సమయంలో కూడా నాటకాన్ని వదల్లేదు. 1968లో రుక్మిణీ దేవితో కోటకి వివాహమైంది. ఒకవైపు ఉద్యోగం... మరోవైపు నాటకాలు, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ బిజీగా ఉండేవారు. ఇక తెలుగు నాటకరంగం హైదరాబాద్‌లో వెలిగిపోతున్న సమయంలో ఉద్యోగరీత్యా ఆయన కూడా హైదరాబాద్‌కు బదిలీపై వచ్చారు. నూతన్ ప్రసాద్, పరుచూరి గోపాలకృష్ణ, రాళ్లపల్లి, పీఎల్ నారాయణ... వంటివారితో కలిసి నాటకాలు వేసే అవకాశం ఆయనకు దక్కింది. హైదరాబాద్‌లో కోట వేసిన 'ప్రాణం ఖరీదు'నాటకం నచ్చడంతో డైరెక్టర్ కె.వాసు, నిర్మాత క్రాంతికుమార్ సినిమాగా తీయాలనుకున్నారు. ఆ నాటిక రాసిన సీఎస్ రావే 'ప్రాణం ఖరీదు'(1978) చిత్రానికి కూడా రచయిత. ఆయనకు కోట అంటే చాలా సెంటిమెంట్ ఉండేది. దీంతో 'ప్రాణం ఖరీదు'లో ఓ చిన్న వేషం ఉంది... మీరు చేయాలని కోరడంతో కోట అంగీకరించారు.. అలా చిరంజీవి హీరోగా నటించిన 'ప్రాణం ఖరీదు'సినిమాతో కోట సినీరంగ ప్రవేశం చేశారు.

'ప్రతిఘటన'.. టర్నింగ్ పాయింట్

మొదట సినిమాలను అంతగా సీరియస్‌గా తీసుకోలేదు. అందుకేనేమో 'ప్రాణం ఖరీదు'తర్వాత ఆయనకు నాలుగేళ్లకు పైగా గ్యాప్ వచ్చింది. డైరెక్టర్ జంధ్యాలతో ఉన్న పరిచయం వల్ల 'అమరజీవి'(1983) అనే సినిమా చేశారు. అయితే ఆయనెప్పుడూ సినీ నటుడు కావాలనుకోలేదు. అలాగని వచ్చిన అవకాశాలను కాదనలేదు. టి.కృష్ణ దర్శకత్వంలో విజయశాంతి లీడ్ రోల్‌లో నటించిన 'ప్రతిఘటన'(1985) చిత్రంలో విలన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కోట. ఆ సినిమా ఆయన సినీ కెరీర్‌కి మంచి టర్నింగ్ పాయింట్ అయింది. ఆ తర్వాత ఆయన వెనుతిరిగి చూసుకోలేదు. 'ప్రతిఘటన'తర్వాత అవకాశాలు ఎక్కువగా రావడంతో 1986 చివర్లో బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేశారు. 'ప్రతిఘటన'తర్వాత మళ్లీ ఆయనకి అంత పేరు తెచ్చిన చిత్రం 'అహ నా పెళ్లంట'. ఆ సినిమాలోని పాత్ర ఆయనకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు తీసుకొచ్చింది. పిసినారి పాత్రలు, అల్లరి తాతయ్య, అవినీతి నాయకుడు, కామెడీ విలన్, పోలీసు, మాంత్రికుడు వంటి విభిన్న పాత్రల్లో ఆయన నటించారనడం కంటే జీవించారని చెప్పడం అతిశయోక్తి కాదు. మిమిక్రీ చేయగలిగే నైపుణ్యం, హావభావాలు, డైలాగ్ డెలివరీ అన్నీ కలిసి ఒక నటుడిలో ఉండాల్సిన అన్ని లక్షణాలు కలిగిన సంపూర్ణ నటుడయ్యారు.

గాయకుడిగానూ...

రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన 'సర్కార్'సినిమాతో బాలీవుడ్‌లోనూ ఎంట్రీ ఇచ్చారు కోట. క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్‌గా, కమెడియన్‌గా... ఇలా అన్ని పాత్రల్లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 750కి పైగా సినిమాల్లో నటించి, ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. కోట నటించిన చివరి చిత్రం 'హరి హర వీరమల్లు'. ఈ నెల 24న ఈ చిత్రం విడుదల కానుంది. ఇక గాయకుడిగా కోట శ్రీనివాసరావు అఖిల్ బాల నటుడిగా రూపొందిన 'సిసింద్రీ'చిత్రంలో 'ఓరి నాయనో...', పవన్ కల్యాణ్ నటించిన 'గబ్బర్ సింగ్'చిత్రంలో 'మందు బాబులం మేము...'పాటలు పాడారు. అలాగే తెలుగులో అనువాదమైన పలు తమిళ చిత్రాలకు డబ్బింగ్ కూడా చెప్పారు. ఉదాహరణకు 'జెంటిల్‌మేన్, భారతీయుడు'తదితర చిత్రాల్లో నటుడు గౌండమణికి, 'నరసింహ, ఒకే ఒక్కడు'తదితర చిత్రాల్లో మణివణ్ణన్‌కి గాత్రదానం చేశారు. ఇంకా పలువురు నటులకూ చెప్పారు. దివంగత నటులు ఎస్వీ రంగారావు, కైకాల సత్యనారాయణ, రావు గోపాలరావు వంటి మహానటుల తర్వాత ఆ లోటును పూరించిన నటుడు కోట శ్రీనివాసరావు అని ఇండస్ట్రీలో నానుడి. ఆయన నటనకు బాలీవుడ్ బిగ్ బీ అమితాబ్ బచ్చన్‌తో సహా ఎంతోమంది అభిమానులయ్యారు. కోట



కోట శ్రీనివాసరావు అంతిమయాత్ర

శ్రీనివాసరావు-బాబూ మోహన్ కాంబినేషన్‌కి ప్రేక్షకుల్లో ఉన్న క్రేజే వేరు. వారిద్దరూ తెరపై కనిపించారంటే నవ్వుల జల్లులే. వారిద్దరూ కలిసి సుమారు 60కి పైగా చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. ఆ కాంబినేషన్ ఉంటే సినిమా మినిమమ్ హిట్టే అనే ముద్ర ఇండస్ట్రీలో ఏర్పడింది. కోట, రుక్మిణీ దేవి దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. ఆయన తనయుడు కోట ప్రసాద్ కొన్ని సినిమాల్లో నటించారు. అయితే 2010 జూన్ 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రసాద్ మృతి చెందడంతో కోట తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు.

విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా...

రాజకీయాల పరంగా బీజేపీ అంటే కోటకు అభిమానం. అలాగే దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అంటే చాలా ఇష్టం. ఆయన సూచన మేరకు బీజేపీ అభ్యర్థిగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. 1999 నుంచి 2004 వరకు శాసనసభ్యుడిగా పని చేశారు. ఎమ్మెల్యే అయినప్పటికీ నటనకు దూరం కాలేదాయన. ఓ వైపు ప్రజా ప్రతినిధిగా బిజీగా ఉంటూనే మరోవైపు సినిమాలు కూడా అంతే బిజీగా చేశారు.

అవార్డులివీ..

కోట శ్రీనివాసరావు నట జీవితంలో తొమ్మిది నంది అవార్డులు అందుకున్నారు. 'ప్రతిఘటన'(1985) సినిమాకి తొలి నంది అవార్డు సొంతం చేసుకున్నారాయన. ఆ తర్వాత గాయం(1993), తీర్పు(1994), లిటిల్ సోల్జర్స్(1996), గణేష్(1998), చిన్న(2000), పెళ్లైనకొత్తలో(2006), ఆ నలుగురు (2004), పృథ్వీ నారాయణ (2002) సినిమాలకు నంది పురస్కారాలు అందుకున్నారు. అదేవిధంగా 2015 లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్నారు.

ప్రముఖుల సంతాపం

అద్భుతమైన నటనతో తరతరాలుగా కోట శ్రీనివాసరావు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన మృతి బాధాకరం. ఆయన మరణం సినీ రంగానికి తీరని లోటు. సినీ ప్రతిభ, బహుముఖ ప్రజ్ఞకు ఆయన చిరకాలం గుర్తుండిపోతారు. సామాజిక సేవలో కూడా ఆయన ముందంజలో ఉన్నారు. పేదలు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడానికి కృషి చేశారు. **-నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి**

కోట శ్రీనివాస రావు మరణం నన్ను కలచివేసింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. అద్భుతమైన నటనతో అనేక అవార్డులు, లెక్కలేనన్ని గుర్తింపుల తోపాటు నిస్వార్థమైన ప్రజాసేవకు పద్మశ్రీ అవార్డు కూడా అందుకున్నారు. ప్రజల గుండెల్లో, దేశ సినీ చరిత్రలో ఎన్నటికీ చెరిగిపోని స్థానం సంపాదించుకున్నారు.
-అమిత్ షా, కేంద్ర హోం శాఖ మంత్రి

తెలుగు చిత్ర పరిశ్రమకు కోట శ్రీనివాసరావు లేని లోటు తీర్చలేనిది. వైవిధ్యభరితమైన నటనతో భారత చలనచిత్ర పరిశ్రమపై చెరగని ముద్ర వేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేస్తున్నా.
-జిష్ణుదేవ్ వర్మ, గవర్నర్

కోట శ్రీనివాస రావు భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన పోషించిన విభిన్న పాత్రలతోం తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు తీవ్ర సానుభూతి వ్యక్తంచేస్తున్నా.
-ఎ.రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

విభిన్న పాత్రలను పోషించి, ప్రేక్షక హృదయాల్లో తన స్థానాన్ని పదిలపరుచుకున్న విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు. ఆయన మరణంతో సినిమా రంగం ఒక గొప్ప నటున్ని కోల్పోయింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.
-కేసీఆర్, మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత

కోట శ్రీనివాసరావు తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఆయన ఎన్నో అద్భుతమైన పాత్రలతో తెలుగు ప్రేక్షకులను అలరించారు. ఆయన మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. వారి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.
-వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు

విలక్షణ నటుడిగా, అసాధారణ పాత్రధారిగా తనదైన ముద్ర వేసిన కోట శ్రీనివాసరావు మరణం ఆవేదన కలిగించింది. విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హాస్య నటుడిగా ఆయన పోషించిన విభిన్న పాత్రలు చిరస్థాయిగా నిలిచిపోతాయి.
-కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్


నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో 750కి పైగా చిత్రాల్లో ప్రేక్షకులను మెప్పించిన కోట శ్రీనివాసరావు విలక్షణ నటుడు. చిరస్మరణీయమైన పాత్రల ద్వారా ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా.
-హరీశ్‌రావు, మాజీ మంత్రి


పద్మశ్రీ కోట శ్రీనివాసరావు ఇక లేరనే వార్త ఎంతో కలచివేస్తుంది. కోట శ్రీనివాసరావు తెలుగు సినీ రంగానికి అపూర్వ సేవలందించారు. భారత సినీ పరిశ్రమలో ఆయన ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు.
-మహేశ్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ అధ్యక్షుడు

కోట మృతి పట్ల త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి, ఎంపీ కె.లక్ష్మణ్ రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు.

యూకేకు శ్రీమంతుల గుడ్‌బై

ఒకదేశంలోని సంపన్నులు ఆ దేశాన్ని వీడి ఇతర దేశానికి ఎందుకు వెళ్లిపోతారు? వ్యాపార విస్తరణ, ఉన్న దేశంలో అధిక పన్నులు, ప్రభుత్వంవైపు నుంచి ఇబ్బందులు.. తదితర కారణాలతోనే కదా. అలా 2023లో అత్యధిక కుబేరులు యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి వెళ్లిపోయారు. 2025లో ఈ సంఖ్య రికార్డు స్థాయిలో 16,500 వరకు ఉండొచ్చట. ఈ జాబితాలో భారత్ కూడా ఉండటం విశేషం. మనదేశం నుంచి 2023లో 6,500 మంది వెళ్లిపోయారు. 2025లో ఈ సంఖ్య 3,500 వరకు ఉండొచ్చని అంచనా. (ఈ జాబితాలో సంపన్నులు అంటే సుమారు రూ.8.5 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ మొత్తం పెట్టుబడి పెట్టగలిగే మొత్తం ఉన్నవారు)






ప్రస్తుతం ప్రపంచంలో సగానికిపైగా చమురు నిల్వలు నాలుగు దేశాల్లోనే ఉన్నాయి. ప్రపంచంలో అత్యధిక చమురు నిల్వలు ఉన్న దేశం వెనెజులా. **టాప్ - 10 దేశాల్లో అమెరికా 9వ స్థానంతో సరిపెట్టుకుంది.**

ఆధారం: పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ (ఒపెక్)

టాప్ – 8 గోల్కొండ కోట

దేశంలో ఇప్పటికీ అత్యధికులకు సందర్శనకు ఇష్టమైన ప్రదేశం తాజ్‌మహల్. 2025 జనవరి – మార్చి త్రైమాసికంలో దేశీయ పర్యాటకులు అత్యధికంగా సందర్శించింది తాజ్‌నే. దాని దరిదాపుల్లో మరేవీ లేవు. దేశీయ పర్యాటకులు అత్యధికంగా సందర్శించిన టాప్ – 10 ప్రదేశాల జాబితాలో హైదరాబాద్‌లోని గోల్కొండ కోట 8వ స్థానంలో నిలిచింది.



\- సాక్షి స్పెషల్ డెస్క్

యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ



యాదగిరిగుట్ట: ఆదివారం సెలవు కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు యాదగిరి క్షేత్రానికి తరలివచ్చారు. దీంతో శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి మూడు గంటలకు పైగా, వీఐపీ దర్శనానికి గంటకు పైగా సమయం పట్టింది. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.53,64,989 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

పార్లమెంట్ సమావేశాల్లో వ్యూహంపై చర్చ

రేపు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ భేటీ

న్యూఢిల్లీ: రానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఈ నెల 15వ తేదీన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం కానుంది. చైర్‌పర్సన్ సోనియా గాంధీ అధ్యక్షతన ఆమె 10 జన్‌పథ్ నివాసంలో భేటీ జగనుంది. ఇందులో రాజ్యసభ, లోక్‌సభల్లో ప్రతిపక్ష నేతలుగా ఉన్న మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలతోపాటు ఉభయ సభల ఉప నేతలు, పార్టీ చీఫ్ విప్‌లు, విప్‌లు పాల్గొంటారు. కొందరు సీనియర్ నేతలు కూడా పాలుపంచుకుంటారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఆగస్ట్ 21 వరకు పార్లమెంట్ సెషన్ కొనసాగనుంది. ఆపరేషన్ సిందూర్‌తోపాటు బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ తదితర అంశాలపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విరుచుకుపడే అవకాశాలు కన్పిస్తున్నాయి. బిహార్ ఓటరు జాబితా సవరణను సవాల్ చేస్తూ కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్షాలు సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెల్సిందే. ఈసీ చర్య రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అదేవిధంగా, ఆపరేషన్ సిందూర్ సమయంలో మోదీ ప్రభుత్వం అనేక తప్పిదాలకు పాల్పడి, దేశానికి నష్ట కలిగించిందని కాంగ్రెస్ విమర్శిస్తోంది. అంతేకాదు, భారత్-పాక్ మధ్య అణు యుద్ధం ప్రమాదం తన జోక్యంతోనే తొలగిందంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే ప్రకటనలు చేయడంపైనా ప్రభుత్వంపై విరుచుకుపడుతోంది. పై అంశాలపై ప్రభుత్వం నుంచి సమాధానాలకు కాంగ్రెస్ పార్లమెంట్‌లో పట్టుబట్టే ఛాన్సుంది. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రమూకల దాడి, అమెరికా టారిఫ్‌లు వంటి వాటిపైనా ఇండియా కూటమి చర్చకు ప్రభుత్వాన్ని నిలదీస్తాయని భావిస్తున్నారు. కాంగ్రెస్ వ్యూహం ఖరారైతే ఇతర ప్రతిపక్షాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణను రూపొందించే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాలు అంటున్నాయి.

లారీ బోల్తా.. 9 మంది బలి


మరో 13 మందికి తీవ్రగాయాలు

- క్షతగాత్రుల్లో ఇద్దరు చిన్నారులు
- అన్నమయ్య జిల్లా రెడ్డిపల్లె చెరువు కట్టపై ఘోర ప్రమాదం

ఓబులవారిపల్లె/పుల్లంపేట: అన్నమయ్య జిల్లాలో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెడ్డిపల్లె చెరువుకట్టపై లారీ బోల్తాపడి 9 మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో ఐదుగురు మహిళలు ఉండగా.. నలుగురు పురుషులు. ఈ దుర్ఘటనలో మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో ఇద్దరు చిన్నారులు సైతం ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. శెట్టిగుంట ఎస్టీ కాలనీకి 22 మంది కూలీలు ఐషర్ వాహనంపై రాజంపేట ఇసుకపల్లి గ్రామానికి మామిడి కాయల్ని కోసి, లారీలో లోడ్ చేసేందుకు వెళ్లారు. మామిడి కాయల్ని లోడ్ చేసిన అనంతరం అదే లారీపై రైల్వేకోడూరు మామిడి మార్కెట్ యార్డుకు బయలుదేరారు. లారీ రెడ్డిపల్లి చెరువుకట్టపైకి రాగా మలుపు వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి బోల్తా కొట్టింది. ప్రమాదంలో గజ్జల దుర్గయ్య, గజ్జల వెంకటేశు, గజ్జల శ్రీను, గజ్జల రమణ, సుబ్బరత్నమ్మ, చిట్టెమ్మ, గజ్జల లక్ష్మీదేవి, రాధా, వెంకట సుబ్బమ్మ మృత్యువాతపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ 13 మంది కూలీలను 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ రామ్‌నాథ్ కార్గే పరిశీలించారు. వీరంతా రెక్కాడితే గానీ డొక్కాడని రోజు కూలీలే.



బోల్తాపడ్డ వాహనం



మామిడికాయలను తొలగించి, మృతదేహాలను తీస్తున్న పోలీసులు

లారీ ప్రమాదంపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని పుల్లంపేట మండలం రెడ్డిపల్లి చెరువు కట్టపై ఆదివారం రాత్రి మామిడి కాయల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడిన ఘటనపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో సెట్టిగుంట ఎస్టీ కాలనీకి చెందిన తొమ్మిది మంది చనిపోవడం, 13 మంది తీవ్రంగా గాయ పడటం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరంతా నిరుపేదలని, మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించడంతో పాటు వారిని కూడా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 14-7-2025


పద్మశ్రీ అందుకుంటూ...

నివాళి

'శివ'లో అతను మాచిరాజు
'అతడు'లో బాజిరెడ్డి
పవర్‌జోన్‌లో అలాంటివాడుంటాడు - కోటలాగా.
'అహ నా పెళ్ళంట'లో భిక్షపతి
'ఆమె'లో అంతకంటే పిసినారి
ప్రతి వీధిలో ఉంటాడు - కోటలాగే.
'భద్రం బీ కేర్‌ఫుల్ బ్రదరూ'...
'మందుబాబులం మేము మందుబాబులం'...
మిడిల్‌క్లాస్ పార్టీల్లో పెగ్గుపెగ్గుకొక కోట...
ఆ సినిమాలో తండ్రి... ఈ సినిమాలో తాతా...
'చెబాష్... చెబాష్... చెబాష్'
ఉత్సాహపరిచే బాబాయ్...
తెలుగు తెరపై ఆల్‌రౌండర్ కోట.
1985 'ప్రతిఘటన' నుంచి
2015 'సన్నాఫ్ సత్యమూర్తి' వరకు
ప్రేక్షకుల హృదయాలను గెలుస్తూనే ఉన్నాడు.
దిగంతాలకేగినా నేలన మిగిలిపోయాడు.


కోట శ్రీనివాసరావు

సకల సినీ పాత్రలకు పెట్టని కోట

కోట శ్రీనివాసరావు తన ముఖంతో కంటే ముందు తన మాటతో ప్రేక్షకులకు తెలిశారు.

అవును.

'ప్రతిఘటన' సూపర్ హిట్ అయ్యాక వెంటనే డైలాగులు మార్కెట్‌లోకి క్యాసెట్లుగా వచ్చేశాయి. అప్పటికి ఆ సినిమా చాలా ఊళ్లకు వెళ్లనే లేదు. ఈలోపు క్యాసెట్లలో డైలాగులు వినసాగారు జనం. అందులో తెలంగాణ భాషలో పాత్ర మాట్లాడే ఒక పాత్ర వారిని ఆశ్చర్యపరిచి కొత్తగా అనిపించింది. మూసకట్టు తెలుగు సినిమాల్లో తెలంగాణ మాటను ఆ మాత్రమైనా పలికించినవారు అప్పటి వరకూ లేరు. ఏడడిగినా 'పైకమిటీని అడిగి జెప్తా' అనే పాత్ర ఆ నటుడికి జన సామాన్యంలో మొదటిసారి గుర్తింపు తెచ్చింది. అందరూ ఆ నటుడిది తెలంగాణ అయి ఉంటుందని అనుకున్నారు.

కాదు... కంకిపాడు.

•••

చిరంజీవి, కోట శ్రీనివాసరావు ఒకే సినిమాతో సినీ రంగ ప్రవేశం చేశారు.

'ప్రాణం ఖరీదు'. 1978.

కాని 1985 వరకూ కోటకు మళ్లీ సినిమాలు చేసే వీలు రాలేదు. బ్యాంకు ఉద్యోగమూ... బాధ్యతలూ... నాటకాలూ. అయితే నాటకాలు వేసే వారు సినీ దర్శకుల కంట పడటం సులభం. క్రాంతి కుమార్, టి. కృష్ణ, జంధ్యాల అలా అవకాశాలు ఇచ్చినవారే. టి. కృష్ణ 'ప్రతిఘటన'లో రాజకీయ నాయకుడి వేషం వేయిస్తే 'బాబాయ్ అబ్బాయ్'లో అప్పులిచ్చి బాలకృష్ణ, సుత్తి వీరభద్రరావుల వెంటపడే గ్యాంగులో ఒకడిగా చూపించారు జంధ్యాల. అయితే సినిమాలో కోటకు ఆ అప్పు తిరిగి రాకపోగా పులి మీద పుట్రలా నిర్మలమ్మ మనవరాలైన పావలా శ్యామల పెళ్లి చేసుకోమని వెంటపడుతుంటుంది. రెండు పాత్రలూ నవ్వించేవే. అందుకే 'అహ నా పెళ్ళంట'లో పిసినారి పాత్రకు కోట గుర్తుకు వచ్చారు రామానాయుడుకు. వాస్తవానికి ఆ పాత్ర రావు గోపాలరావు వేయాలి. కోటకు రాసి పెట్టి ఉంది. 'నాకేంటి' అని కోట ప్రేక్షకులను చూస్తూ అరచేతిలో అరచేతితో తాళం వేస్తే ప్రేక్షకులు ఎంతెంత ఇచ్చారనీ. ఇప్పటి వరకూ... ఇకపైనా.. అభిమానం!

•••

కోటది నాగభూషణం స్కూలు. సీరియస్ విలన్‌లుగా రాణించిన కైకాల, రావు గోపాలరావుల అంశ కోటలో ఉన్నా కోట ఎప్పటికీ వారిలా సీరియస్ విలన్‌గా పండలేదు. కామెడీ



టచ్ ఉంటే చెలరేగుతారు. నాగభూషణం కూడా అంతే. అందుకే కోటలో నాగభూషణం మేనరిజమ్స్ కనిపిస్తాయి. నాగభూషణాన్ని ఇన్‌స్పైర్ చేసిన తమిళ నటుడు ఎం.ఆర్. రాధ బాడీ లాంగ్వేజ్ మాట విరుపు కూడా కోటలో ఉన్నాయి. మాటను నెమ్మది చేసి పెంచడం ఎం.ఆర్. రాధ స్టయిల్. నాన్ సీరియస్‌గా కనిపించే సీరియస్ విలన్. 'శత్రువు'లో కోడి రామకృష్ణ కోటను సీరియస్ విలన్‌గానే చూపిద్దామనుకున్నారు. కాని 'ఈ హోటల్‌లో జలపాతాలు ఎవరు పెట్టార్రా బాబూ'... అని చేతులు నెత్తి మీద వేసుకుంటే ప్రేక్షకులు భయపడుతూనే నవ్వారు. 'థ్యాంక్స్' అనే అతని మేనరిజమ్‌ని ఫాలో అయ్యారు.

•••

తమిళంలో గౌండర్ మణి, సెంథిల్ ద్వయం చేస్తున్న కామెడీకి తెలుగు రిప్లికాగా కోట, బాబూ మోహన్ తయారు కావడం సినిమాల సక్సెస్‌కు కారణమైంది. 'మామగారు' (1990)లో మొదలైన ఈ కామెడీ దాదాపు పదేళ్లు ఒక ఊపు ఊపింది. కోట సెట్స్ మీద మాటలు పేల్చడంలో ఘనులు. 'కథలు లేక తెలుగు సినిమా కదల్లేకపోతోంది' అనేవారాయన. కథలు లేక వరుసపెట్టి సాగిన తమిళ రీమేకుల్లో కోటకు పాత్రలు దొరుకుతూ వెళ్లాయి. అంతే కాదు ఆయన తన అద్భుతమైన టైమింగ్‌తో గౌండర్ మణి, మణివణ్ణన్, రాధా రవి... తదితరుల పాత్రలకు డబ్బింగ్ చెప్పి సినిమాలు హిట్ కావడానికి కారకులు అయ్యారు. 'ఒకే ఒక్కడు', 'ప్రేమలేఖ' సినిమాల్లో మణివణ్ణన్‌కు కోట డబ్బింగ్ చెప్పిన తీరు ఆ రంగంలో కృషి చేసేవారు తప్పక పరిశీలించదగ్గది.

•••

దర్శకులే ఆర్టిస్టులను తయారు చేస్తారు. కోటకు ఆ సంగతి తెలుసు. నేను డైరెక్టర్ల ఆర్టిస్టును అని అంగీకరించేవారు. కోట కెరీర్‌లో ఇద్దరు ముగ్గురు దర్శకులు చాలా ముఖ్యపాత్ర పోషించారు. జంధ్యాల ఎలాగూ సరే. కాని జంధ్యాల శిష్యుడుగా రంగప్రవేశం చేసిన ఇ.వి.వి. సత్యనారాయణ కోటను తన సినిమాలకు ముఖ్య బలంగా చేసుకున్నారు. 'సీతారత్నంగారి అబ్బాయి'తో మొదలైన ఈ కాంబినేషన్ ఇ.వి.వి. చివరి సినిమా వరకూ కొనసాగింది. '420'లో కోటతో చేయించిన ఎస్.ఐ. పాత్రను 'హలో బ్రదర్'లో రిపీట్ చేసి ఎస్.ఐ. తాడి మట్టయ్య పాత్రను గుర్తుండిపోయేలా చేశారు. ఇ.వి.వియే కోటను వెంకటేశ్‌కు తండ్రిలా చూపించే సాహసం చేసి 'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు'ను సూపర్ హిట్ చేశారు. కోట ఆ పాత్రను అలవోకగా నమిలేశారు. ఇ.వి.వి.యే కోటను 'మా నాన్నకు పెళ్లి' సినిమాలో తాత పాత్రకు ప్రమోట్ చేశారు. ఇక 'జంబలకిడి పంబ'లో కోటను ఎవరు మరువగలరు? షాట్ మొదలుకావడమే తలకు తుండు ముడి వేసి తులసికోట చుట్టూ తిరుగుతుంటారు. ఇక కోట.. బ్రహ్మానందంల మధ్య సాగే లాంఛనాల డైలాగులు అందరికీ కంఠోపాఠమే. కోట అడిగిన మగపడుచు లాంఛనాలకు బ్రహ్మానందం జవాబు 'అర్ధ నూట పదహార్లు... రెండు జబ్బల బనీన్లు. ఒక కరీం బీడీ కట్ట'....

ఇ.వి.వితో సమాంతరంగా ఎస్.వి. కృష్ణారెడ్డి కూడా కోటకు వరుసగా పాత్రలు ఇస్తూ వెళ్లారు. 'రాజేంద్రుడు గజేంద్రుడు', 'శుభలగ్నం', 'మాయలోడు'... ఇక 'వినోదం' సినిమా కోట చుట్టూనే తిరుగుతూ వినోదాన్ని పంచింది.

•••

'హోల్డర్‌లో దూరడం ముఖ్యం కాదు... స్విచ్ వేస్తే వెలగాలి'... అని కోట తరచూ చెప్పేమాట. అవకాశాల కోసం సినిమా ఇండస్ట్రీలో తిరిగేవారు తమలో ఎంత ప్రతిభ ఉందో గుర్తెరిగి ప్రయత్నించాలని అనేవారాయన. రికమండేషన్లు పాత్ర పట్టడానికి పనికి వస్తాయి గాని కెమెరా ముందు రికమండేషన్లు పని చేయవు. స్వయంగా వెలగాల్సిందే. ఆ వంకన చూస్తే మొదలు నుంచి తుది వరకు కోట స్విచ్ వేసిన ప్రతిసారి వెలుగుతూనే ఉన్నారు. ఒకో సందర్భంలో ఒకో పాత్ర... ఒకో మెరుపు. 'గాయం' సినిమాలో రేవతి 'మీరేమంటారు?' అనడిగితే 'ఖండిస్తున్నాం' అంటాడు కోట. చిన్న సీన్. పెద్ద హిట్. 'మనీ' సినిమాలో శుభలేఖ ఇస్తే ఇచ్చినవాడి మీద జాలిపడుతూ 'కార్డ్ ప్రింటెడ్' అంటూ పలికించిన కామెడీ బ్యాచిలర్ పార్టీలలో నేటికీ వినపడుతూనే ఉంటుంది. 'సంతోషం' సినిమాలో హింస రాజుగా ఒకటి రెండు సీన్లు... భలే. ఈ కోటే 'గణేశ్' సినిమాలో అత్యంత భయంకరమైన విలనీని ప్రదర్శించారు. కోట విలన్‌గా చేసిన పాత్రల్లో ఇది వేసినంత గట్టి ముద్ర మరొకటి వేయలేదు. 'జయమ్ము నిశ్చయమ్మురా'లో 'ఎన్టీవోడు గద పిసుకుతుండు' అని బ్రహ్మానందం ప్రాణం తీస్తాడు పటేల్ పాత్రలో ఉన్న కోట. ఇక వంశీ తీసిన 'శ్రీ కనక మహాలక్ష్మి డాన్స్‌ట్రూప్'లో హీరోయిన్‌ని నాటకాలకు పంపమని నిర్మలమ్మను అడిగేందుకు కోట వెళ్లి 'లవకుశ' సినిమాలోని పాట పాడటం, నిర్మలమ్మ చీపిరి తిరగేయడం మరో భాషలో మరో నటుడి మీద కుదరని కామెడీ. ఇలా నవ్వించిన కోట 'లిటిల్ సోల్జర్స్'లో చాలా సీరియస్‌గా ఉండే మేజర్‌గా కనిపించడం, పిల్లలకు ధైర్యం ఇవ్వడం మరువగలమా? 'ఆ నలుగురు', 'ఫ్యామిలీ సర్కస్', 'నా ఎదవ తనం ముందు నీ ఎదవతనం ఎంత' అని కొడుకు శ్రీహరిని ఊరడించే తండ్రిగా 'బావగారూ... బాగున్నారా', 'అన్నయ్య'లో సీనియర్ లారీ క్లీనర్‌గా 'చెబాష్ చెబాష్ చెబాష్' అనే మేనరిజమ్ కోటను పదే పదే గుర్తు చేసేవే. 'సడక్'లో సదాశివ్ అద్భుతంగా చేసిన హిజ్రా పాత్రను 'రెండిళ్ల పూజారి'లో కోట అంతే అద్భుతంగా చేయగలిగారు. కెరీర్ పీక్‌లో ఉండగా అలాంటి పాత్ర చేయడం రిస్క్. దానిని దాటారు కోట.

ఈ కోట శ్రీనివాసరావే కొడుకు మీద లోలోన ఎంతో ప్రేమ పెట్టుకుని పైకి కఠినంగా ఉండే తండ్రిగా 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే'లో ఎంత బాగా నటించారు!

•••

కోట అసలు సిసలు తెలుగు నటుడు. ఆయన ఇతర భాషల్లో హిట్ అయినా ఆయన ముఖం, మాట, నటన, నడక అన్నీ తెలుగువే. అందుకే ఆయన పరాయి భాష నటుల మీద ఒకోసారి నిరసన చూపినా... లోకల్ టాలెంట్‌కు అవకాశాలు ఇవ్వాలని 2003 ప్రాంతంలో హైదరాబాద్‌లో నిరాహార దీక్షకు కూచున్నా తెలుగు మమకారమే కారణం. 'మండలాధీశుడు' సినిమాలో నటించడం వల్ల చాలా కాలం ఆయన ఇండస్ట్రీలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే యాక్సిడెంట్‌లో కుమారుణ్ణి పోగొట్టుకుని పుట్టెడు దుఃఖం మూటగట్టుకున్నారు. వయసు, డయాబెటిస్ ఆయనను ఇంటికే పరిమితం చేశాయి గానీ ఆయన తన మాటను వెలిగిస్తూనే వెళ్లారు.

'శ్రీమతితో, షుగర్‌తో జాగ్రత్తగా ఉండాలి. శ్రీమతిని బాగా చూసుకోకపోతే ఆమె వెళ్లిపోతుంది. షుగర్‌ను బాగా చూసుకోకపోతే మనం వెళ్లిపోతాం' అని జోక్ చేసేవారాయన.

రామ్‌గోపాల్ వర్మ, త్రివిక్రమ్ శ్రీనివాస్ వంటి అతి కొద్ది మంది దర్శకులు ఆయనలోని భిన్నమైన నటుణ్ణి వెలికి తీసే పాత్రలు ఇచ్చారు. కోట చాలా గొప్పగా చాలా పాత్రలు చేసినా ఆయనకు చాలెంజ్ విసిరే పాత్రలు ఇంకా దొరకాల్సింది.

కోట వంటి ఆల్‌రౌండర్ నటుడు అరుదు.

ఆ మేలిమి నటుడికి నివాళి.

– కె.



'అహ నా పెళ్ళంట'లో కోట న్యూస్‌పేపర్‌ను లుంగీలా కట్టుకోవడం, కోణ్ణి వేళాడగట్టి అదే చికెన్ కర్రీ అని ఉత్తన్నం తినేయడం, వర్షం రాకపోయినా, గేదె ఎక్కువ పాలివ్వకపోయినా బ్రహ్మానందం జీతంలో కోత విధించడం... బ్రహ్మానందం కోటను చూసి 'వీడూ వీడి మొహమూనూ' అని తిట్టుకుంటూ ఉంటే 'ఆ మొహానికేమి మాకు నచ్చింది' అని సాకారు ప్రేక్షకులు ముద్దుగా.



మా ఇద్దరి నటప్రస్థానం 'ప్రాణం ఖరీదు' సినిమాతో ప్రారంభమైంది. వ్యక్తిగతంగా ఆయన చేసే చమత్కారాలు, చెప్పే జోకులు కానీ... అవి ఉత్సాహపరుస్తాయి. షూటింగ్ ఉందంటే ఇవాళ కోటగారు ఉంటారు... బాగుంటుందనే ఉత్సాహంతో వెళ్లేవాళ్లం. ఆయన చేయలేని క్యారెక్టర్, చేయని క్యారెక్టర్, మాట్లాడని యాస, మాండలికాలు లేవనే చెప్పాలి. అంతటి పరిపూర్ణమైన నటన. ఆయనలా విలక్షణమైన, వైవిధ్యమైన నటులు మళ్లీ వస్తారని నేను అనుకోవడం లేదు. అలాంటి నటులు దొరకరేమో... ఉండరేమో కూడా.

– చిరంజీవి

ప్రియమైన కోట... మిమ్మల్ని ఇకపై చాలా మిస్ అవుతాము. మీ ప్రతిభ, మీ ఉనికి, మీ మంచి మనసును ఎప్పటికీ మర్చిపోలేము. మాటల్లో చెప్పలేని దుఃఖం కలుగుతోంది.

– మంచు మోహన్‌బాబు

నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో విలక్షణ పాత్రలు పోషించిన కోట శ్రీనివాసరావుగారు తెలుగు ప్రేక్షకుల గుండెల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తన విలక్షణ నటనతో ఎన్నో పాత్రలకు జీవం పోశారు. ఇతర భాషల్లోనూ నటించి, మెప్పించిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఎమ్మెల్యేగా ఆయన ప్రజాసేవతోనూ మంచి నాయకుడిగా పేరు సంపాదించుకున్నారు.

– నందమూరి బాలకృష్ణ

ప్రియమైన కోటగారు... ఎన్నో జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయి. మీ ప్రేమ, ఆప్యాయత, మీ చతురత, మీ ప్రతిభ భర్తీ చేయలేనివి.

– నాగార్జున

తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలోనే విలక్షణ నటుడు. వ్యక్తిగతంగానూ నాకు నష్టమే. 'ఇంట్లో ఇల్లాలు... వంటింట్లో ప్రియురాలు, శత్రువు, గణేష్, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే'... ఇలా ఎన్నో సినిమాలు చేశాం. మా సురేష్ ప్రొడక్షన్స్‌లోని ప్రతి సినిమాలో కోటగారు చేసేవారు. మా నాన్నగారు డి. రామానాయుడు, నా సోదరుడు సురేష్ బాబు, రానాలకూ కోటగారితో మంచి జ్ఞాపకాలు ఉన్నాయి.

– వెంకటేశ్

ప్రముఖుల నివాళి

కోట శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకోవడంతో పాటు కోట కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని పలువురు చిత్రరంగ ప్రముఖులు వ్యక్తం చేశారు.

ఏ అభిప్రాయాన్ని అయినా నిర్మొహమాటంగా చెప్పే వ్యక్తి కోటగారు. నా మొదటి సినిమా 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' నుంచి 'అత్తారింటికి దారేది'... వరకు నాకు ఆయనతో మంచి అనుబంధం ఉంది. 'అత్తారింటికి దారేది' సినిమా సమయంలో మీరు కాస్త ఇబ్బంది పడుతున్నారంటే, కష్టాలను అధిగమించడానికి నటనే నాకు మరుపు అని చెప్పేవారు. ఆ మాట నన్ను చాలా కదిలించింది. ఎంత మంది గొప్ప నటులు ఉన్నా ఆయనది విశిష్టమైన శైలి. కోట శ్రీనివాసరావు – బాబుమోహన్‌గార్ల కాంబినేషన్‌ని మేం విపరీతంగా ఎంజాయ్ చేసేవాళ్లం. – పవన్ కల్యాణ్

కోట శ్రీనివాసరావుగారిని చూస్తూ, ఆరాధిస్తూ, ఆయన్నుంచి నేర్చుకుంటూ పెరిగాను. కోట బాబాయ్ మా ఫ్యామిలీ మెంబర్ లాంటివారు. ఆయనతో నేను కలిసి పని చేసిన క్షణాలు నాకు మంచి జ్ఞాపకాలు. – రవితేజ

కోట శ్రీనివాసరావుగారి మరణవార్త విని చాలా బాధపడ్డాను. ఆయన సినిమాలు చూస్తూ, ఆయన్నుంచి నేర్చుకుంటూ పెరిగిన వారికి కోటగారు దూరం కావడం వ్యక్తిగత నష్టంలా అనిపిస్తుంది. – మహేశ్‌బాబు

యాక్టింగ్ ఇండస్ట్రీకి, నటనకి నిలువెత్తు రూపం కోట శ్రీనివాసరావుగారు. ఆయన ఒక్కరే. ఇంకో కోటాగారు మళ్లీ పుట్టరు... మళ్లీ రారు. అందుకే నేను అందరికీ విజ్ఞప్తి చేసేది ఏంటంటే... ఈ రోజు మనకు ఉన్న మాధ్యమాల్లో ఆయన మనకు మిగిల్చి వెళ్లినటువంటి ఎన్నో అద్భుతమైన పాత్రలు, చిత్రాలు ఉన్నాయి. లెట్స్ సెలబ్రేట్ కోటాగారు. అందరికీ నా విజ్ఞప్తి. ఆయన మనల్ని ఎంతగా రంజింపచేశారో ఆ అనుభూతులుంటాయి. ఆయన ఎక్కడున్నా ఆ చల్లని చూపు మనందరిపై ఉండాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

– ఎన్టీఆర్

కోట శ్రీనివాసరావుగారిలాంటి విలక్షణ నటుడిని సినీ పరిశ్రమ కోల్పోయింది. మన హృదయాల్లో నిలిచిపోయేలా, ఆయన పోషించిన అద్భుతమైన పాత్రలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి – రామ్‌చరణ్

కోట శ్రీనివాసరావుగారి గురించి హృదయ విదారక వార్త విని ఇప్పుడే మేల్కొన్నాను. మీ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేని బహుముఖ ప్రజ్ఞాశాలి మీరు. మిమ్మల్ని మిస్ అవుతున్నాము కోటగారు. మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులకు నా సానుభూతి. – అల్లు అర్జున్

కోట శ్రీనివాసరావుగారు అసమాన ప్రతిభావంతుడు. సీరియస్ రోల్ అయినా, విలన్ రోల్ అయినా, కామెడీ రోల్ అయినా... ఇలా పోషించిన ఏ పాత్రకైనా ప్రాణం పోశారు. ఆయన సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయనతో చాలా సినిమాల్లో కలిసి పని చేసే అదృష్టం నాకు కలిగింది. ఆయన కళ, ఆయన నవ్వు, ఆయన పోషించిన పాత్రలు సజీవంగా ఉంటాయి. – విష్ణు మంచు

కోట శ్రీనివాసరావుగారు మాకు ఒక యాక్టర్‌గా కన్నా కూడా మా కుటుంబ సభ్యుడు. మా నాన్నగారు సినిమాలు చేస్తున్నప్పటి నుంచి సెట్స్‌లో ఆయన్ను చూశాను. అలాగే నా తొలి సినిమా 'అల్లరి'లో నా ఫాదర్‌గా చేశారు. మేం ఇద్దరం దాదాపు 40–50 సినిమాల వరకు కలిసి పని చేశాం. – 'అల్లరి' నరేశ్

సినీపరిశ్రమలో ఉన్న కొద్దిమంది గొప్ప నటుల్లో కోట శ్రీనివాసరావుగారు ఒకరు. ఆయన నటనతో నా సినిమాలు 'శివ, గాయం, మనీ, సర్కార్, రక్తచరిత్ర'లు మరింత ప్రభావితం అయ్యాయి. కోట శ్రీనివాసరావుగారూ... మీరు ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయి ఉండొచ్చు... కానీ మీ పాత్రలు జీవించే ఉంటాయి – రామ్‌గోపాల్ వర్మ



50 ఏళ్ల సహచర్యం మాది. కోటగారు సినిమాల్లోకి వెళ్లక ముందు నుంచి నాకు పరిచయం. నాటకాల నుంచి పరిచయం. ఆయనతో కలిసి నాటకాలు వేసిన వాడిని నేను. సినిమా యాక్టర్ అవుదామని ఆయన అనుకోలేదు. కోటగారి నేచర్ ప్రకారం ఆయన మాట కటువుగా ఉండేది. యావత్ భారతదేశం ఆయన్ను నటుడిగా గుర్తించింది. అనుకున్నది సాధించాడు. కోట శ్రీనివాసరావుగారి స్థానాన్ని ఎవరూ పూరించలేరు. మాకు కూడా కొన్ని వేల, వందల అనుభూతులను మిగిల్చిన కోట ఇవాళ కూలిపోయింది

- తనికెళ్ల భరణి







కోట శ్రీనివాసరావుగారి మరణవార్త నన్ను ఎంతగానో బాధించింది. నటనలో నిష్ణాతుడు. పోషించిన ప్రతి పాత్రకు ప్రాణం పోసిన లెజెండ్. వెండితెరపై ఆయన లేని లోటు భర్తీ చేయలేనిది.

– ఎస్ఎస్ రాజమౌళి

ఓ చరిత్ర ముగిసిపోయింది. అంత గొప్ప నటుడిని కెమెరా వెనకాల నుంచి చూసే అదృష్టం చాలాసార్లు కలిగింది నాకు. ఆయనతో పని చేసే అవకాశం దొరికింది. వ్యక్తిగతంగానూ ఆయనతో మంచి అనుబంధం ఉంది. షూటింగ్ లేని సమయాల్లో కూడా ఆయనతో మాట్లాడుతూ ఉండేవాడిని.

– త్రివిక్రమ్

కోటన్న, నేను సినిమాల్లోనే కాదు... విడిగా మాట్లాడుకుంటున్నప్పుడు కూడా సినిమాల్లో ఎలా ఉండేవో అలాగే సెటైర్స్ ఉండేవి. మొన్న ఫోన్ చేస్తే... 'ఎక్కడున్నావ్ రా... ఎప్పుడొస్తావ్ రా' అంటే.. 'రేపు వస్తా'నని అన్నాను. బాగా మాట్లాడాడు. 'హా.. చాల్లేవోయ్'... ఇలా మా తరహా మాటల్లోనే మాట్లాడారు. 'షాట్ సిద్ధమైంది అన్నా... మరలా చేస్తా'నని చెప్పి, మళ్లీ ఫోన్ చేస్తే, పడుకున్నారు. ఇంటికి వెళితే సంతోషపడేవాడు. 'రారా.. చాలా బోర్ కొడుతోంది' అనేవారు. ఎన్నోసార్లు ఒకే ప్లేట్‌లో భోజనం చేశాం. మాటలకందని సందర్భాలు ఎన్నో ఉన్నాయి మా ఇద్దరి మధ్య.

– బాబూమోహన్

కోట శ్రీనివాసరావుగారు, నేను కలిసి కొన్ని వందల సినిమాల్లో యాక్ట్ చేశాం. ఒక దశకంలో నేను, కోట శ్రీనివాసరావు, బాబుమోహన్... ప్రతి సినిమాలో ఉండేవాళ్లం. నాలుగు దశాబ్దాలుగా 'అరే... ఒరేయ్...' (భావోద్వేగానికి లోనవుతూ..) అనుకుంటూ కలిసి ఉన్నాం. నటన ఉన్నంత కాలం కోట ఉంటాడు. వాడు ఒక నట రాజపుత్రుడు. ఏ విషయంలోనైనా నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తి.

– బ్రహ్మానందం

'రాజేంద్రుడు-గజేంద్రుడు, మాయలోడు. అహ నా పెళ్ళంట'... ఇలా చెప్పుకుంటూ పోతే నా జీవితంలోని సూపర్‌హిట్ సినిమాలన్నింటిలోనూ కోట మామ ఉన్నారు. వారం క్రితం ఫోన్ చేసి, 'ఏంటి మామ... ఆరోగ్యం ఎలా ఉందన్నాను', 'అబ్బాయ్... నువ్వు ఇంటికి రా' అన్నారు. తెలుగువారి ప్రతి ఇంట్లోనూ ఉన్నటువంటి నటుడు కోట శ్రీనివాసరావుగారు. చాలా భాషల్లో నటుడిగాను మెప్పించారు. కోట మామగారూ... మీరు ఎక్కడ ఉన్నా మీ విలక్షణమైన శైలిలో అందర్నీ నవ్విస్తూ ఉండాలి.

– రాజేంద్రప్రసాద్

తెలుగు నటీనటులు, తెలుగు ప్రతిభావంతులకు పెద్ద ఎత్తున చాన్స్ దొరకడం లేదనే బాధ కోటగారిలో ఉండేది. ఆయన ఆవేదన నిజమైనదని నాకు అనిపించింది. ఒకసారి ఎవరో అడిగారు... ప్రకాశ్‌రాజ్ పరభాష నటుడే కదా? అని. 'ఆయన తెలుగు నేర్చుకున్నారు కదా. మనోడు అయిపోయాడు' అన్నారు. మన భాషను తప్పుగా పలుకుతారు. మన అవకాశాలను ఎవరో తీసుకెళ్లిపోతారనేది ఆయనకు ఉండేది. ఇటీవల కోటగారు గుర్తొచ్చి... ఆయన ఎక్కడంటే, ఆరోగ్య సమస్యల వల్ల సినిమాలు చేయడం లేదన్నారు. ఫోన్ చేసి, ప్రొడక్షన్ వారి నుంచి కారు పంపిస్తే ఆయన వచ్చారు... సరదాగా మాట్లాడుకున్నాం. – ప్రకాశ్‌రాజ్

కోట శ్రీనివాసరావుగారితో కలిసి కొన్ని సినిమాలు చేయడం నా అదృష్టం. ఆయన అచీవ్ చేయనిది లేదు... చూడనది లేదు. తెలుగువారందరికీ అవకాశాలు ఉండాలని కోరుకునే వ్యక్తి ఆయన. నటన గురించే 24 గంటలూ ఆలోచించే మహానటుడు ఆయన. – రావు రమేశ్



ఆ తరంలో ఎస్వీ రంగారావుగారు, ఆ తర్వాత కైకాల సత్యనారాయణ రావుగారు, ఆ తర్వాత కోట శ్రీనివాసరావుగారు. కోట బాబాయ్-నేను 200 సినిమాలకు పైనే కలిసి నటించాం. తెలుగు నటులంటే ఆయనకు చాలా ఇష్టం. బాబాయ్ అని మా సొంతవారిని ఎన్నిసార్లు పిలిచామో తెలియదు కానీ.. కోట బాబాయ్ అని కొన్ని లక్షలసార్లు పిలిచి ఉంటాము.

– అలీ

విన్నర్ సినెర్

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్ టైటిల్ వశం


సినెర్

- ఫైనల్లో అల్‌కరాజ్‌పై ఘనవిజయం
- కెరీర్‌లో నాలుగో గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన ఇటలీ స్టార్
- రూ. 34 కోట్ల 85 లక్షల ప్రైజ్‌మనీ సొంతం


అల్‌కరాజ్

లండన్: పచ్చిక కోర్టులపై తన ప్రతాపాన్ని చూపిన ఇటలీ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ 'వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్' చాంపియన్‌గా అవతరించాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ సినెర్ 4-6, 6-4, 6-4, 6-4తో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ రెండో ర్యాంకర్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)ను ఓడించాడు. విజేతగా నిలిచిన సినెర్‌కు 30 లక్షల పౌండ్లు (రూ. 34 కోట్ల 85 లక్షలు), రన్నరప్ అల్‌కరాజ్‌కు 15 లక్షల 20 వేల పౌండ్లు (రూ. 17 కోట్ల 66 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. 3 గంటల 4 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో గెలవడం ద్వారా గత నెలలో ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో అల్‌కరాజ్ చేతిలో ఎదురైన ఓటమికి 23 ఏళ్ల సినెర్ బదులు తీర్చుకున్నాడు. అంతేకాకుండా తన కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్ టైటిల్‌ను సాధించాడు. ఓవరాల్‌గా సినెర్ ఖాతాలో ఇది నాలుగో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కావడం విశేషం. సినెర్ 2024, 2025లలో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్... 2024లో యూఎస్ ఓపెన్ టైటిల్ సాధించాడు. సినెర్ చేతిలో ఓటమితో గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో అల్‌కరాజ్‌కు తొలిసారి పరాజయం ఎదురైంది. ఈ మ్యాచ్‌కంటే ముందు 22 ఏళ్ల అల్‌కరాజ్ ఫైనల్ చేరిన ఐదు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ (2022 యూఎస్ ఓపెన్; 2023 వింబుల్డన్; 2023 ఫ్రెంచ్ ఓపెన్; 2024 వింబుల్డన్; 2025 ఫ్రెంచ్ ఓపెన్) విజేతగా నిలిచాడు.

తొలి సెట్ కోల్పోయినా...

గతంలో అల్‌కరాజ్ చేతిలో ఎనిమిదిసార్లు ఓడిపోయి, నాలుగుసార్లు మాత్రమే నెగ్గిన సినెర్ వింబుల్డన్ ఫైనల్లో శుభారంభం చేయలేకపోయాడు. తొలి సెట్‌లో 4-2తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ... అల్‌కరాజ్ ధాటికి సినెర్ వరుసగా నాలుగు గేమ్‌లు కోల్పోయి సెట్‌ను 4-6తో చేజార్చుకున్నాడు. తొలి సెట్‌ను కోల్పోయినా... ఆందోళన చెందకుండా సంయమనంతో ఆడిన సినెర్ రెండో సెట్‌లో తొలి గేమ్‌లోనే అల్‌కరాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేశాడు. ఆ తర్వాత తన సర్వీస్‌లను నిలబెట్టుకొని సెట్‌ను 6-4తో నెగ్గి 1-1తో సమం చేశాడు. మూడో సెట్‌లోని తొమ్మిదో గేమ్‌లో అల్‌కరాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి పదో గేమ్‌లో సర్వీస్‌ను నిలబెట్టుకున్న సినెర్ సెట్‌ను 6-4తో దక్కించుకున్నాడు. నాలుగో సెట్‌లోనూ సినెర్ దూకుడు కొనసాగించి మూడో గేమ్‌లో అల్‌కరాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేశాడు. ఆ తర్వాత తన సర్వీస్‌లను కాపాడుకొని సెట్‌తో పాటు విజయాన్ని ఖరారు చేసుకున్నాడు.

ఫైనల్ మ్యాచ్ గణాంకాలు

సినెర్		అల్‌కరాజ్
8	ఏస్‌లు	15
2	డబుల్ ఫాల్ట్‌లు	7
30/40	నెట్ పాయింట్లు	17/23
4/9	బ్రేక్ పాయింట్లు	2/6
40	విన్నర్స్	38
40	అనవసర తప్పిదాలు	36
125	మొత్తం పాయింట్లు	113

ఆఖరి టి20లో భారత్ ఓటమి

- ఇంగ్లండ్‌పై 3-2తో సిరీస్ టీమిండియా వశం
- 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' శ్రీచరణి



బర్మింగ్‌హామ్: చివరి బంతి వరకు హోరాహోరీగా సాగిన ఆఖరి టి20 మ్యాచ్‌లో ఇంగ్లండ్‌దే పైచేయిగా నిలిచింది. చివరి మ్యాచ్‌లో ఓడినప్పటికీ హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత మహిళల జట్టు ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-2తో సొంతం చేసుకుంది. ఇంగ్లండ్‌లోని బౌన్సీ పిచ్‌లపై సిరీస్ ఆసాంతం నిలకడగా రాణించిన ఆంధ్రప్రదేశ్ స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీచరణికి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది. ఐదు మ్యాచ్‌లు ఆడి మొత్తం 10 వికెట్లు తీసిన శ్రీచరణి టీమిండియాకు సిరీస్ దక్కడంలో కీలకపాత్ర పోషించింది. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన చివరి టి20లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. మొత్తం తొమ్మిది మంది బ్యాటింగ్‌కు దిగితే ఒక్క షఫాలీ వర్మ (41 బంతుల్లో 75; 13 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే దంచేసింది. ఆతిథ్య బౌలర్లలో చార్లీ డీన్ 3, సోఫీ ఎకిల్‌స్టోన్ 2 వికెట్లు తీశారు. అనంతరం 168 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ మహిళల జట్టు సరిగ్గా 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అరుంధతి రెడ్డి వేసిన చివరి బంతికి సోఫీ ఎకిల్‌స్టోన్ సింగిల్ తీసి ఇంగ్లండ్‌ను విజయతీరానికి చేర్చింది. అంతకుముందు ఓపెనర్లు సోఫియా డంక్లే (46; 3 ఫోర్లు, 1 సిక్స్), డానీ వ్యాట్ (31 బంతుల్లో 56; 9 ఫోర్లు) 10.3 ఓవర్లలోనే 101 పరుగులు జోడించడంతోనే ఇంగ్లండ్‌కు శుభారంభం లభించింది. కెప్టెన్ టామీ బ్యూమోంట్ (30; 5 ఫోర్లు) ధాటిగా ఆడింది. భారత బౌలర్లలో దీప్తి, అరుంధతి చెరో 2 వికెట్లు తీశారు. ఈ సిరీస్ ముగియడంతో ఇరుజట్ల మధ్య తదుపరి మూడు వన్డేల సిరీస్ ఈ నెల 16న సౌతాంప్టన్‌లో జరిగే తొలి మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది.

బ్యాటర్లదే భారం

లార్డ్స్ విజేత... సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లే జట్టేదో నేడు తేలనుంది. నాలుగో రోజు 14 వికెట్లు పడ్డాయి. ఆఖరి రోజూ వికెట్ల జోరు కొనసాగితే మాత్రం ఎవరి అంచనాలకు అందని ఫలితమే వస్తుంది. పిచ్ మారుతున్న ధోరణి, బ్యాటర్లకు ఎదురవుతోన్న పరిస్థితి చూస్తుంటే... అగ్ని పరీక్ష తప్పదేమో! దీంతో బంతిని ఎదుర్కోవడం కంటే ప్రతి ఓవర్లో బ్యాటర్లు సవాళ్లనే ఎదుర్కోవాల్సి ఉంటుంది. భారత్‌ను మిగిలున్న 135 పరుగుల లక్ష్యం ఊరిస్తుంటే... పిచ్ ఇంగ్లండ్‌ను ఉత్సాహపరుస్తోంది.

భారత్ లక్ష్యం 193, ప్రస్తుతం 58/4

- టీమిండియాకు 135 పరుగుల దూరంలో లార్డ్స్ విజయం
- ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 192 ఆలౌట్
- సుందర్‌కు 4 వికెట్లు
- రాణించిన సిరాజ్, బుమ్రా


రాహుల్

లండన్: భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య మూడో టెస్టు ఆఖరి మజిలీకి చేరింది. మూడో రోజు ముగిసేసరికి సమంగా నిలిచిన జట్లు... నాలుగో రోజు బౌలర్ల పట్టుదలకు తలొగ్గాయి. భారత బ్యాటర్లు రాణిస్తే గెలుపు... ఇంగ్లండ్ బౌలర్లు పడగొడితే ముప్పు... ఏదేమైనా ఐదో రోజు ఆట రసవత్తర ముగింపునకు తెరలేపనుంది. ఇంగ్లండ్‌ను 200 పరుగుల్లోపే ఆలౌట్ చేశామన్న ఆనందాన్ని భారత టాపార్డర్ వికెట్లు ఆవిరి చేశాయి. 193 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్... ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 17.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 58 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (47 బంతుల్లో 33 బ్యాటింగ్; 6 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు. బ్రైడన్ కార్స్ 2 వికెట్లు తీశాడు. ఇన్నింగ్స్ మొదలైన రెండో ఓవర్లోనే యశస్వి జైస్వాల్ (0) నిర్లక్ష్యంగా వికెట్‌ను పారేసుకోగా... కరుణ్ నాయర్ (14), కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (6) కార్స్ అద్భుతమైన బంతులకు వికెట్ల ముందు దొరికిపోయారు. 'నైట్‌వాచ్‌మన్' ఆకాశ్‌దీప్ (1)ను స్టోక్స్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. భారత్ చేతిలో 6 వికెట్లుండగా... గిల్ బృందం విజయానికి 135 పరుగుల దూరంలో ఉంది. అంతకుముందు ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 62.1 ఓవర్లలో 192 పరుగుల వద్ద ఆలౌటైంది. జో రూట్ (96 బంతుల్లో 40; 1 ఫోర్), కెప్టెన్ బెన్ స్టోక్స్ (96 బంతుల్లో 33; 3 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. భారత బౌలర్లలో స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ 12.1-2-22-4 చక్కని స్పెల్‌తో తిప్పేశాడు.

సిరాజ్ మొదలుపెడితే...

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 2/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్‌ను సిరాజ్ తన పేస్ బౌలింగ్‌తో వణికించాడు. ఇన్నింగ్స్ ఆరో ఓవర్లో డకెట్ (12)ను అవుట్ చేశాడు. కాసేపటికి ఒలీ పోప్ (4)ను ఎల్బీగా పంపాడు. సిరాజ్ పేస్‌ను గమనించిన కెప్టెన్ గిల్ మరో ఎండ్‌లో బుమ్రాను తప్పించి నితీశ్ కుమార్‌కు బంతిని అప్పగించడం ఫలితాన్నిచ్చింది. ఓపెనర్ క్రాలీ (22)ని నితీశ్ అవుట్ చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లోనూ అతని వికెట్‌ను నితీశే తీశాడు. దీంతో 50 పరుగులకే ఇంగ్లండ్ 3 టాపార్డర్ వికెట్లను కోల్పోయింది. ఈ దశలో రూట్, హ్యారీ బ్రూక్ నిలబడేందుకు చేసిన ప్రయత్నం లంచ్‌వరకైనా నిలువలేదు. ఆకాశ్‌దీప్ ఓవర్లో మిడాఫ్ దిశగా భారీ సిక్సర్ బాదిన బ్రూక్ అదే జోరులో స్వీప్‌షాట్ ఆడే యత్నంలో బోల్తా పడ్డాడు. స్టంప్స్ లక్ష్యంగా సంధించిన ఆకాశ్ బంతి బ్రూక్ మిడిల్ స్టంప్‌ను పడేసింది. దీంతో 87 పరుగుల వద్ద అతను క్లీన్‌బౌల్డ్ కావడంతో ఇంగ్లండ్ కీలకమైన నాలుగో వికెట్ కోల్పోయింది. 98/4 వద్ద లంచ్‌బ్రేక్‌కు వెళ్లారు.

సుందర్ ఉచ్చులో...

రెండో సెషన్‌లో ఇంగ్లండ్ తేరుకుంది. ఇటు రూట్, అటు కెప్టెన్ స్టోక్స్ నిలకడగా ఆడారు. పిచ్ పరిస్థితులకు తగ్గట్లుగా బ్యాటింగ్ చేశారు. దీంతో ఈ సెషన్‌లో భారత బౌలర్లు పడిన కష్టానికి తగిన ఫలితమైతే రాలేదు. అయితే సుందర్ మాయాజాలం మొదలవడంతో జట్టు స్కోరు 150 దాటిన తర్వాత రూట్, స్వల్ప వ్యవధిలోనే స్మిత్ (8) అవుటయ్యారు. ఈ సెషన్‌లో కేవలం 2 వికెట్లనే కోల్పోయి 77 పరుగులు జతచేసింది. అయితే మూడో సెషన్ ఇంగ్లండ్‌ను ముంచింది. స్టోక్స్ వికెట్‌ను పడేయడంతో సుందర్ ఆలౌట్‌కు సిద్ధం చేశాడు. వోక్స్ (10), కార్స్ (1)లను బుమ్రా బౌల్డ్ చేయగా, బషీర్ (2)ను బౌల్డ్ చేసి సుందర్ ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను ముగించాడు.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 387; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 387; **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** క్రాలీ (సి) జైస్వాల్ (బి) నితీశ్ 22; డకెట్ (సి) బుమ్రా (బి) సిరాజ్ 12; పోప్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 4; జో రూట్ సుందర్ 40; బ్రూక్ (బి) ఆకాశ్‌దీప్ 23; స్టోక్స్ (బి) సుందర్ 33; స్మిత్ (బి) సుందర్ 8; వోక్స్ (బి) బుమ్రా 10; కార్స్ (బి) బుమ్రా 1; ఆర్చర్ (నాటౌట్) 5; బషీర్ (బి) సుందర్ 2; ఎక్స్‌ట్రాలు 32; **మొత్తం (62.1 ఓవర్లలో ఆలౌట్)** 192. **వికెట్ల పతనం:** 1-22, 2-42, 3-50, 4-87, 5-154, 6-164, 7-181, 8-182, 9-185, 10-192. **బౌలింగ్:** బుమ్రా 16-3-38-2, సిరాజ్ 13-2-31-2, నితీశ్ 5-1-20-1, ఆకాశ్‌దీప్ 8-2-30-1, జడేజా 8-1-20-0, సుందర్ 12.1-2-22-4. **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) స్మిత్ (బి) ఆర్చర్ 0; రాహుల్ (బ్యాటింగ్) 33; కరుణ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కార్స్ 14; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కార్స్ 6; ఆకాశ్ దీప్ (బి) స్టోక్స్ 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (17.4 ఓవర్లలో 4 వికెట్లకు)** 58. **వికెట్ల పతనం:** 1-5, 2-41, 3-53, 4-58. **బౌలింగ్:** వోక్స్ 5-2-11-0, ఆర్చర్ 4-0-18-1, స్టోక్స్ 4.4-0-15-1, కార్స్ 4-1-11-2.


సుందర్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

నైపుణ్యాలుంటేనే ప్లేస్‌మెంట్స్

ఇంజినీరింగ్ స్పెషల్

ప్రతీ విద్యార్థి, వారి తల్లిదండ్రుల కల.. ఇంజినీరింగ్ పూర్తి చేసిన తరువాత ప్రభుత్వ రంగంలో లేదా పేరున్న ప్రైవేట్ కంపెనీ లేదా మల్టీనేషనల్ సంస్థలో స్థిరమైన ఉద్యోగం సాధించడమే. అయితే, ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే.. మార్కులు, సర్టిఫికేట్లు ఒక్కటే సరిపోవు. దీనికోసం విద్యార్థులు సాధన ద్వారా అభివృద్ధి చేసుకునే నైపుణ్యాలు, పరిజ్ఞానం, సరైన దృక్పథం అత్యంత ముఖ్యమైనవి. అవి ప్లేస్‌మెంట్స్ ఫలితంపై నేరుగా ప్రభావం చూపిస్తాయి. ఈ నేపథ్యంలో.. ప్లేస్‌మెంట్స్‌లో విజయానికి దోహదం చేసే నైపుణ్యాల గురించి తెలుసుకుందాం..

సాంకేతిక ప్రావీణ్యం

ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థి తన బ్రాంచ్‌కు సంబంధించిన ప్రాథమిక, మౌలికమైన అంశాలపై బలమైన పట్టు కలిగి ఉండాలి. ఫండమెంటల్స్ బలంగా ఉంటే, ఇంటర్వ్యూలో టెక్నికల్ ప్రశ్నలకు ఆత్మవిశ్వాసంతో సమాధానం ఇవ్వగలరు.

ఉదాహరణకు సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థి 'స్ట్రక్చరల్ ఇంజనీరింగ్'లో, మెకానికల్ విద్యార్థి 'థర్మోడైనమిక్స్'లో నైపుణ్యం చూపితే.. ఆ విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వడానికి కంపెనీలు ఎక్కువ ఆసక్తి చూపిస్తాయి. ఆటోక్యాడ్, మెట్‌ల్యాబ్ వంటి సిమ్యులేషన్,డిజైన్ టూల్స్‌పై అవగాహన ఉన్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ అవకాశాలు మరింత మెరుగవుతాయి.

ప్రోగ్రామింగ్-డిజిటల్ స్కిల్స్

ఈ డిజిటల్ యుగంలో ప్రోగ్రామింగ్ నైపుణ్యం అత్యవసరం. పైథాన్, జావా, సీ ++ వంటి లాంగ్వేజ్‌లలో నైపుణ్యం కలిగిన విద్యార్థులు కోడింగ్ రౌండ్లలో తమ ప్రత్యేకత చూపగలుగుతారు. డిజైన్, డేటా అనలిటిక్స్, సిమ్యులేషన్ టూల్స్ వంటి వాటి వినియోగం ప్రాజెక్ట్ స్థాయిని పెంచుతుంది. ఏఐ, ఐవోటీ,సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక టెక్నాలజీలపై అవగాహన ఉండటం మరిన్ని అవకాశాలకు ద్వారాలు తెరుస్తుంది. లీడ్ కోడ్, హ్యాకర్ ర్యాంక్, కోడ్‌చెఫ్, గీక్ ఫర్ గీక్స్,టీసీఎస్ డిజిటల్, టీసీఎస్ నింజా,కోడ్‌ఫోర్సెస్, ఎస్‌పీవోజీ వంటి ప్లాట్‌ఫార్మ్‌లను ఉపయోగించి నిరంతర సాధన చేయాలి. డేటా స్ట్రక్చర్స్, అల్గారిథమ్‌లపై మంచి పట్టు అవసరం.

సర్టిఫికేషన్స్

బీటెక్‌తోపాటు అదనపు సర్టిఫికేషన్లు విద్యార్థికి ప్రత్యేక గుర్తింపును ఇస్తాయి. ఏడబ్ల్యూఎస్, సేల్స్‌ఫోర్స్, ఒరాకిల్, శ్యాప్, పెగా వంటి కోర్సులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించారు. ఈ సర్టిఫికేషన్లు విద్యార్థికి ప్రత్యేకమైన డొమైన్ జ్ఞానం, ప్లాట్‌ఫార్మ్‌కు సంబంధించిన నైపుణ్యాలను అందిస్తాయి. ఇలాంటి సర్టిఫికేషన్లు ఉన్నవారికి ఎక్కువ సాలరీ ప్యాకేజ్ వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి.

ఇన్నోవేషన్-ప్రాజెక్ట్ వర్క్

పుస్తకాలకే పరిమితం కాకుండా.. స్వయంగా కొత్త ఆలోచనలతో ప్రాజెక్టులు చేయడం అవసరం. ఇది సృజనాత్మకతను, సమస్య పరిష్కార సామర్థ్యాన్ని చూపిస్తుంది. హ్యాకథాన్స్, టెక్నికల్ ఫెస్ట్‌లో పాల్గొనడం ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రెజెంటేషన్ స్కిల్స్ మెరుగవుతాయి. కంపెనీలు ఇన్నోవేటివ్ మైండ్ సెట్ ఉన్నవారిని ఎంపిక చేసుకోవడానికి ప్రాధాన్యతనిస్తాయి.

అనలిటికల్, కమ్యూనికేషన్ స్కిల్స్

ఒక సమస్యను విశ్లేషించి పరిష్కార మార్గాలు కనుగొనగలగడం అనలిటికల్ థింకింగ్‌లో భాగం. ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, గ్రూప్ డిస్కషన్స్, కేస్ స్టడీస్ వంటి వాటిలో ఈ నైపుణ్యాన్ని పరీక్షిస్తారు. దీంతోపాటు స్పష్టంగా, ఆత్మవిశ్వాసంతో మాట్లాడగలగడం-ప్రస్తుత ప్రొఫెషనల్ ప్రపంచంలో ఒక ముఖ్యమైన నైపుణ్యం. హెచ్‌ఆర్ రౌండ్, గ్రూప్ డిస్కషన్స్, ప్రెజెంటేషన్స్, టెక్నికల్ డాక్యుమెంటేషన్ వంటి అంశాల్లో దీన్ని పరీక్షిస్తారు. క్లయింట్లతో, జట్టుతో చక్కగా పని చేయాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరి.

ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్

ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్ట్‌ల ద్వారా విద్యార్థులు పరిశ్రమ వాతావరణాన్ని నేరుగా అర్థం చేసుకొని అనుభవాన్ని గడిస్తారు. ఈ అనుభవం కంపెనీలకు విద్యార్థి పనిచేయగల సామర్థ్యంపై నమ్మకం కలిగిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా పనిచేసే కంపెనీలు.. విభిన్న సాంస్కృతిక నేపథ్యాలలో సరిపడే అభ్యర్థులను కోరుకుంటాయి. గ్లోబల్ అవగాహన కలిగిన విద్యార్థులు మల్టీనేషనల్ కంపెనీలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు.



-ప్రొఫెసర్ సి.వి.నరసింహులు,
ప్రిన్సిపాల్, సీబీఐటీ, హైదరాబాద్

సర్కారీ బ్యాంకుల్లో.. స్పెషలిస్ట్ ఆఫీసర్

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నియామకాల ప్రక్రియ చేపట్టే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. మరో ముఖ్య నోటిఫికేషన్‌తో ముందుకొచ్చింది. వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొత్తం 1,007 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ప్రిలిమినరీ, మెయిన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో... 2026-27 సంవత్సరానికి ఐబీపీఎస్ స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

» 1,007 ఎస్‌వో పోస్టుల భర్తీకి ఐబీపీఎస్ నోటిఫికేషన్

» మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ

- మొత్తం ఎస్‌వో పోస్టుల సంఖ్య: 1007

పోస్టుల వివరాలు

ఐటీ ఆఫీసర్(స్కేల్ 1), అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్ (స్కేల్ 1), రాజ్‌భాషా అధికారి(స్కేల్ 1), లా ఆఫీసర్ (స్కేల్ 1), హెచ్‌ఆర్/పర్సనల్ ఆఫీసర్(స్కేల్ 1), మార్కెటింగ్ ఆఫీసర్(స్కేల్ 1).

ఎంపిక ప్రక్రియలో పాల్గొనే బ్యాంకులు

బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

అర్హతలు

పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఎస్సీ, బీటెక్, ఎల్ఎల్‌బీ, ఎంఏ, ఎంఆర్క్, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ/పీజీడీఎం, పీజీ డిప్లొమా, పీజీడీబీఎం, పీజీడీబీఏలో ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. అభ్యర్థులు 2025, జూలై 21 నాటికి విద్యార్హతలు పూర్తి చేసుకొని ఉండాలి. ఒక అభ్యర్థి ఒక పోస్టుకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

వయసు

01.07.2025 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనాలు

స్పెషలిస్ట్ ఆఫీసర్-స్కేల్1కు నెలకు మూల వేతనశ్రేణి రూ.48,480 -రూ.85,920 లభిస్తుంది. దీంతోపాటు డీఏ, హెచ్‌ఆర్ఏ, ఇతర అలవెన్సులు అందుతాయి.

ఎంపిక ప్రక్రియ

ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష, ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష, కామన్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష విధానం

- లా ఆఫీసర్, రాజభాష అధికారి పోస్టులకు ప్రిలిమినరీ పరీక్ష 150 ప్రశ్నలు-125 మార్కులకు జరుగుతుంది. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 50 ప్రశ్నలు-25 మార్కులకు, రీజనింగ్ 50 ప్రశ్నలు -50 మార్కులకు, జనరల్ అవేర్‌నెస్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు బ్యాంకింగ్ ఇండస్ట్రీ 50 ప్రశ్నలు-50 మార్కులకు ఉంటాయి. పరీక్ష వ్యవధి ఒక్కో విభాగానికి 40 నిమిషాల చొప్పున మొత్తం 2 గంటలు. ఈ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల విధానంలో జరుగుతుంది. ప్రశ్న పత్రం ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగం మినహా ఇంగ్లిష్/హిందీ మాధ్యమంలో ఉంటుంది.
- ఐటీ ఆఫీసర్, అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్, హెచ్‌ఆర్/పర్సనల్ ఆఫీసర్, మార్కెటింగ్ ఆఫీసర్ పోస్టులకు ప్రిలిమినరీ పరీక్ష 150 ప్రశ్నలు-125 మార్కులకు జరుగుతుంది. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 50 ప్రశ్నలు-25 మార్కులకు, రీజనింగ్ 50 ప్రశ్నలు-50 మార్కులకు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-50 మార్కులకు ఉంటాయి. పరీక్ష వ్యవధి ఒక్కో విభాగానికి 40 నిమిషాల చొప్పున మొత్తం 2 గంటలు. ఈ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల విధానంలో జరుగుతుంది. ప్రశ్న పత్రం ఇంగ్లిష్ లాంగ్వేజ్ మినహా ఇంగ్లిష్/హిందీ మాధ్యమంలో ఉంటుంది.
- ప్రిలిమినరీ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు. ప్రిలిమినరీ పరీక్షలోని మూడు విభాగాల్లోనూ కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన వారితో కేటగిరీల వారీగా షార్ట్‌లిస్ట్ చేసి.. తదుపరి దశ మెయిన్ పరీక్షకు అనుమతిస్తారు.

ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష ఇలా



- లా ఆఫీసర్, ఐటీ ఆఫీసర్, అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్, హెచ్‌ఆర్/పర్సనల్ ఆఫీసర్, మార్కెటింగ్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించే మెయిన్ పరీక్షలో ప్రొఫెషనల్ నాలెడ్జ్ విభాగంపై 60 ప్రశ్నలు-60 మార్కులకు ఉంటాయి. పరీక్ష వ్యవధి 45 నిమిషాలు. ప్రశ్న పత్రం హిందీ/ఇంగ్లిష్‌లో ఉంటుంది.
- రాజభాష అధికారి పోస్టులకు ప్రొఫెషనల్ నాలెడ్జ్ ఆబ్జెక్టివ్ పరీక్షలో 45 ప్రశ్నలు, ప్రొఫెషనల్ నాలెడ్జ్ డిస్క్రిప్టివ్ పరీక్షలో 2 ప్రశ్నలు ఉంటాయి. ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ ప్రశ్నలకు కలిపి మొత్తం 60 మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి ఒక గంట.
- ఆబ్జెక్టివ్ తరహా పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు.

వంద మార్కులకు ఇంటర్వ్యూ

ఆన్‌లైన్ మెయిన్ పరీక్షలో ప్రతి విభాగంలో కనీస అర్హత మార్కులు సాధించడం తోపాటు మొత్తంగా ఉత్తమ స్కోర్ చేసిన అభ్యర్థులను కేటగిరీల వారీగా షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. పోస్టుల సంఖ్యను బట్టి కటాఫ్ నిర్ణయిస్తారు. మెయిన్ పరీక్షలో సాధించిన మార్కులను మాత్రమే ఇంటర్వ్యూకు ఎంపిక చేసేందుకు పరిగణనలోకి తీసుకుంటారు. ఈ ఇంటర్వ్యూకు వంద మార్కులు కేటాయించారు. ఇందులో జనరల్ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు, ఎస్సీ/ఎస్టీ /ఓబీసీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులు 35 శాతం మార్కులు సాధించాలి.

తుది ఎంపిక

ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష మార్కులకు, ఇంటర్వ్యూ మార్కులకు 80:20 నిష్పత్తిలో వెయిటేజీ కల్పిస్తారు. ఆ విధంగా మొత్తం వంద మార్కులకు ఉత్తమ స్కోర్ పొందిన వారితో తుది జాబితా రూపొందిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 21.07.2025
- ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష: ఆగస్టు, 2025
- ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష: నవంబర్ 2025
- వెబ్‌సైట్: https://www.ibps.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌హెచ్‌పీసీ లిమిటెడ్‌లో 361 అప్రెంటిస్‌లు

నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్(ఎన్‌హెచ్‌పీసీ) వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 361.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు-129, డిప్లొమా అప్రెంటిస్‌లు-76, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌లు-156.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీకాం,బీటెక్/బీఈ, ఎల్ఎల్‌బీ, డిప్లొమా, ఐటీఐ, బీఎస్‌డబ్ల్యూ, ఎంఏ, ఎంబీఏ/పీజీడీఎం, పీజీ డిప్లొమాలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 30 ఏళ్లు మించకూడదు.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.15,000, డిప్లొమా అప్రెంటిస్‌కు 13,500, ఐటీఐ గ్రేడ్ అప్రెంటిస్‌కు 12,000.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.08.2025
» **వెబ్‌సైట్:** www.nhpcindia.com

ఎన్‌ఎండీసీ లిమిటెడ్, హైదరాబాద్‌లో 17 మేనేజర్ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌ఎండీసీ) జూనియర్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 17.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ మేనేజర్ (ఫైనాన్స్)-10, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్)-07.
» **అర్హత:** సంబంధిత విభాగంలో సీఏ/సీఎంఏ, డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు జూనియర్ మేనేజర్‌కు రూ.50,000 నుంచి రూ.1,60,000, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టుకు రూ.1,00,000 నుంచి రూ.2,60,000.
» **వయసు:** జూనియర్ మేనేజర్‌కు 30 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు 45 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.07.2025
» **వెబ్‌సైట్:** https://www.nmdc.co.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-ఫిజిక్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-ఇంగ్లిష్

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
14-7-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	690	82,500
నిఫ్టీ ▽	205	25,150

విదేశీ సూచీలు

నాస్‌డాక్	20,585	▽	45
డోజోన్స్	44,371	▽	279
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,941	▽	35
డాక్స్	24,255	▽	201
షాంఘై	3,510	△	0.50
నికాయ్	39,570	▽	77

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.97	87.65
£	బ్రిటన్ పౌండ్	113.39	118.34
€	యూరో	98.09	102.57
¥	జపాన్ యెన్ (100)	47.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	54.04	58.90
S$	సింగపూర్ డాలర్	64.71	69.40
SAR	సౌదీ రియాల్	22.00	23.49
UAE D	యూఏఈ దిర్హామ్	22.47	24.25
¥	చైనా యువాన్	11.10	12.92

ఔట్ పేషెంట్ ప్లాన్.. నో టెన్షన్!



ఆస్పత్రుల్లో ఎన్నో ప్రయోజనాలు

- అపరిమిత వైద్యుల కన్సల్టేషన్లు
- వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఔషధాలకు చెల్లింపులు
- హెల్త్ పాలసీకి రైడర్‌గా తీసుకోవచ్చు
- ఊహించని ఖర్చును సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు

అనారోగ్యంతో డాక్టర్ దగ్గరకెళ్తే వ్యాధి నిర్ధారణ పరీక్షల తర్వాతే పరిష్కారం సూచిస్తుంటారు. కన్సల్టేషన్, డయాగ్నోస్టిక్స్ చార్జీలు, మందులకు కలిపి ఎంతలేదన్నా రూ.2,000–5,000 మధ్య ఖర్చు చేయాల్సిందే. నలుగురు లేదా ఐదుగురు సభ్యులున్న కుటుంబం ఏడాదిలో ఇలా వైద్యుల వద్దకు ఎన్నిసార్లు వెళ్లాల్సి వస్తుందో ఊహించలేం. ఈ రూపంలో ఎంత ఖర్చు ఎదురవుతుందో అంచనా వేయలేం. హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ ఉన్నా కానీ, కేవలం హాస్పిటల్‌లో చేరి తీసుకునే చికిత్సలకే (ఇన్ పేషెంట్ కవర్) అధిక శాతం పాలసీలు కవరేజీ అమలు చేస్తుంటాయి. జీవనశైలి వ్యాధులు, వైరల్ ఫీవర్లు, ఇన్ఫెక్షన్లు పెరిగిపోయిన తరుణంలో.. ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఓపీడీ) కవరేజీకి ప్రాధాన్యం పెరుగుతోంది. ఇది ఉంటే ఊహించని ఖర్చును కొంత వరకు తట్టుకోవచ్చు. ఓపీడీ ప్లాన్లలో సదుపాయాలు, వీటి కోసం ఎంత ఖర్చవుతుంది? తదితర అంశాలపై అవగాహన కల్పించే కథనమే ఇది. – సాక్షి, బిజినెస్ డెస్క్

ఔట్ పేషెంట్ విభాగం (ఓపీడీ)లో చేసే ఖర్చు గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా సగటు ద్రవ్యోల్బణం మించి వైద్యుల కన్సల్టేషన్, డయాగ్నోస్టిక్స్ చార్జీలు పెరుగుతున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఓపీడీపై దేశ ప్రజలు చేసిన ఖర్చు 37.7 బిలియన్ డాలర్లుగా ఉంటుందని (రూ.3.20 లక్షల కోట్లు సుమారు) 'ఇండియా ఇన్సూర్‌టెక్ అసోసియేషన్' అంచనా వేసింది. ఈ ఖర్చులో రిటైల్ ఓపీడీ ఇన్సూరెన్స్ ద్వారా చెల్లించింది కేవలం 0.1 శాతమే. అంటే దాదాపు 99.9 శాతం మంది ఓపీడీ కవరేజీకి దూరంగా ఉన్నట్టు ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు చాలా వాటిల్లో ఓపీడీ కవరేజీ ఒక సదుపాయంగా ఉండదు. ఓపీడీకి పెరుగుతున్న ప్రాధాన్యం నేపథ్యంలో బీమా కంపెనీలు ఇప్పుడు ఈ కవరేజీని సైతం ఇన్‌పేషెంట్ కవర్‌తో పాటు ఆఫర్ చేస్తున్నాయి.

ఓపీడీ ప్లాన్లలో కవరేజీ..

ఓపీడీ కవరేజీ ఇన్‌బిల్ట్‌గా కలిగిన హెల్త్ ప్లాన్లు కొన్నే ఉన్నాయి. దాదాపు అన్ని కంపెనీలు ఓపీడీ కవర్‌ను యాడాన్ కింద అందిస్తున్నాయి. హాస్పిటల్‌లో చేరాల్సిన అవసరం లేకుండా.. వైద్యుల వద్దకు వెళ్లి సమస్యల గురించి చెప్పి, తీసుకుని వెళ్లిపోయే చికిత్సా సలహాలు ఓపీడీ కిందకు వస్తాయి. ''ఓపీడీ కవర్ కింద ఔషధాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వైద్యుల కన్సల్టేషన్ చార్జీ (డాక్టర్ ఫీజు)లను బీమా సంస్థలు చెల్లిస్తాయి. రెగ్యులర్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లలో పాలసీదారు హాస్పిటల్ పాలైతే తప్పించి వీటికి పరిహారం రాదు'' అని హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ ఈడీ పార్థని ఘోష్ తెలిపారు. కాకపోతే ఇలా వైద్యుల ఫీజులు, ఔషధాలు, డయాగ్నోస్టిక్స్‌కు చెల్లింపుల పరంగా ఓపీడీ కవర్‌లో కొన్ని పరిమితులు ఉండడాన్ని గమనించొచ్చు. సాధారణంగా నగదు రహిత విధానంలో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఈ ఓపీడీ చెల్లింపులకు బీమా సంస్థలు ప్రాధాన్యం ఇస్తుంటాయి. బీమా సంస్థలకు ఆస్పత్రులతో టైఅప్ ఉంటుంది. కనుక వీటికి అయ్యే వ్యయాలు తక్కువగా ఉంటాయి. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుని రీయింబర్స్‌మెంట్ దరఖాస్తు చేసుకున్నా బీమా సంస్థలు అనుమతిస్తుంటాయి. కానీ, నాన్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నగదు రహిత విధానంలో ఓపీడీ చెల్లింపులకు కొన్ని బీమా సంస్థలు అంగీకరించడం లేదు. ఇందులో మోసాల రిస్క్ ఉంటుందని, రీయింబర్స్‌మెంట్‌కే ప్రాధాన్యం ఇస్తున్నాయి. కొన్ని బీమా సంస్థలు ఓపీడీ కవరేజీని పూర్తిగా నెట్‌వర్క్ ఆస్పత్రులకే పరిమితం చేస్తున్నాయి.

ఇలా చేస్తే మెరుగు..

- ఓపీడీ కవర్‌లో భాగంగా వచ్చే ఉచిత హెల్త్ చెకప్‌లు, టెలీ కన్సల్టేషన్ సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి.
- నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నగదు రహిత విధానంలో సులభంగా సేవలు పొందొచ్చు. రీయింబర్స్‌మెంట్ విధానంలో అయితే అన్ని బిల్లులను జాగ్రత్తపరిచి క్లెయిమ్ దాఖలు చేయాల్సి వస్తుంది. నగదు రహిత విధానంలో అయితే ఈ ప్రహసనం తప్పించొచ్చు.
- ఉప పరిమితులను జాగ్రత్తగా గమనిస్తూ, గరిష్ఠ పరిమితి మేరకు ఉపయోగించుకోవాలి.
- ఓపీడీ కవర్‌ను రెన్యువల్ సమయంలో సమీక్షించుకోవాలి. కవరేజీ చాలకపోయినా.. ప్లాన్ ఆఫర్ చేస్తున్న ప్రయోజనాలు, ఉప పరిమితులు అంత అనుకూలంగా అనిపించకపోయినా మెరుగైన ప్లాన్‌కు అప్‌గ్రేడ్ కావాలి.

ప్రీమియం.. పరిమితులు

- ఐసీఐసీఐ లాంబార్డ్ 'ఎలివేట్' అన్నది ఓపీడీ రైడర్. 35 ఏళ్ల వ్యక్తి రూ.10,000 వార్షిక కవరేజీకి చెల్లించాల్సిన ప్రీమియం రూ.4,980. నగదు రహిత విధానంలో ఈ ప్లాన్ పనిచేస్తుంది. ఎలాంటి ఉప పరిమితుల్లేవు.
- బజాజ్ అలియాంజ్ 'హెల్త్ ప్రైమ్' రూ.15,000 కవరేజీకి రూ.2,062 ప్రీమియంను (35 ఏళ్ల వ్యక్తికి) వసూలు చేస్తోంది.
- నివా బూపా 'అక్యూట్ బెస్ట్ కేర్' ప్లాన్ సైతం నగదు రహిత, రీయింబర్స్‌మెంట్ విధానంలో కవరేజీని ఆఫర్ చేస్తోంది. రూ.10,000 కవరేజీకి రూ.4,801 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.
- నివా బూపా వెల్ కన్సల్ట్ ఓపీడీ ప్లాన్ 20 శాతం కోపేమెంట్‌ను రీయింబర్స్‌మెంట్‌కు అమలు చేస్తోంది.
- స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఓపీడీ కవర్‌ను.. ప్రమాదాలకు సంబంధించి చికిత్సలకు నగదు రహిత, రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌లను అనుమతిస్తోంది. ఈ ప్లాన్ రూ.25,000 కవరేజీకి రూ.4,802 ప్రీమియం వసూలు చేస్తోంది.

''సంప్రదాయంగా చూస్తే ఓపీడీ ప్లాన్లలో డాక్టర్ కన్సల్టేషన్, డయాగ్నోస్టిక్స్, ఫార్మసీ బిల్లుల పరంగా ఉప పరిమితులు ఉంటాయి. ఉదాహరణకు ఓపీడీ సమ్ ఇన్సూర్డ్ రూ.20,000 ఉండొచ్చు. అయినప్పటికీ, ఫార్మసీ (ఔషధాలు)కి సంబంధించి రూ.5,000 ఉప పరిమితిగా ఉండొచ్చు. అయితే కవరేజీని తమ అవసరాల మేరకు పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు వీలుగా ఉప పరిమితుల్లేని ప్లాన్లను సైతం బీమా సంస్థలు తీసుకొస్తున్నాయి'' అని పాలసీ బజార్ హెల్త్ ఇన్సూరెన్స్ బిజినెస్ హెడ్ సిద్ధార్థ్ సింఘాల్ తెలిపారు. ఓపీడీ కవర్ తీసుకునే ముందు ఉప పరిమితుల గురించి సంపూర్ణంగా తెలుసుకోవాలి. తమకు అప్పటికే జీవనశైలి వ్యాధులు ఉంటే, వాటికి సైతం చెల్లింపులు చేసే విధంగా చూసుకోవాలి. కొన్ని ఓపీడీ ప్లాన్లలో ఏడాదిలో వైద్యుల కన్సల్టేషన్లు గరిష్ఠంగా ఇన్ని పర్యాయాలు మాత్రమే అన్న పరిమితులు కూడా ఉంటున్నాయి. కొన్ని బీమా సంస్థలు నెట్‌వర్క్ ఆస్పత్రులు కాకుండా వేరే చోటు తీసుకునే చికిత్సలకు చెల్లింపులు చేయడం లేదు.

ఓపీడీ ప్లాన్ తీసుకోవచ్చా..?



తరచూ వైద్యుల సలహాలు, చికిత్సల కోసం వెళ్లే వారికి ఓపీడీ ప్లాన్లు ఉపయోగకరం. ముఖ్యంగా జీవనశైలి వ్యాధులు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడే వారు వీటిని తీసుకోవచ్చు. ''ఆరోగ్యవంతులైన వ్యక్తులకు సైతం ఓపీడీ కవర్ ప్రయోజకరమే. ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా అనారోగ్యాలను తొలి దశలోనే గుర్తించొచ్చు'' అని మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ ప్రొడక్ట్స్, బిజినెస్ హెడ్ ఆశిష్ యాదవ్ సూచించారు. బీమా సంస్థ ఆఫర్ చేసే నగదు రహిత ఆస్పత్రుల నెట్‌వర్క్‌ను కూడా చూడాలి. ఓపీడీ ప్లాన్లలో తమకు నచ్చిన వైద్య నిపుణుడి వద్దకు కాకుండా, బీమా సంస్థ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోని వైద్యుల సేవలకు పరిమితం కావాల్సి వస్తుంది. కనుక నెట్‌వర్క్ జాబితాలో పేరున్న హాస్పిటల్స్ ఉన్నాయేమో పరిశీలించాలి. రీయింబర్స్‌మెంట్ విధానంలో షరతులు ఉన్నాయేమో తెలుసుకోవాలి. అసలు షరతుల్లేని లేదా పరిమిత షరతులతో మెరుగైన ప్రయోజనాలను ఆఫర్ చేసే ఓపీడీ ప్లాన్‌ను ఎంపిక చేసుకోవచ్చు. పనిచేసే సంస్థ నుంచి ఓపీడీ ప్లాన్‌కు అవకాశం ఉంటే అదే తీసుకోవడం మేలు. తమ అవసరాలకు సరితూగే ఓపీడీ ప్లాన్‌ను ఎంపిక చేసుకోవడం అన్నింటికంటే ప్రధానమైనది. వివిధ సంస్థలు ఆఫర్ చేస్తున్న ఓపీడీ ప్లాన్లు, వాటిల్లోని సదుపాయాలు, నెట్‌వర్క్ ఆస్పత్రుల జాబితాను పోల్చి చూడాలి. మెరుగైన చెల్లింపుల చరిత్రతో సహేతుక ప్రీమియంతో ఉన్న ప్లాన్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

ఇతర ప్లాన్లు



బీమా కంపెనీల భాగస్వామ్యంతో కొన్ని ప్రైవేటు సంస్థలు ప్రత్యేక ఓపీడీ ప్లాన్లను అందిస్తున్నాయి. ఇందులో లివ్‌లాంగ్ ఇన్సూరెన్స్ ఒకటి. దాదాపు అన్ని ప్రముఖ బీమా సంస్థల తరఫున ఓపీడీ కవర్ సేవలను ఆఫర్ చేస్తోంది. రూ.15,000 కవరేజీకి రూ.5,500, రూ.16,000 కవరేజీకి రూ.6,000, రూ.28,800 కవరేజీకి రూ.11,599 ప్రీమియం కింద వసూలు చేస్తోంది. ఈ తరహా సంస్థల ఓపీడీ ప్లాన్లలో కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ.. ఎన్నో ఉచిత ప్రయోజనాలను ఆఫర్ చేస్తున్నాయి. లివ్‌లాంగ్ 'ఎల్డర్‌కేర్' ఓపీడీ ప్లాన్ కోసం 66 ఏళ్ల గీత ఏడాదికి రూ.12,000 ప్రీమియం చెల్లిస్తోంది. ఇందులో ఔషధాలు, డయాగ్నోస్టిక్స్ చార్జీలకు ఏడాదిలో గరిష్ఠ చెల్లింపులు రూ.3,000కు పరిమితం. అయినప్పటికీ 83 ప్యారామీటర్లతో కూడిన ఫుల్‌బాడీ చెకప్, వైద్యులు, పోషకాహార నిపుణులతో అపరిమిత కన్సల్టేషన్లు, ఏడాదిలో ఆరు స్పెషలిస్ట్ వైద్యుల కన్సల్టేషన్లను ఉచితంగా ఆఫర్ చేస్తున్నట్టు ఆమె చెప్పారు. అంతే కాదు ఏడాదిలో రెండు ఉచిత అంబులెన్స్ సర్వీసులను సైతం వినియోగించుకునే సదుపాయం ఇందులో ఉంది.

'ఈవెన్ హెల్త్‌కేర్' కంపెనీ సైతం మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ సంస్థతో కలసి ఓపీడీ ఇన్సూరెన్స్‌ను అందిస్తోంది. కాకపోతే దీన్ని విడిగా రైడర్ కింద కాకుండా.. ఇండెమ్నిటీ కవర్‌కు యాడాన్‌గా ఆఫర్ చేస్తోంది. రూ.10 లక్షల వరకు ఓపీడీ కవర్ తీసుకోవచ్చు. ప్రీమియం కూడా 35 ఏళ్లలోపు వారికి ఏడాదికి రూ.4,500, 36–49 ఏళ్లలోపు వారికి రూ.10,000, 50 ఏళ్లు మించిన వారికి రూ.19,000 చార్జ్ తీసుకుంటోంది. ఓపీడీలో క్లెయిమ్స్ ఎక్కువ. అందుకే ప్రీమియం కూడా ఎక్కువే. 'ఓపీడీ కవర్‌లో ప్రతి రూ.100 రక్షణ కోసం చెల్లించే ప్రీమియం రూ.50 వరకు ఉంటుంది. ఈ మేరకు పొదుపు చేసుకోవచ్చు' అని సెక్యూర్‌నౌ ఇన్సూరెన్స్ బ్రోకర్ సహ వ్యవస్థాపకుడు కపిల్ మెహతా తెలిపారు. ఉచిత హెల్త్ స్క్రీనింగ్, చెకప్‌ల ద్వారా ఇవి వ్యాధి నివారణను ప్రోత్సహిస్తాయని చెప్పారు. ఓపీడీ రక్షణ ఉంటే.. ఎన్నిసార్లు వైద్యుల వద్దకు వెళ్లి, పరీక్షలు చేయించుకోవాల్సి వచ్చినా నిశ్చింతగా ఉండొచ్చన్నారు.

పనిచేసే సంస్థ నుంచి ఓపీడీ ప్లాన్



కొన్ని బీమా సంస్థలు ప్రైవేటు కంపెనీల ఉద్యోగులకు ఓపీడీ కవరేజీని గ్రూప్ ప్లాన్ కింద ఆఫర్ చేస్తున్నాయి. నోయిడాకు చెందిన అన్మోల్ ఓ ఆర్థిక సేవల కంపెనీలో పనిచేస్తున్నాడు. పనిచేసే సంస్థ నుంచి తనకు, తన తల్లిదండ్రులకు కలిపి ఓపీడీ ప్లాన్ తీసుకున్నాడు. ఏడాదికి కవరేజీ రూ.21,000 కాగా, రూ.11,000 ప్రీమియం చెల్లిస్తున్నాడు. అన్మోల్‌కు 10 శాతం, అతడి తల్లిదండ్రులకు 20 శాతం కో–పే షరతు ప్లాన్‌లో భాగంగా ఉంది. అంటే ప్రతీ బిల్లులోనూ ఈ మేరకు అన్మోల్ సొంతంగా చెల్లించుకోవాలి. అయినప్పటికీ ఏటా రూ.18,000 విలువైన ఓపీడీ ప్రయోజనాలను తాను పొందుతున్నట్టు తెలిపాడు. అంటే ప్రీమియం చెల్లింపులు పోను అతడికి నికర మిగులు రూ.7,000గా ఉందని అర్థమవుతోంది. కొన్ని సంస్థలు అయితే ఉచితంగానే తమ ఉద్యోగులకు ఓపీడీ కవర్‌ను ఆఫర్ చేస్తున్నాయి. కొన్ని ఓపీడీ ప్లాన్లు కళ్లు, దంత సంబంధిత చికిత్సలకు సైతం కవరేజీనిస్తున్నాయి.

గో ఫ్యాషన్ (ఇండియా) | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 902
టార్గెట్: రూ. 1,127
ఎందుకంటే: దేశీయంగా వేగవంత వృద్ధిలో ఉన్న మహిళల లోదుస్తుల విభాగంలో గో ఫ్యాషన్(ఇండియా) మార్కెట్ లీడర్‌గా కొనసాగుతోంది. గో కలర్స్ బ్రాండుతో భారీ స్థాయిలో కార్యకలాపాలు విస్తరించింది. 2020కల్లా దేశీయంగా మహిళల బాటమ్ వేర్ విభాగం రూ. 13,500 కోట్ల మార్కెట్ విలువను సాధించింది. దీనికితోడు పరిశ్రమలోనే అత్యధికస్థాయిలో వార్షికంగా 12 శాతం ప్రగతిని సాధిస్తోంది. దీంతో ఈ విభాగంలో ముందస్తుగానే కార్యకలాపాలు ప్రారంభించిన కంపెనీగా గో ఫ్యాషన్ ప్రయోజనం పొందుతోంది. అంతేకాకుండా రెండు ప్రధాన వ్యూహాలతో మార్కెట్ వాటాను పెంచుకుంటోంది. ప్రత్యక్షంగా కస్టమర్లకు ప్రొడక్టులను విక్రయించడం(డీ2సీ)తోపాటు.. 120 రంగులలో 50కుపైగా మోడళ్లతో ప్రొడక్టులను రూపొందిస్తోంది. వెరసి మహిళల బాటమ్ వేర్ విభాగంలో 2019–20కల్లా 8 శాతం మార్కెట్ వాటాను అందుకుంది. అమ్మకాలకు ప్రత్యేకించిన బ్రాండ్ ఔట్‌లెట్(ఈబీవో) విధానాన్ని అమలు చేస్తోంది. తద్వారా కంపెనీకి కీలకమైన విక్రయాలలో వృద్ధిని సాధిస్తోంది. ఇందుకు ఈబీవోలపై పెట్టుబడుల సమర్థవంత వినియోగం దన్నుగా నిలుస్తోంది. దీంతో 44 శాతం పన్ను తదుపరి ఆర్‌వోసీఈసహా.. 18–24 నెలల పేబ్యాక్ గడువును సాధిస్తోంది. 2025 మార్చికల్లా గో కలర్స్ 180 పట్టణాలలో 776 ఈబీవోలను నిర్వహిస్తోంది. ఇకపై ప్రతీ ఏడాది 20 నుంచి 25 కొత్త పట్టణాలలో కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా 2028కల్లా 250 పట్టణాలకు విస్తరించాలని చూస్తోంది. ఇందుకు అనుగుణంగా ఏడాదికి 100 స్టోర్లు చొప్పున ఏర్పాటు చేసే ప్రణాళికల్లో ఉంది. కార్యకలాపాల నిర్వహణపై పటిష్ఠ నగదు ఆర్జనను సాధిస్తుండటం సానుకూల అంశం!

సీఈ ఇన్ఫో సిస్టమ్స్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 1,793
టార్గెట్: రూ. 2,620
ఎందుకంటే: మ్యాప్‌మైఇండియా(ఎంఎంఐ) బ్రాండ్ కంపెనీ సీఈ ఇన్ఫో సిస్టమ్స్ యాజమాన్యం ఇటీవల ఇన్వెస్టర్ల సమావేశంలో మరోసారి 2027–28 ఏడాదికల్లా రూ. 1,000 కోట్లకుపైగా ఆదాయ లక్ష్యాన్ని పునరుద్ఘాటించింది. 35 శాతానికిపైగా నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లతో లక్ష్యాన్ని సాధించాలని ఆశిస్తోంది. ఇందుకు పటిష్ఠ ఆర్డర్‌బుక్ తోడ్పాటునివ్వనున్నట్లు భావిస్తోంది. 2028 ఏప్రిల్‌కల్లా ఆర్డర్‌బుక్ విలువ రూ. 2,000 కోట్లకుపైగా పుంజుకోగలదని అంచనా వేస్తోంది. 2028కల్లా ఆటో రంగంలో అటాచ్ రేట్లు 23 శాతానికి బలపడనున్నట్లు ఎంఎంఐ భావన. ఇందుకు 5.4 మిలియన్ల పరిమాణాన్ని(90 శాతం మార్కెట్ వాటా) అందుకోవలసి ఉంటుంది. భారత్‌తరహాలోనే ఆగ్నేయాసియా దేశాల్లో(ఎస్‌ఈఏ) అవకాశాలు లభించనున్నట్లు కంపెనీ భావిస్తోంది. హ్యుందాయ్ ఆటోఎవర్‌తో ఏర్పాటు చేసిన భాగస్వామ్య సంస్థ(జేవీ) టీఎల్‌టీ 2030కల్లా మ్యాప్ డేటాలో 50 శాతం, సాఫ్ట్‌వేర్‌లో 30 శాతం మార్కెట్ వాటాను లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాంతానికి యూనిఫైడ్ మ్యాప్ కోసం జేవీ కృషి చేస్తోంది. తద్వారా ఆటో దిగ్గజాలకు అభివృద్ధి వ్యయాలను ఆదా చేసే యోచనలో ఉంది. ఎంటర్‌ప్రైజ్ విభాగంలో వెర్టికలైజేషన్‌తో పాటు, వాలెట్ షేర్‌ను పెంచుకోవడంపై ఎంఎంఐ దృష్టి పెట్టింది. ఎస్‌ఈఏలోనూ విస్తరించాలని చూస్తోంది. ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం ఏర్పాటు చేసిన అనుబంధ సంస్థ ఎండీటీ సమీకృత ప్లాట్‌ఫామ్ ద్వారా ఐపీ ఆధారిత సొల్యూషన్లు సమకూర్చుతోంది. పటిష్ఠ ఎగ్జిక్యూషన్‌ను అమలు చేస్తోంది. 2028కల్లా కస్టమర్ల సంఖ్య 500కు చేరనున్నట్లు కంపెనీ ఊహిస్తోంది. కేవలం సర్వీసులపైనే దృష్టిపెట్టకుండా కొత్త క్లయింట్లను సాధించడం ద్వారా లాభదాయకతను భారీగా పెంచుకునే అవకాశముంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

న్యూ ఫండ్ ఆఫర్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ యాక్టివ్ మొమెంటం ఫండ్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ తాజాగా యాక్టివ్ మొమెంటం ఫండ్‌ను ప్రవేశపెట్టింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్‌ఎఫ్‌వో) జూలై 22తో ముగుస్తుంది. నిలకడగా వృద్ధి చెందుతూ, మరింతకాలం పెరిగే ధోరణులు కనపరుస్తున్న స్టాక్స్‌లో ఇది ఇన్వెస్ట్ చేస్తుంది. దేశీ ఈక్విటీ మార్కెట్లో వివిధ కాలాల్లో వివిధ స్టాక్స్, రంగాలు ఇలాంటి ధోరణులను కనపరుస్తుంటాయని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ఈడీ శంకరన్ నరేన్ తెలిపారు. వాటి వృద్ధి ధోరణులను అందిపుచ్చుకుని, ఇన్వెస్టర్లకు మెరుగైన రాబడులు అందించాలనేది ఈ స్కీమ్ లక్ష్యమని వివరించారు. వివిధ రంగాలు, మార్కెట్ క్యాప్స్‌వ్యాప్తంగా ఇన్వెస్ట్ చేసే వెసులుబాటు ఈ పథకానికి ఉంటుంది. దీనితో విస్తృత స్థాయిలో పెట్టుబడులు పెట్టే అవకాశాలు ఇన్వెస్టర్లకు లభిస్తాయి. ఈ ఫండ్‌కి నిఫ్టీ 500 టీఆర్‌ఐ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉంటుంది. కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ఫండ్ మేనేజర్లుగా మనస్వి షా, షర్మిలా డిసిల్వా ఉంటారు.

ఫ్రాంక్లిన్ ఇండియా మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్

ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఇండియా తమ మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్‌ను ప్రవేశపెట్టింది. ఇది ఈక్విటీ, డెట్, కమోడిటీలవ్యాప్తంగా వివిధ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ ఈక్విటీ సెగ్మెంట్లో దీర్ఘకాలికంగా పెట్టుబడి వృద్ధికి దోహదపడే వ్యూహాలను అమలు చేస్తుంది. అలాగే డెట్, మనీ మార్కెట్ సాధనాలు, పసిడి లాంటి కమోడిటీల్లోనూ ఇన్వెస్ట్ చేయడం ద్వారా నష్టభయాల నుంచి పోర్ట్‌ఫోలియోకు రక్షణ కల్పిస్తుంది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జూలై 25తో ముగుస్తుంది. ఎన్‌ఎఫ్‌వో సందర్భంగా రూ. 10కి యూనిట్ లభిస్తుంది. కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ప్రస్తుతం ఈక్విటీల వేల్యుయేషన్లు అధిక స్థాయిలో ఉంటూ, బాండ్ ఈల్డ్‌లు స్థిరపడుతున్న తరుణంలో, వివిధ సాధనాలతో కూడుకున్న పోర్ట్‌ఫోలియో ఉంటే రిస్కుకు తగ్గట్లుగా మరింత అధిక రాబడులు పొందేందుకు వీలవుతుందని సంస్థ ప్రెసిడెంట్ అవినాశ్ సత్వాలేకర్ తెలిపారు.

ఆరు నెలల కోసం ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?

Q & A




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

కొన్ని పథకాల ఎన్‌ఏవీ తక్కువగా, కొన్నింటి ఎన్‌ఏవీ చాలా ఎక్కువగా ఉన్నట్టు గమనించాను. ఎన్‌ఏవీ తక్కువగా ఉన్న పథకాలు చౌక అని అర్థమా?
– భైరవ్ స్వామి

ప్రతి మ్యూచువల్ ఫండ్‌కు సంబంధించి నెట్ అస్సెట్ వ్యాల్యూ (ఎన్‌ఏవీ) ఉంటుంది. ఎన్‌ఏవీ తక్కువ ఉంటే అది ఇతర పథకాలతో పోలిస్తే చౌక అని కొందరు భావిస్తుంటారు. కానీ, పెట్టుబడుల కోసం ఒక మ్యూచువల్ ఫండ్ పథకాన్ని ఎంపిక చేసుకోవడానికి ఎన్‌ఏవీని పరిగణనలోకి తీసుకోకూడదు. ఒక మ్యూచువల్ ఫండ్ పథకం పెట్టుబడుల మార్కెట్ విలువను, ఈ పథకంలోని మొత్తం యూనిట్లతో భాగించినప్పుడు వచ్చే విలువను ఎన్‌ఏవీగా పరిగణిస్తుంటారు. ఒక పథకానికి సంబంధించి ఒక యూనిట్ విలువగా దీన్ని చూడాలి. ఒక కంపెనీ షేరు ధర మాదిరే, ఒక ఫండ్ యూనిట్ ధరను ఎన్‌ఏవీగా అనుకోవచ్చు. ఒక ఫండ్ యూనిట్‌ను కొనుగోలు చేసుకోవడానికి ఎంత పెట్టుబడి పెట్టాలో ఇది తెలియజేస్తుంది. అలాగే, ఒక యూనిట్‌ను విక్రయిస్తే ఎంత వస్తుందో దీన్ని చూసి తెలుసుకోవచ్చు.

రెండు మ్యూచువల్ ఫండ్స్ పథకాల ఎన్‌ఏవీని పోల్చి చూడకూడదు. ఎన్‌ఏవీ చౌకగా ఉంటే అది మెరుగైన పథకం కావాలనేమీ లేదు. ఒక పథకం నిర్వహణలోని పెట్టుబడుల మార్కెట్ విలువ మారినప్పుడు ఎన్‌ఏవీలో మార్పు కనిపిస్తుంది. ఎప్పటికప్పుడు వచ్చే తాజా పెట్టుబడులు, అదే పథకం నుంచి ఇన్వెస్టర్లు ఉపసంహరించుకునే మొత్తం కూడా ప్రభావం చూపిస్తుంది. ఉదాహరణకు ఎక్స్ అనే ఫండ్ ఎన్‌ఏవీ రూ.20 ఉంది. వై అనే ఫండ్ ఎన్‌ఏవీ రూ.100 ఉంది. ఏడాది కాలంలో ఈ రెండు పథకాలు ఒకే విధంగా 25 శాతం రాబడి ఇచ్చాయని అనుకుందాం. అప్పుడు ఎక్స్ ఫండ్ ఎన్‌ఏవీ రూ.20 నుంచి రూ.25 అవుతుంది. వై ఫండ్ ఎన్‌ఏవీ రూ.100 నుంచి రూ.125 అవుతుంది. ఆయా పథకాల పెట్టుబడులపై వచ్చిన రాబడి ఆధారంగా ఎన్‌ఏవీలో మార్పులు ఉంటాయి. అంతేకానీ, ఎన్‌ఏవీ తక్కువగా ఉంటే చౌక, ఆకర్షణీయమని అనుకోవద్దు.



రూ.50,000 మొత్తాన్ని మూడు నుంచి ఆరు నెలల కాలానికి ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. మెరుగైన రాబడుల కోసం ఈ మొత్తాన్ని ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి?
– అనూష

స్వల్ప కాలం కోసం అయితే మొదట పెట్టుబడికి భద్రత ఎక్కువ ఉండేలా చూసుకోవాలి. రాబడుల కంటే పెట్టుబడిని కాపాడుకునే విధంగా వ్యూహం ఉండాలి. కనుక ఈ మొత్తాన్ని మీరు బ్యాంకు ఖాతాలోనే కొనసాగించుకోవచ్చు. లేదంటే ఆరు నెలల కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. వీటిల్లో రాబడులు తక్కువే అయినా హామీతో కూడినవి. పెట్టుబడికి భద్రత ఎక్కువ. కావాల్సినప్పుడు పెట్టుబడిని రాబడితో పాటు సులభంగా వెనక్కి తీసుకోవచ్చు. బ్యాంకులో చేసే డిపాజిట్ రూ.5 లక్షల వరకు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ నుంచి బీమా ఉంటుంది. ఇవి కాకుండా లిక్విడ్ ఫండ్స్‌లోనూ ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇవి ట్రెజరీ బిల్లులు, ప్రభుత్వ సెక్యూరిటీలు, రెపో సర్టిఫికెట్లలో ఇన్వెస్ట్ చేస్తాయి. గరిష్ఠంగా 91 రోజుల కాల వ్యవధి కలిగిన సెక్యూరిటీల్లోనే లిక్విడ్ పథకాలు ఇన్వెస్ట్ చేస్తాయి. బ్యాంకు డిపాజిట్ల కంటే లిక్విడ్ ఫండ్స్‌లో కొంచెం అదనపు రాబడి వస్తుంది. కాకపోతే పెట్టుబడి భద్రతకు అవి హామీ ఇవ్వవు.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో..
క్యూ1 ఫలితాలే మార్కెట్లకు దిక్సూచి
స్థిరత్వంతోపాటు మెరుగైన రాబడి

క్లుప్తంగా...

16 పీఎంఎల్‌ఏ స్పెషల్ కోర్టుల ఏర్పాటు

- ఇందులో తెలంగాణకు 14, విశాఖపట్నంలో 2
- త్వరితగతిన కేసుల విచారణకు ఈడీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్ : మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ)కింద నమోదైన కేసుల విచారణను వేగవంతం చేయడానికి ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా తెలంగాణలో 14, విశాఖపట్నంలో రెండు కలిపి మొత్తం 16 పీఎంఎల్‌ఏ స్పెషల్ కోర్టులను ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఈడీ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. పీఎంఎల్‌ఏ కేసుల సంఖ్యకు తగ్గట్టుగా కోర్టులు లేని రాష్ట్రాల్లో అదనంగా ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. తెలంగాణ, విశాఖతోపాటు రాజస్తాన్‌లో ప్రస్తుతం ఉన్న జైపూర్ కోర్టుకు అదనంగా మరో ఐదు కోర్టులు కేటాయించినట్టు పేర్కొంది. గోవాలో ఉత్తర గోవా కోసం ఒక ప్రత్యేక కోర్టును ప్రకటించారు. ప్రత్యేక కోర్టులతో పీఎంఎల్‌ఏ కేసులలో విచారణ వేగవంతం అవుతుందని ఈడీ అధికారులు తెలిపారు.

16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం

- 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం
- రెండు రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు



తిరుమల/తిరుపతి అన్నమయ్య సర్కిల్: శ్రీవారి ఆలయంలో జూలై 16న ఆణివార ఆస్థానం జరగనుంది. ఈ సందర్భంగా జూలై 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ కారణంగా రెండు రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలను ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా ఇతరులకు టీటీడీ రద్దు చేసింది. జూలై 14, 15వ తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించిన సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సహకరించాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

శ్రీశైలంలో ఉచిత స్పర్శదర్శనం నిలిపివేత

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రానికి భక్తుల రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో ఉచిత స్పర్శ దర్శనాన్ని నిలిపివేస్తున్నట్టు ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీశైల జలాశయ క్రస్ట్ గేట్లు తెరచినందున రెండు రోజులుగా భక్తుల రద్దీ అధికంగా ఉంటోందని పేర్కొన్నారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నవేళలలో కల్పించే ఉచిత స్పర్శ దర్శనానికి నిలిపివేశామన్నారు.




పొద్దు జారి.. ఇంటి దారి..

ఉదయాస్తమయాలు ఆద్యంతం ఆహ్లాదం మిగుల్చుతాయి. ఓ ఆదివాసీ గిరిజనుడు రోజంతా తన మేకలను అటవీ ప్రాంతంలో మేత కోసం తీసుకెళ్లి.. పొద్దువాలే వేళ ఇంటికి తిరుగు పయనమవుతున్న ఈ దృశ్యం కూడా అలాంటిదే. ఆదిలాబాద్ రూరల్ మండలం కేబీ కాంప్లెక్స్ సమీపం నుంచి టెక్డిగూడ గ్రామానికి వెళ్తుండగా కనువిందు చేసిన దృశ్యమిది.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

టుడేస్ గ్రాఫిక్..



ఏసీ లారీలు..

రోడ్ల మీదికి వస్తున్న ఏసీ కేబిన్ లారీలు

- అక్టోబర్ ఒకటి నుంచి ట్రక్కుల్లో ఏసీ తప్పనిసరి
- ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం
- విపరీత వేడి మధ్య పనిచేసే డ్రైవర్లకు ఊరట
- ఏసీ కేబిన్లపై లారీ యజమానుల్లో భిన్న వాదనలు



సాక్షి, హైదరాబాద్: భగభగమండే ఎండ వేడి.. బాగా వేడెక్కే ఇంజిన్ సెగ.. ఒళ్లంతా చెమటలతో తడిసి ముద్దయినా అలాగే ముందుకు సాగుతుంటారు లారీ డ్రైవర్లు. రోజులు, నెలల తరబడి వేడి సెగతో పోరాటం చేస్తూ విపరీతమైన అలసటకు గురవుతుంటారు. ఈ పరిస్థితి కూడా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని లారీ కేబిన్‌లలో కూడా ఎయిర్ కండిషన్ (ఏసీ) వసతి కల్పించాలని కేంద్రం నిర్ణయించిన సంగతి తెలిసిందే. వచ్చే అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ఏసీ కేబిన్‌తో కూడిన లారీలనే విక్రయించాలని కేంద్రం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. అందుకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, ప్రధాన లారీ తయారీ కంపెనీలు ఏసీలతో కూడిన ట్రక్కులను ఇప్పటికే అందుబాటులోకి తెస్తున్నాయి. అవి లారీ డ్రైవర్లకు కొత్త అనుభవాన్ని పంచుతున్నాయి.

ముందుగానే మొదలు

అక్టోబర్ ఒకటి నుంచి విక్రయించే ప్రతి సరుకు రవాణా ట్రక్కు కేబిన్‌లో ఏసీ తప్పనిసరిగా ఉండాలని కేంద్రం నోటిఫికేషన్ జారీచేసింది. ఏసీ కేబిన్ ఉన్న ట్రక్కులకే రోడ్డెక్కే అనుమతి ఉంటుంది. దీంతో ప్రధాన కంపెనీలు గడువు కంటే ముందే కొత్త ట్రక్కులను ఏసీ వసతితో అమ్మటం ప్రారంభించాయి. టాటా, అశోక్ లేలాండ్, భారత్ బెంజ్, ఐషర్ లాంటి ప్రధాన కంపెనీల ట్రక్కులు ఏసీతోనే వస్తున్నాయి. దేశవ్యాప్తంగా నిత్యం దాదాపు కోటి టన్నుల సరుకు వివిధ ప్రాంతాలకు ట్రక్కుల ద్వారా రవాణా అవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఇది ఆరు లక్షల టన్నుల వరకు ఉంటోందని అంచనా. తెలంగాణలో 5.8 లక్షల సరుకు రవాణా వాహనాలుంటే వీటిల్లో మూడు లక్షల వరకు లారీలే. రెండు తెలుగు రాష్ట్రాల్లో ట్రక్కుల సంఖ్య దాదాపు ఏడు లక్షల వరకు ఉంది. ఈ నేపథ్యంలో పాత లారీలకు కూడా ఏసీ వసతి కల్పించాలని డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు.

భిన్న వాదనలు

మన దేశంలో వేసవిలో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీ సెల్సియస్ దాటుతాయి. మరోవైపు భారీ లోడ్‌ను మోయాల్సి రావటంతో ట్రక్కుల ఇంజిన్లు ప్రయాణంలో విపరీతంగా వేడెక్కుతాయి. ఆ వేడి ట్రక్కు కేబిన్‌లోకి చేరుతుంది. అటు ఎండ, ఇటు ఇంజిన్ వేడితో డ్రైవర్లు అతలాకుతలం అవుతుంటారు. అధిక ఉష్ణోగ్రతలు డ్రైవర్లలో అలసట, డీహైడ్రేషన్, ఏకాగ్రత తగ్గడానికి కారణమవుతోంది. ఇది రోడ్డు ప్రమాదాలకు దారితీస్తోంది. కేబిన్‌లో ఏసీ అమర్చితే వేడి ప్రభావం తగ్గటంతో డ్రైవర్లు త్వరగా అలసిపోతారు. డ్రైవింగ్‌పై వారికి నియంత్రణ పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఏసీల వల్ల ప్రమాదాలు కూడా పెరుగుతాయని కొందరు వాదిస్తున్నారు. రోజుల తరబడి వాహనం నడిపే ట్రక్కు డ్రైవర్లు ఏసీ ద్వారా వచ్చే చల్లదనం వల్ల తొందరగా నిద్రలోకి జారుకునే ప్రమాదం ఉందని, ఇది ట్రక్కు ప్రమాదాలను మరింత పెంచుతుందని పేర్కొంటున్నారు.

కేబిన్‌లో ఏసీ ప్రమాదకరమే

లారీ కేబిన్‌లో ప్రస్తుతం వేడి ఎక్కువగా ఉంటున్న మాట నిజమే. దీన్ని నియంత్రించేందుకు ఇంజిన్ నుంచి తక్కువ వేడి వచ్చేలా లారీ తయారీలో మార్పులు సూచించాలి. అంతేతప్ప ఏసీ వసతి ఉంటే ఎక్కువ దూరం ట్రక్కు నడిపే డ్రైవర్ సులభంగా నిద్రలోకి జారుకునే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం డ్రైవర్ పక్కన కిటికీ తెరిచి ఉండి గాలి విసురుగా వచ్చి మొహానికి తగలటం వల్ల డ్రైవర్‌కు నిద్ర మత్తు వీడుతుంది. ఏసీ వల్ల కిటికీలు మూసి ఉంటాయి కాబట్టి నిద్రలోకి జారుకుంటారు. అందుకే ఈ నిర్ణయం సరికాదని ఇప్పటికే మేం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లాం.

– భాస్కర్‌రెడ్డి, తెలంగాణ లారీ యజమానుల సంఘం మాజీ అధ్యక్షుడు

ఏసీతో డ్రైవర్లలో అలసట ఉండదు

అధిక వేడి మధ్య లారీలు నడపటం డ్రైవర్లను తీవ్ర చికాకుకు గురి చేస్తోంది. దీనివల్ల వారిలో ఏకాగ్రత తగ్గి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుంది. ఏసీ ఏర్పాటుతో వారికి ఆ సమస్య ఉండదు. అయితే, ఏసీ వల్ల నిద్రలోకి జారుకోకుండా కొంత అప్రమత్తత అవసరం. ఏసీ లారీలు పూర్తిగా రోడ్కెక్కితే పర్యవసానాలేంటో తెలుస్తుంది. కానీ, డ్రైవర్ల ఇబ్బందులు తగ్గి సరుకు రవాణా మరింత పెరగటం మాత్రం ఖాయం.

– రాజేందర్‌రెడ్డి, తెలంగాణ లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు.

రైళ్లలో సీసీటీవీలు

- పైలట్ ప్రాజెక్టు విజయవంతం
- దేశవ్యాప్తంగా అమలుకు నిర్ణయం
- 74 వేల బోగీలు, 15 వేల లోకోమోటివ్‌లలో కెమెరాలు
- ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ద్వారాల వద్ద ఏర్పాటు
- 100 కిలోమీటర్ల వేగంలోనూ స్పష్టమైన చిత్రాలు వచ్చేలా నాణ్యత
- అత్యాధునిక ఫీచర్ల కెమెరాలు ఏర్పాటు చేయాలని రైల్వే మంత్రి ఆదేశం
- ఒక్కో ప్రయాణికుల బోగీలో 4, లోకోమోటివ్‌లో 6 కెమెరాలు
- సీసీ కెమెరాలతో దోపిడీలు, దాడులు తగ్గుతాయని అంచనా



న్యూఢిల్లీ: రైళ్లలో త్వరలో సీసీటీవీ కెమెరాలు దర్శనమివ్వనున్నాయి. భారతీయ రైల్వేస్ పరిధిలో ఉన్న మొత్తం 74 వేల ప్యాసింజర్ బోగీలు, 15 వేల సరుకు రవాణా లోకోస్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయనున్నట్లు రైల్వేశాఖ ఆదివారం ప్రకటించింది. ఉత్తర రైల్వే విభాగంలో కొన్ని ప్రయాణికుల బోగీలు, లోకోల్లో ప్రయోగాత్మకంగా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల వల్ల సత్ఫలితాలు వచ్చాయని, త్వరలో అన్ని బోగీల్లో కెమెరాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. బోగీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఆ శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్‌సింగ్ బిట్టు శనివారం రైల్వే శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పైలట్ ప్రాజెక్టులో వచ్చిన ఫలితాలను సమీక్షించి, అన్ని బోగీల్లో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో రైల్వేశాఖ తెలిపింది.

ప్రయాణికులకు భద్రత

బోగీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల ప్రయాణికుల భద్రత మరింత పెరుగుతుందని రైల్వేశాఖ అధికారులు చెబుతున్నారు. 'సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల ప్రయాణికుల భద్రత మరింత పెరుగుతుంది. బోగీల్లో దోపిడీలకు పాల్పడే దొంగలు, వ్యవస్థీకృత ముఠాల ఆగడాలకు అడ్డుకట్ట వేయవచ్చు. ప్రయాణికుల ప్రైవసీకి ఇబ్బంది కలగకుండా సీసీ కెమెరాలను బోగీల ద్వారాల వద్దనే ఏర్పాటు చేస్తాం'అని తెలిపారు.

ఒక్కో బోగీలో 4 కెమెరాలు

ప్రయాణికుల రైళ్లలో ఒక్కో బోగీలో నాలుగు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. బోగీకి ఉండే రెండు ద్వారాల్లో ఒక్కో ద్వారం వద్ద రెండు చొప్పున డోమ్ టైప్ అత్యాధునిక కెమెరాలు అమర్చుతారు. లోకోమోటివ్‌లలో 6 సీసీ కెమెరాలు ఉంటాయి. ముందు, వెనుక భాగాల్లో ఒక్కోటి, కార్‌కు రెండు వైపులు రెండు డోమ్ టైప్ కెమెరాలు ఉంటాయి. వీటికి అదనంగా రెండు డెస్క్ మౌంటెడ్ మైక్రోఫోన్ కెమెరాలు కూడా ఏర్పాటుచేస్తారు. ఈ సీసీ కెమెరాలన్నీ ఎస్‌టీక్యూసీ సర్టిఫికేషన్‌తో అత్యాధునిక ఫీచర్లతో ఉంటాయని రైల్వేశాఖ అధికారులు తెలిపారు. కెమెరాల నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీపడొద్దని రైల్వే మంత్రి సూచించినట్లు చెప్పారు. రైలు గంటలకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నా, వెలుతురు సరిగా లేకపోయినా సీసీ కెమెరా ఫుటేజీ అత్యంత స్పష్టంగా ఉండేలా నాణ్యమైన కెమెరాలు అమర్చాలని కోరినట్లు వెల్లడించారు. ఇండియా ఏఐ మిషన్ సహకారంతో సీసీ కెమెరాల డేటా సేకరణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించుకోవాలని అశ్వినీ వైష్ణవ్ సూచించినట్లు పేర్కొన్నారు.

ట్రావెల్ యాజ్ యూ లైక్ టికెట్ ధరల పెంపు

సాక్షి, హైదరాబాద్: నెల రోజుల క్రితం బస్‌పాస్ ధరలను సవరించి ప్రయాణికులపై భారం మోపిన తెలంగాణ ఆర్టీసీ.. తాజాగా ట్రావెల్ యాజ్ యూ లైక్ (టీఏవైఎల్–టీ24) టికెట్ ధరలను పెంచేసింది. సాధారణ, వృద్ధులు–మహిళలు, చిన్నారుల.. కేటగిరీలకు చెందిన ఈ టికెట్ ధరలను పెంచి అమలులోకి తెచ్చింది. రూ.120గా ఉన్న టీఏవైఎల్ అడల్ట్ టికెట్ ధరను రూ.150కి, రూ.100గా ఉన్న టీఏవైఎల్ వృద్ధులు– మహిళల టికెట్‌ను రూ.120కి, రూ.80గా ఉన్న టీఏవైఎల్ చిన్నారుల టికెట్‌ను రూ.100కి పెంచింది. ఈ టికెట్‌తో కొన్ని నిర్ధారిత ప్రాంతాల్లో 24 గంటలపాటు ఏ బస్సుల్లోనైనా, ఎన్నిసార్లయినా తిరిగే వీలుంటుంది. దీంతో ఏదైనా ముఖ్యమైన పనితో రోజులో ఎక్కువ పర్యాయాలు బస్సులెక్కాల్సిన వాళ్లు ఈ టికెట్ కొని ప్రయాణిస్తుంటారు. ధరల సవరణతో ఆర్టీసీకి ఆదాయం గణనీయంగా పెరగనుంది. నెల రోజుల క్రితం బస్‌పాస్ ధరలను 20 శాతం పెంచిన ఆర్టీసీ, టికెట్ ధరలను కూడా సమీప మొత్తానికి రౌండాఫ్ చేసింది. కేంద్రప్రభుత్వం టోల్‌ధరలను సవరించిన నేపథ్యంలో, ఆర్టీసీ కూడా టోల్ సెస్‌ను పెంచిన విషయం తెలిసిందే.

తిరుపతి - చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి అన్నమయ్య సర్కిల్: ఆగస్టులో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు దక్షిణమధ్య రైల్వే తెలిపింది. ప్రతి సోమ, శనివారాల్లో తిరుపతి నుంచి చర్లపల్లికి (07018), ప్రతి శుక్ర, శనివారాల్లో చర్లపల్లి నుంచి తిరుపతికి (07017) రైళ్లు అందుబాటులో ఉంటాయి. ఈ రైళ్లు మల్కాజిగిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తి రోడ్, గద్వాల్, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట స్టేషన్లలో ఆగుతాయి. ప్రతి బుధవారం చర్లపల్లి నుంచి తిరుపతికి రైలు (07251), ప్రతి గురువారం తిరుపతి నుంచి చర్లపల్లికి రైలు (07252) రైళ్లు నడువనున్నాయి. ఈ ప్రత్యేక రైళ్లు జనగాం, కాజీపేట, వరంగల్, నెక్కొండ, మహబూబాబాద్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, రేణిగుంట స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ఏఐతో లే'ఆఫ్ సోపాలు'!

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో కొలువుల కోతే!

- ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి
- ఉద్యోగులను తగ్గించుకోవాలని భావిస్తున్న 41శాతం కంపెనీలు
- రానున్న ఐదేళ్లలో 9.2 కోట్ల మంది ఉద్యోగాలు హుష్!
- కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగులపై ఏఐ ట్రాకింగ్ టెక్నాలజీ నిఘా
- అవేర్, వాల్‌మార్ట్, డెల్టా, టి-మొబైల్, చెవ్రాన్, స్టార్‌బక్స్, గూగుల్‌లోనూ నిత్య పర్యవేక్షణ
- లక్ష్యాలను చేరుకోలేని సిబ్బందికి నేరుగా ఊస్టింగ్ లెటర్లు పంపుతున్న కృత్రిమ మేధ





"రానున్న ఐదేళ్లలో అన్ని ఎంట్రీ లెవల్ వైట్ కాలర్ ఉద్యోగాల్లో సగాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) భర్తీ చేస్తుంది. అంటే సాధారణ ఉద్యోగులు కొలువులు కోల్పోయి రోడ్డున పడతారు. నిరుద్యోగం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఇది కనీసం 10 శాతం నుంచి 20 వరకూ ఉండవచ్చు.'' ఈ మాటలు చెప్పింది మరెవరో కాదు ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మాన్. దీంతో ప్రపంచ వ్యాప్తంగా యువతరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ప్రస్తుతం టెక్ ప్రపంచంలో ఏఐ మాటే ఎక్కువగా వినిపిస్తోంది. రానున్న రోజుల్లో ప్రపంచాన్ని శాసించే దిశగా ఏఐ అడుగులు వేస్తోంది. 2029 నాటికి మానవ మేధస్సును కృత్రిమ మేధ అధిగమిస్తుందని ఎలన్ మస్క్ కూడా వ్యాఖ్యానించడం ఆందోళన కలిగిస్తోంది. ఏఐ సాంకేతికత వల్ల అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటాయని, 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 9.2 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోతారని తాజా అధ్యయనాల సారాంశం. అంతర్జాతీయంగా పలు కార్పొరేట్ సంస్థల్లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు దీనికి ఊతమిస్తున్నాయి. ఈ ఏడాది భారీ సంఖ్యలో టెక్ లేఆఫ్స్ ఉండబోతున్నాయని సమాచారం.

- సాక్షి, అమరావతి

ప్రతి సంస్థలోనూ ఉద్యోగుల పనితీరుపై పర్యవేక్షణ సర్వసాధారణం. అయితే కార్యాలయంలో పని గంటలు మొదలైనప్పటి నుంచి పూర్తయ్యే వరకూ ప్రతి ఉద్యోగి కదలికలనూ ఏఐ ట్రాక్ చేయడం అనేది ఇప్పుడు కార్పొరేట్ సంస్థల్లో కొత్తగా మొదలైంది. పనితీరు మదింపు తర్వాత సంస్థ లక్ష్యాలను చేరుకోలేని వారికి కృత్రిమ మేధ

వెంటాడే ఏ 'ఐ': నేరుగా ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు (డిస్మిస్ ఆర్డర్) ఆదేశాలను యాజమాన్యంతో సంబంధం లేకుండానే వారి ఈ మెయిల్‌కు పంపిస్తుందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. వాల్‌మార్ట్, డెల్టా, చెవ్రాన్, స్టార్‌బక్స్, అవేర్, టి-మొబైల్ వంటి ప్రముఖ సంస్థలూ ఉద్యోగుల పనితీరు పర్యవేక్షణకు ఏఐని ఉపయోగిస్తున్నాయి. గూగుల్ క్లౌడ్ హెచ్ఆర్ బృందం వారి నియామక ప్రక్రియను మార్చడానికి, ఉద్యోగుల ఆన్‌బోర్డింగ్‌ను వేగవంతం చేయడానికి ఏఐని వాడుతున్నారు. అయితే ఇలాంటి చర్యల వల్ల పనితీరు మెరుగుపడదు సరికదా ఉద్యోగులను మానసికంగా ప్రభావితం చేస్తాయని 'కార్నెల్' పరిశోధనలో తేలింది.

జూనియర్లకు కష్టకాలం

ఏఐ ట్రాకింగ్ వల్ల ప్రపంచవ్యాప్తంగా టెక్, ఇతర ఇండస్ట్రీల్లో వేల సంఖ్యలో జూనియర్ స్థాయి ఉద్యోగాలు పోయే అవకాశం ఉందని ప్రముఖ వ్యక్తుల వ్యాఖ్యలు, అధ్యయనాలను బట్టి తెలుస్తోంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించిన 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్ రిపోర్ట్ 2025' సర్వే ప్రకారం, ఏఐ టెక్నాలజీ పెరుగుదల వల్ల ప్రపంచంలోని దాదాపు 41 శాతం కంపెనీలు రానున్న ఐదేళ్లలో తమ ఉద్యోగులను తగ్గించుకోవాలనుకుంటున్నాయి. ఇప్పటికే మెటా, మైక్రోసాఫ్ట్, సేల్స్‌ఫోర్స్, బీపీ వంటి కంపెనీలు తమ వర్క్‌ఫోర్స్ నుంచి ఉద్యోగుల్ని తొలగించడం ప్రారంభించాయి. సీఎన్ఎన్ టెలివిజన్‌లో పనిచేస్తున్న 200 మందిని తొలగించింది. స్టార్‌బక్స్ సిబ్బందిని తొలగించింది. ఇంజినీరింగ్, ఉత్పత్తి, కార్యకలాపాలు వంటి విభాగాలలో స్ట్రైప్ 300 మందిని ఇళ్లకు పంపనుంది. యూకే పెట్రోలియం కంపెనీ బీపీ సుమారుగా 7,700 మంది ఉద్యోగుల్ని, కాంట్రాక్టర్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. మెటా కూడా 5శాతం మంది వర్క్‌ఫోర్స్‌ని తగ్గించనుంది. బ్లాక్‌రాక్ 200 మందిని వద్దంటోంది. వాషింగ్టన్ పోస్ట్ 100 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికినట్లు తెలిపింది. ఇవే కాకుండా చాలా కంపెనీలు ఉద్యోగుల్ని తీసేయనున్నాయి. కంపెనీలు తమ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల వైపు వెళ్లడానికి, ఖర్చుల్ని నియంత్రించడానికి ఉద్యోగుల్ని తగ్గించాలని నిర్ణయించుకున్నాయి.

క్లుప్తంగా...

ఉపాధ్యాయులపై బోధనేతర పనిభారం తగ్గించాలి

ప్రభుత్వానికి నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులపై బోధనేతర పనిభారం తగ్గించి, విద్యా బోధనపై దృష్టి సారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదివారం నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బోధనేతర పనులకు నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని కోరింది. అసర్, నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నివేదికలు చూస్తే మన రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు ఆందోళన కలిగిస్తున్నాయని, దీనికి ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులే ముఖ్య కారణమని పేర్కొంది. రాష్ట్రంలో సమష్టిగా విద్యా నాణ్యతను పెంచాల్సిన అవసరం ఉందని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరికృష్ణ, ఎం.శ్రీనివాసరావు, గౌరవ సలహాదారు ఎస్.బాలన్న తెలిపారు. గతంలో డైట్ కళాశాల నిపుణులు విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంపై ఉపాధ్యాయులకు నిరంతరం సూచనలు ఇచ్చేవారని, నేడు రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదన్నారు. డైట్ కళాశాలల్లో 90 శాతం పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థలో కూడా డిప్యూటేషన్ విధానంలో పనిచేస్తున్నారన్నారు. దీంతో విద్యలో ఆశించిన ఫలితాలు రావట్లేదని పేర్కొన్నారు.

ఎంఈవోల బదిలీలు వెంటనే చేపట్టాలి

సాక్షి, అమరావతి: మండల విద్యాశాఖాధికారుల బదిలీలను వెంటనే చేపట్టాలని ఎంఈవో-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం డిమాండ్ చేశారు. ఈ విషయమై విద్యాశాఖ మంత్రికి లేఖ రాసినట్టు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఈవో-1గా పనిచేస్తున్న వారంతా 2017 నుంచి ఒకేచోట పనిచేస్తున్నారని, బదిలీలు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటీవల అన్ని శాఖల్లో బదిలీలు పూర్తిచేశారని, ఎంఈవోలను మాత్రం విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మికుల్ని బెదిరించడం సరికాదు

మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్


సాక్షి, అమరావతి: సమస్యల పరిష్కారం కోసం సమ్మె బాట పట్టిన మున్సిపల్ ఇంజినీరింగ్, శానిటేషన్ వర్కర్స్‌పై బెదిరింపులకు పాల్పడటం సరికాదని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతియుత నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులకు గుంటూరు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు నోటీసులు ఇచ్చి బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ వ్యవహరిస్తున్న తీరు కార్మికులను రెచ్చగొట్టేలా ఉందన్నారు. ఇది కార్మికుల్లో మరింత అశాంతి పెరగటానికి దారితీస్తుందన్నారు.

నౌకాదళానికి నూతన శక్తి నిస్తార్



18న తూర్పు నౌకాదళ అమ్ములపొదిలోకి ఐఎన్ఎస్ నిస్తార్

- స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన యుద్ధ నౌక
- హిందూస్థాన్ షిప్‌యార్డులో రూపకల్పన
- ఇటీవలే భారత నౌకాదళానికి అప్పగింత



ఐఎన్ఎస్ నిస్తార్

సాక్షి, విశాఖపట్నం: భారత్-పాక్ యుద్ధ సమయంలో విశాఖపట్నం సహా తూర్పు తీరాన్ని నాశనం చేయడానికి దూసుకొచ్చిన పీఎన్ఎస్ ఘాజీ జలాంతర్గామిని ఐఎన్ఎస్ నిస్తార్ యుద్ధనౌక ధ్వంసం చేసింది. దాయాది దేశంతో జరిగిన యుద్ధంలో చారిత్రక విజయాన్ని అందించిన ఆ నిస్తార్ 1989లో సేవల నుంచి నిష్క్రమించింది. ఇప్పుడు.. ఆ ప్రతిష్టాత్మక విజయానికి ప్రతీకగా, పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మితమైన కొత్త ఐఎన్ఎస్ నిస్తార్ యుద్ధనౌక భారత నౌకాదళ అమ్ములపొదిలో చేరనుంది. హిందూస్థాన్ షిప్‌యార్డ్ నిర్మించిన ఈ డైవింగ్ సపోర్ట్ వెసల్స్ విశాఖపట్నం కేంద్రంగా సేవలను అందించనుంది.

భారత రక్షణ రంగం నిస్తార్ నిర్మాణంతో కీలక మైలురాయిని అధిగమించింది. 'ఆత్మనిర్భర్ భారత్'లో భాగంగా పూర్తిస్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకల తయారీకి ఉపక్రమించిన హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) సాంకేతిక సంస్కరణలు చేసుకుంటూ.. ఐఎన్ఎస్ నిస్తార్ యుద్ధనౌకను అందుబాటులోకి తీసుకొచ్చింది. దాదాపు 15 సార్లు సీ ట్రయల్స్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ జలాంతర్గామి రక్షణ నౌక.. నౌకాదళ అమ్ములపొదిలో చేరి సేవలందించనుంది. నిస్తార్ క్లాస్ నౌకల రూపకల్పన, సామర్థ్యాలను ధ్రువీకరించేందుకు పలు సార్లు హార్బర్ ట్రయల్స్, సీ ట్రయల్స్ నిర్వహించారు. 'యార్డ్-11190' పేరుతో రూపొందించిన ఈ నౌకలో ఏర్పాటు చేసిన ఎయిర్/మిక్స్‌డ్

ఐఎన్ఎస్ నిస్తార్ స్వరూపమిదీ..

బరువు	9,350 టన్నులు
పొడవు	118.4 మీటర్లు
వెడల్పు	22.8 మీటర్లు
స్వదేశీ పరిజ్ఞానం	80 శాతం
ప్రాజెక్టు వ్యయం	రూ.2,396 కోట్లు



విజయవంతంగా ఎయిర్, మిక్స్ గ్యాస్ డైవింగ్ సిస్టమ్స్ ట్రయల్స్ పూర్తి చేసిన షిప్‌యార్డ్ సిబ్బంది

డైవింగ్ కాంప్లెక్స్ షిప్ 75 మీటర్ల లోతు వరకు డైవింగ్ చేయడానికి వీలు కల్పిస్తుంది. నీటి అడుగున డైవింగ్ సర్వేలు, తనిఖీలు నిర్వహించేందుకు ఇది కీలకంగా వ్యవహరిస్తుంది. సముద్ర గర్భం నుంచి 15 టన్నుల బరువును ఎత్తేందుకు వీలుగా నౌకలో మెరైన్ క్రేన్ కూడా ఏర్పాటు చేశారు.



నిస్తార్‌లో మెగా డీజిల్ జనరేటర్ ప్రారంభిస్తున్న హెచ్ఎస్ఎల్ అధికారులు

ఇటీవలే అన్ని పరీక్షలు విజయవంతంగా పూర్తి చేసిన హిందూస్థాన్ షిప్‌యార్డ్.. నిస్తార్‌ను భారత నౌకాదళానికి అప్పగించింది. ఈ నెల 18న విశాఖపట్నం వేదికగా జరిగే కార్యక్రమంలో ఈ యుద్ధ నౌకను రాజ్‌నాథ్ సింగ్ జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం తూర్పు నౌకాదళం నుంచి నిస్తార్ తన సేవలందిస్తుంది. నిస్తార్ క్లాస్‌లో మరో యుద్ధనౌక ఐఎన్ఎస్ నిపుణ్ కూడా షిప్‌యార్డ్‌లో సిద్ధం అవుతోంది. దీన్ని వచ్చే ఏడాది

18న జాతికి అంకితం చేయనున్న రక్షణ మంత్రి

ఇండియన్ నేవీకి అప్పగించేలా పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో ఒక నౌక తయారు కాగా.. ఇంకొకటి సిద్ధమవుతోంది. సాధారణంగా ప్రతి యుద్ధనౌకలోనూ 5 జనరేటర్లు ఉంటాయి. ఇప్పటివరకు 2 మెగావాట్ల డీజిల్ జనరేటర్లు మాత్రమే వార్‌షిప్స్‌లో వినియోగించారు. కానీ నిస్తార్‌కు మాత్రం 3 మెగావాట్ల జనరేటర్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. నిస్తార్ 300 మీటర్ల లోతు వరకు కార్యకలాపాలు నిర్వహించగలదు. డీప్ సబ్‌మెర్జెన్స్ రెస్క్యూ వెహికల్‌తో అమర్చబడి, నిస్తార్ క్లాస్ షిప్ ఆపదలో ఉన్న జలాంతర్గాములకు కూడా సహాయం చేయగలదు. సముద్రంలో నిరంతర గస్తీ, పరిశోధన, రక్షణ కార్యకలాపాలకు నిస్తార్ కీలకంగా మారనుందని నౌకాదళ వర్గాలు వెల్లడించాయి.

తమ్ముళ్లు తన్నుకున్నారు

చిత్తూరు అర్బన్: తెలుగు తమ్ముళ్లు తన్నుకున్న ఘటన శనివారం చిత్తూరు నగరం గిరింపేటలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు...మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గిరింపేటలో మేకల జయరాజ్ బ్యానర్‌ను ఏర్పాటు చేశాడు. ఈ బ్యానర్‌లో కాజూరు బాలాజీ ఫొటో లేకపోవడంతో... అతడి అనుచరులు యువరాజ్, రజిత, మహేష్‌లు ఆ బ్యానర్‌ను చించేశారు. రాత్రి 10గంటల సమయంలో జయరాజ్ కుటుంబసభ్యులపై వారు కర్రలు, ఇనుప రాడ్, ఇటుకలతో దాడి చేశారు. జయరాజ్ కుటుంబ సభ్యులకు తీవ్రగాయలయ్యాయి. ఇరువర్గాల పరస్పర ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెయింట్ లూయిస్‌లో మహానేతకు ఘన నివాళులు

సాక్షి, అమరావతి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి పురస్కరించుకని సెయింట్ లూయిస్‌లో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి , కడపల మోహన్ రెడ్డి వర్చువల్‌గా పాల్గొని, మహానేతతో వారి జ్ఞాపకాలను పంచుకున్నారు. చికాగో, మెంఫస్, కాన్సాస్ నుంచి వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఈ వేడుకలో పాల్గొన్నారు. 2007 లో వైఎస్సార్ సెయింట్ లూయిస్ పర్యటనలో ఇదే కన్వెన్షన్ హాల్ లో పబ్లిక్ మీటింగ్ లో మాట్లాడారని వారంతా గుర్తు చేసుకున్నారు.

ఆషాఢం

సంప్రదాయ సమ్మేళనం.. పశ్చిమలో ఆధ్యాత్మిక శోభ



కాళ్ల మండలం ఏలూరుపాడులో అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు (ఫైల్)

- అమ్మవార్లకు సారెలు, విశేష అలంకరణలు
- ఇళ్లలో తెలగ పిండి, మునగాకు వంటకాలు
- ఆడపడుచుల చేతికి గోరింటాకు లేపనాలు
- చక్కర్లు కొడుతున్న కొత్త జంటలు
- దుకాణాల్లో ఆఫర్ల మేళాలు

సాక్షి, భీమవరం: సంస్కృతి, సంప్రదాయాల పుట్టిల్లు తెలుగు నేల. ప్రకృతితో మమేకం చేస్తూ ఇక్కడి ప్రతి నెలకి ఏదోక విశిష్టత ఉంటుంది. అందులోనూ నాలుగో నెలైన ఆషాఢ మాసం మరింత ప్రత్యేకమైనదిగా భావిస్తారు. వాతావరణాన్ని చల్లబరుస్తూ తొలకరి వర్షాలు, పొంగి ప్రవహించే కాలువలు, వరి నాట్లుతో పచ్చ తివాచీని పరుచుకునే పంట పొలాలు, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, ప్రత్యేక వంటకాలు, ఆచారాలు ఆహ్లాదాన్ని అందిస్తాయి. పౌర్ణమి నాడు చంద్రుడు ఉత్తరాషాఢ, పూర్వాషాఢ నక్షత్రాల్లో సంచరించడం వలన ఈ నెలను ఆషాఢ మాసంగా పిలుస్తారు. మిగిలిన నెలలతో పోలిస్తే శూన్య మాసంగా భావించి శుభకార్యాలు తలపెట్టనప్పటికి దేవతారాధనకు ఇదే సరైన సమయంగా పెద్దలు చెబుతారు. ఆషాఢంలోని తొలి ఏకాదశి రోజునే శ్రీమన్నారాయణుడు యోగ నిద్రలోకి వెళ్లేది. హిందువుల తొలి పండుగ కూడా ఇదే.

గురు పౌర్ణమి, స్కంధ షష్ఠి తదితర పర్వదినాలు జరుపుకుంటారు. జిల్లాలోని గ్రామ దేవతలకు ఆషాఢం సారెలు, మొక్కుబడులు సమర్పించుకోవడం అనాదిగా వస్తోంది. భీమవరం మావుళ్లమ్మ, రాయకుదురు మావుళ్లమ్మ, మహాలక్ష్మి, ఏలూరుపాడులోని ముసలమ్మ, ఎల్లమ్మ, మోగల్లులోని పెన్నేరమ్మ, మారమ్మ, గంగాదేవి అమ్మవార్లు, జిల్లాలో పేరొందిన గ్రామ దేవతల ఆలయాల్లో ఆషాఢ మాసం పూజలు ఘనంగా జరుగుతున్నాయి. శాఖాంబరిగా, ప్రత్యేక అలంకరణల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తున్నారు.



తెలగపిండి-మునగాకు కూర

నవ దంపతుల చక్కర్లు

కొత్తగా పెళ్లైన జంట ఆషాఢంలో అత్తవారింటి గడప దాటకూడదని సంప్రదాయం. ఈనెల్లో దంపతులు కలిస్తే తొమ్మిది నెలల తర్వాత మండు వేసవిలో కాన్పు వచ్చే అవకాశం ఉంది. వైద్య సదుపాయాలు అంతగా లేని ఆ రోజుల్లో ఇది తల్లీబిడ్డకు మంచిది కాదు. తొలకరి జల్లులతో సార్వా పనులు మొదలయ్యేది ఇప్పుడే. కొత్త పెళ్లికొడుకు పొలం పనులకు పోకుండా భార్య కొంగు పట్టుకుని తిరిగితే తిండి గింజలకు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నది ఒక కారణం. అనుభవ జ్ఞానంతోనే పూర్వీకులు ఆషాఢం వేళ కొత్తజంట అత్తింటి గడప దాటకూడదనే ఆచారం తెచ్చారంటారు. అయినా ఇంటిలోని వారికి ఏవో సాకులు చెప్పి నవ దంపతులు చక్కర్లు కొట్టడం, ఏమీ తెలీనట్టుగా అత్తమామలు లోలోపల మురిసిపోవడం ప్రతి ఇంటా జరిగే తంతే. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో పార్కులు, పేరుపాలెం బీచ్, ఇతర పర్యాటక కేంద్రాలు కొత్త జంటలతో కళకళలాడుతున్నాయి.

గోరింట పూస్తుంది

ఆరేళ్ల పాపాయి నుంచి 60 ఏళ్ల వృద్ధురాలి వరకు అరచేతులు, కాళ్లకు పారాణిగా గోరింటాకు పెట్టుకునేందుకు ఉత్సాహపడతారు. పల్లెల్లోని అమ్మమ్మలు, నానమ్మలు గోరింటాకును రుబ్బించి పట్టణాల్లోని తమ కుమార్తెలు, కోడళ్లు, మనవరాళ్లకు పంపిస్తుంటారు. ఈ సీజన్‌లో గోరింటాకు పెట్టుకోవడం వెనుక శాస్త్రీయ కారణంగా ఉంది. వర్షాల వలన ఇంట్లో పనులు చేసుకునే మహిళల కాళ్లు, చేతులు పగుళ్లు తీస్తుంటాయి. గోరింటాకు పగుళ్లు రాకుండా చేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబు తున్నారు. ఇలా ఆషాఢ ఆచారాలు ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్య కారకాలుగా ఉన్నాయి.

వంటకాలూ ప్రత్యేకమే

వర్షాలతో శరీరం చల్ల బడి నజ్జు చేయడం, ప్రతికూల వాతావరణంతో ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంది. వీటికి నివారణగా తెలగపిండి-మునగాకు, పప్పు-వాగ కాయలు ఈ ఆషాఢ మాసంలో వండుకోవడం జిల్లా అంతటా కనిపిస్తుంది. గ్రామల్లో నివసించే వారు పట్ట ణాల్లోని తమ వాళ్లకు ప్రత్యేకంగా వండి పంపిస్తుంటారు. వీటిలోని పోష కాలు శరీర ఉష్ణోగ్రతలను అదుపులో ఉంచి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఆషాఢంలో ఒక్కసారైన ఈ కూరలు తినాలనేది అనాదిగా వస్తున్న ఆచారం. ఈ సీజన్‌లో వచ్చే నేరేడుపండ్లు, తాటికాయాలు ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి.

అరుదైన కాలం ఆషాఢం



ఆషాఢ మాసం అన్ని నెలల్లోనూ అరుదైనది. సూర్యుడు మిధున రాశి నుంచి కర్కాటక రాశిలోకి ప్రవేశిస్తాడు. ఈ సమయంలో వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తాయి. వీటిని తట్టుకునేలా మనుషులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో వచ్చే మార్పుల ప్రభావం వ్యాధి నివారణకు ఉపకరిస్తుంది. పండితులు చాతుర్మాస దీక్షలు చేపడతారు. ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్యం పెనవేసుకున్నా మాసం ఆషాఢం.

- రామశాస్త్రి, పండితులు, ఆకివీడు

అన్నింటా ఆఫర్ల మేళా

ఆషాఢం వేళ అన్నింటా ఆఫర్ల మేళానే. జిల్లాలో ఏలూరు, భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు, జంగారెడ్డిగూడెం, నరసాపురం, నూజివీడు తదితర పట్టణాల్లోని క్లాత్, రెడీమేడ్, జ్యూయలరీ, కాస్మోటిక్స్ షోరూంలతో పాటు మండల కేంద్రాల్లోని చిన్న దుకాణాల్లో సైతం ప్రస్తుతం ఆషాఢం ఆఫర్లు నడుస్తున్నాయి. మహిళల్ని ఆకర్షించి అమ్మకాలు ఆషాఢం సేల్ అంటూ వ్యాపారులు ఆఫర్లు ప్రకటిస్తున్నారు.

విద్యుత్ కోతలపై మహిళల కన్నెర్ర



ఆందోళన చేస్తున్న మహిళలు

- ప్రత్తిపాడులోని పాత మద్రాసు రోడ్డుపై బైఠాయించి ఆందోళన
- వేలకు వేలు బిల్లులు కట్టించుకోవడం లేదా అంటూ మండిపాటు
- విద్యుత్‌శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం

ప్రత్తిపాడు: అప్రకటిత విద్యుత్ కోతలపై మహిళలు మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ నిప్పులు చెరిగారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ఒకటో వార్డులోని పూల బజారులో కొద్ది నెలలుగా తీవ్ర విద్యుత్ సమస్య నెలకొంది. లో వోల్టేజీ సమస్యతో పాటు ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. తాజాగా శనివారం రాత్రి పదకొండు గంటల నుంచి ఆదివారం రాత్రి వరకు కోత విధించడంతో స్థానిక మహిళలు, ప్రజలు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని ప్రశ్నించారు. వారు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతుండటంతో పాటు ఏమి చేసుకుంటారో చేసుకోండని చులకన చేసి మాట్లాడుతున్నారు. దీంతో మహిళలు, స్థానికులు ఆదివారం రాత్రి గుంటూరు పర్చూరు పాతమద్రాసు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఉచితంగా కరెంటు ఇస్తున్నారా? అందరిలానే తాము నెల నెలా వేలకు వేలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదా? అంటూ మండిపడ్డారు. ఎప్పుడు కరెంటు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదని వాపోయారు. ఇంట్లో వృద్ధులు, పసి పిల్లల బాధలు వర్ణణాతీతంగా ఉంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతమద్రాసు రోడ్డుపై పెద్దఎత్తున ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ నాగేంద్ర రోడ్డు మీద ఆందోళన విరమించాలని కోరారు. ఏఈ వచ్చి సమాధానం చెప్పే వరకు కదిలేది లేదని మహిళలు పట్టుబట్టారు. విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడతామని పోలీసులు చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.




ఢిల్లీ నుంచి ఢిల్లీకి
ద ఇండియన్ పనోరమ టూర్

'ద ఇండియన్ పనోరమ' టూర్. ఇది ఏడు రోజుల యాత్ర. ఐఆర్‌సీటీసీ నిర్వహిస్తున్న ఈ టూర్ ఢిల్లీ నుంచి మొదలై ఢిల్లీకి చేరడంతో పూర్తవుతుంది. ఈ టూర్‌లో జైపూర్, రణతంబోర్, ఫతేపూర్ సిక్రీ, ఆగ్రా, ఓర్ఛా, ఖజురహో, వారణాసి ప్రదేశాలు కవర్ అవుతాయి.

పనోరమ టూర్‌లో ఏమేమి ఉన్నాయి?
యూపీ... ఎంపీ... రాజస్థాన్ రాష్ట్రాలు.
ఆరు రోజుల్లో మూడు రాష్ట్రాల పర్యటన.
జయ్‌పూర్‌లో సన్‌డయల్‌ను చూస్తాం.
అమేర్ కోటలో మాన్‌సింగ్ మందిరం.
రామ్‌బాగ్ రాజమందిరంలో భోజనం.
పులి పుట్టిల్లు రణతంబోర్ సఫారీ.
విజయం పేరుకే పరిమితమైన ఫతేపూర్.
ఏడు వింతల్లో స్థానం పొందిన తాజ్‌మహల్.
ఢిల్లీకి మోడలైన ఓర్ఛా ఐలాండ్‌ఫోర్ట్.
బ్రిటిష్ ఇంజనీర్‌లను దిగ్భ్రమకు గురిచేసిన...
ఆలయాల పుట్ట... ఖజురహో నగరం.
సారనాథ్ స్థూపం... సిల్క్ వీవింగ్ సెంటర్.
వారణాసిలో గంగాహారతి... పడవ విహారం.
వారం రోజులు ఏడు క్షణాలను తలపిస్తాయి.

1 రోజు

ఢిల్లీ నుంచి జైపూర్‌కు ప్రయాణం. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ రైల్వే స్టేషన్‌లో ఉదయం ఏడున్నరకు పర్యాటకులకు స్వాగతం. రైలెక్కిన తర్వాత తొమ్మిది గంటలకు మహారాజాస్ ఎక్స్‌ప్రెస్ ఢిల్లీ నుంచి జయ్‌పూర్‌కు బయలుదేరుతుంది. పన్నెండు గంటలకు టూర్ మేనేజర్ పర్యాటకులకు ఈ టూర్ గురించిన వివరాలు తెలియచేస్తారు. ఒంటి గంటకు రైల్లోనే లంచ్. మూడున్నరకు రైలు జయ్‌పూర్‌కు చేరుతుంది. అమేర్ ఫోర్ట్ సందర్శనం. తిరిగి రాత్రి ఎనిమిది గంటలకు వచ్చి రైలెక్కాలి. రాత్రి భోజనం రైల్లోనే. రాత్రి బస రైల్లోనే. రైలు జయ్‌పూర్ స్టేషన్‌లోనే ఉంటుంది.



అమేర్ కోట

జయ్‌పూర్‌కి పదకొండు కిలోమీటర్ల దూరాన ఉన్న నగరం అమేర్. ఇందులోని కోట అమేర్ కోటగా వ్యవహారంలోకి వచ్చింది. రాజపుత్రుల నిర్మాణకౌశలానికి నిదర్శనం ఈ కోట. దీని నిర్మాణం నాటికే మనదేశంలో మొఘల్ పాలన మొదలైంది. అమేర్ కోటలోని కొన్ని ప్యాలెస్‌లలో మొఘల్ ఆర్కిటెక్చర్ సమ్మేళనం కూడా కనిపిస్తుంది. ఈ కోటను కట్టించిన మాన్‌సింగ్‌కి పన్నెండు మంది రాణులు. ఒక్కో రాణికి ఒక్కొక్క గది ఉంటుంది. ప్రతి గది నుంచి పై అంతస్థులోని మాన్‌సింగ్ గదికి మెట్లు ఉన్నాయి. శీలాదేవి ఆలయ ద్వారం, గణేశ్‌పోల్ ముఖద్వార నిర్మాణం అద్భుతంగా ఉంటాయి. ప్యాలెస్ లోపల గోడలకు పాలరాతిలో చేసిన ఇన్‌లే వర్క్‌ను చూసే కొద్దీ చూడాలనిపిస్తుంది.

2 రోజు

జయ్‌పూర్ పర్యటన. ఉదయం ఎనిమిది గంటలకు రైల్లోనే బ్రేక్‌ఫాస్ట్. తొమ్మిదింటికి రైలు దిగి సిటీ ప్యాలెస్, గ్యాలరీల వీక్షణానికి వెళ్లాలి. ఒంటిగంటకు తిరిగి రైలెక్కిన తర్వాత భోజనం. ఆ తర్వాత విశ్రాంతి. రైల్లో ఏర్పాటు చేసిన యాక్టివిటీలతో సేదదీరవచ్చు. సాయంత్రం ఆరు గంటలకు రామ్‌బాగ్ ప్యాలెస్‌కు వెళ్లాలి. డిన్నర్ ప్యాలెస్‌లోనే. తొమ్మిదిన్నరకు తిరిగి రైలెక్కాలి. రాత్రి పదకొండు గంటలకు రైలు జయ్‌పూర్‌నుంచి సవాయ్ మాధోపూర్ (రణతంబోర్)కు బయలుదేరుతుంది.

గులాబీ నగరం!

ఈ నగరం పేరు జయ్‌పూర్, రెండవ సవాయ్ జయ్‌సింగ్ నిర్మించాడు. బ్రిటిష్ రాజకుటుంబీకులు భారత్ సందర్శనార్థం వచ్చిన సందర్భంగా జయ్‌పూర్‌లోని భవనాలకు గులాబీ రంగులు వేశారు. అప్పటి నుంచి పింక్‌సిటీ అనే పేరు వాడుకలోకి వచ్చింది. యునెస్కో సాధారణంగా ఒక కట్టడాన్ని లేదా ప్రదేశాన్ని మాత్రమే హెరిటేజ్ సైట్‌ల జాబితాలోకి తీసుకుంటుంది. ఒక నగరం మొత్తాన్ని హెరిటేజ్‌సైట్‌గా గుర్తించడం అరుదు. ఆ గౌరవం జయ్‌పూర్‌కి దక్కింది. సైక్లింగ్ ప్రేమికులు జయ్‌పూర్‌లో రెండు రోజులు బస చేసి, సైకిల్ అద్దెకు తీసుకుని పర్యాటక ప్రదేశాలను చుట్టివస్తారు. అంత సమయం లేని వాళ్లు వాహనంలో సిటీ టూర్ చేస్తారు.

సిటీప్యాలెస్, హవామహల్, జల్‌మహల్ వంటి రాజపుత్రుల మార్కు నిర్మాణాలతోపాటు మనదేశ విజ్ఞానానికి ప్రతీక అయిన జంతర్‌మంతర్‌ని తప్పకుండా చూడాలి. దీనిని 1734లో నిర్మించారు. అతిపెద్ద సన్‌డయల్ ఇక్కడే ఉంది.

రామ్‌బాగ్ తొలి ప్యాలెస్‌హోటల్

రామ్‌బాగ్ ప్యాలెస్ జయ్‌పూర్‌కి మణిహారం వంటిది. యాభై ఎకరాల్లో విస్తరించిన ఈ ప్యాలెస్ ప్రధాన నగరానికి ఎనిమిది కిలోమీటర్ల దూరాన ఉంది. ఇందులో జయ్‌పూర్ రాజు సవాయ్ రెండవ మాన్‌సింగ్, మహారాణి గాయత్రీ దేవి నివసించారు. రాజకుటుంబీకుల వివాహ వేడుకలు, పోలో ఆటలు ఇక్కడే జరిగేవి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సంస్థానాలను విలీనం చేసిన క్రమంలో ఈ ప్యాలెస్‌ను హోటల్‌గా మార్చారు. కొంతకాలం రాజకుటుంబమే నిర్వహించింది. తర్వాత తాజ్ గ్రూప్ నిర్వహిస్తోంది. ప్యాలెస్‌లో రాజభోజనం చేసే అవకాశం ఈ టూర్ కల్పిస్తోంది.



3 రోజు


రణతంబోర్ నుంచి ఫతేపూర్ సిక్రీ. ఉదయం ఆరున్నరకు రైలు దిగి రణతంబోర్ నేషనల్ పార్కుకు వెళ్లాలి. తొమ్మిది ముప్పావుకు వెనక్కి వచ్చి రైలెక్కాలి. అప్పుడు బ్రేక్‌ఫాస్ట్ ఇస్తారు. పదింపావుకి రైలు ప్రయాణం ఫతేపూర్ సిక్రీ వైపు సాగుతుంది. మధ్యాహ్న భోజనం తర్వాత రెండూ ముప్పావుకు రైలు ఫతేపూర్ సిక్రీకి చేరుతుంది. మూడు నుంచి ఫతేపూర్ సిక్రీ నగర పర్యటన మొదలు. సాయంత్రం ఆరు గంటలకు తిరిగి రైలెక్కాలి. రైలు ఆగ్రా వైపు సాగుతుంది. ఏడున్నరకు భోజనం. ఎనిమిది గంటలకు రైలు ఆగ్రా స్టేషన్‌కు చేరుతుంది.

రణతంబోర్ పులి పుట్టిల్లు

రణతంబోర్ విస్తారమైన అడవి. కొంతభాగం పులుల సంరక్షణ కేంద్రం. రాయల్ బెంగాల్ టైగర్‌లు సంచరించే నేల ఇది. ఈ అడవిలో ఏడువందల అడుగుల ఎత్తు కొండ మీద ఓ కోట. ఇది జయ్‌పూర్ రాజవంశానికి చెందిన కోట. రాజపుత్రుల శత్రుదుర్భేద్య కోటలంత పెద్దది కాదు, కానీ నిర్మాణపరంగా పెద్దదే. యునెస్కో ఈ కోటను హిల్ ఫోర్ట్స్ ఆఫ్ రాజస్థాన్ కేటగిరీలో వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది. ఈ అడవిలో చంబల్ నది ప్రవహిస్తుంది.

విజయవంతం కాని ఫతేపూర్

ఫతేపూర్ అంటే... సిటీ ఆఫ్ విక్టరీ. అంటే విజయనగరం అని అర్థం. విఫలమైన అక్బర్ ప్రయత్నాల్లో ఇదొకటి. ఎవరూ సొంతం చేసుకోని అక్బర్ బ్రెయిన్ చైల్డ్ 'దీన్ ఈ ఇలాహి' మతం కూడా ఇక్కడే పుట్టింది. ఇక్కడ పుట్టిన జహంగీర్ కూడా మొఘల్ పాలకుల్లో అత్యంత తక్కువ సమయం పాలించిన పాలకుడు, ఎటువంటి చారిత్రక గొప్పదనం లేని పాలకుడుగా మిగిలిపోయాడు. పాతికేళ్ల కిందట ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఈ ప్రదేశంలో తవ్వకాలు చేపట్టింది. సిక్రీ అనే ఈ గ్రామంలో అక్బర్ నగరాన్ని నిర్మించక ముందు శుంగ జాతి ప్రజలు నివసించేవారని, కన్యాకుబ్జ బ్రాహ్మణుల ఆధీనంలో ఉండేదని వెల్లడైంది. అక్బర్‌కు ఇష్టమైన భార్య మరియమ్ ఉజ్ జమానీకి మగపిల్లవాడు పుట్టిన ఈ ప్రదేశంలోనే రాజధానిని నిర్మించాలని అక్బర్ ముచ్చటపడ్డాడు. సుమారు 150 అడుగుల ఎత్తులో ఉన్న కొండ మీద అద్భుతమైన నగరాన్ని నిర్మించాడు. యునెస్కో ఈ నగరాన్ని వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది.



4 రోజు

ఆగ్రా పర్యటన. ఆరున్నరకు తాజ్ మహల్ సందర్శన. తొమ్మిది గంటలకు తాజ్ ఖేమాలో బ్రేక్‌ఫాస్ట్. పదకొండు గంటలకు తిరిగి రైలెక్కాలి. రైలు ప్రయాణం ఓర్ఛా వైపు సాగుతుంది. మధ్యాహ్న భోజనం తర్వాత విశ్రాంతి, రైల్లో ఏర్పాటు చేసిన యాక్టివిటీలతో సేదదీరడం. రాత్రి భోజనం ఏడున్నరకు.

వాహ్ వండర్‌ఫుల్ తాజ్!

తాజ్‌మహల్ మనదేశానికి గర్వకారణం. ఇది యునెస్కో గుర్తించిన హెరిటేజ్ సైట్ మాత్రమే కాదు. ప్రపంచ వింత కూడా. ఏడు వింతల జాబితా కోసం 2007లో ఓటింగ్ జరిగినప్పుడు మొదట తాజ్ చాలా వెనుకబడింది. వెనుకబడిందనే విషయం మీద ప్రభావవతమైన కథనాలను వార్తాపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా చానెళ్ల ప్రసారం చేయడంతో దేశమంతా చైతన్యవంతమైంది. ఉత్సాహవంతులు చురుగ్గా ఓటింగ్‌లో పాల్గొని తాజ్ మహల్‌కు ఓటు వేసి గెలిపించారు. తాజ్‌మహల్ మాత్రం 'నన్ను ప్రేమించండి లేదా సమాధికి ఇంత గొప్ప నిర్మాణం అవసరమా అని ద్వేషించండి... నన్ను మాత్రం గుర్తించి తీరాల్సిందే' అన్నట్లు ఠీవిగా ఉంటుంది. గోడలకు ఉన్న రంగురంగు ఇన్‌లే వర్క్ వస్త్రం మీద దారంతో అందంగా కుట్టిన పూలను తలపిస్తుంది. గోడలకు పాలరాతిలో చెక్కిన పూలను చూస్తే మైనాన్ని కరిగించి మూసలో పోసి గోడకు అతికించారా అనిపిస్తుంది. మెత్తని రాతిలో ఉలి చేసిన చాతుర్యానికి, శిల్పకారుడి నైపుణ్యానికి సలామ్ అనాల్సిందే. ఈ టూర్‌లో ఆగ్రాలోని రెడ్‌ఫోర్ట్‌ను కూడా చూడాలి. అక్బర్ తొలి రాజధాని ఆగ్రా. ఈ ఎర్ర కోట నుంచే పాలన సాగించాడు.



5 రోజు

ఓర్ఛాకు రావడం, ఖజురహోకి ప్రయాణం. ఉదయం ఆరున్నరకు రైలు ఓర్ఛా స్టేషన్‌కు చేరుతుంది. ఓర్ఛా కోట సందర్శనం, గ్రామాల పర్యటన తర్వాత తిరిగి రైలెక్కాలి. తొమ్మిదీ ముప్పావుకు బ్రేక్‌ఫాస్ట్. మహారాజాస్ ఎక్స్‌ప్రెస్ ఖజురహోకు సాగుతుంది. ఒంటి గంటకు లంచ్. మూడింటికి రైలు ఖజురహోకి చేరుతుంది. రైలు దిగి అక్కడి ప్రసిద్ధ దేవాలయాల దర్శనం. ఆరున్నరకు వెనక్కి వచ్చి మహారాజాస్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాలి. విశ్రాంతి, యాక్టివిటీస్‌తో సేదదీరడం. ఏడున్నరకు రాత్రి భోజనం. రాత్రి పదిగంటలకు రైలు వారణాసికి బయలుదేరుతుంది.


ఐలాండ్ ఫోర్ట్

ఓర్ఛా కోట మరీ పురాతనమైనదేమీ కాదు. పదహారవ శతాబ్దపు నిర్మాణం. బుందేల్ రాజపుత్రుల కోట ఇది. రుద్రప్రతాప్ సింగ్ మొదలు పెట్టాడు. ఆ తర్వాత వచ్చిన పాలకులు ఒక్కో ప్యాలెస్‌ను నిర్మిస్తూ విస్తరించారు. మొఘల్ పాలకుడు జహంగీర్ ఈ రాజ్యానికి అతిథిగా విచ్చేసిన సందర్భంగా ఆయన బస కోసం అప్పటి బుందేల్‌ఖండ్ రాజు వీర్ సింగ్ దేవ్ ఏకంగా ఒక మందిరాన్నే కట్టించారు. అదే జహంగీర్ ప్యాలెస్. ఢిల్లీ నగరాన్ని డిజైన్ చేసిన ఆర్కిటెక్ట్ ల్యూటియెన్స్ కూడా ఓర్ఛా కోట, ప్యాలెస్‌ల డిజైన్‌లతో ప్రభావితమయ్యాడు. ఈ కోట నిర్మాణంలో గొప్పతనం ఏమిటంటే... కోటలోని మూలనున్న చిన్న గదుల్లోకి కూడా సూర్యరశ్మి ధారాళంగా ప్రసరించడానికి చిన్న చిన్న గూళ్లున్నాయి. ఈ కోటలో మరో ప్రత్యేకత ఏమిటంటే... ఇది ఐలాండ్ ఫోర్ట్. బేత్వా, జామ్ని నదుల సంగమస్థలిలో ఏర్పడిన దీవి మీద నిర్మించారు. అందుకే ఈ కోట నుంచి ప్రధాన నేలమీదకు వంతెన కూడా ఉంటుంది. సాధారణంగా శత్రువుల దాడుల నుంచి రక్షణ కోట చుట్టూ కందకం తవ్వుతారు. ఇక్కడ నీటి మధ్యలో కోట ఉంటుంది.

ఆలయ నగరం ఖజురహో

ఖజురహో జైన, హిందూ దేవాలయాలకు ప్రసిద్ధి. ఎక్కువ ఆలయాలు తొమ్మిది, పది, పదకొండు శతాబ్దాలనాటివి. పన్నెండవ శతాబ్దం నాటికి ఆ సంఖ్య 85కి చేరింది. బుందేల్‌ఖండ్‌ను పాలించిన చందేల రాజవంశస్థులు నిర్మించిన ఆలయాలివన్నీ. ఇవన్నీ నగర వాస్తు శైలి నిర్మాణాలు. యునెస్కో ఈ ప్రదేశాన్ని హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది. వైష్ణవం, శైవ ఆలయాలు, జైన ఆలయాలు నిర్మాణపరంగా చాలా ప్రత్యేకమైనవి. బ్రిటిష్ ఇంజనీర్‌లు ఈ నిర్మాణాలను స్వయంగా పరిశీలించి కథనాలను రాశారు. ఈ ప్రదేశం 1986లో యునెస్కో జాబితాలో చేరింది.






6 రోజు

వారణాసి విహారం. ఉదయం ఎనిమిది గంటలకు రైల్లోనే బ్రేక్‌ఫాస్ట్. మధ్యాహ్న భోజనం హోటల్ తాజ్ గాంజెస్‌లో. లంచ్ తర్వాత సారనాథ్ స్థూపం, సిల్క్ వీవింగ్ సెంటర్ సందర్శనం. నాలుగన్నరకు గంగానదిలో పడవ విహారం, గంగాహారతి దర్శనం. ఎనిమిది గంటలకు తిరిగి మహారాజాస్ ఎక్స్‌ప్రెస్ చేరిన తర్వాత ఎనిమిదన్నరకు డిన్నర్. తొమ్మిదిన్నరకు ఢిల్లీకి ప్రయాణం.

సారనాథ్

బుద్ధుడి జీవితంలో సారనాథ్ ప్రముఖమైన ప్రదేశం. సిద్ధార్థుడు ధ్యానం చేసి బుద్ధుడైన తర్వాత తొలిసారిగా ప్రవచనం బోధించిన ప్రదేశం. బౌద్ధానికి సంబంధించిన పుస్తకాలు, వ్యాసాల్లో బుద్ధుడు ఒక చెట్టు కింద కూర్చుని ఐదుగురు శిష్యులకు బోధిస్తున్న చిత్రం ఉంటుంది. అది సారనాథ్‌లోని తొలి ప్రబోధానికి ప్రతీకాత్మక చిత్రం. సారనాథ్‌లోని బౌద్ధ స్థూపం, ప్రపంచదేశాల్లోని బుద్ధుని శిల్పాలతో ఓ గార్డెన్ ఉన్నాయిక్కడ. వారణాసి చేనేత కేంద్రం ఉందిక్కడ. మగ్గం ఉంటుంది. నేత ప్రక్రియలను వివరిస్తారు. ఇది సొసైటీ ఆధీనంలో నడుస్తుంది. అందుకే ఈ వీవింగ్ సెంటర్‌లో అమ్మే చేనేత చీరలను కచ్చితమైనవిగా భావిస్తారు. ఇక వారణాసిలో గంగాహారతిని చూడడం నయనానందకరం. ఈ టూర్‌లో కాశీ విశ్వనాథుడి దర్శనం లేదు. ఆసక్తి ఉన్న వాళ్లు మధ్యలో వీలు చేసుకుని విశ్వనాథుని దర్శనానికి వెళ్లవచ్చు.





7 రోజు

తొమ్మిదింటికి రైల్లోనే బ్రేక్‌ఫాస్ట్. పన్నెండున్నరకు రైలు ఢిల్లీకి చేరుతుంది. స్టేషన్‌లో ఐఆర్‌సీటీసీ ఉద్యోగుల వీడ్కోలుతో పర్యటన పూర్తవుతుంది.

ప్యాకేజ్ ధరలివి:

- డీలక్స్ క్యాబిన్ లో ఒక్కొక్కరికి దాదాపుగా ఏడు లక్షల రూపాయలు. సూట్‌లో ఒక్కొక్కరికి పదమూడు లక్షల రూపాయలు. ప్రెసిడెన్షియల్ సూట్‌లో 22లక్షలకు పైగా అవుతుంది. వీటికి ఐదు శాతం జీఎస్‌టీ అదనం.
- ఈ ప్రదేశాల్లో పర్యటనకు అక్టోబర్ నుంచి ఏప్రిల్ మధ్య సమయం అనువుగా ఉంటుంది. కాబట్టి బుకింగ్ ఇంకా మొదలవలేదు. 90 రోజుల ముందు సైట్ ఓపెన్ అవుతుంది.
- ప్రయాణం మొత్తం 2,300 కిమీల ప్రయాణం.





- వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



“మీ డబ్బుపై మీరు నియంత్రణ సాధించలేకపోతే డబ్బు కొరత మిమ్మల్ని నియంత్రిస్తుంది.”
- డేవ్ రామ్సే,
అమెరికన్ రేడియో వ్యాఖ్యాత, పర్సనల్ ఫైనాన్స్ నిపుణుడు

బిజినెస్ రీల్

దేశీ ఫుట్‌వేర్ రంగంపై విదేశీ కన్ను

తైవాన్, వియత్నాం కంపెనీల ఆసక్తి



న్యూఢిల్లీ: దేశీ నాన్‌లెదర్ ఫుట్‌వేర్ రంగంలో పెట్టుబడులు చేపట్టేందుకు విదేశీ కంపెనీలు ఆసక్తి చూపుతున్నట్లు లెదర్ ఎగుమతుల మండలి(సీఎల్‌ఈ) చైర్మన్ ఆర్‌కే జలాన్ పేర్కొన్నారు. ప్రధానంగా తైవాన్, వియత్నాం కంపెనీలు ముందున్నట్లు తెలియజేశారు. అయితే ఇందుకు ప్రభుత్వ మద్దతు కీలకంగా నిలవనున్నట్లు అభిప్రాయపడ్డారు. తైవాన్, వియత్నాం దేశాల సంస్థలు చైనా తదితర దేశాల నుంచి షూ సోల్స్, మౌల్డ్స్, మెషీనరీ, ఫ్యాబ్రిక్స్ తదితర ప్రొడక్టులను దిగుమతి చేసుకుంటున్నట్లు వెల్లడించారు. వెరసి ఈ రెండు దేశాల కంపెనీలు భారత్‌లో పెట్టుబడులకు ఉత్సాహంగా ఉన్నట్లు తెలియజేశారు. ఆయా సంస్థలకు మద్దతిస్తే తయారీకి అవసరమయ్యే నాన్‌లెదర్ సంబంధ ఫుట్‌వేర్ ప్రొడక్టులను సులభంగా దిగుమతి చేసుకోగలుగుతాయని వివరించారు. భారత్ నుంచి పటిష్టస్థాయిలో ఎగుమతులు నమోదవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26)లో 7 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. గతేడాది(2024–25) 5.75 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు నమోదైనట్లు ప్రస్తావించారు. వీటిలో యూఎస్‌కు అత్యధికంగా 95.7 కోట్ల డాలర్ల విలువైన ఎగుమతులు జరిగాయని, వీటి వాటా 20 శాతమని తెలియజేశారు. తదుపరి 11 శాతం వాటాతో యూకే, జర్మనీ నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది 18 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. దేశీయంగా తయారీని ప్రోత్సహిస్తే ఎగుమతులు పుంజుకోవడంతోపాటు.. మరింత ఉద్యోగ కల్పనకు వీలుంటుందని వివరించారు.

ఏఐఐబీ నుంచి ఐఐఎఫ్‌ఎల్ హోమ్ ఫైనాన్స్‌కు రూ.858 కోట్ల రుణం



ముంబై: ఆసియా మౌలిక సదుపాయాల పెట్టుబడి బ్యాంకు (ఏఐఐబీ) నుంచి రూ.858 కోట్ల (100 మిలియన్లు) రుణాన్ని పొందినట్లు ఐఐఎఫ్‌ఎల్ హోమ్ ఫైనాన్స్ సంస్థ శనివారం తెలిపింది. ‘‘దేశవ్యాప్తంగా పేద కుటుంబాలకు సొంతింటి ఏర్పాటు అవకాశాలు మెరుగుపరిచే లక్ష్య సాధనలో ఏబీబీ నుంచి నిధులు అందడం ఒక కీలక ఘట్టం’’ అని ఐఐఎఫ్‌ఎల్ హెచ్‌ఎఫ్‌ఎల్ సీఈవో మోను రాత్రా తెలిపారు. ఐఐఎఫ్‌ఎల్ హెచ్‌ఎఫ్‌ఎల్ భాగస్వామ్యం ద్వారా భారత గృహ నిర్మాణ రంగంలో పర్యావరణ అనుకూల భవనాలు (గ్రీన్ బిల్డింగ్) ప్రమాణాలు మరింత మెరుగుతాయని ఏఐఐబీ డైరెక్టర్ జనరల్ గ్రెగొరీ లియు తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-7-2025

విశాఖ	540-00
చిత్తూరు	583-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	493-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

క్యూ1 ఫలితాలే దిక్సూచి

జాబితాలో టెక్ దిగ్గజాలు హెచ్‌సీఎల్ టెక్, విప్రో

- టెక్ మహీంద్రా, యాక్సిస్‌బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్
- టోకు, రిటైల్ ధరల ద్రవ్యోల్బణ గణాంకాలు కీలకం
- యూఎస్‌తో వాణిజ్య ఒప్పందాలకూ ప్రాధాన్యత



దేశీ స్టాక్ మార్కెట్లు ఈ వారం అటు ఏప్రిల్–జూన్ (క్యూ1) ఫలితాలతోపాటు.. ఇటు ఆర్థిక గణాంకాల ఆధారంగా కదిలే వీలుంది. ఈ వారం పలు టెక్ దిగ్గజాల క్యూ1 పనితీరు వెల్లడికానుండగా.. టోకు, రిటైల్ ధరల ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదల కానున్నాయి. వీటికితోడు అంతర్జాతీయ అంశాలు, మార్కెట్లపైనా ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. వివరాలు చూద్దాం...

– సాక్షి, బిజినెస్ డెస్క్

గత వారం చివర్లో డీలా పడిన దేశీ స్టాక్ మార్కెట్లు ఈ వారం కన్సాలిడేషన్ బాటలో సాగే అవకాశమున్నట్లు నిపుణులు అభిప్రాయపడ్డారు. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభంకావడంతో ఇన్వెస్టర్లు వీటిపై దృష్టి పెట్టనున్నట్లు ఆల్మండ్ గ్లోబల్ సీనియర్ ఈక్విటీ రీసెర్చ్ నిపుణులు సిమ్రన్‌జీత్ సింగ్ భాటియా తెలియజేశారు. గత వారం ఐటీ సేవల టాటా గ్రూప్ దిగ్గజం టీసీఎస్ క్యూ1 పనితీరుతో సీజన్‌కు తెరతీసింది. ఫలితాలు, అంచనాలు నిరాశపరచడంతో వారాంతాన టీసీఎస్‌సహా ఇతర ఐటీ కౌంటర్లలో అమ్మకాలు తలెత్తాయి. ఈ వారం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, విప్రోతోపాటు.. ప్రయివేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం యాక్సిస్, మెటల్ రంగ బ్లూచిప్ జేఎస్‌డబ్ల్యూ స్టీల్ తదితరాలు క్యూ1 ఫలితాలు ప్రకటించనున్నాయి. దీంతో మార్కెట్ ఆటుపోట్ల మధ్య ఫలితాల ఆధారంగా కొన్ని కౌంటర్లు వెలుగులో నిలవవచ్చని మోతీలాల్ ఓస్వాల్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా పేర్కొన్నారు.

ధరల గణాంకాలు..

గత(జూన్) నెలకు టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణ(డబ్ల్యూపీఐ) గణాంకాలు నేడు(14న) విడుదలకానున్నాయి. మే నెలకు డబ్ల్యూపీఐ 0.39 శాతం పెరిగింది. ఏప్రిల్‌లో నమోదైన 0.85 శాతంతో పోలిస్తే తగ్గింది. ఈ బాటలో జూన్ నెలకు రిటైల్ ధరల ద్రవ్యోల్బణ(సీపీఐ) గణాంకాలను ప్రభుత్వం 15న ప్రకటించనుంది. మే నెలలో సీపీఐ 2019 ఫిబ్రవరి తదుపరి కనిష్టంగా 2.82 శాతానికి చేరింది. ఏప్రిల్‌లో నమోదైన 3.16 శాతంతో పోలిస్తే వెనకడుగు వేసింది. ధరల గణాంకాలు రిజర్వ్ బ్యాంక్ చేపట్టే పాలసీ సమీక్షలో వడ్డీ రేట్ల నిర్ణయాలను ప్రభావితం చేసే సంగతి తెలిసిందే. దీంతో వీటికి ప్రాధాన్యత ఉన్నట్లు స్టాక్ నిపుణులు తెలియజేశారు. దేశీయంగా క్యూ1 ఫలితాలు మార్కెట్లపై ప్రభావం చూపనుండగా.. ధరల గణాంకాలు సైతం సెంటిమెంటుకు కీలకంకానున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు.

ట్రేడ్ డీల్‌పై దృష్టి

యూఎస్, భారత్ మధ్య ఇటీవల ప్రారంభమైన వాణిజ్య టారిఫ్‌ల చర్చలు సెంటిమెంటుకు కీలకంగా నిలవనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. గత కొద్ది రోజులుగా యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ కెనడా తదితర పలు దేశాల దిగుమతులపై వివిధ స్థాయిల్లో టారిఫ్‌లను విధిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యూఎస్, భారత్ వాణిజ్య ఒప్పందంతోపాటు.. ఇతర దేశాలతో ట్రంప్ టారిఫ్ చర్చలకు ప్రాధాన్యత ఉన్నట్లు తెలియజేశారు.

విదేశీ అంశాలు

యూఎస్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్ల కదలికలు, ముడిచమురు ధరలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐ) పెట్టుబడులు వంటి అంశాలు సైతం కీలకంగా నిలవనున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు. ఈ వారం యూఎస్ ద్రవ్యోల్బణ గణాంకాలు, చైనా జీడీపీ వివరాలు వెల్లడికానున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య టారిఫ్‌ల అనిశ్చితులకుతోడు.. రాజకీయ, భౌగోళిక వివాదాలు కొనసాగుతుండటం సెంటిమెంటును దెబ్బతీయవచ్చని నిపుణులు పేర్కొన్నారు. వెరసి మార్కెట్లు కన్సాలిడేషన్ బాటలో సాగవచ్చని అభిప్రాయపడ్డారు.

సాంకేతికంగా చూస్తే..



గత వారం ప్రధాన ఇండెక్సులు సెన్సెక్స్, నిఫ్టీ కీలకమైన ఇంటర్మీడియెట్ మద్దతులను కోల్పోయాయి. నిజానికి మొదటి మూడు రోజులు స్థిరంగా కదిలినప్పటికీ ఐటీ దిగ్గజం టీసీఎస్ ఫలితాలు, టారిఫ్‌లపై అనిశ్చితి, ఎఫ్‌పీఐల అమ్మకాలు దెబ్బతీసినట్లు సాంకేతిక నిపుణులు పేర్కొన్నారు. ఇంతక్రితం అంచనా వేసినట్లు నిఫ్టీ బ్రేకవుట్ సాధించి 25,500కు చేరినప్పటికీ ఆ స్థాయిలో నిలదొక్కుకోలేకపోయింది. వారాంతాన 25,150కు క్షీణించింది. దీంతో స్వల్ప కాలంలో 24,800–24,700కు నీరసించే వీలుంది. వెరసి 25,400–25,500 వద్ద రెసిస్టెన్స్ ఎదురుకావచ్చు. ఇదేవిధంగా సెన్సెక్స్ 82,500కు జారింది. దీంతో 81,500–81,000 స్థాయిలో సపోర్ట్ తీసుకునే అవకాశముంది. 82,800–83,050 పాయింట్ల వద్ద రెసిస్టెన్స్ కనిపించవచ్చునని నిపుణులు విశ్లేషించారు.

గత వారమిలా..

గత వారం(7–11) దేశీ స్టాక్ మార్కెట్లు తొలి అర్ధభాగంలో బలపడినప్పటికీ చివర్లో డీలా పడ్డాయి. వాణిజ్య టారిఫ్ వివాదాలు, నిరుత్సాహకర టీసీఎస్ ఫలితాలు ప్రభావం చూపాయి. అమ్మకాలు ఊపందుకోవడంతో గత వారం బీఎస్‌ఈ సెన్సెక్స్ నికరంగా 932 పాయింట్లు(1.1 శాతం) క్షీణించింది. 82,500 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ సైతం 311 పాయింట్లు(1.2 శాతం) నీరసించింది. 25,150 వద్ద స్థిరపడింది.

పదేళ్లలో ఆరింతలైన ఐటీ రిఫండ్‌లు



- 17 రోజులకు తగ్గిన కాలవ్యవధి
- నాలుగింతలైన ప్రత్యక్ష పన్ను వసూళ్లు
- ఐటీ రిటర్నుల్లో 133 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: ఆదాయపన్ను రిఫండ్‌లు, రిటర్నులు బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ పాలనలో గణనీయంగా పెరిగాయి. యూపీఏ–2 పాలనలో చివరి ఆర్థిక సంవత్సరం 2013–14లో పన్ను చెల్లింపుదారులకు ఆదాయపన్ను శాఖ చేసిన చెల్లింపులు (రిఫండ్) రూ.83,008 కోట్లుగా ఉంటే.. 2024–25 సంవత్సరం (ఎన్‌డీఏ పాలనలో 11వ సంవత్సరం) నాటికి రిఫండ్‌లు రూ.4.77 లక్షల కోట్లకు పెరిగాయి. అంటే 474 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. అంతేకాదు 2013–14 సంవత్సరంలో ఐటీ రిఫండ్‌లకు 93 రోజుల సగటు వ్యవధి తీసుకోగా, అది 2024–25 సంవత్సరానికి 17 రోజులకు తగ్గింది. ఇక ఈ పదేళ్లలో స్థూల పన్ను వసూళ్లు, ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేసే వారిలోనూ మంచి వృద్ధి కనిపించింది. 2013–14 సంవత్సరానికి స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.7.22 లక్షల కోట్లుగా ఉంటే, 2024–25 సంవత్సరంలో ఈ మొత్తం రూ.27.03 లక్షల కోట్లకు పెరిగింది. ఐటీ రిటర్నుల దాఖలు 133 శాతం పెరిగింది. 2013లో 3.8 కోట్ల ఆదాయపన్ను రిటర్నులు (ఐటీఆర్‌లు) దాఖలు కాగా, 2024లో 8.89 కోట్ల ఐటీఆర్‌లు నమోదయ్యాయి.

వ్యవస్థ మార్పు ఫలితమే

పన్ను రిఫండ్‌లు గణనీయంగా పెరగడం, రిఫండ్‌ల కాలవ్యవధి కూడా 17 రోజులకు తగ్గడం అన్నది పన్ను యంత్రాంగంలో వచ్చిన మార్పు ఫలితమేనని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా డిజిటల్ వసతులు, పూర్తిగా ఆన్‌లైన్లోనే రిటర్నుల దాఖలు, ప్రత్యక్ష హాజరు అవసరం లేని పన్ను రిటర్నుల మదింపులు (ఫేస్‌లెస్) అన్నవి ఐటీఆర్‌లను మరింత కచ్చితత్వంతో ప్రాసెస్ చేసేందుకు వీలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నాయి. ముందుగానే భర్తీ అయిన పన్ను రిటర్నులు (టీడీఎస్, ఫామ్ 16, 26ఏఎస్ తదితర మార్గాల్లో వచ్చిన సమాచారంతో నిండినవి), రిఫండ్ ప్రాసెస్‌ను ఆటోమేట్ చేయడం, టీడీఎస్ సర్దుబాట్లు, ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల పరిష్కారం అన్నవి కాల వ్యవధిని తగ్గించి, పన్ను చెల్లింపుదారులకు మెరుగైన అనుభవానికి తోడ్పడుతున్నట్టు తెలిపాయి. 2013–14లో స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లలో రిఫండ్‌లు 11.5 శాతంగా ఉంటే, 2024–25లో 17.6 శాతానికి పెరగడం గమనార్హం. ‘‘పన్ను చెల్లింపుదారుల సంఖ్య విస్తరించడం, ముందస్తు పన్ను చెల్లింపులు, టీడీఎస్ యంత్రాంగం మరింత బలంగా మారినప్పుడు రిఫండ్‌లు సైతం పెరగడం సాధారణమే. వ్యవస్థలో పరిణతికి ఇది నిదర్శనం’’అని ఆ వర్గాలు తెలిపాయి.

మారికో లక్ష్యం.. ఐదేళ్లలో రెట్టింపు ఆదాయం

- 2030 నాటికి రూ.20,000 కోట్లు
- చైర్మన్ హర్ష్ మరివాలా

న్యూఢిల్లీ: ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ సంస్థ మారికో వచ్చే ఐదేళ్లలో ఆదాయాన్ని రెట్టింపు చేసుకోనుంది. 2030 నాటికి రూ.20,000 కోట్లకు చేరుకోవాలన్నది తమ లక్ష్యమని మారికో చైర్మన్ హర్ష్ మరివాలా ప్రకటించారు. సఫోలా, పారాచ్యూట్, లివాన్ తదితర ప్రముఖ బ్రాండ్లను కలిగిన మారికో ఆదాయం 2024–25లో రూ.10,000 కోట్లుగా ఉండడం గమనార్హం. మారికో బ్రాండ్లు, ఆవిష్కరణల బలానికి ఇది నిదర్శనమంటూ కంపెనీ వార్షిక నివేదికలో పేర్కొన్నారు. కంపెనీ తదుపరి మార్పు దశలో ఉందన్నారు. భిన్న ప్రాంతాల ప్రజల మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను తీసుకురానున్నట్టు కంపెనీ ఎండీ, సీఈవో సౌగత్ గుప్తా తెలిపారు. అంతర్జాతీయంగా విశ్వసనీయమైన డిజిటల్ ఎఫ్‌ఎంసీజీ బ్రాండ్‌గా అవతరించడమే తమ లక్ష్యమన్నారు. మధ్య కాలాలానికి 25 శాతానికి పైనే వృద్ధిని నమోదు చేస్తామన్న విశ్వాసంతో ఉన్నట్టు చెప్పారు. 2019–20 అమ్మకాల నుంచి ఎనిమిది రెట్ల వృద్ధికి చేరుకుంటామన్నారు. తమ పోర్ట్‌ఫోలియోని దూకుడుగా విస్తరిస్తామని ప్రకటించారు.



మెర్సిడెస్ బెంజ్ ధరల పెంపు

సెప్టెంబర్ నుంచి 1-1.5 శాతం అప్



న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ ఇండియా వాహన ధరలను పెంచనుంది. సెప్టెంబర్ నుంచి వివిధ మోడల్ కార్ల ధరలను 1–1.5 శాతం స్థాయిలో పెంచేందుకు చూస్తున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ వెల్లడించారు. ప్రధానంగా యూరోతో మారకంలో రూపాయి బలహీనపడటంతో ధరల పెంపు యోచనకు తెరతీసినట్లు పేర్కొన్నారు. అయితే ఈ ఏడాది ఇప్పటికే రెండుసార్లు వాహన ధరలను పెంచడం గమనార్హం! 2025 జనవరి, జులైలో కార్ల ధరలను హెచ్చించింది. కాగా.. యూరో ప్రభావాన్ని తట్టుకునే బాటలో మరోసారి సెప్టెంబర్ నుంచి ధరల పెంపు చేపట్టనున్నట్లు అయ్యర్ తెలియజేశారు. గత నెల రోజులుగా యూరోతో మారకంలో రూపాయి 100 మార్క్ వద్దే కదులుతున్నట్లు తెలియజేశారు. ఫలితంగా సెప్టెంబర్‌లో 1 నుంచి 1.5 శాతంవరకూ ధరల పెంపును చేపట్టనున్నట్లు తెలియజేశారు. ధరల పెంపు వల్ల ప్రభావం పడబోదని, మరోపక్క వడ్డీ రేట్లు దిగివస్తుండటంతో కొనుగోలుదారులకు ఈఎంఐ చెల్లింపులు బ్యాలన్స్ అవుతాయన్నారు. కంపెనీ కార్ల అమ్మకాలలో 80% ఫైనాన్స్ ద్వారానే నమోదవుతున్నట్లు చెప్పారు.

ఈసారి రిఫండ్ త్వరగా రాకపోవచ్చు

ఈసారి రిటర్నులు ఫైల్ చేస్తున్నారు. ఇంచుమించు కోటి దాకా రిటర్నులు వేసినట్లు అంచనా. అందులో చాలా మంది వెరిఫై కూడా చేశారు. గతంలో రిటర్ను వేసిన ఒకటి, రెండు రోజుల్లో రిఫండ్ వచ్చేసిన కేసులున్నాయి. సాధారణంగా 20 నుంచి 45 రోజుల్లోపల మీ బ్యాంకు ఖాతాకి రిఫండ్ మొత్తం జమ అవుతుంది. కానీ కొన్ని సందర్భాల్లో జాప్యం జరగొచ్చు. ఏ కారణం వల్ల రిఫండ్ త్వరగా రాదంటే..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు


- చాలా మంది వెరిఫై చేయడం లేదు. ఇలా వెరిఫై చేయనంతవరకు రిటర్నులను ముట్టుకోరు. ప్రాసెస్ చెయ్యరు. అందుకని రిటర్నులను వేసిన వెంటనే వెరిఫై చేయడం మరిచిపోవద్దు.
- బ్యాంకు అకౌంట్ వివరాలు పూర్తిగా ఇవ్వకపోతే రిఫండు రాదు. బ్యాంకుల విలీనం వల్లో, అడ్రెస్సులు పోవడం వల్లో, కోడ్‌లలో వచ్చిన మార్పులను తెలియచేయకపోవడం వల్లో కూడా ఇలా జరగొచ్చు. బ్యాంకు అకౌంటు నంబరు ఇప్పుడు పొడుగ్గా ఉంటోంది. ఏ ఒక్క అంకె తప్పొచ్చినా, సమాచారం లోపం వల్ల జమ ఆగిపోతుంది.
- పెద్ద సమస్య ఎక్కడ వస్తుందంటే .. మిస్‌మ్యాచింగ్. రిటర్నుల్లో దాఖలు చేసిన అంశాలు, అన్నీ పూర్తిగా 26 ఏఎస్, ఏ19తో సరిపోయి ఉండాలి. 26ఏఎస్, ఏఐఎస్, ఈ రెండూ ఆదాయపు పన్ను వెబ్‌సైట్లో దొరుకుతాయి. ఇవి చాలా స్పష్టంగా మీకు సంబంధించిన సమాచారాన్ని సమగ్రంగా క్రోడీకరించి చూపిస్తాయి. సర్వసాధారణంగా తప్పులు ఉండవు. చాలా మంది ఏం చేస్తుంటారంటే, వీటిలో సమాచారం బేస్‌గా రిటర్నులు వేసేస్తుంటారు. అప్పుడు మిస్‌మ్యాచ్ ఉండదు. ఇదొక సేఫ్ గేమ్. అలా అని మీరు 26ఏఎస్, ఏఐఎస్ అంశాలతో పూర్తిగా ఏకీభవించాలని లేదు. అందులోని అంశాలు తప్పని అనిపించినా, రెండు సార్లు కనిపించినా, మీవి కాకపోయినా, మీరు విభేదించవచ్చు. అప్పుడు, మిస్‌మ్యాచ్ తథ్యం. ఇలాంటప్పుడు రిఫండు ఆలస్యం అవుతుంది.
- కొంత మంది ఫారం ఎంచుకోవడంలో పొరపాటు చేస్తారు. అలాంటి పొరపాటు జరిగినా, రిఫండు ఆలస్యం కావచ్చు. జాగ్రత్త వహించాలి.
- సాంకేతికపరమైన సమస్యలు ఉత్పన్నమవ్వొచ్చు. ఇవి తాత్కాలికం కావొచ్చు. తాత్కాలికం అయితే, గంటలోనో లేదా రోజులోపలో దానంతట అదే సాల్వ్ అయిపోతుంది. కొన్ని వారం, పది రోజులు పట్టొచ్చు. అధికార్లకు ఈ సమస్య తెలియకపోవచ్చు. సిస్టమ్ అధికార్లకు కూడా వెనువెంటనే తెలియదు. ఈ మేరకు ప్రాసెసింగ్ లేటు అవుతుంది.
- పన్నులు చెల్లింపుల మూడు రకాలు. టీడీఎస్, అడ్వాన్స్ ట్యాక్స్, సెల్ఫ్ అసెస్‌మెంట్. ఈ చలాన్లలోని అంశాలు రాసేటప్పుడు ఏ పొరపాటు జరిగినా .. చెల్లింపులకు సంబంధించిన పద్దు, గవర్నమెంటు ఖాతాలో మీ పేరున జమ అవ్వదు. సస్పెన్స్‌లో పెడతారు. దాన్ని పట్టుకోవడం సులువైన పని కాదు. అలాగే టీడీఎస్ రికవరీలు, చెల్లింపులు, రిటర్నులు వేయడం – ఈ మూడు దశల్లో ఎక్కడ తప్పు జరిగినా, పెండింగ్‌లో పడిపోతుంది. అటు పక్క వ్యక్తి తప్పులు చేసినా మీరే సఫర్ అవుతారు. చెక్ చేసుకోండి. ఇలాంటి సమస్యల వల్ల రిఫండ్ ఆగిపోతుంది.
- పాత/ముందు సంవత్సరాల్లో చెల్లించాల్సిన బకాయిలుంటే వాటిని రికవరీ చేయడం వల్ల ప్రస్తుత సంవత్సరపు రిఫండ్ ఆగిపోవచ్చు. ఈ మధ్య ఓ కేసులో 18 ఏళ్ల క్రితం ఉన్న బకాయిల నిమిత్తం నోటీసులు ఇచ్చారు. కాగితాలు సకాలంలో దొరక్కపోవటం వల్ల జవాబు ఇవ్వలేదు. ఆ సంవత్సరం బకాయిల నిమిత్తం కరెంటు రిఫండును తొక్కి పెట్టేశారు. వాళ్లకి వాళ్లు పన్నులను రికవర్ చేసుకోవడానికి ఎంత వెనక్కయినా వెళ్తారు. మన కష్టాలు పట్టించుకోరు. అందుకనే అన్ని సంవత్సరాల రికార్డులూ భద్రంగా దాచిపెట్టుకోవాలి. అశ్రద్ధ వద్దు. రికవరీ చేసుకున్నామని మీకు చెప్పరు కూడా.
- ఇక అధికార్ల వద్ద మరో బ్రహ్మాస్త్రం ఉంటుంది. అదే స్క్రూటినీ ప్రొసీడింగ్స్. ఏదైనా కారణాల వల్ల మీ కేసు స్క్రూటినీకి ఎంపిక అయిందనుకోండి. అధికార్లు ఆరా తీస్తారు. ఆరాలో తొక్క తీస్తారు. తొక్క తీసి తోలు కడతారు. అలా అయ్యేవరకు రిఫండ్ రాదు. అలాగని స్క్రూటినీ అంటే భయపడక్కర్లేదు కానీ, జాప్యం ఎక్కువ జరగొచ్చు. అనిశ్చితి .. అయోమయం పరిస్థితి నెలకొనవచ్చు.

ఈ సంవత్సరానికి గాను గతంలోలాగా వెనువెంటనే రిఫండులు జారీ చేయడం లేదు. ఒకటికి పది సార్లు చెక్ చేసి, గతానికి వెళ్లి, అన్ని చెక్ చేసి కానీ రిఫండులు ఇవ్వడం లేదు. అలా అని మీరేమీ గాభరాపడక్కర్లేదు.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

స్థిరత్వంతోపాటు మెరుగైన రాబడి

కోటక్ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్



పెట్టుబడులకు అధిక స్థిరత్వం, మెరుగైన రాబడులు కోరుకునే వారికి లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్ విభాగం అనుకూలంగా ఉంటుంది. అటు లార్జ్‌క్యాప్ స్థిరత్వానికి భరోసానిస్తే, మిడ్‌క్యాప్ పెట్టుబడులు దీర్ఘకాలంలో అధిక రాబడులకు వీలు కల్పిస్తాయి. ఈ విభాగంలో కోటక్ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్ మంచి పనితీరు చూపిస్తోంది.

రాబడులు

ఈ పథకం గడిచిన ఏడాది కాలంలో పెట్టుబడిపై 3 శాతం రాబడిని (డైరెక్ట్‌ప్లాన్) అందించింది. మూడేళ్లలో వార్షిక రాబడి 24.52 శాతం చొప్పున ఉంది. ఐదేళ్లలో చూస్తే 25.48 శాతం, ఏడేళ్లలో 18.65 శాతం, పదేళ్లలో 16.72 శాతం చొప్పున ఈ పథకం ప్రతిఫలాన్ని అందించింది. బీఎస్‌ఈ లార్జ్‌అండ్ మిడ్‌క్యాప్ టీఆర్‌ఐ కంటే ఈ పథకమే మూడు శాతం వరకు వివిధ కాలాల్లో అధిక రాబడులను తెచ్చిపెట్టింది. లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్ విభాగం సగటు రాబడితో పోల్చి చూసినా ఈ పథకంలోనే పటిష్టమైన పనితీరు కనిపిస్తుంది.

పెట్టుబడుల విధానం

బోటమ్ అప్ విధానాన్ని స్టాక్స్ ఎంపికకు అనుసరిస్తుంది. అంటే రంగాల వారీ కాకుండా విడిగా స్టాక్స్ పనితీరు ఆధారంగా ఎంపిక చేస్తుంది. పోటీ పరంగా స్థిరమైన అనుకూలతలు, బలమైన బ్యాలన్స్ షీట్, వ్యాపార విస్తరణకు అవకాశాలు కలిగిన కంపెనీలకు ప్రాధాన్యం ఇస్తుంది. అదే సమయంలో స్టాక్స్ విలువలు కూడా సహేతుక స్థాయిలో ఉంటేనే ఎంచుకుంటుంది. వ్యాల్యూ స్టాక్స్‌లోనూ కొంత పెట్టుబడులు పెడుతుంది. పెట్టుబడి తర్వాత స్టాక్ ధర మరీ పతనం కాకుండా, తగినంత లిక్విడిటీ ఉండే విధంగా రిస్క్‌పరమైన జాగ్రత్తలు తీసుకుంటుంది. అంతేకాదు మెరుగైన గవర్నెన్స్ (పాలన) ఉన్న కంపెనీలకే ప్రాధాన్యం ఇస్తుంది. స్టాక్స్ ఎంపిక ఆధారంగా వివిధ మ్యూచువల్ ఫండ్స్‌లో రాబడులు స్వల్పకాలంలో హెచ్చు, తగ్గులకు లోనవుతుంటాయి. కానీ, దీర్ఘకాలంలో రాబడి మెరుగ్గా ఉండేలా చూసుకోవడం అవసరం. లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్ అయినప్పటికీ పెట్టుబడుల్లో లార్జ్‌క్యాప్ కంపెనీలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటుంది.

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతానికి ఈ పథకం నిర్వహణలో రూ.28,294 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 98.74 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. 0.32 శాతం డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెట్టగా, 0.94 శాతం నగదు నిల్వలు కలిగి ఉంది. ఈ పథకం పోర్ట్‌ఫోలియోలో మొత్తం 67 స్టాక్స్ ఉన్నాయి. ఇందులో టాప్ 10 స్టాక్స్‌కు చేసిన కేటాయింపులు 34.34 శాతంగా ఉన్నాయి. ఈక్విటీ పెట్టుబడులను విశ్లేషించగా.. లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే 71 శాతం పెట్టుబడులు ఉండడాన్ని గమనించొచ్చు. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 28.39 శాతం ఇన్వెస్ట్ చేసింది. స్మాల్‌క్యాప్ కేటాయింపులు 0.55 శాతంగా ఉన్నాయి. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. 23.43 శాతం మేర ఈ రంగానికి చెందిన కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత ఇండస్ట్రియల్స్ కంపెనీలకు 18.12 శాతం, టెక్నాలజీ రంగ కంపెనీలకు 16.11 శాతం, మెటీరియల్స్ కంపెనీలకు 13 శాతం, ఇంధన రంగ కంపెనీలకు 11.37 శాతం, హెల్త్‌కేర్ కంపెనీలకు 7.28 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	6.37
భారత్ ఎలక్ట్రానిక్స్	4.17
ఐసీఐసీఐ బ్యాంక్	3.58
ఇన్ఫోసిస్	3.28
ఎటర్నల్	3.25
ఎస్‌బీఐ	3.19
కోరమాండల్ ఇంటర్నేషనల్	2.88
యాక్సిస్ బ్యాంక్	2.63
భారతీ ఎయిర్‌టెల్	2.59
ఎల్‌అండ్‌టీ	2.40



వివాహబంధానికి సైనా, కశ్యప్ గుడ్‌బై

న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ స్టార్లు సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ తమ వివాహ బంధానికి ముగింపు పలికారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సైనా తమ విడాకుల విషయాన్ని ఆదివారం రాత్రి పోస్ట్ చేసింది. 'జీవితం కొన్నిసార్లు మనల్ని వేర్వేరు దిశలకు తీసుకెళు తుంది. ఎంతో ఆలోచించి, సుదీర్ఘంగా చర్చించుకున్న తర్వాత నేను, కశ్యప్ విడిపోవాలనే నిర్ణయానికి వచ్చాం. పరస్పర అవగాహనతో సహృద్భావ వాతావరణంలో మా విడాకులు తీసుకుంటున్నాం. కశ్యప్‌తో నాకు ఎన్నో తీపి గుర్తులున్నాయి. ఇకపై మిత్రులుగా ఉంటాం. మా నిర్ణయాన్ని అందరు స్వాగతిస్తారని, ప్రైవసీని గౌరవిస్తారని ఆశిస్తున్నాం' అని ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. పుల్లెల గోపీచంద్ వద్ద శిక్షణ తీసుకున్న సైనా, కశ్యప్‌లు 2018లో పెళ్లి చేసుకున్నారు. సైనా రెండుసార్లు కామన్వెల్త్ చాంపియన్‌గా నిలిచింది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకుంది.

చరణి శ్రీకారం

అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతున్న ఆంధ్రప్రదేశ్ స్పిన్నర్ శ్రీచరణి

ఇంగ్లండ్‌తో టి20ల్లో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు కైవసం ● భవిష్యత్తుపై భరోసా పెంచుతున్న వైనం

ప్రాక్టీస్ సెషన్‌కు అందరికంటే ముందు హాజరవడం... శిక్షణ ముగిసిన తర్వాత కూడా 'ఇంకొక్క బాల్ వేస్తా' అంటూ కొనసాగించడం... అనుకున్న స్థానంలో బంతి వేసేంత వరకు అలుపెరగకుండా సాధన సాగించడం... వెరసి ఆ అమ్మాయిని ప్రత్యేకంగా నిలిపాయి! ఏజ్ గ్రూప్ టోర్నీలంటే ఏంటో తెలియకుండా... అండర్-19 ఊసే లేకుండా... నేరుగా మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఆడే అవకాశం దక్కించుకున్న ఆ అమ్మాయి... ఆడింది రెండు మ్యాచ్‌లే అయినా తన ప్రతిభతో అందరినీ ఆకట్టుకుంది. దీంతో జాతీయ జట్టు నుంచి పిలుపు రాగా... అక్కడ కూడా మెరుగైన ప్రదర్శనతో కట్టిపడేసింది. భిన్నమైన పిచ్‌లపై మరింత ప్రభావం చూపగలదని ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక చేస్తే ఏకంగా 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కించుకుంది. అంతర్జాతీయ స్థాయిలో ఆడిన తొలి టి20 సిరీస్‌లో 10 వికెట్లతో సత్తా చాటిన ఆంధ్రప్రదేశ్ స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీ చరణిపై ప్రత్యేక కథనం...

సాక్షి క్రీడావిభాగం

టి20 ఫార్మాట్‌లో ఇంగ్లండ్‌పై చెప్పుకోదగ్గ రికార్డులేని భారత జట్టు... ఈ పర్యటనలో భాగంగా ఆడిన తొలి టి20లో ఘనవిజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నాటింగ్‌హామ్ వేదికగా జరిగిన తొలి టి20లో స్మృతి మంధాన సెంచరీతో చెలరేగడంతో భారత జట్టు భారీ స్కోరు చేయగా... ఛేదనలో ఇంగ్లండ్ చేతులెత్తేసింది. 'శత'క్కొట్టిన స్మృతికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కగా... ఈ మ్యాచ్ ద్వారానే అంతర్జాతీయ టి20ల్లో అరంగేట్రం చేసిన శ్రీచరణి 4 వికెట్లతో అదరగొట్టింది. అయితే మంధాన మెరుపుల ముందు శ్రీచరణి బౌలింగ్ వాడి వెలుగులోకి రాలేదు. బ్రిస్టల్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లోనూ మొదట టీమిండియా మంచి స్కోరు చేయగా... ఛేదనలో ఇంగ్లండ్‌ను కట్టడి చేసిన ఘనత ఆంధ్ర ప్లేయర్‌దే. 4 ఓవర్లలో 28 పరుగులే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టడంతో ఆతిథ్య జట్టు విజయానికి దూరమైంది. మూడో మ్యాచ్‌లోనూ నిలకడ కొనసాగించిన శ్రీ చరణి మరో రెండు వికెట్లు ఖాతాలో వేసుకుంది. మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టి20లోనూ మరో 2 వికెట్లు తీసింది. ఆఖరి పోరులో వికెట్ పడగొట్టలేకపోయినా... ఓవరాల్‌గా ఐదు మ్యాచ్‌ల్లో కలిపి 10 వికెట్లు తీసిన శ్రీచరణి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు కైవసం చేసుకుంది.

అనూహ్య అవకాశం...

ఇంగ్లండ్‌తో టి20 సిరీస్ ఆరంభానికి ముందు దీప్తి శర్మ, రాధ యాదవ్ వంటి సీనియర్ స్పిన్నర్లు జట్టులో ఉండటంతో శ్రీ చరణికి అసలు తుది జట్టులో చోటు దక్కుతుందా అనే అనుమానాలు రేకెత్తగా... సిరీస్ ముగిసే సమయానికి నైపుణ్యం గల బౌలర్ అనే స్థాయికి ఎదిగింది. వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన శ్రీచరణి చిన్నప్పుడు కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా ప్రారంభించిన ఆట తనను అందలం ఎక్కిస్తుందని ఏ దశలోనూ ఊహించలేదు. జాతీయ జట్టు తరఫున నిలకడగా రాణించడమే తన లక్ష్యమని 20 ఏళ్ల శ్రీచరణి అంటోంది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో క్రికెట్ ఓనమాలు నేర్చుకున్న ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్... కెరీర్ ఆరంభంలో ఫాస్ట్ బౌలర్ కావాలని భావించింది. తగినంత ఎత్తు, అందుకు తగ్గ శరీర సౌష్టవం ఆమెను ఆ దిశగా ప్రోత్సహించగా... ఆంధ్రప్రదేశ్ హెడ్ కోచ్ శ్రీనివాస్ రెడ్డి మాత్రం ఆమెను స్పిన్ వైపు అడుగులు వేయించాడు. అపార ప్రతిభ ఉన్న శ్రీచరణికి ఆరంభంలో ఏదీ కలిసి రాలేదు. దీంతో అండర్-19 జట్టులో ఆమెకు చోటు దక్కలేదు. అయినా ఏమాత్రం నిరుత్సాహానికి గురికాని ఈ లెఫ్ట్ హ్యాండర్... వచ్చిన అవకాశాలను వినియోగించుకుంటూ రోజురోజుకు మరింత మెరుగైంది.

ఢిల్లీ క్యాపిటల్స్ చొరవతో...

డబ్ల్యూపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీకి చెందిన హైదరాబాద్ మాజీ కెప్టెన్ అనన్య ఉపేంద్రన్ దృష్టిలో పడటంతో శ్రీచరణి దశ తిరిగింది. 2022 టి20 చాలెంజర్ ట్రోఫీలో చరణి బౌలింగ్‌ను గమనించిన అనన్య... ఈ అమ్మాయికి మంచి భవిష్యత్తు ఉందని ముందే ఊహించింది. 'ఆ టోర్నీ మొత్తంలో శ్రీచరణి ప్రదర్శన నన్ను ఆకట్టుకుంది. మెరుగైన బౌలింగ్ యాక్షన్‌కు తోడు... బంతి మీద మంచి నియంత్రణ ఉండటం ఆమె బలం. ఇక మిగిలిన స్పిన్నర్లతో పోల్చుకుంటే కాస్త వేగంగా బంతులు వేస్తుండటంతో... ప్రత్యర్థులు షాట్లు ఆడలేకపోయేవారు. ఇంత ప్రతిభ ఉన్న అమ్మాయిని ఐసీసీ తొలిసారి నిర్వహించిన అండర్-19 మహిళల ప్రపంచకప్‌లో పాల్గొన్న భారత జట్టులో చోటు దక్కకపోవడం నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. మంచి శరీర సౌష్టవం ఉండటంతో గాల్లోనే బంతిని తిప్పగల సహజ ప్రతిభ ఆమెకు అబ్బింది' అని అనన్య వెల్లడించింది. ఆ తర్వాత అనన్య ప్రోత్సాహంతో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున అవకాశం దక్కించుకున్న శ్రీచరణి ఆడిన రెండు మ్యాచ్‌ల్లో 4 వికెట్లు పడగొట్టింది. ఈ దెబ్బతో జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న తెలుగమ్మాయి... ముక్కోణపు





వన్డే, టి20ల్లో అరంగేట్రం సందర్భంగా స్నేహ్ రాణా నుంచి టోపీ అందుకుంటున్న శ్రీచరణి

టోర్నీలో భాగంగా శ్రీలంకతో ఆడిన తొలి వన్డేలో రెండు వికెట్లతో సత్తా చాటింది. ఇప్పటి వరకు 5 వన్డేలు ఆడిన శ్రీచరణి 6 వికెట్లు పడగొట్టి భవిష్యత్తుపై ఆశలు రేపుతోంది.

సుదీర్ఘ కాలం ఆడాలనే లక్ష్యంతో...

ఈ ఏడాది సొంతగడ్డపై ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో భారత జట్టు తమ బలాన్ని పెంపొందించుకోవాలని భావిస్తుండగా... అందులో భాగంగా యువ ప్రతిభకు విరివిగా అవకాశాలు ఇస్తోంది. అలా జట్టులోకి వచ్చిన శ్రీ చరణి ఇప్పటి వరకైతే తనమీద పెట్టుకున్న అంచనాలను అందుకుంది. మరి ఏడాది వ్యవధిలో ఇటు వన్డే ప్రపంచకప్ అటు టి20 వరల్డ్‌కప్ జరగనున్న నేపథ్యంలో శ్రీచరణి ఇదే నిలకడ కొనసాగిస్తే మెగా టోర్నీల్లో పాల్గొనడం ఖాయమే. ఆడింది తక్కువ మ్యాచ్‌లే అయినా... ఆమె సాధన చేసే తీరు, బంతిని సంధించే విధానం శ్రీ చరణిని ప్రత్యేకంగా నిలుపుతున్నాయి. కెరీర్ ఆరంభంలోనే అంతర్జాతీయ స్టార్ ప్లేయర్లతో కలిసి ఆడటం తనకు కలిసొచ్చిందని చరణి పేర్కొంది. ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ మెగ్ లానింగ్ తనకు ఏం కావాలో స్పష్టంగా చెప్పేదని దాని వల్ల తన పని సులువైందని ఆమె వెల్లడించింది. ఎప్పటికప్పుడు లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు సాగుతున్న శ్రీచరణి... పరిస్థితులను త్వరగా ఆకళింపు చేసుకొని అందుకు తగ్గట్లు బంతులు వేస్తుందని భారత మహిళల జట్టు బౌలింగ్ కోచ్ ఆవిష్కార్ సాల్వీ చెప్పాడు. స్వతహాగా సిగ్గరి అయిన శ్రీచరణి అంతర్జాతీయ స్థాయిలో సుదీర్ఘ కాలం జట్టుకు ప్రాతినిధ్యం వహించాలనే లక్ష్యంతో అడుగులు ముందుకు వేస్తోంది.

అనిరుధ్ జోడీ ఓటమి



న్యూపోర్ట్ (అమెరికా): 'హాల్ ఆఫ్ ఫేమ్ ఓపెన్' ఏటీపీ-125 చాలెంజర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పోరాటం ముగిసింది. పురుషుల డబుల్స్ విభాగంలో అనిరుధ్ (భారత్)-రీస్ స్టాల్డర్ (అమెరికా) జోడీ సెమీఫైనల్లో నిష్క్రమించింది. 96 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో అనిరుధ్-స్టాల్డర్ ద్వయం 2-6, 7-6 (8/6), 11-13తో 'సూపర్ టైబ్రేక్'లో హన్స్ హచ్ వెర్డుగో (మెక్సికో)-క్రిస్టియన్ రోడ్రిగెజ్ (కొలంబియా) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. ఆరు ఏస్‌లు సంధించిన ఈ ఇండో-అమెరికన్ ద్వయం నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను మూడు సార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. సెమీఫైనల్లో ఓడిన అనిరుధ్-స్టాల్డర్‌లకు 3,470 డాలర్ల (రూ. 2 లక్షల 97 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

రన్నరప్ ప్రార్థన ద్వయం



న్యూపోర్ట్ (అమెరికా): 'హాల్ ఆఫ్ ఫేమ్ ఓపెన్' మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ)-125 చాలెంజర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ప్రార్థన తొంబారే (భారత్)-అరియాని హర్తానో (నెదర్లాండ్స్) జోడీ రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన డబుల్స్ ఫైనల్లో ప్రార్థన-అరియాని ద్వయం 6-7 (4/7), 3-6తో కార్మన్ కోర్లే-ఇవానా కోర్లే (అమెరికా) జంట చేతిలో ఓడిపోయింది. 82 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో ఇండో-డచ్ జోడీ నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. ప్రార్థన-అరియాని జోడీకి 5,766 డాలర్ల (రూ. 4 లక్షల 94 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 81 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

బంగ్లాదేశ్ ఘనవిజయం

● రాణించిన లిటన్ దాస్, రిషాద్
● రెండో టి20లో శ్రీలంక ఓటమి

దంబుల్లా: బ్యాటర్ల జోరుకు బౌలర్ల సహకారం తోడవడంతో... శ్రీలంకతో రెండో టి20లో బంగ్లాదేశ్ ఘనవిజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన రెండో టి20లో బంగ్లాదేశ్ 83 పరుగుల తేడాతో ఆతిథ్య శ్రీలంకపై గెలుపొందింది. ఫలితంగా సిరీస్ 1-1తో సమమైంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. కెప్టెన్ లిటన్ దాస్ (50 బంతుల్లో 76; 1 ఫోర్, 5 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా... షమీమ్ హుసేన్ (27 బంతుల్లో 48; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), తౌహిద్ హృదయ్ (25 బంతుల్లో 31; 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుగైన ప్రదర్శన చేశారు. లంక బౌలర్లలో బినురా ఫెర్నాండో 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో శ్రీలంక 15.2 ఓవర్లలో 94 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (29 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్), దసున్ శనక (16 బంతుల్లో 20; 2 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. కెప్టెన్ చరిత అసలంక (5), కుశాల్ మెండిస్ (8), కుశాల్ పెరీరా (0), అవిష్క ఫెర్నాండో (2), చమిక కరుణరత్నే (0), వాండర్సె (8) పెవిలియన్‌కు క్యూ కట్టారు. బంగ్లాదేశ్ బౌలర్లలో రిషాద్ హుసేన్ 3 వికెట్లు పడగొట్టగా... షరీఫుల్ ఇస్లామ్, సైఫుద్దీన్ చెరో రెండు వికెట్లు తీశారు. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక ఆఖరి టి20 బుధవారం కొలంబోలో జరగనుంది. ఈ పర్యటనలో టెస్టు, వన్డే సిరీస్‌లను ఆతిథ్య శ్రీలంక గెలుచుకుంది.



లిటన్ దాస్

నాలుగో రౌండ్‌లో హంపి, దివ్య





బతూమి (జార్జియా): మహిళల ప్రపంచకప్ చెస్ నాకౌట్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపి, జూనియర్ ప్రపంచ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ (మహారాష్ట్ర) నాలుగో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. మూడో రౌండ్‌లో హంపి 1.5-0.5తో కులోన్ క్లాడియా (పోలాండ్)పై, దివ్య 1.5-0.5తో టియోడోరా ఇంజాక్ (సెర్బియా)పై విజయం సాధించారు. ఆదివారం జరిగిన మూడో రౌండ్ రెండో గేమ్‌లో హంపి 44 ఎత్తుల్లో క్లాడియాను ఓడించింది. ఇంజాక్‌తో జరిగిన రెండో గేమ్‌ను దివ్య 30 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. శనివారం జరిగిన మూడో రౌండ్ తొలి గేమ్‌ను హంపి 102 ఎత్తుల్లో 'డ్రా' చేసుకోగా... ఇంజాక్‌తో జరిగిన గేమ్‌లో దివ్య 39 ఎత్తుల్లో గెలిచింది. మూడో రౌండ్‌లోని రెండు గేమ్‌లు ముగిశాక భారత్‌కే చెందిన ద్రోణవల్లి హారిక-స్టావ్‌రూలా (గ్రీస్), వంతిక అగర్వాల్-కాటరీనా లాగ్నో (రష్యా), వైశాలి-కరిస్సా యిప్ (అమెరికా) 1-1తో సమంగా నిలిచారు. దాంతో ఈరోజు టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించి విజేతలను నిర్ణయిస్తారు.

జ్యోతి యర్రాజీ సర్జరీ సక్సెస్

సాక్షి, హైదరాబాద్: గాయంతో ఇబ్బంది పడుతున్న భారత స్టార్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకుంది. ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో 12.96 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం నెగ్గిన జ్యోతి... ప్రాక్టీస్ సందర్భంగా గాయపడింది. దీంతో పోటీలకు దూరమైన జ్యోతి... తాజాగా యాంటీరియర్ క్రూసియేట్ లిగమెంట్ (ఏసీఎల్)కు సర్జరీ చేయించుకున్నట్లు సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించింది. ప్రముఖ వైద్యుడు దిన్‌షా పర్దీవాలా పర్యవేక్షణలో జరిగిన శస్త్రచికిత్స విజయవంతమైందని తెలిపింది. 'గత కొన్ని వారాలు భారంగా గడిచాయి. గాయం కారణంగా అమితంగా ఇష్టపడే అథ్లెటిక్స్‌కు దూరంగా ఉండాల్సి రావడం తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. ఈ శుక్రవారం సర్జరీ విజయవంతంగా పూర్తైంది. కష్ట సమయంలో అండగా నిలిచిన కుటుంబ సభ్యులు, కోచ్‌లు, భారత అథ్లెటిక్స్ సమాఖ్యకు ప్రత్యేక ధన్యవాదాలు. త్వరలోనే తిరిగి కోలుకుంటా. రెట్టించిన ఉత్సాహంతో ట్రాక్‌పై అడుగుపెట్టాలని భావిస్తున్నా' అని జ్యోతి పేర్కొంది. ఇటీవల నిలకడగా రాణిస్తున్న జ్యోతి... టోక్యో వేదికగా జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాలని ఆశించినా... ఇప్పుడది సాధ్యపడేలా లేదు. వరల్డ్ అథ్లెటిక్స్ అర్హత మార్క్ 12.73 సెకన్లు కాగా... జ్యోతి నేరుగా ఈ అవకాశం దక్కించుకోకపోయినా ర్యాంకింగ్స్ ఆధారంగా ఆమెకు ఈ మెగా టోర్నీలో అవకాశం దక్కేది.



ఆస్ట్రేలియా 225 ఆలౌట్

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ 16/1 ● 'డే అండ్ నైట్' టెస్టు

కింగ్‌స్టన్ (జమైకా): వెస్టిండీస్‌తో మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా ఓ మాదిరి స్కోరుకు పరిమితమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం అర్ధరాత్రి ప్రారంభమైన ఆఖరి టెస్టు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 70.3 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌటైంది. గత రెండు మ్యాచ్‌లు గెలిచి ఇప్పటికే టెస్టు సిరీస్ కైవసం చేసుకున్న ఆసీస్... గులాబీ బంతితో జరుగుతున్న 'డే అండ్ నైట్' టెస్టు మ్యాచ్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కంగారూలు ఆశించిన స్కోరు చేయలేకపోయారు. స్టీవ్ స్మిత్ (66 బంతుల్లో 48; 8 ఫోర్లు), కామెరూన్ గ్రీన్ (108 బంతుల్లో 46; 5 ఫోర్లు) రాణించగా... కెప్టెన్ కమిన్స్ (24), ఉస్మాన్ ఖ్వాజా (23), అలెక్స్ కేరీ (21) ట్రావిస్ హెడ్ (20) తలా కొన్ని పరుగులు చేశారు. కరీబియన్ పేసర్లు వరుస విరామాల్లో వికెట్లు పడగొడుతూ... కంగారూలపై ఒత్తిడి పెంచారు. వెస్టిండీస్ బౌలర్లలో షామర్ జోసెఫ్ 4 వికెట్లు పడగొట్టగా... జైడెన్ సీల్స్, జస్టిన్ గ్రీవ్స్ చెరో 3 వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 16 పరుగులు చేసింది. కెవ్లాన్ అండర్సన్ (3) అవుట్ కాగా... బ్రాండన్ కింగ్ (8 బ్యాటింగ్), కెప్టెన్ రోస్టన్ చేజ్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. చేతిలో 9 వికెట్లు ఉన్న విండీస్... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 209 పరుగులు వెనుకబడి ఉంది.



స్టీవ్ స్మిత్



షామర్ జోసెఫ్

స్టార్క్ 100వ టెస్టు...

ఈ పర్యటనలో ఆస్ట్రేలియా జట్టు ఇప్పటికే సిరీస్ కైవసం చేసుకున్నా... వెస్టిండీస్ బౌలర్లను ఎదుర్కొనే విషయంలో మాత్రం కంగారూల తడబాటు మరోసారి స్పష్టమైంది. గత రెండు మ్యాచ్‌ల్లోనూ కొన్నిసార్లు కరీబియన్ బౌలర్ల ధాటికి నిలవలేకపోయిన ఆసీస్... ఆపై తమ అనుభవంతో గట్టెక్కింది. గులాబీ బంతితో జరుగుతున్న ఈ టెస్టులోనూ అదే కొనసాగింది. బౌలింగ్‌లో ఫర్వాలేదనిపించిన విండీస్... ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మొదటి రోజు చివరి గంటసేపు క్రీజులో నిలిచి ఒక వికెట్ మాత్రమే కోల్పోయింది. ఈ క్రమంలో ఆస్ట్రేలియా పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొని విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా 100వ టెస్టు ఆడుతున్న స్టార్క్ బంతులను కరీబియన్‌లు కాచుకున్న తీరు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. గులాబీ బంతి టెస్టుల్లో మెరుగైన రికార్డు ఉన్న స్టార్క్ తొలి రోజు ఒక వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్ కోసం సీనియర్ స్పిన్నర్ నాథన్ లయన్‌ను పక్కన పెట్టిన ఆస్ట్రేలియా... మరో పేసర్ స్కాట్ బోలాండ్‌కు తుది జట్టులో చోటు కల్పించింది.

భారత చెస్ 87వ గ్రాండ్‌మాస్టర్‌గా హరికృష్ణన్

చెన్నై: భారత చదరంగంలో మరో గ్రాండ్‌మాస్టర్ (జీఎం) అవతరించాడు. తమిళనాడుకు చెందిన 24 ఏళ్ల హరికృష్ణన్ ఈ ఘనత సాధించాడు. ఫ్రాన్స్‌లో ముగిసిన లా ప్లాగ్నె అంతర్జాతీయ చెస్ ఫెస్టివల్‌లో హరికృష్ణన్ జీఎం హోదా పొందడానికి అవసరమైన మూడో జీఎం నార్మ్‌ను ఖరారు చేసుకున్నాడు. భారత్‌కే చెందిన ఇనియన్‌తో గేమ్‌ను 'డ్రా' చేసుకున్న హరికృష్ణన్ నాలుగో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో చివరి జీఎం నార్మ్‌ను అందుకున్నాడు. 2023లో బీల్ చెస్ ఫెస్టివల్‌లో తొలి జీఎం నార్మ్ పొందిన ఈ మాస్టర్ ఆఫ్ కామర్స్ (ఎంకామ్) విద్యార్థి ఈ ఏడాది జూన్‌లో స్పెయిన్‌లో జరిగిన అందుజార్ ఓపెన్‌లో రెండో జీఎం నార్మ్ పొందాడు. 'చాలా ఆనందంగా ఉంది. ఏడేళ్ల క్రితం గ్రాండ్‌మాస్టర్ హోదా కోసం ప్రయత్నం మొదలైంది. గత మూడేళ్లలో క్రమం తప్పకుండా టోర్నీల్లో పోటీపడుతున్నాను. కానీ జీఎం నార్మ్‌లు సాధించలేకపోయాను. అయితే రెండు నెలల వ్యవధిలో రెండు జీఎం నార్మ్‌లు పొంది గ్రాండ్‌మాస్టర్ హోదా దక్కించుకోవడంతో చాలా సంతోషంగా ఉన్నాను' అని తమిళనాడుకే చెందిన గ్రాండ్‌మాస్టర్ శ్యామ్ సుందర్ మోహన్‌రాజ్ వద్ద శిక్షణ తీసుకుంటున్న హరికృష్ణన్ వ్యాఖ్యానించాడు.



ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఎవరికి కల్పించారు?

సంస్థలు

జాతీయ బాలల హక్కుల కమిషన్

2005లో జాతీయ బాలల హక్కుల పరిరక్షణ చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టం ప్రకారం జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను 2007లో పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పాటు చేశారు. దీని ఏర్పాటుకు రాజ్యాంగ స్ఫూర్తి, ఐక్యరాజ్య సమితి తీర్మానాలు దోహదపడ్డాయి. ఈ చట్టం ప్రకారం 18 ఏళ్లలోపు వారిని బాలలుగా గుర్తిస్తారు.

నిర్మాణం: ఈ కమిషన్‌లో చైర్‌పర్సన్, ఆరుగురు సభ్యులుంటారు. వీరిలో ఇద్దరు మహిళా సభ్యులు తప్పనిసరి. వీరిని కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. పదవీ కాలం మూడేళ్లు. పదవీ విరమణ వయసు చైర్‌పర్సన్‌కు 65 ఏళ్లు, సభ్యులకు 60 ఏళ్లు. రెండు పర్యాయాల కంటే ఎక్కువసార్లు నియమితులయ్యే అవకాశం లేదు. వీరిని ముందుగానే తొలగించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది.

చైర్‌పర్సన్‌గా నియమితులవ్వాలంటే బాలల సమస్యలపై అవగాహన ఉండాలి. బాలల సంక్షేమానికి కృషి చేసే వ్యక్తి అయ్యుండాలి. సభ్యుల్లో ఒకరు విద్యారంగం, రెండోవారు బాలల ఆరోగ్యం, మూడో వారు బాల నేరస్థుల సమస్యలు, నాలుగో వారు బాలకార్మిక వ్యవస్థ నిషేధం, అయిదో వారు బాలల మానసిక స్థితి, చివరి వారు బాలలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.

కమిషన్ విధులు


1. రాజ్యాంగం, వివిధ చట్టాల ద్వారా బాలలకు కల్పించిన రక్షణల అమలును పరిశీలించి మరింత ఉన్నతంగా అమలు చేసేందుకు మార్గదర్శకాలను జారీ చేయడం.
2. బాలల హక్కుల ఉల్లంఘన అంశాలపై విచారణ జరిపి అవసరమైన సూచనలు చేయడం.
3. బాలల అభివృద్ధికి, రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టడం.
4. బాలల హక్కుల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై వార్షిక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించడం.
5. బాలల హక్కులకు సంబంధించిన పరిశోధనలను ప్రోత్సహించడం.
6. బాలల హక్కులపై సమాజంలో విస్తృత ప్రచారం నిర్వహించడం.
7. బాలల హక్కుల ఉల్లంఘనకు సంబంధించి సత్వర విచారణకు ప్రత్యేక బాలల కోర్టు ఏర్పాటు చేయడం. జాతీయ బాలల హక్కుల కమిషన్ తొలి చైర్‌పర్సన్ శాంతా సిన్హా

జాతీయ అల్ప సంఖ్యాక వర్గాల కమిషన్

భారత రాజ్యాంగంలో అల్ప సంఖ్యాక వర్గాల సంరక్షణకు, సంక్షేమానికి ఆర్టికల్ 29, 30, 350(ఎ), 350 (బి) ప్రత్యేకంగా చేర్చారు. 350(బి) ప్రకారం మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక అధికారిని నియమించాలి. అనంతరం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి. దీని ప్రకారం జాతీయ మైనార్టీ కమిషన్‌ను 1978లో ఏర్పాటు చేసి 1993లో పార్లమెంట్ చట్టం ద్వారా చట్టపరమైన గుర్తింపు కల్పించారు. ఈ కమిషన్‌కు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించేందుకు 2005లో 103వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపాదించారు. కేంద్రం ఆరు మతాలకు చెందిన వారిని మైనార్టీలుగా గుర్తించింది.

1) ముస్లింలు 2) సిక్కులు
3) క్రిస్టియన్లు 4) బౌద్ధులు
4) జైనులు 5) పార్శీలు

నిర్మాణం: ఈ కమిషన్‌లో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, అయిదుగురు సభ్యులుంటారు. వీరందరూ



మైనార్టీలై ఉండాలి. వీరికి మైనార్టీల సమస్యలపై అవగాహన ఉండాలి. వీరిని ప్రభుత్వం నియమిస్తుంది. పదవీకాలం మూడేళ్లు. ముందుగానే వీరిని తొలగించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది.

విధులు, అధికారాలు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

1. మైనార్టీల స్థితిగతులను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం, అందులో పేర్కొన్న సమస్యల పరిష్కారానికి సూచనలు చేయడం.
2. మైనార్టీల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన చట్టాల అమలు తీరును పరిశీలించడం.
3. రాజ్యాంగం ద్వారా కల్పించిన ప్రత్యేక రక్షణల అమలు తీరును పరిశీలించడం.
4. మైనార్టీల హక్కులకు భంగం కలిగినప్పుడు విచారణ జరిపి అధికారులకు ఆదేశాలు జారీ చేయడం.
5. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం జారీ చేసే ఆదేశాలను అమలు చేయడం.
6. కేసుల విచారణలో సివిల్ కోర్టుకు ఉండే అధికారాలు ఈ కమిషన్‌కు ఉంటాయి.

సచార్ కమిటీ

ముస్లింల స్థితిగతుల అధ్యయనం కోసం కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 2005లో ఒక కమిటీని నియమించింది. ఏడుగురు సభ్యులున్న ఈ కమిటీ అధ్యక్షుడిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి రాజేందర్ సింగ్ సచార్ కొనసాగారు. ఈ కమిటీ 2006లో నివేదిక సమర్పించింది. ఈ కమిటీ సిఫారసు మేరకు 2006లో మైనార్టీల సంక్షేమానికి 15 సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టారు. మైనార్టీల విద్య, ఉద్యోగ పరిస్థితులను పరిశీలించేందుకు 2007లో యూపీఏ ప్రభుత్వం రంగనాథ్ మిశ్రా కమిటీని నియమించింది. విద్య, ఉద్యోగ అవకాశాల్లో మైనార్టీలకు తగిన ప్రాతినిధ్యం లేనందువల్ల వారికి 15 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఈ కమిటీ సిఫారసు చేసింది. ఈ రిజర్వేషన్ కల్పించేందుకు ఓబీసీ రిజర్వేషన్‌లో 8 శాతం, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో 7 శాతం కోత విధించాలని పేర్కొంది.

మైనార్టీ కమిషన్ చైర్‌పర్సన్లు

1. మహ్మద్ సర్దార్ అలీఖాన్ – 1993–1996
2. తాహిర్ మహ్మద్ – 1996–1999
3. మహ్మద్ షమీమ్ – 2000–2003
4. తర్లోచన్ సింగ్ – 2003–2006
5. మహ్మద్ హమీద్ అన్సారీ – 2006–2007
6. మహ్మద్ షఫీ ఖురేషీ – 2007–2010
7. వజాహత్ హబీబుల్లా – 2011–2014
8. నసీం అహ్మద్ – 2014–2017
9. గయారుల్ అసన్ రిజ్వి 2017–2020
10. ఇక్బాల్ సింగ్ లల్పురా – 2020 నుంచి కొనసాగుతున్నారు.

మాదిరి ప్రశ్నలు

1. భారత రాజ్యాంగంలోని ఏ అధికరణ ప్రకారం మైనార్టీ విద్యా సంస్థలను ఏర్పాటు చేసుకోవచ్చు?
ఎ) అధికరణ – 29
బి) అధికరణ – 30
సి) అధికరణ – 350
డి) అధికరణ – 350 (బి)
2. భారత రాష్ట్రపతి ఏ అధికరణ ప్రకారం లోక్‌సభకు ఇద్దరు ఆంగ్లో ఇండియన్లను నామినేట్ చేస్తారు?
ఎ) ఆర్టికల్–350 బి) ఆర్టికల్–330
సి) ఆర్టికల్–331 డి) ఆర్టికల్–333
3. మహిళా ప్రగతిశీలతకు ప్రాధాన్యతనిచ్చేది?
ఎ) ఆర్టికల్–16 బి) ఆర్టికల్–15
సి) ఆర్టికల్–16(2) డి) ఆర్టికల్–15(3)
4. ఓబీసీలలో క్రిమీలేయర్‌ను భారత సుప్రీంకోర్టు ఏ కేసులో ప్రస్తావించింది?
ఎ) ఉన్నికృష్ణన్
బి) బాలాజీ
సి) ఇందిరా సహానీ
డి) అశోక్ కుమార్ ఠాకూర్
5. ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఎవరికి కల్పించారు?
ఎ) ఎస్సీ, ఎస్టీలకు
బి) ఓబీసీలకు
సి) ఎస్సీ, ఎస్టీ, బీసీలకు
డి) ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు
6. 1953లో ఏర్పాటైన బీసీ కమిషన్ మొదటి చైర్మన్ ఎవరు?
ఎ) బీపీ మండల్
బి) కాకాసాహెబ్ కాలేకర్
సి) సీతారాం కేసరి
డి) జ్యోతిరావు పూలే
7. 1978లో మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం నియమించిన మండల్ కమిషన్ తన నివేదికను ఎప్పుడు సమర్పించింది?
ఎ) 1978 బి) 1979
సి) 1980 డి) 1982
8. కింది వాటిలో సరైంది?
ఎ) ఎస్సీ, ఎస్టీ కమిషన్ మొదటి చైర్మన్ – రాందాస్
బి) బీసీ కమిషన్ మొదటి చైర్మన్ – ఆర్ఎస్ ప్రసాద్
సి) మానవహక్కుల కమిషన్ మొదటి చైర్మన్ – రంగనాథ్ మిశ్రా
డి) పైవన్నీ
9. కమిషన్ ఏర్పాటుకు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
ఎ) మానవ హక్కుల కమిషన్ – 1993
బి) మహిళా కమిషన్ – 1993
సి) జాతీయ బాలల కమిషన్ – 2007
డి) పైవన్నీ
10. కింది వాటిలో రాజ్యాంగ ప్రతిపత్తి లేని సంస్థ?
ఎ) మైనార్టీ కమిషన్
బి) మానవ హక్కుల కమిషన్
సి) మహిళా కమిషన్
డి) పైవన్నీ
11. ఎస్సీ, ఎస్టీ క్రిమీలేయర్ గురించి సుప్రీంకోర్టు ఏ కేసులో ప్రస్తావించింది?
ఎ) అశోక్ కుమార్ ఠాకూర్ vs బిహార్
బి) ఇందిరాసహానీ vs ఉత్తరప్రదేశ్
సి) బాలాజీ vs కేరళ
డి) భరత్‌కుమార్ vs కేరళ
12. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన మొదటి ప్రభుత్వం?
ఎ) రాజీవ్‌గాంధీ –1985
బి) దేవెగౌడ – 1996
సి) మన్మోహన్‌సింగ్ – 2008
డి) వాజ్‌పేయ్ – 2001
13. కింది వాటిలో సరికానిది?
ఎ) ప్రస్తుత మహిళా కమిషన్ చైర్‌పర్సన్ – లలితా కుమార మంగళం
బి) ప్రస్తుత మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ – కేజీ బాలకృష్ణన్
సి) మైనార్టీ కమిషన్ ప్రస్తుత చైర్‌పర్సన్ – నసీం అహ్మద్ డి) పైవన్నీ
14. ఏ కమిటీ సిఫారసు మేరకు అల్ప సంఖ్యాకుల సంక్షేమానికి 15 సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టారు?
ఎ) రంగనాథ్ మిశ్రా
బి) రెండో పరిపాలన సంస్కరణల కమిషన్
సి) సచార్ కమిటీ
డి) ఏదీకాదు
15. రాజ్యాంగం ప్రకారం ఏ రాష్ట్రాల్లో గిరిజన సంక్షేమం కోసం మంత్రి ఉండాలి?
ఎ) బిహార్, మధ్యప్రదేశ్
బి) బిహార్, మధ్యప్రదేశ్, ఒడిశా
సి) ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా
డి) ఏదీకాదు
16. ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేశారు?
ఎ) 52వ సవరణ బి) 65వ సవరణ
సి) 69వ సవరణ డి) 71వ సవరణ
17. మైనార్టీలకు కనీసం ప్రాథమిక విద్యను మాతృభాషలో అందించాలని పేర్కొనే అధికరణ ఏది?
ఎ) అధికరణ–29 బి) అధికరణ–30
సి) అధికరణ–350(ఎ)
డి) అధికరణ–350(బి)
18. బీసీ కమిషన్ చైర్మన్‌కు ఉండాల్సిన అర్హత?
ఎ) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
బి) 10 ఏళ్ల పరిపాలన అనుభవం
సి) జిల్లా కోర్టు న్యాయమూర్తి
డి) సుప్రీంకోర్టు న్యాయమూర్తి
19. తెలుగు రాష్ట్రాల మహిళా కమిషన్ ప్రస్తుత అధ్యక్షురాలు ఎవరు?
ఎ) మేరీ రవీంద్రనాథ్
బి) జయసుధ
సి) వెంకటరత్నం
డి) లలితా కుమార మంగళం
20. భారత రాజ్యాంగంలోని ఏ అధికరణ ప్రకారం బీసీ కమిషన్ ఏర్పాటు చేయాలి?
ఎ) అధికరణ – 338
బి) అధికరణ – 338(ఎ)
సి) అధికరణ – 340(ఎ)
డి) అధికరణ – 342
21. ఎస్సీ, ఎస్టీలపై అకృత్యాల నిషేధ చట్టాన్ని ఎప్పుడు రూపొందించారు?
ఎ) 1969 బి) 1989
సి) 1990 డి) 1991
22. ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల నిరోధక చట్టం నుంచి ఏ రాష్ట్రానికి మినహాయింపు ఇచ్చారు?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) జమ్మూకశ్మీర్
సి) అసోం డి) మిజోరం
23. మైనార్టీలకు విద్యా ఉద్యోగ అవకాశాల్లో 15 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఏ కమిటీ సిఫారసు చేసింది?
ఎ) రంగనాథ్ మిశ్రా కమిటీ
బి) రాజేంద్ర సచార్ కమిటీ
సి) జాతీయ మైనార్టీ కమిషన్
డి) పైవన్నీ

సమాధానాలు

1) బి; 2) సి; 3) డి; 4) సి;
5) ఎ; 6) బి; 7) సి; 8) డి;
9) బి; 10) డి; 11) ఎ; 12) బి;
13) బి; 14) సి; 15) సి; 16) బి;
17) సి; 18) డి; 19) సి; 20) సి;
21) బి; 22) బి; 23) ఎ.

అణు రియాక్టర్ల పితామహుడు ఎవరు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
ఫిజిక్స్

రేడియోధార్మికత

ఒక రేడియోధార్మిక పదార్థం దానిలో నుంచి రేడియోధార్మిక కిరణాలను విడుదల చేస్తూ దాని అసలు ద్రవ్యరాశిలో సగం ద్రవ్యరాశిగా మార్పు చెందడానికి పట్టే కాలాన్ని 'అర్ధ జీవిత కాలం' అంటారు. అర్ధ జీవిత కాలాల విలువ ఆయా రేడియోధార్మిక కిరణాల స్వభావంపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. కాబట్టి వేర్వేరు రేడియోధార్మిక పదార్థాల అర్ధ జీవిత కాలాలు వేర్వేరుగా ఉంటాయి. ఏదైనా ఒక రేడియోధార్మిక పదార్థం దాని నుంచి రేడియోధార్మిక కిరణాలను విడుదల చేస్తూ సీసం (Pb_{82}) ఆకృతిని పొందినప్పుడు స్థిరత్వాన్ని పొందుతుంది. దీంతో ఆ పదార్థ రేడియోధార్మికత ఆగిపోతుంది. అందువల్ల సీసం అర్ధ జీవిత కాలాన్ని అనంతంగా తీసుకుంటారు.

కృత్రిమ రేడియోధార్మికత

ప్రయోగశాలలో ఒక స్థిరమైన పరమాణు కేంద్రకాన్ని భారయుత కణాలతో ఢీకొనే విధంగా చేసినప్పుడు అది రేడియోధార్మికతను ప్రదర్శిస్తుంది. దీన్ని 'కృత్రిమ రేడియోధార్మికత' అంటారు. ఐరీన్ క్యూరీ, ఫ్రెడ్రిక్ జూలియట్ క్యూరీ కృత్రిమ రేడియోధార్మికతను కనుగొన్నారు.

ఉదా: ప్లుటోనియం (Pu), నెప్ట్యూనియం, అమెరిసియం(Americium), లారెన్సియం, క్యూరీయం, ఫెర్మియం, స్ట్రాన్షియం, ఐన్‌స్టీనియం మొదలైన మూలకాలు కృత్రిమ రేడియోధార్మికత ధర్మాన్ని ప్రదర్శిస్తాయి.

సాధారణంగా వినియోగించే U, Th, Pu రేడియోధార్మిక మూలకాల్లో.. ప్లుటోనియం (Pu)-ను అత్యుత్తమ అణు ఇంధనంగా పరిగణిస్తారు. స్ట్రాన్షియం (Stansium)–90 అనే రేడియోధార్మిక కిరణాలు అణు రియాక్టర్ల నుంచి విడుదలవుతాయి. ఇవి మానవుల చర్మంపై పడితే చర్మ కేన్సర్‌కు కారణమవుతాయి.

ఐన్‌స్టీన్ ప్రధాన పరిశోధనలు

1. ద్రవ్యరాశి శక్తి తుల్యత నియమం $E = mc^2$
2. సాపేక్ష సిద్ధాంతం
3. కాంతి విద్యుత్ ఫలిత సమీకరణం

కాంతి విద్యుత్ ఫలిత సమీకరణాన్ని ప్రతిపాదించినందుకు ఐన్‌స్టీన్‌కు 1921లో నోబెల్ బహుమతి లభించింది. ఐన్‌స్టీన్‌ను ఈ మిలీనియం శాస్త్రవేత్తగా గుర్తించి, గౌరవించారు.

కేంద్రక విచ్ఛిత్తి

పరమాణు సంఖ్య 82, అంతకంటే ఎక్కువ ఉన్న పరమాణువు కేంద్రకాలను తటస్థ ఆవేశం ఉన్న న్యూట్రాన్‌తో ఢీకొట్టించినప్పుడు అది విచ్ఛిన్నం చెంది దాదాపు సరిసమానమైన రెండు కొత్త పరమాణు కేంద్రకాలుగా విడిపోతుంది. వాటిలో నుంచి కొన్ని న్యూట్రాన్లు, అత్యధిక అణుశక్తి విడుదలవుతాయి. దీన్ని 'కేంద్రక విచ్ఛిత్తి' అంటారు.

ఉదా: ఒక యురేనియం పరమాణు కేంద్రకాన్ని న్యూట్రాన్‌తో తాడనం చెందించినప్పుడు అది విచ్ఛిన్నం చెంది ${}_{36}Kr$, ${}_{56}Ba$ అనే కొత్త పరమాణు కేంద్రకాలుగా విడిపోతుంది. ఈ ప్రక్రియలో మూడు న్యూట్రాన్లు, 200 MeVల అణుశక్తి విడుదలవుతుంది.

$${}_0n^1 \rightarrow {}_{92}U^{235} \rightarrow {}_{36}Kr + {}_{56}Ba + 3\,{}_0n^1 + 200\,MeV$$

యురేనియం న్యూట్రాన్లు అణుశక్తి

సాధారణంగా యురేనియం, థోరియం, ప్లుటోనియం మూలకాలు కేంద్రక విచ్ఛిత్తికి లోనవుతాయి. అందువల్ల వీటిని విచ్ఛిత్తిశీల పదార్థాలు లేదా అణు ఇంధనాలు అంటారు. వీటిలో యురేనియం 'పిచ్‌బ్లెండ్' రూపంలో, థోరియం 'మోనజైట్' రూపంలో భూమిలో లభిస్తాయి. ప్లుటోనియం అనేది మానవుడు రూపొందించిన కృత్రిమ రేడియోధార్మిక పదార్థం. కేంద్రక విచ్ఛిత్తిని ఒట్టోహన్, స్ట్రాస్‌మన్ అనే శాస్త్రవేత్తలు కనుగొన్నారు.

గొలుసు చర్య (శృంఖల చర్య): విచ్ఛిత్తి శీల పదార్థంలో విచ్ఛిత్తి చర్య నిరంతరంగా కొనసాగుతూ అన్ని కణాలకు విస్తరించడాన్ని 'గొలుసు చర్య' లేదా 'శృంఖల చర్య' అంటారు. గొలుసు చర్య రేటు కింద పేర్కొన్న అంశాలపై ఆధారపడి ఉంటుంది.
1. విచ్ఛిత్తి శీల పదార్థ స్వభావం.
2. గొలుసు చర్యలో పాల్గొంటున్న న్యూట్రాన్ల వేగం (న్యూట్రాన్ల వేగం పెరిగితే గొలుసు చర్య రేటు కూడా పెరుగుతుంది).

గొలుసు చర్యలో వెలువడే న్యూట్రాన్ల సగటు సంఖ్య 2.5 మాత్రమే. గొలుసు చర్య పూర్తి కావడానికి పట్టే సమయం కేవలం 10^{-8} సెకన్లు. దీన్ని ఒక "Shake" అంటారు.

1 Shake = 10^{-8} sec.

ఇది కాలాన్ని కొలవడానికి ఉపయోగించే అతి చిన్న ప్రమాణం. కాలాన్ని కొలవడానికి అతి పెద్ద ప్రమాణం – కాస్మిక్ సంవత్సరం.

1 కాస్మిక్ సంవత్సరం = 250 మిలియన్ సంవత్సరాలు (సుమారు)

గొలుసు చర్యను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. అనియంత్రిత గొలుసు చర్య: గొలుసు చర్యలో పాల్గొంటున్న న్యూట్రాన్ల వేగాన్ని అదుపు చేయలేకపోతే అది నిరంతరంగా కొనసాగుతుంది. దీన్ని 'అనియంత్రిత గొలుసు చర్య' అంటారు.

ఉదా: అణుబాంబు.

అణుబాంబు నిర్మాణంలో ఇమిడి ఉన్న సూత్రం కేంద్రక విచ్ఛిత్తి. అణుబాంబు విస్ఫోటం జరిగినప్పుడు అనియంత్రిత గొలుసు చర్య పద్ధతిలో అణుశక్తి విడుదలవుతుంది. సాధారణంగా అణుబాంబులను తయారు చేసిన తర్వాత అల్యూమినియం పాత్రలో భద్రపరుస్తారు. అల్యూమినియం ద్వారా న్యూట్రాన్ (${}_0n^1$) చొచ్చుకువెళ్లదు.

2. నియంత్రిత గొలుసు చర్య: గొలుసు చర్యలో పాల్గొంటున్న న్యూట్రాన్ల వేగాన్ని తగ్గిస్తే ఆ చర్య అదుపులోకి వస్తుంది. దీన్ని 'నియంత్రింత గొలుసు చర్య' అంటారు. ఈ పద్ధతిలో వెలువడిన అణుశక్తిని మానవాళి అభివృద్ధి కోసం ఉపయోగిస్తారు.

న్యూక్లియర్ రియాక్టర్ (అణు రియాక్టర్)

న్యూక్లియర్ రియాక్టర్ నిర్మాణంలో కేంద్రక విచ్ఛిత్తి అనే సూత్రం ఇమిడి ఉంటుంది. ఇందులో నియంత్రిత గొలుసు చర్య ప్రకారం అణుశక్తి విడుదలవుతుంది. 1942 డిసెంబర్‌లో చికాగో(అమెరికా)లో ఫెర్మి అనే శాస్త్రవేత్త మొట్టమొదటి అణు రియాక్టర్‌ను నిర్మించాడు. అందువల్ల ఇతడిని 'అణు రియాక్టర్ల పితామహుడు' అంటారు. అణు రియాక్టర్లలో ప్రధానంగా కింద పేర్కొన్న భాగాలు ఉంటాయి.

1. అణు ఇంధనాలు (కోర్): యురేనియం, థోరియం, ప్లుటోనియంలలో ఏదో ఒక పదార్థాన్ని చిన్న స్థూపాకార కడ్డీలుగా తయారు చేసి రియాక్టర్‌లో వివిధ వరుసల్లో పేర్చుతారు.

2. మితకారులు (Moderators): అణు రియాక్టర్‌లో న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించి గొలుసు చర్యను అదుపు చేయడానికి మితకారులను ఉపయోగిస్తారు. సాధారణంగా భారజలం (D_2O), గ్రాఫైట్ కడ్డీలు, దృఢమైన ప్లాస్టిక్ పదార్థాలను మితకారులుగా ఉపయోగిస్తారు.

భారజలాన్ని యూరే అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. దీన్ని హైడ్రోజన్ ఐసోటోప్ అయిన డ్యుటీరియాన్ని ఉపయోగించి తయారీ చేస్తారు. అందువల్ల భారజలాన్ని డ్యుటీరియం ఆక్సైడ్ అంటారు.

3. నియంత్రకాలు: న్యూక్లియర్ రియాక్టర్‌లోని న్యూట్రాన్లను శోషించుకొని గొలుసు చర్యను పూర్తిగా ఆపడం కోసం నియంత్రకాలను ఉపయోగిస్తారు.

ఉదా: కాడ్మియం కడ్డీలు, స్టీల్ కడ్డీలు, బోరాన్ కడ్డీలు.

4. శీతలీకరణి (కూలంట్): న్యూక్లియర్ రియాక్టర్‌లో స్టీల్ పైపులను అమర్చి వాటి ద్వారా సాధారణ లేదా భారజలాన్ని ప్రవహింపజేస్తారు. ఇది రియాక్టర్ లోపలి ఉష్ణాన్ని గ్రహించి వేడెక్కి వెలుపలికి వెళుతుంది.

5. షీల్డింగ్: న్యూక్లియర్ రియాక్టర్‌పై అల్యూమినియం, సీసం, కాంక్రీట్‌ల మిశ్రమాన్ని ఉపయోగించి ప్రత్యేక పైకప్పును నిర్మిస్తారు. దీన్ని 'షీల్డింగ్' అంటారు. రియాక్టర్ సామర్థ్యం ఆధారంగా దీని మందం ఏడు అంగుళాల నుంచి 10 మీటర్ల వరకు ఉంటుంది. అణు రియాక్టర్‌లో గొలుసు చర్య జరుగుతున్నప్పుడు వెలువడే ప్రమాదకరమైన రేడియోధార్మిక కిరణాలు ఈ పైకప్పును ఢీకొని తిరిగి రియాక్టర్ లోపలికి వెళతాయి. దీని వల్ల పరిసరాల్లోని వాతావరణం, జలావరణం, జీవావరణానికి ఎలాంటి ప్రమాదం ఉండదు. న్యూక్లియర్ రియాక్టర్ నిర్మాణం పూర్తైన తర్వాత అది అణుశక్తిని ఉత్పత్తి చేసే దశకు చేరుకుంటే దాన్ని 'సందిగ్ధ స్థితి' అంటారు.

కేంద్రక సంలీనం

రెండు తేలికైన పరమాణు కేంద్రకాలు కలిసి ఒకే కేంద్రకంగా మారినప్పుడు అత్యధిక శక్తి విడుదలవుతుంది. దీన్ని 'కేంద్రక సంలీనం' అంటారు.

ఉదా: రెండు ప్రోటాన్లు కేంద్రక సంలీనంలో పాల్గొని డ్యుటీరియంగా మారినప్పుడు 26.8 MeV శక్తి విడుదలవుతుంది.

$${}_1H^1 + {}_1H^1 \rightarrow {}_1H^2 + 26.8\ MeV$$

P^+ P^+ డ్యుటీరియం అణుశక్తి

సాధారణ గది ఉష్ణోగ్రత, పీడనాల వద్ద సజాతి ఆవేశాలున్న ప్రోటాన్లు పరస్పరం వికర్షించుకొని ఒక దాని నుంచి మరొకటి దూరంగా వెళతాయి. కాబట్టి 'కేంద్రక సంలీనం' జరగదు. కానీ సుమారు 20 మిలియన్ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత, అధిక పీడనం వద్ద ప్రోటాన్లు వాటి మధ్య వికర్షణ బలాన్ని అధిగమించి కేంద్రక సంలీనంలో పాల్గొంటాయి. అధిక ఉష్ణోగ్రత, పీడనాల వద్ద జరగడం వల్ల కేంద్రక సంలీనాన్ని 'ఉష్ణ కేంద్రక చర్య' అని కూడా అంటారు. సూర్యుడు, నక్షత్రాల స్వయం ప్రకాశకత్వానికి కారణం కేంద్రక సంలీన చర్యే. సూర్యుడు, నక్షత్రాల్లో అత్యధిక ఉష్ణోగ్రత, పీడనాల వద్ద ప్రోటాన్లు కేంద్రక సంలీనంలో పాల్గొని కాంతి శక్తిని విడుదల చేస్తాయి. విశ్వంలోని హైడ్రోజన్, హీలియం వాయువులను 'శాశ్వత వాయువులు'గా పేర్కొంటారు.

కేంద్రక విచ్ఛిత్తి, కేంద్రక సంలీనాల మధ్య భేదాలు

కేంద్రక విచ్ఛిత్తి	కేంద్రక సంలీనం
1. సాధారణ గది ఉష్ణోగ్రత, పీడనాల వద్ద భారయుత యురేనియం, థోరియం, ప్లుటోనియం లాంటి కణాల్లో జరుగుతుంది.	1. అత్యధిక ఉష్ణోగ్రత, పీడనాల వద్ద తేలికైన ప్రోటాన్ల మధ్య కేంద్రక సంలీనం జరుగుతుంది.
2. దీనిలో గొలుసు చర్యను మితకారులను ఉపయోగించి నియంత్రించవచ్చు.	2. ప్రస్తుత శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం ప్రకారం కేంద్రక సంలీనంలోని గొలుసు చర్యను నియంత్రించడానికి వీలుకాదు.
3. ఇందులో తక్కువ శక్తి విడుదలవుతుంది.	3. సంలీనంలో ఎక్కువ శక్తి విడుదలవుతుంది.
4. ఓపెన్ హైమర్ అనే అమెరికా శాస్త్రవేత్త కేంద్రక విచ్ఛిత్తి అనే సూత్రం ఆధారంగా 1945లో అణుబాంబును నిర్మించాడు.	4. హైడ్రోజన్ బాంబు కేంద్రక సంలీనం అనే సూత్రం ఆధారంగా పనిచేస్తుంది. ఒక హైడ్రోజన్ బాంబు సామర్థ్యం, 1000 అణుబాంబుల సామర్థ్యానికి సమానం. హైడ్రోజన్ బాంబ్‌ను మొదటగా 1954లో ఎడ్వర్డ్ టెల్లర్ అనే అమెరికా శాస్త్రవేత్త తయారు చేశాడు. దీనిపేరు మైక్.

విద్య, ఉద్యోగ సమాచారం

యూసీఐఎల్, జార్ఖండ్‌లో వైండింగ్ ఇంజన్ డ్రైవర్ పోస్టులు

జార్ఖండ్‌లోని యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(యూసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వైండింగ్ ఇంజన్ డ్రైవర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. మూడేళ్ల పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 62 నుంచి 67 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.41,674.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ట్రేడ్‌టెస్ట్/ స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జనరల్ మేనేజర్, యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, జాదుగూడ మైన్స్, సింగ్‌భం ఈస్ట్, జార్ఖండ్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 16.07.2025.
» **వెబ్‌సైట్:** https://ucil.gov.in

నాల్కో భువనేశ్వర్‌లో 32 మేనేజర్ పోస్టులు

భువనేశ్వర్‌లోని నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(ఎన్ఏఎల్‌సీవో) వివిధ విభాగాల్లో డిప్యూటీ జనరల్ మేనేజర్, సీనియర్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 32.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ మేనేజర్–29, డిప్యూటీ జనరల్ మేనేజర్–02, సీనియర్ మేనేజర్–01.
» **విభాగాలు:** ఫైనాన్స్, హెచ్ఆర్‌డీ, లా, సర్వే, మైనింగ్, ఇన్విరాన్‌మెంట్, కోల్ మైనింగ్, సేఫ్టీ, జియాలజీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, సీఏ, పీజీ, పీజీ డిప్లొమా, ఎల్ఎల్‌బీ, ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 11.08.2025 నాటికి 35 నుంచి 48 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.1,00,000, సీనియర్ మేనేజర్‌కు రూ.80,000 నుంచి రూ.2,20,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.60,000 నుంచి రూ.50,500.
» **ఎంపిక విధానం:** సీబీటీ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 11.07.2025
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**11.08.2025
» **వెబ్‌సైట్:** https://nalcoindia.co.in

ముల్కీ నిబంధనల సడలింపుతోనే ఉద్యమాలు మొదలు

స్వతంత్ర భారతదేశంలో హైదరాబాద్ రాష్ట్రం

ఈ అంశానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. టీఎస్‌పీఎస్సీ గ్రూప్స్ సిలబస్‌లో ఈ అంశాన్ని ప్రముఖంగా పొందుపర్చారు. కాబట్టి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేవారు ఈ అంశాన్ని మూడు భాగాలుగా విభజించుకొని ప్రిపేరవ్వాలి. బూర్గుల రామకృష్ణారావు నాయకత్వంలో ఏర్పాటైన మంత్రివర్గం గురించి ప్రధానంగా అధ్యయనం చేయాలి. 1952లో జరిగిన ముల్కీ ఆందోళనలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. వీటి గురించి తెలుసుకునే క్రమంలో మూడు విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. అవి..

1. స్థానిక ఉద్యోగాలు - ఒక డిమాండ్.
2. సిటీ కాలేజ్ సంఘటన - ప్రాధాన్యం
3. జస్టిస్ జగన్‌మోహన్ రెడ్డి కమిటీ నివేదికలోని ముఖ్యాంశాలు.

ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు, ప్రత్యేక తెలంగాణ డిమాండ్, చర్చలు, రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ కమిషన్ (ఎస్సార్సీ) ఆవిర్భావం, కారణాలు, ఎస్సార్సీలోని ప్రధానాంశాలు, సిఫారసుల గురించి క్షుణ్నంగా తెలుసుకోవాలి. వీటితోపాటు చిన్న రాష్ట్రాలు, ఎస్సార్సీపై రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలను కూడా అధ్యయనం చేయాలి.

బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గం

స్వతంత్ర భారతదేశానికి సార్వత్రిక ఎన్నికలు తొలిసారిగా 1952లో జరిగాయి. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఈ ఎన్నికల్లో హైదరాబాద్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్ నియోజక వర్గం నుంచి గెలుపొందారు. హైదరాబాద్ రాష్ట్ర రాజ్‌ప్రముఖ్ ఉస్మాన్ అలీ ఖాన్ 1952 మార్చి 6న కింగ్ కోఠిలోని తన నివాసంలో బూర్గులతో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు.

బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గం

1. బి.రామకృష్ణారావు - సీఎం
2. బిందు దిగంబర రావు - హోం శాఖ
3. గోపాలయ సుబ్బు క్రిష్ణ మెల్కోటె- ఆర్థిక శాఖ
4. మర్రి చెన్నారెడ్డి - వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ
5. దేవిసింగ్ చౌహాన్ - గ్రామీణాభివృద్ధి శాఖ
6. సి. జగన్నాథరావు - న్యాయశాఖ
7. అన్నారావు ఘనముఖి-పంచాయతీరాజ్
8. ఫూల్‌చంద్ గాంధీ - ఆరోగ్య, విద్యాశాఖ
9. నవాబ్‌జంగ్ బహదూర్ - పబ్లిక్ వర్క్స్
10. శంకర్ డియో - సామాజిక సేవలు
11. వి.బి.రాజు - సమాచార, ప్రణాళిక, కార్మిక
12. కె.వి.రంగారెడ్డి - అటవీ, కస్టమ్స్, ఎక్సైజ్
13. కొరటికర్ వినాయక రావు - వాణిజ్యం, పరిశ్రమల శాఖ

హైదరాబాద్ రాష్ట్ర మంత్రివర్గ నిర్మాణ, పరిపాలనాపరమైన ముఖ్యాంశాలు

- బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే వరంగల్‌లో గైర్ ముల్కీ(స్థానికేతరులు) ఉద్యమానికి అంకురార్పణ జరిగింది.
- హైదరాబాద్ రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు వి.డి. దేశ్‌ముఖ్ (మరాఠ్వాడ సుబా). ప్రతిపక్ష పార్టీ పేరు 'పీపుల్స్ డెమొక్రటిక్ ఫెడరేషన్'.
- బి. రామకృష్ణారావు కేబినెట్‌లో పనిచేసిన ఏకైక ఆంధ్ర నాయకుడు వి.బి.రాజు. ఆయన సికింద్రాబాద్ శాసనసభ స్థానానికి ఎన్నికయ్యారు.
- టి. హయగ్రీవాచారి అధ్యక్షతన వరంగల్‌లో మొదటి విశాలాంధ్ర మహాసభ 1950లో జరిగింది. హైదరాబాద్ రాజధానిగా విశాలాంధ్రను వెంటనే ఏర్పాటు చేయాలని ఈ మహాసభలో పట్టుబట్టారు.
- శ్రీశ్రీ అధ్యక్షతన 1954లో రెండో విశాలాంధ్ర మహాసభ హైదరాబాద్‌లో జరిగింది.
- 1956లో ఢిల్లీలో జరిగిన పెద్ద మనుషుల ఒప్పందంలో హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో బి.రామకృష్ణారావు పాల్గొన్నారు. 1956 అక్టోబర్ 31 వరకు ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగారు.
- పెద్ద మనుషుల ఒప్పందం తర్వాత 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. బి.రామకృష్ణారావు కేరళ గవర్నర్‌గా నియమితులయ్యారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ ఉద్యమ చరిత్ర

స్థానికులకు ఉద్యోగాలు - ముల్కీ ఉద్యమం (1952)

1948లో పోలీసు చర్య అనంతరం హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైంది. తర్వాత దాదాపు నాలుగేళ్లపాటు హైదరాబాద్ సంస్థానాన్ని స్థానికేతరులే పరిపాలించారు. రెండేళ్లపాటు సైనికపాలన ఉండగా, మరో రెండేళ్లు అధికారులు హైదరాబాద్ రాష్ట్రాన్ని పాలించారు. ఇంగ్లిష్, తెలుగు స్పష్టంగా రావనే సాకుతో ఈ కాలంలో చాలామంది స్థానికులను ఉద్యోగాల నుంచి తొలగించారు. మద్రాసు నుంచి, బయటి ప్రాంతాల నుంచి చాలా మందిని రప్పించారు. తహశీల్దార్ల నుంచి కార్యదర్శుల వరకు అనేక ఉద్యోగాల్లో స్థానికేతరులనే నియమించారు. ఇలా ఒక సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేసుకొని నాలుగేళ్లపాటు పరిపాలన సాగించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అధికారులు దొంగ ముల్కీ సర్టిఫికెట్‌లను జారీ చేసి బయటి వారిని ఉద్యోగాల్లో నియమించుకున్నారు. ఇక్కడి ప్రజల పట్ల గైర్ ముల్కీలు(స్థానికేతరులు) అహంభావాన్ని ప్రదర్శించి, అవమానపర్చేవారు. ఇక్కడి వారితో అవహేళనగా మాట్లాడేవారు. ఉన్నతస్థాయి అధికారుల వల్ల అనేక అవమానాలకు గురైన స్థానికుల్లో చైతన్యం పెరిగింది. 1951లో ముల్కీల నిర్వచనాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించింది. ఈ సవరణ ప్రకారం వరసగా 15 ఏళ్లపాటు స్థానికంగా నివాసం ఉన్నవారంతా ముల్కీలవుతారు. దీనికి ఏవిధమైన ప్రమాణ పత్రం సమర్పించాల్సిన అవసరం లేదు. ఆ తర్వాత కేంద్రం మళ్లీ ముల్కీ అర్హతను 12 ఏళ్లకు కుదించింది. దీంతో స్థానికుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.



మొదటి సార్వత్రిక ఎన్నికల్లో తమ హక్కులను సాధించుకోవాలని తెలంగాణ ప్రజలు భావించారు. 1952లో అధికారంలోకి వచ్చిన బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం సంయమనాన్ని పాటిస్తూ ముల్కీల సవరణల జోలికి పోలేదు. 1952 మార్చిలో బూర్గుల ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక.. ముల్కీ హక్కులను పునరుద్ధరించాలని, విద్యావంతులైన స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ప్రజలు డిమాండ్ చేశారు. గైర్ ముల్కీ ఉద్యమం క్రమంగా విస్తృతమైంది. ప్రజల్లో చైతన్యం పెరగడంతో హక్కుల సాధన కోసం ఉద్యమించారు.

గైర్ ముల్కీ ఉద్యమంలో ప్రధానంగా వినిపించిన నినాదం 'మద్రాసీ గో బ్యాక్, ఇడ్లీ సాంబర్-గోబ్యాక్'. 1952 జూన్ 26న వరంగల్‌లో విద్యార్థుల నాయకత్వంలో గైర్ ముల్కీ ఉద్యమం ప్రారంభమైంది. అయిదు రోజులపాటు నిరంతరంగా కొనసాగింది. 1952 జులై 31న విద్యార్థులంతా కలిసి ఒక తీర్మాన పత్రాన్ని ఆమోదించి, ఆందోళన విరమించారు.

తీర్మాన పత్రంలోని అంశాలు

'దొంగ ముల్కీ పత్రాలతో ఉద్యోగాల్లో ప్రవేశించిన స్థానికేతరులపై విచారణ జరపాలి. ప్రభుత్వం వారిని తొలగించి స్థానికుల నిరుద్యోగ సమస్య తీర్చాలి. ఇక మీదట సరైన రుజువు లేనిదే ముల్కీ సర్టిఫికెట్లు ఇవ్వరాదు' అని ఐక్య విద్యార్థి సంఘం కోరింది.

ఈ తీర్మానాన్ని వరంగల్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్ ఎ.బుచ్చయ్య ప్రవేశపెట్టారు. దానికి విద్యార్థులు అంగీకరించేలా కృషి చేశారు. ఆయన కృషి వల్లే హన్మకొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు కూడా ఈ తీర్మానానికి అంగీకరించారు. ఈ విధంగా స్థానిక నిరుద్యోగ యువకులు చైతన్యవంతులై తమ హక్కుల సాధన కోసం ఉద్యమించారు. 1952 ఆగస్టు 7న ఖమ్మం ప్రాంతంలో కూడా గైర్ ముల్కీ ఉద్యమం తలెత్తింది. ఈ ఉద్యమాలన్నీ స్థానికులకు జరిగిన అన్యాయాలు, వారు ఎదుర్కొన్న అవమానాలకు వ్యతిరేకంగా జరిగినవే. నాటి తెలంగాణ సమాజంలో ఆవిర్భవించిన ఈ ఉద్యమాలన్నీ చైతన్య స్ఫూర్తితో వచ్చినవే. వీటి వెనుక ఎవరి ప్రోద్బలం లేదు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఇతర ప్రాంతాల వారికి, ఇతర రాష్ట్ర ఉద్యోగులకు అవకాశం ఇస్తున్నందుకు; ఇతర రాష్ట్ర విద్యార్థులకు ఇక్కడి పాఠశాలు, కళాశాల్లో ప్రవేశాలు కల్పిస్తున్నందుకు నిరసనగా స్థానిక విద్యార్థులు రెండు రోజులపాటు సమ్మె చేశారు. 1952 ఆగస్టు 8న వరంగల్ జిల్లా మానుకోట (మహబూబాబాద్)లో దాదాపు వెయ్యి మంది విద్యార్థులు పాఠశాలకు, కళాశాలలకు వెళ్లకుండా ప్రదర్శనలు చేస్తూ 'బే ముల్కీలు వాపసు పోవాలి' అని నినాదాలు చేశారు. విద్యార్థుల నాయకత్వంలో సంఘటితమై బలమైన ఉద్యమం రూపుదిద్దుకుంది. వరంగల్ విద్యార్థి సంఘం పిలుపు మేరకు ఈ ఉద్యమం పెద్ద ఎత్తున జరిగింది. దీంతో ముల్కీ నిబంధనలను సవరించి, కఠినతరం చేయడానికి ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉందని 1952 ఆగస్టు 10న అన్ని పత్రికల్లో వార్త వచ్చింది.

మాదిరి ప్రశ్నలు

1. హైదరాబాద్ రాష్ట్రంలో తొలిసారిగా ఎన్నికలు ఎప్పుడు జరిగాయి?
   ఎ) 1952 ఫిబ్రవరి బి) 1950 ఫిబ్రవరి
   సి) 1949 ఫిబ్రవరి డి) 1951 ఫిబ్రవరి
2. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వానికి ముఖ్య సలహాదారుడు ఎవరు?
   ఎ) జె.ఎన్.చౌదరి బి) ఎం.కె.వెల్లోడి
   సి) నవాబ్‌జంగ్ బహదూర్
   డి) మీర్ అలీఖాన్
3. బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో ఆంధ్రుడైన వి.బి. రాజు ఏ శాఖకు మంత్రిగా వ్యవహరించారు?
   ఎ) కార్మిక, ప్రణాళిక బి) విద్య, ఆరోగ్యం
   సి) సాంఘిక సంక్షేమం డి) పరిశ్రమలు
4. హైదరాబాద్ రాష్ట్ర ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన వారు?
   ఎ) బి. రామకృష్ణారావు
   బి) మెల్కోటే సి) రావి నారాయణరెడ్డి
   డి) మర్రి చెన్నారెడ్డి

సమాధానాలు

1) ఎ; 2) బి; 3) ఎ; 4) సి.

Clients are judging you by your?



BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Each time Hemanth turns on his computer, he has (1)/ to wait for it to load, enter the special code, and then enters a password (2)/ to get into his workspace before (3) / he can begin working (4)/ No Error (5)

2. Because there is (1)/ two sets of cutlery, a couple napkins, and plates on each table, students do not have (2) / to set(3) / their own place settings. (4) / No Error (5)

3. The decision that has just been (1) / agreed with (2) / by the board members should serve as a basis for their (3) / other accomplishments in the years to come. (4)/ No Error(5)

4. People who dislike cats sometimes (1) /criticize them for being (2) /savvy and independent; whereas those who are fond of (3) / cats often admire them for the same qualities. (4) / No Error(5)

5. Even with (1) / a calculator, you must have a basic understanding of (2) / mathematics if one expects (3)/ to do decently on the Math section. (4) / No Error(5)

Directions: (Q. 6 -10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Godavari rises in a magnificent way above its tributaries during rainy season.
1) rises a magnificent way above
2) rises in a magnificent way, way above
3) rises magnificently above
4) rises magnificently way above
5) No correction required

7. During colonial days, a school room looked rather empty.
1) colonial days, a school room looks
2) colonial days, a schoolroom looked
3) colonial days; a schoolroom looked
4) colonial days; a school room looked
5) No correction required

8. The helium-filled balloon rose in the air.
1) rose on the air.
2) was rising in the air.
3) was in the air.
4) rose into the air.
5) No correction required

9. If I had the address, I would have delivered the package myself.
1) had address,
2) had seen the address
3) had had the address
4) had their address
5) No correction required

10. Vasantha claims that cats made the best pets.
1) will make the best pets
2) could be the best pets
3) are the best pets
4) make the best pets
5) No correction required

Directions (Q. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Tsunamis generally consist of a series of waves with periods ranging from minutes to hours, arriving in a so-called "wave train".
B) Wave heights of tens of meters can be generated by large events.
C) Rather than appearing as a breaking wave, a tsunami may instead initially resemble a rapidly rising tide, and for this reason they are often referred to as tidal waves.
D) A Tsunami is a series of waves in a water body caused by the displacement of a large volume of water, generally in an ocean or a large lake.
E) Although the impact of tsunamis is limited to coastal areas, their destructive power can be enormous and they can affect entire ocean basins.
F) Tsunami waves do not resemble normal sea waves, because their wavelength is far longer.

11. What is the LAST sentence after rearrangement?
1) C 2) B 3) D 4) E 5) F

12. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) C

13. What is the THIRD sentence after rearrangement?
1) A 2) C 3) B 4) E 5) F

14. What is the FIRST sentence after rearrangement?
1) B 2) C 3) D 4) E 5) F

15. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. 16 - 20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. Japan's abundant rainfall and the ___ mild temperature throughout most of the country have produced a _____vegetation cover.
1) Typically, lush
2) Prominence, dry
3) Importantly, scarce
4) Average, green
5) General, prominent

17. Nobody knows ____ how many languages there are in the world, partly because of the difficulty in distinguishing between a language and the sub-languages or dialects ____ it.
1) Exclusively, from
2) Extend, among
3) Exactly, within
4) Extensively, Between
5) Precisely, with

18. The ______ of natural gas from Norway's Troil gas ________ is expected to increase annually.
1) Yield, field
2) Production, depot
3) Manufacture, ground
4) Assemble, bunk
5) Making, drivel

19. The results of the company's cost-cutting ______ are evident in its profits.
1) Events 2) Action
3) Dealings 4) Procedure
5) Measures

20. With cloning technology, scientists _______ what has long been the ultimate _____ of modern husbandry.
1) are approaching, goal
2) were approaching, aim
3) had approached, target
4) is approaching, mark
5) was approaching, set

Directions (Q. 21 - 30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Businesses spend a lot of time and money on choosing just the ___ (21) name for their enterprise. But, all too often choosing the right domain name is left for the end of the business naming process instead of at the _____ (22) where it belongs. Your future customers have to be able to ______ (23) you on the web. Your domain name may be sending the wrong message and ______ (24) you business. When people are given a website and then told it's .net or .biz, the first thing they think is, "Oh, somebody else got the .com, huh?" Some will even purposefully go and see what company secured .com, maybe they are the one that they should really be dealing with.

Even more damaging is the fact that .com is everyone's ____ (25) when typing. You may know someone's site ends in .net, but by default you probably often start to type .com. People are busy. Everyone is multitasking and managing a staggering amount of information. The ____ (26) you make someone work to find you the more likely they won't put in the effort.

While there are only so many .com addresses available, it is unlikely that anything else will ever take the place of .com as the default website ending for _____ (27) users.

In an effort to get a website ending in .com some business owners get cute and make up their own word. Sometimes service providers have reasonably used their own name as their website URL, but their name is tough for most people to spell.

The problem with both scenarios is that once someone has to ask how to spell your domain name they have already convinced themselves it is too hard to remember. If someone has to write down your domain name you are one lost piece of paper away from losing him or her as a ___ (28) forever.

People are not willing to put too much effort into finding your site. There are just ______ (29) many options on the web to be bothered by difficult to spell websites. Don't get too cute when thinking up a company name or domain name. Make it easy. If you want to use your own name, but your name is tough to spell, get a simple domain that will point to your other site. For example if your name is Christopher Zvynski, get another domain called askchris.com that will redirect customers to your site.

One company that has built its entire business around a premium domain name that's the obvious choice for its category is Hotels.com. One of their recent marketing campaigns even featured the tagline, "Hotels.com, the obvious choice". While the space is fiercely competitive, Hotels.com will likely always be an industry leader because it's name coincides perfectly with what people are likely to search for or enter into their browsers. How much value does this kind of premium domain name generate?

Beyond being easy to find, domain names like Cars.com or Hotels.com send a message to customers that this company understands the web and that they have been around a while. How else would they have gotten such a perfect name? Typical consumers are not thinking that the domain name was probably purchased as a business cost.

Customers and clients are judging you by your ______ (30). It may have nothing to do with your quality and abilities, but it is the way of the marketplace. Make it easy for people to find you and you will always have eager customers.

21. 1) exactly 2) right 3) precise 4) correctly 5) truth
22. 1) beginning 2) start 3) proceeding 4) preceding 5) recede
23. 1) identical 2) find 3) come 4) hit 5) draw
24. 1) costing 2) estimate 3) find 4) figure 5) quotation
25. 1) evasion 2) avoidance 3) dodging 4) default 5) internet
26. 1) hardly 2) hard 3) hardest 4) too hard 5) harder
27. 1) any 2) some 3) most 4) much 5) little
28. 1) friend 2) relative 3) foe 4) customer 5) neighbor
29. 1) few 2) many 3) much 4) little 5) too
30. 1) knowledge 2) expertise 3) skills 4) service 5) domain

Key:

1) 2	2) 1	3) 2	4) 5
5) 3	6) 3	7) 2	8) 4
9) 4	10) 4	11) 4	12) 2
13) 2	14) 3	15) 1	16) 1
17) 3	18) 1	19) 5	20) 1
21) 2	22) 1	23) 2	24) 1
25) 4	26) 5	27) 3	28) 4
29) 5	30) 5		